www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఈవీఎంలే సరైనవి

- బ్యాలట్ పేపర్లకు కాలం చెల్లింది.. దేన్నీ గుడ్డిగా అనుమానించవద్దు
- సంస్కరణలను వృథా చేయవద్దు.. ఈవీఎంల కేసులో సుప్రీం తీర్పు
- వీవీప్యాట్ స్లిప్పులను నూరు శాతం లెక్కించాలన్న పిటిషన్ల కొట్టివేత
- సింబల్ లోడింగ్ యూనిట్లనూ 45 రోజులు భద్రపరచాలని ఆదేశం
- ఎన్నికల పిటిషన్ దాఖలైతే.. 5 శాతం ఈవీఎంల మైక్రో కంట్రోలర్ల మెమొరీని సంబంధిత ఇంజనీర్లు తనిఖీ చేయాలని మరో ఆదేశం

2



శనివారం | 27-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 11 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: తదియ ఉ. 8.18 తదుపరి చవితి; నక్షత్రం: జ్యేష్ఠ తె. 4.28 తదుపరి మూల; వర్జ్యం: ఉ. 9.27-11.06; దుర్ముహూర్తం: ఉ. 5.54-7.35; అమృతఘడియలు: రా. 7.22-9.01; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 5.54; సూర్యాస్తమయం: 6.30 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బుగ్గన నామినేషన్‌పై హైడ్రామా

ఆస్తులు దాచారంటూ అఫిడవిట్‌పై టీడీపీ ఫిర్యాదు

ఆరుగంటల పాటు పెండింగ్

హైడ్రామా మధ్య చివరికి అనుమతి

పొన్నూరులో బీఫాం ఇవ్వని అంబటి

భార్య, కుమార్తె ఆస్తుల దాపరికం

అయినా ఆమోదించిన ఆర్వో

ఆమంచికి విద్యుత్ బకాయిల అడ్డు

నామినేషన్ పెండింగ్.. నేడు నిర్ణయం

కొడాలిపై ఫిర్యాదా.. తీసుకోను: ఆర్వో

వేమిరెడ్డి ఆస్తులపై సాయిరెడ్డి ఫిర్యాదు

స్వీకరించని రిటర్నింగ్ అధికారి

రాష్ట్రవ్యాప్తంగా పరిశీలన పూర్తి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల పరిశీలన పర్వం శుక్రవారం ముగిసింది. ఇండిపెండెంట్లు సహా కొన్ని చిన్న పార్టీల అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను అధికారులు పలు కారణాలతో తిరస్కరించారు. ఇక, అభ్యర్థులు స్వయంగా తమ నామినేషన్లను వెనక్కి తీసుకునేందుకు

మిగతా 2వ పేజీలో...



కూటమిదే గెలుపు

160 అసెంబ్లీ స్థానాలు మావే

24 లోక్‌సభ సీట్లు కూడా: చంద్రబాబు

నేను ఎందరో ముఖ్యమంత్రులను చూశాను. కానీ జగన్‌లా జనాన్ని వేధించి అందరినీ నాశనం చేసే, మానసిక సంతులనం లేని సీఎంను ఎప్పుడూ చూడలేదు. - చంద్రబాబు

రాష్ట్రం నుంచి ఎన్డీయేకి అదనంగా 20 సీట్లు

జగన్‌కు మానసిక సంతులనం దెబ్బతింది

సంక్షేమాన్ని పణంగా పెట్టి రాజకీయాలు

వేధింపులు, వినాశనమే ఆయన ధ్యేయం

విపక్ష నేత చంద్రబాబు ఆగ్రహం

జమిలిని 2017లోనే సమర్థించానని వెల్లడి

'ది రిపబ్లిక్' సీనియర్ జర్నలిస్టు అర్ణబ్ గోస్వామికి ప్రత్యేక ఇంటర్వ్యూ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే ఘనవిజయం సాధిస్తుందని తమకు నూటికి నూరు పాళ్లూ విశ్వాసం ఉందని టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు అన్నారు. 160 అసెంబ్లీ, 24 లోక్‌సభ స్థానాల్లో గెలుస్తామని స్పష్టం చేశారు. కేంద్రంలో మోదీ నేతృత్వంలో ఎన్డీయే అధికారంలోకి వస్తుందనే నమ్మకం తమకుందని.. 400కి పైగా ఎంపీ సీట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుందని.. రాష్ట్రం నుంచి అదనంగా 20 లోక్‌సభ స్థానాలిస్తామని చెప్పారు. మోదీ నాయకత్వంలో భారతదేశం గ్లోబల్ పవర్‌గా మారుతోందన్నారు. 'ది రిపబ్లిక్' టీవీ నిర్వహించిన 'దేశం తెలుసుకోవాలనుకుంటోంది (నేషన్ వాంట్స్ టు నో)' కార్యక్రమంలో

మిగతా 14వ పేజీలో...



కీ॥శే॥శ్రీమతి వేమూరి కనకదుర్గ గారు

(డైరెక్టర్ - ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి)

జననం : 14.07.1958 - మరణం : 27.04.2021

విధి మనుషుల్ని దూరం చేస్తుంది...
మనసుల్ని కాదు !
కాలం గాయాల్ని మాన్పుతుంది...
జ్ఞాపకాల్ని కాదు !!

- వేమూరి రాధాకృష్ణ

మరియు కుటుంబ సభ్యులు

వైసీపీకి ఓటేస్తే నాశనమే!



రాజోలు నియోజకవర్గంలో జరిగిన సభకు హాజరైన జనం, మాట్లాడుతున్న పవన్

జగన్ మళ్లీ వస్తే ఎవరినీ బతకనివ్వడు

మహిళలకు రక్షణ ఉండదు

సొంత తల్లినే ఉపేక్షించని వ్యక్తి వైసీపీ నేతలను వదులుతాడా?

ఆయన్ను నమ్మితే మీకూ కష్టాలే

గులకరాయి నిందితుణ్ని పట్టుకున్నారు

రథం తగలబెట్టినవారి సంగతేంటి?

ప్రచార సభల్లో పవన్ ధ్వజం

30న కూటమి మేనిఫెస్టో విడుదల

కాకినాడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సొంత చెల్లెలి దుస్తులపైనే కామెంట్ చేసే దిగజారుడు వ్యక్తి ముఖ్యమంత్రి జగన్ అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ నిప్పులు చెరిగారు. వైసీపీకి మళ్లీ ఓటేస్తే మన నాశనం మనకు మనం కొని తెచ్చుకున్నట్లేనన్నారు. జగన్ మళ్లీ గెలిస్తే ఆడబిడ్డలకు రక్షణ ఉండదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం మలికిపురం, రామచంద్రపురం నియోజకవర్గం ద్రాక్షారామల్లో జరిగిన బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. సొంత తల్లినే ఉపేక్షించని జగన్ భవిష్యత్‌లో వైసీపీ నేతలను కూడా వదలరని హెచ్చరించారు. తాను రోడ్డుపైకి

మిగతా 11వ పేజీలో...



తిరుపూరు ర్యాలీలో షర్మిల అభివాదం

జగన్ పాలనలో అన్నీ మోసాలే

ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు

అమరావతిని కాస్తా భ్రమరావతిని చేశావు

చింతలపూడి పథకాన్ని ఎప్పుడో గాలికొదిలేశావు

ప్రతి ఏటా సంక్రాంతికి జాబ్ కేలెండర్ ఎక్కడ?

ఐదేళ్లుగా కోడి పందేలతోనే సరిపోయింది

సీఎం అయ్యాక ఒక్కరోజూ ప్రజల ముందుకు రాలేదు

సీఎం జగన్‌పై పీసీసీ చీఫ్ షర్మిల నిప్పులు

11

'పింఛను'పై అదే కుట్ర

ఏప్రిల్‌లో చేసినట్లే చేస్తామని ఈసీకి వెల్లడి

చంద్రబాబు లేఖపై స్పందన కోరిన కమిషన్

జాబ్ చార్ట్ పేరుతో 'బిజీ' కబుర్లు

సచివాలయ సిబ్బందితో పంపిణీ కుదరదట

ఈసారి 3వ తేదీలోపు ముగించేస్తాం

ఉదయం 7 నుంచి రాత్రి 7 దాకా పంపిణీ

ఇంటి వద్ద పంపిణీ కుదరదన్న సీఎస్



అమరావతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్లను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయలేమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి తేల్చేశారు. ఏప్రిల్‌లో చేసినట్లుగానే మే నెలలోనూ పింఛన్ల పంపిణీ ఉంటుందని ఎన్నికల కమిషన్‌కు స్పష్టం చేశారు. వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ కుదరదని, వారిని ఎన్నికల ప్రక్రియకు పూర్తి దూరంగా ఉంచాలని ఈసీ గతంలో ఆదేశించిన సంగతి తెలిసిందే. దీంతో.. ఏప్రిల్ నెల పింఛన్లపై వైసీపీ కుట్ర రాజకీయానికి

మిగతా 14వ పేజీలో...

జాగో.. వైజాగ్!

'ఒక్క చాన్స్' రాగానే విశాఖపై వైసీపీ పంజా

అర్చకులపై అమానుషం!

విచక్షణ లేకుండా ఆలయాల్లోనే దాడులు



12 13

సమగ్ర కథనాలు నేటి 'జన కేతనం'లో..

షరియా ఆధారంగా దేశం నడవాలా: అమిత్ షా

గుణ, బేమెతర, ఏప్రిల్ 26: దేశంలో ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) అమలు చేసి తీరుతామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ఈ ఎన్నికల్లో ఇది మోదీ ఇచ్చే గ్యారెంటీ అని ప్రకటించారు. శుక్రవారం మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికల ప్రచార సభల్లో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీని ఉద్దేశించి మాట్లాడుతూ.. మైనార్టీల కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తామని కాంగ్రెస్ చెబుతోందని, అంటే షరియా ప్రకారం దేశం నడవాలా అని ప్రశ్నించారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణాన్ని వ్యతిరేకించిన వారికి దేశాన్ని పాలించే హక్కు లేదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ముస్లింలీగ్ అజెండాను అమలు చేస్తోందని విమర్శించారు.

ప్రతిపక్షాలకు చెంపదెబ్బ!

ఈవీఎంలపై అనవసర రాద్ధాంతం చేశారు: మోదీ



బిహార్‌లో ఎన్నికల ప్రచారంలో నితీశ్‌తో మోదీ

అరారియా/ముంగేర్ (బిహార్), ఏప్రిల్ 26: ఈవీఎంలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలకు గట్టి చెంప దెబ్బ అని ప్రధాని మోదీ అన్నారు. తీర్పును స్వాగతించారు. ఈవీఎంలను అనుమానించిన ప్రతిపక్ష నేతలు దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్నారు. బిహార్‌లోని అరారియా, ముంగేర్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన సుప్రీం తీర్పుపై స్పందిస్తూ.. "ఇది ప్రజాస్వామ్యానికి దక్కిన విజయం" అని వ్యాఖ్యానించారు. ఇక ప్రతిపక్ష పార్టీలు తమకు ఎంతో ఇష్టమైన ముస్లిం ఓటు బ్యాంకు కోసం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను తస్కరించేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను ఓటు బ్యాంకు రాజకీయాలకు మళ్లించడాన్ని తాను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోనని.. ఇది మోదీ గ్యారెంటీ అని హామీ ఇచ్చారు. దేశ వనరులపై తొలి హక్కు పేదలకే ఉంటుందని స్పష్టం చేశారు. బిహార్‌లో కాంగ్రెస్, ఆర్జేడీ, ఇతర ఇండియా కూటమి పార్టీలు అధికారంలో ఉన్న సమయంలో పోలింగ్ బూత్‌లను ఆక్రమించుకొని.. పేదలు, వెనకబడిన వర్గాలు, దళితుల ఓటు హక్కును హరించేవారని ఆరోపించారు. ఈవీఎంలు వచ్చిన తర్వాత వారి ఆటలు సాగడం లేదన్నారు. అందుకే ప్రతిపక్ష నేతలు ఈవీఎంలపై ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. ముస్లింలకు కాంగ్రెస్ ఇస్తున్న ప్రాధాన్యాన్ని, ఇండీ కూటమి తీరును తేటతెల్లం చేయడంతో వారంతా ఆగ్రహంగా ఉన్నారని మోదీ చెప్పారు. తనను భయపెట్టాలని చూడొద్దని హెచ్చరించారు. '25 ఏళ్లుగా నన్ను భయపెట్టాలని చూస్తూనే ఉన్నారు. కానీ, విఫలమయ్యారు' అని చెప్పారు.

గూగుల్ యాడ్స్‌లో బీజేపీ టాప్!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: గూగుల్, యూట్యూబ్‌లలో ప్రచారానికి భారీగా ఖర్చుపెట్టిన పార్టీల్లో పాలక బీజేపీ ముందుంది. రూ.100 కోట్లను దాటేసిన భారతీయ పార్టీగా గుర్తింపు పొందింది. 2018 మే 31 నుంచి 2024 ఏప్రిల్ 25 నడుమ ఆయా పార్టీలు రాజకీయ ప్రకటనలపై పెట్టిన ఖర్చు వివరాలను 'ఇండియాటుడే' చానల్ తెలియజేసింది. గత ఆరేళ్లలో 'రాజకీయ' ప్రకటనల రూపంలో గూగుల్‌కు రూ.390 కోట్ల ఆదాయం లభించింది. ఈ మొత్తంలో బీజేపీ వాటా 26%. ఆ పార్టీ రూ.101 కోట్ల ఖర్చు చేసింది. గూగుల్ యాడ్స్, గూగుల్ డిస్‌ప్లే-వీడియోపై రూ.45 కోట్ల ఖర్చుతో కాంగ్రెస్ ద్వితీయ స్థానంలో నిలిచింది. తమిళనాడు పాలక పార్టీ డీఎంకే గూగుల్ యాడ్స్ వ్యయంలో రూ.42 కోట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఇందులో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి రూ.16.6 కోట్లు ఖర్చుచేయడం గమనార్హం. ఇక బీఆర్ఎస్ నిరుడు నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల వరకే గూగుల్‌లో ప్రకటనలపై వ్యయం చేసింది. రూ.12 కోట్లకుపైగా ఖర్చుచేసినా ఎన్నికల్లో ఓడిపోయింది. అక్కడ కాంగ్రెస్ గెలిచింది. ఇక ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్‌కిశోర్ స్థాపించిన ఐ-ప్యాక్.. ఆంధ్రలో వైసీపీ తరఫున గూగుల్ యాడ్లకు ఈ ఆరేళ్లలో రూ.6.4 కోట్లు, బెంగాల్లో టీఎంసీ కోసం రూ.4.8 కోట్లు ఖర్చుచేసినట్లు డేటా చెబుతోంది.

ఈవీఎంలే సరైనవి

బ్యాలట్ పేపర్లకు కాలం చెల్లింది

గుడ్డిగా దేన్నీ అనుమానించవద్దు

ఈవీఎంల కేసులో సుప్రీం తీర్పు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో నమోదైన ఓట్లన్నింటినీ వీవీప్యాట్ స్లిప్పులతో నూరు శాతం సరిపోల్చి చూడాలంటూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఆ స్లిప్‌లను వేరేగా డిపాజిట్ చేయాలని వచ్చిన అభ్యర్థనలను కూడా జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తోసిపుచ్చింది. ఈవీఎంల బదులుగా మళ్లీ పాత కాలం బ్యాలట్ పద్ధతిని ప్రవేశపెట్టాలనడం సరైంది కాదని ఇద్దరు న్యాయమూర్తులూ ఒకే అభిప్రాయంతో వెలువరించిన వేర్వేరు తీర్పుల్లో స్పష్టం చేశారు. 97 కోట్ల మంది ఓటర్లు, పెద్ద సంఖ్యలో ఉన్న అభ్యర్థులు, లక్షలాది పోలింగ్ బూత్‌లు ఉన్న ఈ దేశం బ్యాలట్ పేపర్ల వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నదని సుప్రీంకోర్టు గుర్తు చేసింది. మళ్లీ అదే పద్ధతికి వెళితే ఎన్నో సంవత్సరాల కృషి తర్వాత జరిగిన ఎన్నికల సంస్కరణలు వృథా అయిపోతాయని న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఈవీఎంలపై అనుమానాలు సహేతుకం కాదని వ్యాఖ్యానించారు. సాంకేతిక అంశాలను, ఇప్పటి వరకూ నమోదైన డేటాను పరిశీలించిన తర్వాత.. ఈవీఎంల ద్వారానే ఎన్నికలు జరిపించడం సరైందని నిర్ణయించామని వారు తెలిపారు. అలాగే.. వీవీప్యాట్ స్లిప్పులను ఓటర్లే డ్రాప్‌బాక్సుల్లో వేసే అవకాశం కల్పించాలన్న విజ్ఞప్తినీ న్యాయమూర్తులు తోసిపుచ్చారు. అలా ఇవ్వడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతాయని.. వాటిని దుర్వినియోగపరిచే అవకాశం ఉన్నదని అభిప్రాయపడ్డారు. ఇప్పటి వరకూ 4 కోట్ల వీవీప్యాట్ స్లిప్పులను కంట్రోల్ యూనిట్ల ఫలితాలతో సరిపోల్చారని, ఒక్కసారి కూడా లోపాలు కనపడలేదని గుర్తుచేశారు. గుడ్డిగా ఒక వ్యవస్థను అనుమానించడం, వ్యతిరేకించడం సరైంది కాదని పేర్కొన్నారు. పరస్పర విశ్వాసం ఏర్పడినప్పుడే ప్రజాస్వామ్యం పటిష్ఠమవుతుందని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. మళ్లీ బ్యాలట్ పేపర్లకు వెళ్లే బదులు.. ఉన్న ఈవీఎంల వ్యవస్థనే మరింత మెరుగుపరచుకోవాలని జస్టిస్ దీపాంకర్ దత్తా తన తీర్పులో పేర్కొన్నారు. కొన్ని స్వార్థపరశక్తులు ఈ దేశం సాధించిన విజయాలను తక్కువ చేయాలని చూస్తున్నాయని జస్టిస్ దత్తా వ్యాఖ్యానించారు.

రెండు ఆదేశాలు..

ఈవీఎంలపై మరింత నమ్మకం పెరిగేందుకు ఎన్నికల కమిషన్‌కు సుప్రీం ధర్మాసనం రెండు ఆదేశాలు జారీ చేసింది.

1) మే 1వ తేదీ తర్వాత.. వీవీప్యాట్ యూనిట్లలోకి అభ్యర్థుల పేర్లు, గుర్తులు, సీరియల్ నంబర్లను లోడ్ చేసిన తర్వాత సింబల్ లోడింగ్ యూనిట్లను (ఎస్ఎల్‌యూలు) సీల్ చేసి, కంటెయినర్లలో భద్రపరచాలి. ఆ ప్రక్రియ సవ్యంగా జరిగినట్లు ధ్రువీకరిస్తూ అభ్యర్థులు లేదా వారి ప్రతినిధులు ఆ సీల్‌పై సంతకం చేయాలి. ఆ సీల్డ్ కంటెయినర్లను.. ఎన్నికల ఫలితాలను ప్రకటించిన తర్వాత 45 రోజులపాటు ఈవీఎంలతో కలిపి స్ట్రాంగ్ రూముల్లో భద్రపరచాలి. ఒకవేళ ఈవీఎంలలో ఓట్లను మళ్లీ లెక్కించాల్సిన పరిస్థితి వస్తే.. అప్పుడు ఈ ఎస్ఎల్‌యూలను కూడా తెరిచి, పరీక్షించాలి.

2) ఫలితాలు వెల్లడైన 7 రోజుల్లోపు.. గెలిచిన అభ్యర్థి తర్వాతి రెండు స్థానాల్లో (అంటే రెండో స్థానంలో లేదా మూడో స్థానంలో) నిలిచిన అభ్యర్థుల్లో ఎవరైనా ఫలితంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే, వారు చెప్పిన నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్‌లో.. వారు సూచించిన సీరియల్ నంబర్ కలిగిన 5% ఈవీఎంల మైక్రోకంట్రోలర్ల మెమొరీని.. వాటిని తయారుచేసిన ఇంజనీర్ల బృందం తనిఖీ చేయాలి. ఈ రెండు ఆదేశాలు ఇవ్వడంతో పాటు.. కౌంటింగ్ సమయంలో పేపర్ స్లిప్‌లను లెక్కించేందుకు ఎలక్ట్రానిక్ యంత్రాలను ఉపయోగించాలన్న పిటిషనర్ల సూచనను కూడా పరిశీలించాలని ధర్మాసనం ఈసీకి సూచించింది. సుప్రీం తీర్పుపై పిటిషనర్ల తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటిదాకా కనీసం 40సార్లు.. ఈవీఎంల విశ్వసనీయతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను కోర్టులు కొట్టేశాయని ఈసీ గుర్తుచేసింది.

ఏమిటీ సింబల్ లోడింగ్ యూనిట్లు?

సింబల్ లోడింగ్ యూనిట్ అంటే.. వీవీప్యాట్ మెషీన్లలోకి అభ్యర్థుల పేర్లు, గుర్తులు, సీరియల్ నంబర్లను ఎక్కించే యంత్రం. ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులందరి గుర్తులనూ తొలుత కంప్యూటర్ ద్వారా ఈ సింబల్ లోడింగ్ యూనిట్‌లోకి ఎక్కిస్తారు (అభ్యర్థులు ఎక్కువ మంది ఉంటే రెండు యూనిట్లను ఉపయోగిస్తారు). తర్వాత వాటిని వీవీప్యాట్లకు అనుసంధానం చేసి.. వాటిలోకి ఆయా గుర్తులను అప్‌లోడ్ చేస్తారు. ఇదంతా నామినేషన్ల దశ పూర్తయి, అభ్యర్థులు ఖరారయ్యాక.. ఎన్నికల కార్యాలయంలో, వివిధ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారుల సమక్షంలో జరిగే ప్రక్రియ. సింబల్ లోడింగ్ యూనిట్లను మనదేశంలో ప్రస్తుతం రెండు సంస్థలే తయారుచేస్తున్నాయి. అవి.. ఈసీఐఎల్, బీఈఎల్. ఈ రెండు సంస్థల ఇంజనీర్లు ఎన్నికల కార్యాలయాలకు వెళ్లి.. గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ యూనిట్ల ద్వారా వీవీప్యాట్ యంత్రాలలోకి అభ్యర్థుల పేర్లు, వారి పార్టీ గుర్తు, సీరియల్ నంబర్ వంటివాటిని లోడ్ చేసి పరీక్షిస్తారు. అంతా సరిగ్గా ఉందని నిర్ధారించుకున్నాక ఈవీఎంలను స్ట్రాంగ్‌రూముల్లో భద్రపరుస్తారు. సింబల్ లోడింగ్ యూనిట్లను జిల్లా ఎన్నికల అధికారి కస్టడీలో ఉంచుతారు. ఎన్నికలు అయిన ఒకరోజు తర్వాత.. ఆ యూనిట్లను సంబంధిత సంస్థల ఇంజనీర్లకు అప్పగిస్తారు. అప్పుడా ఇంజనీర్లు వాటిని తదుపరి దశ ఎన్నికలు జరిగే నియోజకవర్గాల్లో ఉపయోగించడానికి తీసుకెళ్తారు. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం.. ఓడిన అభ్యర్థులకు ఓట్ల లెక్కింపుపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఎన్నికల ఫలితాలు వచ్చిన తేదీ నుంచి 45 రోజుల్లోగా పిటిషన్ దాఖలు చేయొచ్చు.

నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే ఏం చేయాలో చెప్పండి

▸▸ ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే ఏమి చేయాలో చెప్పాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘానికి శుక్రవారం సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఎన్నికల్లో నోటాకు ఎక్కువ ఓట్లు పోలైతే ఆ ఎన్నికను రద్దుచేసి, మళ్లీ నిర్వహించాలని కోరుతూ వక్త, రచయిత శివ్ ఖేరా దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ నోటీసులు ఇచ్చింది. నోటా కంటే తక్కువ ఓట్లు పొందిన అభ్యర్థులు మళ్లీ అదే నియోజకవర్గంలో ఐదేళ్ల వరకూ ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆదేశించాలని పిటిషనర్ కోరారు. ఈ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్డీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణ వాదనలు వినిపించారు. ఇటీవల సూరత్‌లో బీజేపీ అభ్యర్థి పోటీ లేకుండా ఎన్నికైన అంశాన్ని గుర్తు చేశారు. "ఇది సరైన పద్ధతి కాదు. పోటీలో ఒకే అభ్యర్థి ఉన్నప్పటికీ ఎన్నిక నిర్వహించాలి. బీజేపీ అభ్యర్థిని తమ నాయకుడిగా ఎన్నుకోవడం ఇష్టంలేని వారు రాజ్యాంగం తమకు కల్పించిన హక్కులో భాగంగా నోటాకు ఓటేసేవారేమో! సూరత్‌లో నోటాను చెల్లుబాటు అయ్యే అభ్యర్థిగా పరిగణించడంలో కేంద్ర ఎన్నికల సంఘం విఫలమైంది" అని వాదించారు. ఇది ఎన్నికల ప్రక్రియ కాబట్టి కేంద్ర ఎన్నికల సంఘం ఏం చెబుతుందో వినాల్సిన అవసరం ఉందంటూ ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేశారు.

నటుడు రవికిషన్‌కు ఉపశమనం

ముంబయి, ఏప్రిల్ 26: ఉత్తర్‌ప్రదేశ్‌లో బీజేపీ గోరఖ్‌పూర్ లోక్‌సభ స్థానం అభ్యర్థి, నటుడు రవికిషన్‌ని తన తండ్రిగా పేర్కొంటూ ఆయనకు డీఎన్ఏ టెస్ట్ నిర్వహించాలని షినోవా(25) అనే యువతి వేసిన పిటిషన్‌ను ముంబయి కోర్టు శుక్రవారం తిరస్కరించింది. ముంబయిలో దిండోషి సెషన్స్ కోర్టు ఈ పిటిషన్‌పై వాదనలు విన్న తర్వాత ఆమె తల్లి అపర్ణ సోనికి రవికిషన్‌కు మధ్య అనుబంధం ఉన్నట్లు ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేవని పేర్కొంది. కాగా ఏప్రిల్ 16న లక్నవూలో నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో అపర్ణ సోని మాట్లాడుతూ... రవికిషనే షినోవా తండ్రి అని, ఆయన కుమార్తెగా ఆమెకున్న హక్కులను నిరాకరిస్తున్నారని ఆరోపించారు. మరోవైపు రవికిషన్ భార్య ప్రీతి శుక్లా.. అపర్ణ, షినోవా, మరికొందరిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అపర్ణ తనకు అండర్ వరల్డ్‌తో సంబంధాలు ఉన్నాయని తనను బెదిరించారని ఆరోపించారు. దీంతో పోలీసులు అపర్ణ సోని, ఆమె భర్త రాజేశ్ సోని, కుమార్తె షినోవా, కుమారుడు సౌనక్ సోని, సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు వివేక్ కుమార్ పాండే, ఖుర్షీద్ ఖాన్ అనే యూట్యూబ్ చానల్ జర్నలిస్టుపై కేసు నమోదు చేశారు.

మోదీ వణుకుతున్నారు!

స్టేజీపైనే కన్నీళ్లు కూడా పెడతారేమో.. ప్రధానిపై రాహుల్ సంచలన వ్యాఖ్యలు



బళ్లారిలో ఎన్నికల ప్రచారంలో ఖాళీ చెంబును చూపిస్తున్న రాహుల్

బెంగళూరు/బళ్లారి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన విమర్శలపై ఆ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇటీవల మోదీ ప్రసంగాలను గమనిస్తే ఆయన భయంతో వణుకుతున్నట్లుందని, రాబోయే రోజుల్లో ఆయన స్టేజీపైనే కన్నీళ్లు కూడా పెడతారేమోనంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం కర్ణాటక రాష్ట్రంలోని విజయపురలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం దేశంలో పేదరికం, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి ప్రధాన సమస్యలు ఉన్నాయని చెప్పారు. మోదీ తన మాటలతో వాటినుంచి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని ఆరోపించారు. 'కొన్నిసార్లు చైనా, పాకిస్థాన్ అంటారు. కొన్నిసార్లు పళ్లేలు కొట్టి శబ్దం చేయమంటారు. ఇంకోసారి మీ మొబైల్ ఫోన్లలో టార్చ్‌లైట్ ఆన్ చేయమని అడుగుతారు' అని రాహుల్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ మాత్రమే నిరుద్యోగాన్ని రూపుమాపగలదని, ధరల పెరుగుదలను అరికట్టగలదని, ప్రజలకు తమ వంతు వాటా ఇవ్వగలదని ఆయన స్పష్టం చేశారు. మోదీ హయాంలో నిరుద్యోగం కొవిడ్ వ్యాపించినట్లు పెరిగిపోయిందన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తామని యువతకు రాహుల్ హామీ ఇచ్చారు. దేశ చరిత్రలో మొదటిసారిగా ఒక పార్టీ, ఒక వ్యక్తి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయాలని చూస్తున్నారని రాహుల్ ఆరోపించారు.

శ్రీమంతుల సొమ్మును రైతులకు పంచుతాం

ప్రధాని మోదీ శ్రీమంతులకు ఇచ్చిన సొమ్మును రైతులకు పంచడమే తమ పథకమని రాహుల్ అన్నారు. గడిచిన పదేళ్లలో బిలియనీర్లకు మాత్రమే మోదీ మద్దతు ఇచ్చి పోషించారని విమర్శించారు. అదానీకి పెద్ద ప్రాజెక్టులు కట్టబెట్టారని, పేదలకు ఏమిచ్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కర్ణాటకలో ఇచ్చిన ఐదు గ్యారంటీలతో పేదలకు ఎంతో ప్రయోజనం చేకూరుతోందని చెప్పారు.

బీజేపీ చెంబు పార్టీ: రాహుల్

బీజేపీ అంటే భారతీయ చెంబు పార్టీ అని, కరువు సాయంగా కర్ణాటకకు రూ.18వేల కోట్లు రావాల్సి ఉండగా, ఆ రాష్ట్రానికి ఖాళీ చెంబు మాత్రమే దక్కిందని రాహుల్ గాంధీ విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన బళ్లారి మున్సిపల్ కాలేజీ మైదానంలో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. 'దేశ సంపదను తమకు అనుకూలమైన 22మంది సంపన్నులకు బీజేపీ పంచింది. పూర్వం రాజులు వారి సామ్రాజ్యాన్ని ఇష్టారాజ్యంగా పరిపాలించారు. అలాంటి వారి నుంచి దేశాన్ని రక్షించుకునేందుకు కాంగ్రెస్ పోరాడుతోంది" అని ఆయన పేర్కొన్నారు. తాము అధికారంలోకి రాగానే దేశంలో పేదల జాబితాను తయారు చేసి, ప్రతి ఒక్కరి ఖాతాలో ఏడాదికి రూ.లక్ష వేస్తామని, రైతుల రుణాలను మాఫీ చేస్తామని చెప్పారు.

ముగిసిన రెండోదశ

13 రాష్ట్రాల్లోని 88 స్థానాలకు పోలింగ్.. 63.5 శాతం నమోదు

▸▸ కేరళలో ఈ దశలోనే ఎన్నికలు పూర్తి



అసోంలోని దర్రాంగ్‌లో మండే ఎండలో ఓటర్ల క్యూ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల రెండోదశ పోలింగ్ శుక్రవారం ముగిసింది. భానుడు నిప్పులు కురిపిస్తున్నప్పటికీ దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాల్లోని 88 స్థానాల్లో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి ఓటుహక్కు వినియోగించుకున్నారు. రాత్రి 8 గంటల వరకు 63.5 శాతం పోలింగ్ నమోదైందని, పూర్తి వివరాలు లభించిన అనంతరం పోలింగ్ శాతం పెరగవచ్చని ఎన్నికల సంఘం (ఈసీ) ప్రకటించింది. రెండో దశలో కేరళలోని మొత్తం స్థానాలు (20), కర్ణాటక (14), రాజస్థాన్ (13), యూపీ (8), మహారాష్ట్ర (8), మధ్యప్రదేశ్ (6), అస్సాం (5), బిహార్ (5), ఛత్తీస్‌గఢ్ (3), పశ్చిమబెంగాల్ (3)లతోపాటు జమ్ముకశ్మీర్, మణిపూర్, త్రిపురలోని ఒక్కో స్థానానికి పోలింగ్ జరిగింది. అత్యధికంగా త్రిపురలో 79.46 శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా బిహార్‌లో 55.08 శాతం నమోదైంది. కాగా, రెండో దశలో 89 నియోజకవర్గాల్లో పోలింగ్ జరగాల్సి ఉండగా 88 స్థానాలలోనే జరిగింది. మధ్యప్రదేశ్‌లోని బేతుల్‌లో బరిలో ఉన్న బీఎస్పీ అభ్యర్థి మరణించడంతో ఆ స్థానానికి పోలింగ్‌ను మే 7న జరిగే మూడోదశ ఎన్నికలతో కలిపి నిర్వహించనున్నారు. కేరళలో మొత్తం 20 సీట్లకు ఎన్నికలు జరిగాయి. దేశవ్యాప్తంగా చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని ఈసీ తెలిపింది. మధ్యప్రదేశ్‌లో ఓ ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికల విధుల్లో ఉన్న జవాన్ తన సర్వీస్ రైఫిల్‌తో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. తీవ్ర ఉద్రిక్తతలు చెలరేగిన మణిపూర్‌లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఆ రాష్ట్రంలో 77.32 శాతం పోలింగ్ నమోదు కావటం గమనార్హం. శుక్రవారం పలు రాష్ట్రాల్లో ఎండలు మండిపోయాయి. తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బిహార్‌లోని ఖగారియా, ముంగేర్ నియోజకవర్గాలలో ఎండ తీవ్రత కారణంగా ఓటర్లకు అధికారులు షామియానాలు ఏర్పాటు చేసి, తాగునీరు, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్, కాంకేర్ పార్లమెంటు స్థానాల పరిధిలోని 46 గ్రామాల ప్రజలు లోక్‌సభకు ఎన్నికలకు సంబంధించి తొలిసారిగా తమ గ్రామాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ పూర్తయిన అనంతరం ప్రధాని మోదీ ఎక్స్‌లో ట్వీట్ చేస్తూ.. 'రెండోదశ చాలా బాగా పూర్తయ్యింది. ఎన్‌డీఏకు అద్భుతంగా లభించిన స్పందన ప్రతిపక్షాలను మరింత నిరాశపరుస్తుంది' అన్నారు.

బరిలో ఉన్న ప్రముఖులు

రెండో దశ ఎన్నికల బరిలో పలువురు ప్రముఖులు పోటీ పడ్డారు. వీరిలో రాహుల్‌గాంధీ, శశిథరూర్, కేసీ వేణుగోపాల్, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ బఘేల్, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేష్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్రమంత్రులు రాజీవ్ చంద్రశేఖర్, గజేంద్రసింగ్ షెకావత్, సినీ నటి హేమమాలిని, తేజస్వీ సూర్య, కర్ణాటక మాజీ సీఎం కుమారస్వామి ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల తొలిదశ పోలింగ్ ఈ నెల 19న 102 స్థానాలకు జరిగింది. ఇప్పటి వరకూ మొత్తం 190 నియోజకవర్గాలకు పోలింగ్ పూర్తయ్యింది.

ఐదో దశ నోటిఫికేషన్ విడుదల

లోక్‌సభ ఎన్నికల ఐదో దశ నోటిఫికేషన్ శుక్రవారం విడుదలైంది. 8 రాష్ట్రాలలోని 49 నియోజవర్గాలలో ఎన్నికలకు ఈసీ నోటిఫికేషన్ విడుదల చేసింది. మే 20న పోలింగ్ జరుగనుంది. ఈ దశలో యూపీలోని అమేథీ, రాయబరేలీ తదితర స్థానాలున్నాయి. శుక్రవారం నుంచే నామినేషన్ల స్వీకరణ మొదలు కాగా మే 3 నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ. మే 4న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది.

కర్ణాటకలో తొలి విడత పూర్తి

బెంగళూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో మొదటి విడతలో బెంగళూరు దక్షిణ, బెంగళూరు ఉత్తర, బెంగళూరు సెంట్రల్, బెంగళూరు గ్రామీణ, తుమకూరు, కోలారు, చిత్రదుర్గ, చిక్కబళ్లాపుర, మండ్య, మైసూరు, చామరాజనగర, హాసన్, ఉడుపి-చిక్కమగళూరు, దక్షిణ కన్నడ లోక్‌సభ నియోజకవర్గాల్లో శుక్రవారం పోలింగ్ జరిగింది. పోలింగ్ ప్రశాంతంగా ముగిసినప్పటికీ కొన్నిచోట్ల ప్రజలు తమ సమస్యలపై నిరసన వ్యక్తం చేశారు. చామరాజనగర జిల్లా హనూరు తాలూకా మహదేశ్వరగుట్ట పరిధిలో స్థానిక సమస్యలపై ఓటర్లు పోలింగ్‌ను బహిష్కరించారు. నచ్చచెప్పేందుకు వచ్చిన అధికారులపైన తిరగబడ్డారు. పోలింగ్ కేంద్రాన్ని ధ్వంసం చేసి ఈవీఎంలను తగలబెట్టారు. మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టే విధంగా ఓ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఆరోపణలపై బీజేపీ అభ్యర్థి తేజస్వీసూర్య, ఆ పార్టీ నేత సీటీ రవిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

(మొదటి పేజీ తరువాయి)

బుగ్గన నామినేషన్‌పై హైడ్రామా

ఈ నెల 29 వరకు అవకాశం ఉంది. అయితే పలు నియోజకవర్గాల్లో నామినేషన్ల పరిశీలన, అనుమతి విషయంలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా వైసీపీ అభ్యర్థుల నామినేషన్ల విషయంలో హైడ్రామా చోటు చేసుకుంది. ఆయా అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్లలో లోపాలను టీడీపీ అభ్యర్థులు ప్రస్తావించి ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు చర్యల పేరుతో వాటిని పెండింగులో పెట్టినా.. కొన్ని గంటలు గడిచేసరికి ఆమోదించేశారు. ఈ పరిణామం వెనుక పైస్థాయిలో ఒత్తిళ్లు ఉన్నాయని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు.

డోన్‌లో డ్రామా!

నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి, మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నామినేషన్‌ను నాటకీయ పరిణామాల మధ్య ఆమోదించారు. బుగ్గన అఫిడవిట్‌లో ఆస్తులు వెల్లడించలేదని టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి తరఫున ఆయన న్యాయవాదులు శ్రీనివాసభట్, భాస్కర్ రెడ్డి అభ్యంతరం వ్యక్తంచేశారు. దీంతో రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డి తొలుత ఈ నామినేషన్‌ను 6గంటలపాటు పెండింగ్‌లో ఉంచారు. తర్వాత ఏం జరిగిందో ఏమో చివరకు ఆమోదం తెలిపారు. అయితే, దీనివెనుక ఉన్నత స్థాయి ఒత్తిళ్లున్నాయని, ఈసీకి ఫిర్యాదు చేయడంతోపాటు, న్యాయ పోరాటం చేస్తామని టీడీపీ నేతలు తెలిపారు.

పొన్నూరు పేచీ.. గుంటూరు జిల్లా పొన్నూరు వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ దాఖలు చేసిన అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలు వెల్లడించ లేదని టీడీపీ అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఫిర్యాదు చేశారు. అంబటి తన అఫిడవిట్‌లో భార్య, కుమార్తెల ఆస్తుల వివరాలు పేర్కొనలేదన్నారు. నోటరీ చేసిన వ్యక్తి అనుమతి గుంటూరు నగరానికే పరిమితమైనందున అఫిడవిట్ చెల్లదని తెలిపారు. డ్వాక్రా మహిళా సంఘాలు దాచుకున్న దాదాపు రూ.2.50కోట్లను తన సొంత ఖాతాలకు మళ్లించుకున్నారని పేర్కొన్నారని ఇది అభ్యంతరకరమని తెలిపారు. నామినేషన్‌తోపాటు బీఫాం సమర్పించలేదని కాబట్టి నామినేషన్‌ను తరిస్కరించాలని కోరారు. టీడీపీ నేతల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండానే అంబటి నామినేషన్ ఆమోదిస్తున్నట్లు ఆర్వో తెలిపారు.

'ఆమంచి'కి బకాయి బెడద!

బాపట్ల జిల్లా చీరాల అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్ నామినేషన్‌ను పెండింగ్‌లో ఉంచినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. దీనిపై శనివారం నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆమంచి విద్యుత్ బిల్లుల బకాయిలు ఉన్నట్లు ఓ పార్టీకి చెందిన ఏజెంట్ తెలిపారని, దీంతో నామినేషన్‌ను పెండింగ్‌లో ఉంచామని పేర్కొన్నారు.

సాయిరెడ్డికి కలెక్టర్ నో

నెల్లూరు ఎంపీగా పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నామినేషన్‌ను తిరస్కరించాలని వైసీపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారి(కలెక్టర్) హరినారాయణన్‌కు ఫిర్యాదు చేశారు. వేమిరెడ్డి తన అఫిడవిట్‌లో స్వదేశం, విదేశాల్లో ఉన్న ఆస్తులన్నీ చూపలేదని తెలిపారు. ఆయన నామినేషన్ చెల్లదని, తిరస్కరించాలని కలెక్టర్‌ను కోరారు. సాయిరెడ్డి ఫిర్యాదును కలెక్టర్ తిరస్కరించారు.

వైసీపీ అభ్యర్థిపై అయ్యన్న ఫిర్యాదు

అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేశ్ అఫిడవిట్‌లో వెల్లడించకుండా దాచిపెట్టిన అంశాలపై ఆర్వో జయరామ్‌కు టీడీపీ అభ్యర్థి అయ్యన్నపాత్రుడు ఫిర్యాదు చేశారు. నామినేషన్‌ను తిరస్కరించాలని కోరారు.

క్రిమినల్ కేసులు దాచారు

విశాఖ జిల్లా పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ నామినేషన్‌పై జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు తరఫున ఏజెంట్ వేణుగోపాల్ అభ్యంతరాలు వ్యక్తం చేశారు. నామినేషన్‌లో క్రిమినల్ కేసులకు సంబంధించి సమాచారం ఇవ్వలేదని,దానిని తిరస్కరించాలని కోరారు. దీంతో రిటర్నింగ్ అధికారి.. అదీప్‌రాజ్ వివరణ కోరగా, ఏదీ ఉద్దేశపూర్వంగా దాచిపెట్టలేదని సమాధానం ఇచ్చారు. దీంతో అదీప్‌రాజ్ నామినేషన్‌ను ఆమోదించారు.

కొడాలిపై ఫిర్యాదా? నో!

కృష్ణాజిల్లా గుడివాడ వైసీపీ అభ్యర్థి కొడాలి నాని నామినేషన్‌ను తిరస్కరించి, అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ.. టీడీపీ నేత తులసీబాబు ఫిర్యాదు చేశారు. గుడివాడ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సులో కొడాలి తన క్యాంప్ ఆఫీసు నిర్వహించారని, కోడ్ అమల్లోకి వచ్చాక మున్సిపల్ కమిషనర్ నోటీసు ఇవ్వడంతో అయన ఖాళీ చేశారని తెలిపారు. కానీ నామినేషన్ పత్రంలో మాత్రం తాను కాంప్లెక్స్‌ను ఉపయోగించుకోలేదని తెలిపారని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదును తీసుకునేందుకు రిటర్నింగ్ అధికారి పి.పద్మావతి అంగీకరించ లేదు. ఆమె తీరుపై టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

లోకం తీరు

రోజు రోజుకూ పెరుగుతున్న జగన్ బ్యాండేజ్!





కుంభోత్సవానికి తరలివచ్చిన భక్తులు
ఆలయం ఎదుట అన్నపు రాశి

శ్రీశైలంలో శాస్త్రోక్తంగా కుంభోత్సవం

అమ్మవారికి గుమ్మడికాయలు, అన్నపు రాశి సమర్పణ

శ్రీశైలం, ఏప్రిల్ 26: శ్రీశైల మహాక్షేత్రంలోని శుక్రవారం శాస్త్రోక్తంగా కుంభోత్సవం నిర్వహించారు. హరిహరరాయ గోపురం వద్ద గల మహిషాసురమర్ధిని అమ్మవారికి పూజాదికాలు జరిపి ఆ తర్వాత గుమ్మడికాయలు, కొబ్బరికాయలతో పాటు నిమ్మకాయలతో స్వాత్వికబలిని సమర్పించారు. ఉత్సవంలో భాగంగా పసుపు, కుంకుమ రాసులను సమర్పించి అమ్మవారికి శాంతి ప్రక్రియ క్రతువును పూర్తిచేశారు. ప్రదోష కాల పూజల అనంతరం మల్లికార్జునస్వామివారికి అన్నాభిషేకం చేసి ఆలయాన్ని మూసివేశారు. అమ్మవారి ఆలయానికి ఎదురుగా ఉన్న సింహమండపం వద్ద అన్నాన్ని కుంభరాశిగా పోశారు. ఆ తర్వాత సంప్రదాయాన్ని అనుసరించి స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభ హారతిని సమర్పించారు. కుంభోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం భ్రమరాంబికాదేవి అమ్మవారు నిజరూప అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. భ్రామరి అమ్మవారి నిజరూప దర్శనం కోసం భక్తులు పోటెత్తారు.

ఐదు రోజులు మంటలే..!

- తూర్పు, దక్షిణ భారతంలో తీవ్ర వడగాలులు
- రాయలసీమ, తెలంగాణలోనూ గాల్పుల తీవ్రత
- వచ్చే నెలలో మరింత వేడిగాలులు...
- 45 డిగ్రీలు దాటి నమోదయ్యే అవకాశం
- వాతావరణ నిపుణుల హెచ్చరిక

విశాఖపట్నం, అమరావతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మునుపెన్నడూ లేనంతగా ఎండ వేడి, తీవ్ర వడగాడ్పులతో దేశంలోని అనేక ప్రాంతాలు ఉడుకుతున్నాయి. రోహిణి కార్తెకు మరో నెల రోజుల సమయం ఉండగానే రోళ్ల బద్దలయ్యేలా కాస్తున్న ఎండలతో ప్రజలు ఠారెత్తిపోతున్నారు. ఈ ఏడాది వేసవి తీవ్రంగా ఉంటుందని వాతావరణ నిపుణులు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అధికారులు ముందే హెచ్చరించారు. గతేడాది కంటే ప్రస్తుత ఏడాది రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కావొచ్చని ఐఎండీ సీనియర్ అధికారి డీఎస్ పాయ్ శుక్రవారం పేర్కొన్నారు. ఇప్పటివరకు 2023 అత్యంత వేడి సంవత్సరంగా నమోదైందని, అయితే ఈ ఏడాది ఆ రికార్డును అధిగమిస్తుందని అంచనా వేశారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, జార్ఖండ్, పశ్చిమబెంగాల్‌లో తీవ్రమైన వడగాడ్పులు వీయడంతో కొద్దిరోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 42 నుంచి 44 డిగ్రీలు, అక్కడక్కడా అంతకుమించి నమోదు కావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. కాగా, రానున్న ఐదు రోజుల్లో దక్షిణాదిలో ఏపీ, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, వీటికి ఆనుకుని ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, విదర్భ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లలోని అనేక ప్రాంతాల్లో వేడి వాతావరణం కొనసాగడమే కాకుండా వడగాడ్పులు వీస్తాయని ఐఎండీ శుక్రవారం హెచ్చరించింది. ఈ నెల 28 నుంచి 30 వరకు ఈశాన్య భారతంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇదిలావుండగా ఎల్‌నినో బలహీనపడినా ఇంకా దాని అవశేషాల ప్రభావంతో పసిఫిక్ మహాసముద్రం నుంచి వస్తున్న వేడి గాలులు భారత ఉపఖండంలో మరింత వేడిని పెంచుతున్నాయని సీనియర్ వాతావరణ శాస్త్రవేత్త ఒకరు పేర్కొన్నారు. దీని ప్రభావంతో దేశం మొత్తం నిప్పుల కుంపటిలా మారిందని, వచ్చేనెలలో మరింత వేడిగాలులు వీస్తాయని, పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటతాయని హెచ్చరించారు. వడగాడ్పుల ప్రభావం ఎన్నికల ప్రచారం, పోలింగ్‌పై పడనుందన్నారు.



నంద్యాలలో 45.5 డిగ్రీలు

రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45.5 డిగ్రీలకు చేరాయి. శుక్రవారం నంద్యాల జిల్లా చాగలమర్రిలో 45.5 డిగ్రీలు, కడప జిల్లా ఖాజీపేటలో 45.3, పల్నాడు జిల్లా మాచర్లలో 45.2, కర్నూలు రూరల్‌లో 44.9, అనంతపురం జిల్లా తాడిపత్రిలో 44.6, ప్రకాశం జిల్లా మార్కాపురం, విజయనగరం జిల్లా కొత్తవలసలో 44.2, మన్యం సాలూరులో 43.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే 41 మండలాల్లో తీవ్రంగా, 116 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీచాయి. రానున్న రెండు రోజులు ఉష్ణోగ్రత 46 డిగ్రీలకు చేరనుంది. శనివారం.. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లోని 64 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీస్తాయని, రాష్ట్రవ్యాప్తంగా 183 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

భూమి గోల్‌మాల్.. ఫైలూ మాయం!

- ప్రకాశం కలెక్టర్, జేసీ, ఆర్డీవోలపై చర్యలకు ఇచ్చిన ఆదేశాలను తొక్కిపెట్టిన వైనం
- రెవెన్యూలో జూనియర్ అధికారి నిర్వాకం
- రెండు నెలల తర్వాత 'గుట్టు' రట్టు
- ఉలిక్కిపడిన రాష్ట్ర ప్రభుత్వం
- చర్యలకోసం తాజాగా సీసీఎల్‌ఏకు ఆదేశాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పేదింటి స్థలాల భూసేకరణలో భారీ గోల్‌మాల్ జరిగిందన్న ఆరోపణలపై ప్రకాశం జిల్లా కలెక్టర్, నాటి జాయింట్ కలెక్టర్‌లపై విచారణకు ఆదేశిస్తూ రెవెన్యూశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు విచారణ బాధ్యతను భూ పరిపాలనా ప్రధాన కమిషనర్‌కు (సీసీఎల్‌ఏ) అప్పగిస్తూ రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇద్దరు ఐఏఎస్‌లు, ఒంగోలు ఆర్డీవో, తహసిల్దార్, మున్సిపల్ కమిషనర్ సహా సర్వే అధికారిపై విచారణ చేయాల్సి ఉంది. వివరాల్లోకి వెళితే... ఒంగోలు మండలంలోని మూడు గ్రామాల పరిధిలో పేదల ఇంటిస్థలాల కోసం భారీగా భూ సేకరణ చేశారు. అయితే, చట్టబద్ధమైన నిబంధనలు పాటించకుండా, అడ్డగోలు ధరలు నిర్ణయించి భూములు కొన్నారని, ఇందుకు జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్, నాటి జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాస్, రెవెన్యూ అధికారులే కారణమని ఆరోపిస్తూ ఎం.సుధీర్‌కుమార్ అనే వ్యక్తి తొలుత ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. అయితే, ప్రభుత్వస్థాయిలో దీన్ని పట్టించుకోలేదు. దీంతో ఆయన ఈ ఏడాది జనవరి 31న సీబీఐకు లేఖరాశారు. భూ సేకరణలో 201.33 కోట్ల రూపాయల గోల్‌మాల్ జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలంటూ ఆ లేఖలో సీబీఐని కోరారు. పేదింటి స్థలాలకోసం ఎలాగూ భూములు సేకరిస్తారని, ఇందుకోసం అడ్డగోలుగా భూముల ధరలను నిర్ణయించారని, కనీసం న్యాయపరమైన నియమ నిబంధనలను కూడా పరిగణనలోకి తీసుకోలేదని ఫిర్యాదు కాపీలో పేర్కొన్నారు. వ్యవస్థలోని లోపాలను అడ్డంపెట్టుకొని ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించేలా ధరలు నిర్ణయించి కొందరికి అడ్డగోలు లబ్ధి చేకూర్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు.

తొక్కిపెట్టే ప్రయత్నం

నిజానికి ఈ అంశంపై సీఎస్ స్థాయిలోనే విచారణకు ఆదేశించవచ్చు. ఆయన ఏ నిర్ణయం చెప్పకుండానే జీఏడీకి పంపించారు. సీబీఐ నుంచి వచ్చిన లేఖ ఆధారంగా తగిన చర్యలు తీసుకోమని మాత్రమే ముత్యాలరాజు...రెవెన్యూశాఖను కోరారు. ఇక యూవో నోట్‌లోని అంతరార్థం తెలిసి రెవెన్యూశాఖలోని ఓ జూనియర్ అధికారి దాన్ని భద్రంగా తొక్కిపెట్టారు. ఇద్దరు ఐఏఎస్‌లు, మరో ఐదుగురు కీలక అధికారులపై తీవ్ర ఆరోపణలు వచ్చిన విషయాన్ని వెంటనే రెవెన్యూశాఖ స్పెషల్ సీఎస్ దృష్టికి తీసుకెళ్లలేదు. చాలా జాగ్రత్తగా ఆ ఫైలును తన వద్దే అట్టిపెట్టుకున్నారు. రెండు నెలలపాటు ఆ ఫైలును మూడో కంటికి తెలియకుండా చూశారు. ఈలోగా రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్నికల నోటిఫికేషన్ కూడా అమల్లోకి వచ్చింది. ఇక ఈ విషయం గురించి అంతా మర చిపోయారు...ఇక ఫైలును పై అధికారికి పంపించాల్సిన అవసరం రాదేమో అనుకున్నారు. కానీ గుట్టు రట్టయింది. కీలక ఫైలును తొక్కిపెట్టారన్న విషయం వెలుగు చూడటంతో రెవెన్యూ శాఖ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. చివరకు ఆ ఫైలును కనిపెట్టింది.

సీసీఎల్‌ఏ ఏం చేస్తారు?

ప్రకాశం కలెక్టర్, నాటి జేసీ, ఐదుగురు సీనియర్ అధికారులపై వచ్చిన తీవ్ర ఆరోపణలపై విచారణ చేయాలని రెవెన్యూశాఖ..సీసీఎల్‌ఏను ఆదేశించింది. ఇప్పుడు సీసీఎల్‌ఏ ఏం చేస్తారన్నదే కీలకంగా మారనుంది. ఓ కలెక్టర్, జేసీపై విచారణ చేయాలంటే వారికంటే సీనియర్ ఐఏఎస్‌కు బాధ్యతలు అప్పగించాలి. అంటే కార్యదర్శి హోదాలో ఉన్న అధికారితో విచారణ చేయించవచ్చు. మరి సీసీఎల్‌ఏ ఏం చేస్తారన్నదే కీలకంగా మారింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల సందడి నెలకొంది. ఇప్పటికిప్పుడు విచారణ చేయడం సాధ్యమవుతుందా? లేక ఎన్నికలు ముగిశాక విచారణ నిర్వహిస్తారా? అన్న చర్చ జరుగుతోంది. భూసేకరణలో గోల్‌మాల్ జరిగిందా? లేదా అన్నది నిర్ధారించాల్సింది విచారణ ద్వారానే. అయితే, అది ఒక్క ప్రకాశం జిల్లాకే పరిమితం అవుతుందా? లేక రాష్ట్రస్థాయిలో చేపడతారా అన్న చర్చ జరుగుతోంది. ఇందుకు కారణం లేకపోలేదు. పేదింటి స్థలాల సేకరణలో వైసీపీ నేతలు, భూ దళారులు భారీ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలున్నాయి. సరిగ్గా ఐదు లక్షలు కూడా విలువ చేయని భూములకు కోట్ల రూపాయలు చెల్లించారు. ఇలాంటి ఉదంతాలు ప్రతీ మండలంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూ సేకరణ గోల్‌మాల్‌పై సమగ్ర విచారణ జరిపిస్తామని ప్రతిపక్ష టీడీపీ ఇప్పటికే ప్రకటించింది. కాగల కార్యానికి ప్రకాశం జిల్లా విచారణే నాంది కాబోతుందా అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రాష్ట్రస్థాయిలోనే నిర్ణయం తీసుకోండి: సీబీఐ లేఖ

ఆయన ఫిర్యాదుపై సీబీఐ వెంటనే స్పందించింది. ఫిర్యాదులోని అంశాలపై రాష్ట్ర స్థాయిలోనే తగిన నిర్ణయం తీసుకోవాలని కోరుతూ సీబీఐ ఏఐజీ టీపీ సింగ్ ఈ ఏడాది ఫిబ్రవరి 5వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. సీఎస్ ఈ అంశాన్ని జీఏడీకి రిఫర్ చేశారు. సీబీఐ నుంచి వచ్చిన లేఖ, అందులోని అంశాలు, భూ సేకరణపై ఉన్న ఫిర్యాదు కాపీని రెవెన్యూశాఖకు పంపిస్తూ, వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి ముత్యాలరాజు ఫిబ్రవరి 22వ తేదీన రెవెన్యూశాఖకు యూవో నోట్ పంపించారు. "ఫిర్యాదులోని అంశాల ఆధారంగా, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై ఏవైనా ప్రాథమిక ఆధారాలు ఉంటే వెంటనే మాకు నివేదిస్తే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది" అని ముత్యాలరాజు తన నోట్‌లో ప్రస్తావించారు.

ఎట్టకేలకు విచారణకు ఆదేశం

జీఏడీ నుంచి వచ్చిన ఫైలు రెండు నెలలుగా ఓ జాయింట్ సెక్రటరీ వద్ద ఉందని రెవెన్యూశాఖ గుర్తించింది. ఆ ఫైలును వెంటనే స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్ తెప్పించుకొని పరిశీలించారు. అందులోని అంశాలను పరిగణనలోకి తీసుకొని భూసేకరణ గోల్‌మాల్ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ)ను ఆదేశిస్తూ అజయ్‌జైన్ ఈ నెల 23న మెమో జారీ చేశారు.



కూర్మన్నపాలెంలోని ఉక్కు కార్మికుల శిబిరం వద్ద పాల్‌కు పాలాభిషేకం చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

మీడియా, ప్రజల మద్దతుతోనే స్టీల్‌ప్లాంటు భూముల అమ్మకంపై స్టే

- నా లాయర్ అమ్ముడుపోతే.. నేనే వాదించా: కేఏ పాల్

విశాఖపట్నం/సిరిపురం/కూర్మన్నపాలెం, ఏప్రిల్ 26: రాష్ట్ర హైకోర్టులో తాను వేసిన కేసులో విశాఖపట్నం స్టీల్ ప్లాంటు భూములు విక్రయించకూడదంటూ న్యాయమూర్తి స్టే ఇచ్చారని, ఇదంతా మీడియా సహకారం, ప్రజల మద్దతుతోనే సాధ్యమైందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏ పాల్ అన్నారు. ఆయన ఇక్కడి కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఈ కేసులో తన తరఫున వాదించాల్సిన లాయర్ అమ్ముడుపోయారని, దాంతో తానే స్వయంగా కోర్టుకు హాజరై కేసు వాదించుకున్నానని తెలిపారు. దాని ఫలితంగానే స్టీల్‌ప్లాంటు భూములు అమ్మవద్దంటూ కేంద్రానికి కోర్టు ఆదేశించిందన్నారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో కేఏ పాల్ కూర్మన్నపాలెంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పాల్‌కు ఉక్కు కాంట్రాక్టు కార్మికులు పాలాభిషేకం చేశారు.

'విడదల రజనీ' కిడ్నాప్..!

- స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయకుండా పోలీసులే చేశారు
- హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు... సోమవారం విచారణ

అమరావతి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): 'ఎస్సీ మహిళ విడదల రజనీ గుంటూరు పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయడానికి సిద్ధపడ్డారు. ఆమె నామినేషన్ వేయకుండా అడ్డుకోవడానికి అధికార పార్టీ నేతల ఒత్తిడితో నగరంపాలెం పోలీసులు ఆమెను కిడ్నాప్ చేశారు' అంటూ శుక్రవారం హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలైంది. రజనీని అభ్యర్థిత్వాన్ని బలపరిచిన పఠాన్ అస్మతుల్లా ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. రజనీతో పాటు ఆమె భర్త అనురాగరావు ఆచూకీని పోలీసులు చెప్పడం లేదన్నారు. వారి ఇరువురిని కోర్టులో హాజరుపర్చేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యంపై అత్యవసరంగా విచారణ జరపాలని పిటిషనర్ తరఫు న్యాయవాది ఎస్‌వీఎస్ఎస్ శివరాం శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యూ దుర్గాప్రసాదరావు నేతృత్వంలోని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. వ్యాజ్యాన్ని లంచ్‌మోషన్‌గా తీసుకొనేందుకు ధర్మాసనం అంగీకరించింది. అయితే భోజన విరామ సమయం తరువాత ధర్మాసనంలోని ఓ న్యాయమూర్తి మరో బెంచ్‌లో కేసులు విచారిస్తుండడంతో ప్రస్తుత వ్యాజ్యం విచారణ సాధ్యపడలేదు. దీంతో పిటిషన్‌పై సోమవారం విచారణ జరుపుతామని ధర్మాసనం స్పష్టం చేసింది.

ఎన్నికలున్నా జగన్ భజనే

- పిల్లల పాఠ్యపుస్తకాల్లో సీఎం, మంత్రి బొత్సకు కృతజ్ఞతలు
- కోడ్‌ను విస్మరించిన విద్యాశాఖ
- అందుబాటులోకి పీడీఎఫ్‌లు

అమరావతి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ పాఠశాల విద్యాశాఖ తీరు మారడం లేదు. ఇప్పటికే చిక్కీలు, పుస్తకాలపై సీఎం జగన్ బొమ్మలతో ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఆ శాఖ.. ఇప్పుడు 2024-25 పాఠ్యపుస్తకాల రూపకల్పనలోనూ అదే పంథా కొనసాగిస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం కోసం తయారు చేసిన కొత్త పాఠ్యపుస్తకాల పీడీఎఫ్ కాపీలను పాఠశాల విద్యాశాఖ శుక్రవారం విడుదల చేసింది. విద్యార్థులు వాటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించింది. అయితే ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ సీఎం జగన్, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణల పేర్లు పెట్టి, వారికి ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలపడం విమర్శలకు దారితీస్తోంది. పాఠ్యపుస్తకాలు రూపొందించిన రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ(ఎస్‌సీఈఆర్‌టీ) డైరెక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి ప్రతి పుస్తకంలో ముందు మాట రాశారు. అందులో జగన్, బొత్సలకు కృతజ్ఞతలు తెలిపారు. సాధారణ రోజుల్లో ఇది మామూలే అయినా కోడ్ అమల్లో ఉన్న సమయంలో, రాజకీయ నేతల పేర్లు ప్రభుత్వ వ్యవహారాల్లో ఉండకూడదని ఈసీ స్పష్టంగా పేర్కొంది. అయినప్పటికీ ఈసీ ఆదేశాలను ఉల్లంఘించి మరీ సీఎం, మంత్రి పేర్లు పెట్టారు. అంటే ఒకవేళ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయినా ఏడాది పాటు జగన్ పేరు పుస్తకాల్లో ఉండేలా ఎస్‌సీఈఆర్‌టీ ప్లాన్ చేసిందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి పేర్లు పెట్టడమే కాకుండా, వాటిని ఎన్నికలకు ముందే విడుదల చేసి కోడ్‌ను తుంగలో తొక్కారు.

నేడు పాలీసెట్.. 442 కేంద్రాల్లో నిర్వహణ

అమరావతి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్ష పాలీసెట్ శనివారం జరగనుంది. ఈ పరీక్ష నిర్వహణకు రాష్ట్ర వ్యాప్తంగా 442 కేంద్రాలను ఏర్పాటు చేశారు.. 1,59,783 మంది పాలీసెట్‌కు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుంది.

సీఎంఏ ఫౌండేషన్‌లో 'శ్రీమేధ'కు మొదటి ర్యాంకు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 26: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా గురువారం ప్రకటించిన సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థి అన్నా సాయివెంకట ధీరజ్ 340 మార్కులతో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించినట్లు సంస్థ చైర్మన్ అన్నా నందకిశోర్ శుక్రవారం తెలిపారు. సుల్తాన్ చాంద్ మెమోరియల్ బుక్ ప్రైజ్, ర్యాంకు సర్టిఫికెట్‌ను ఐసీఏఐ ఆధ్వర్యంలో మే 23న జరిగే కాన్వొకేషన్‌లో ధీరజ్ అందుకోనున్నట్లు వెల్లడించారు. తమ సంస్థ అందించే ఇంటర్ ఎంఈసీ కాయిన్ ప్రోగ్రామ్ ద్వారా ఏకకాలంలో సీఏ, సీఎంఏ ఫౌండేషన్ కోచింగ్ పొందిన ధీరజ్ ఇంటర్‌లో 979 మార్కులు సాధించారన్నారు. ధీరజ్‌ను నందకిశోర్, డైరెక్టర్ శ్రీలక్ష్మి తదితరులు అభినందించారు.

సంస్కృత భాష పరిరక్షణ అందరి బాధ్యత

సంస్కృతవర్సిటీ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి

తిరుపతి రూరల్, ఏప్రిల్ 26: సంస్కృతం మన సాంస్కృతిక వారసత్వ సంపద అని, దాని పరిరక్షణ, ప్రచారం అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్ పిలుపునిచ్చారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం మూడవ స్నాతకోత్సవం చాన్సలర్ ఎన్.గోపాలస్వామి అధ్యక్షతన శుక్రవారం వర్సిటీలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. ప్రాచీన రాతప్రతులను పరిరక్షించడంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. భారతీయ జ్ఞాన పరంపర పునరుద్ధరణ, ప్రచారంలో సంస్కృత వర్సిటీ వంటి సంస్థల పాత్ర ప్రముఖమైందని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా తొమ్మిది మంది విద్యార్థులకు ఉప రాష్ట్రపతి బంగారు పతకాలు, నగదు బహుమతులు ప్రదానం చేశారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, ఐసర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సంతను భట్టాచార్య తదితరులు పాల్గొన్నారు.



పీజీ విద్యార్థి యశ్వంత్ శ్రీ సాయి దీక్షిత్‌కు బంగారు పతకాలను అందజేస్తున్న ఉపరాష్ట్రపతి

శ్రీవారిని దర్శించుకున్న ఉప రాష్ట్రపతి

తిరుమల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉప రాష్ట్రపతి జగదీప్ ధనఖడ్ దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా ఆయన ఆలయ మహాద్వారం వద్దకు చేరుకున్నారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి, అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం జగదీప్ ధనఖడ్‌ను రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా ఈవో ధర్మారెడ్డి టీటీడీ డైరీ, క్యాలెండరు, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఉపరాష్ట్రపతి మీడియాతో మాట్లాడుతూ.. దేశంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్టు తెలిపారు.

సమ్మె చేస్తున్న కార్మికులతో మాట్లాడండి

- జిల్లా యంత్రాంగం సమక్షంలో చర్చలు జరపండి
- పరిష్కారానికి చేసిన ప్రయత్నాలతో అఫిడవిట్ వేయండి
- అదానీ గంగవరం పోర్టు యాజమాన్యానికి హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ ఈ నెల 30కు వాయిదా



అమరావతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వివాద పరిష్కారం కోసం జిల్లా యంత్రాంగం, పోలీసు కమిషనర్ సమక్షంలో నిర్వాసిత కార్మికులతో చర్చలు జరపాలని గంగవరం అదానీ పోర్టు యాజమాన్యాన్ని హైకోర్టు ఆదేశించింది. వివాద పరిష్కారానికి ఎలాంటి ప్రయత్నం చేశారనే వివరాలను పేర్కొంటూ అఫిడవిట్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. స్థానికంగా ఉన్న పరిస్థితులు, వాటిని చక్కదిద్దేందుకు ఇప్పటివరకు తీసుకున్న చర్యలు...ఇప్పటి వరకు ఎంతమంది పై కేసులు నమోదు చేశారు...తదితర వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని పోలీస్ కమిషనర్‌ను ఆదేశించింది. విచారణను ఈ నెల 30కు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య శుక్రవారం ఆదేశాలిచ్చారు. నిర్వాసిత కార్మికుల సమ్మె నేపథ్యంలో అదానీ గంగవరం పోర్టు నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్‌కు బొగ్గు సరఫరాలో ఎలాంటి అవరోధాలు లేకుండా చర్యలు తీసుకొనేలా విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌ను ఆదేశించాలని కోరుతూ స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.వెంకట దుర్గాప్రసాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా స్టీల్ ప్లాంట్ యాజమాన్యం (ఆర్ఐఎన్ఎల్) తరఫున న్యాయవాది వాదనలు వినిపించారు. "గంగవరం పోర్టులో అన్‌లోడ్ చేయకుండా ఉన్న కోకింగ్ కోల్ ఓడ విశాఖ పోర్టుకు చేరింది. అక్కడ నుంచి స్టీల్ ప్లాంట్‌కు బొగ్గును తరలిస్తున్నాం. అదానీ గంగవరం పోర్టు స్టాక్‌యార్డ్‌లో నిల్వ ఉన్న బొగ్గు, ఇనుప ఖనిజాన్ని తరలించాల్సి ఉంది" అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్(ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. "అదానీ గంగవరం పోర్టు, నిర్వాసిత కార్మికుల మధ్య వివాద పరిష్కారానికి పోర్టు యాజమాన్యం మరింత చొరవ చూపాలి. వారు తీసుకున్న చర్యలు సరిపోవు. నిర్వాసిత కార్మికులు ఆత్మాహుతికి పాల్పడతామని బెదిరిస్తున్నారు. పోర్టు యాజమాన్యం, కార్మికుల మధ్య వివాదం శాంతిభద్రతల సమస్యకు దారితీసింది. పోలీసులు జోక్యం చేసుకుంటే పరిస్థితి మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది. వివాద పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ అన్ని చర్యలు తీసుకున్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోర్టు వద్ద 200మంది పోలీసులతో సెక్యూరిటీ ఏర్పాటు చేశాం. నిర్వాసిత కార్మికుల తరఫు వాదనలు కూడా వినేందుకు వీలుగా వారిని వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చాలి. కోర్టు జోక్యం లేకుండా పోర్టు యాజమాన్యం...నిర్వాసిత కార్మికలతో చర్చించి ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొంటే మంచిది" అని పేర్కొన్నారు. అదానీ గంగవరం పోర్టు తరఫున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ వాదనల వినిపించారు. "కోర్టు ఆదేశాలకు అనుగుణంగా బొగ్గు ఉన్న ఓడను విశాఖ పోర్టుకు మళ్లించాం. గతంలో నిర్వాసిత కార్మికులు లేవనెత్తిన డిమాండ్లను పోర్టు యాజమాన్యం పరిష్కరించింది. ఆరునెలలు గడవకముందే కొత్త డిమాండ్లతో సమ్మెకు దిగారు. కార్మికులతో చర్చలకు యాజమాన్యం సిద్ధంగా ఉంది" అని తెలిపారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి...వివాద పరిష్కారం కోసం జిల్లా యంత్రాంగం, పోలీసు కమిషనర్ సమక్షంలో కార్మికులతో చర్చలు జరపాలని గంగవరం అదానీ పోర్టు యాజమాన్యాన్ని ఆదేశించింది.

షర్మిల వస్త్రధారణపై జగన్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

- వివేకా భార్య లేఖ రాసినా జగన్ మనసు కరగడం లేదు: కనకమేడల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): 'మాజీ మంత్రి వివేకానందరెడ్డి భార్య సౌభాగ్యమ్మ స్వయంగా తనకు లేఖ రాసినా సీఎం జగన్ మనసు కరగడం లేదు. వివేకా హత్యకు నైతిక బాధ్యత వహించి హంతకులను, కుట్రదారులను శిక్షించాల్సిన జగన్.. అందుకు భిన్నంగా కేసు విచారణను అడ్డుకుంటున్నారు. సొంత చెల్లెలు షర్మిల డ్రెస్‌పై జగన్ కామెంట్ చేయడం సిగ్గుచేటు' అని టీడీపీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ ఆరోపించారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

టీడీపీలోకి మాజీ మేయర్ తాడి శకుంతల

- కేశినేని చిన్ని ఆధ్వర్యంలో భారీగా చేరికలు

అమరావతి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): విజయవాడ మాజీ మేయర్ తాడి శకుంతల టీడీపీలో చేరారు. శుక్రవారం ఉండవల్లి నివాసంలో యువనేత లోకేశ్ ఆమెకు పసుపు కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే విజయవాడకు చెందిన నగరాల సామాజిక వర్గ ప్రముఖులు టీడీపీలో చేరారు. ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని ఆధ్వర్యంలో సుమారు 400 కుటుంబాలు టీడీపీ తీర్థం తీసుకున్నాయి.

మహిళలకు ప్రత్యేక క్యూలైన్లు పెట్టాలి

- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సూచన

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద మహిళలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో పాటు గర్భిణీలు, బాలింతలు, బాలికలకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకట లక్ష్మి ఎన్నికల సంఘాన్ని కోరారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని ఆమె కలిసి, మహిళా ఓటర్లకు ప్రత్యేక సదుపాయాలపై చర్చించారు.

ఎన్నికల ముందు అస్మదీయులకు మేళ్లు

మళ్లీ వస్తామో రామోననే భావనతో అడ్డంగా దోచిపెట్టిన జగన్ ప్రభుత్వం

- ఇండోసోల్‌కు 21వేల ఎకరాలు ధారాదత్తం
- నోటిఫికేషన్‌కు రెండు నెలల ముందు అప్పగింత
- 'యాక్సిస్'కు రూ.వేలకోట్ల లబ్ధికి గట్టి ప్రయత్నం
- డిస్కమ్‌లతో 21 ఒప్పందాలు..రద్దుచేసిన ఈఆర్‌సీ
- ఆమోదించినట్టైతే జనంపై రూ.7300 కోట్ల భారం
- తన ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొన్న ఈఆర్‌సీ

అమరావతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : గెలుపు ధీమా సడలిపోవడంతో సార్వత్రిక ఎన్నికలకు ముందు అస్మదీయ సంస్థలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇబ్బడిముబ్బడిగా ప్రభుత్వ ఆస్తులను పంచిపెడుతున్నారు. యాక్సిస్‌కు రూ.7300 కోట్లు మేలు చేసే నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే.. ఇండోసోల్‌కు 20వేల ఎకరాలను ధారాదత్తం చేశారు. నిజానికి, 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే సంప్రదాయేతర ఇంధనోత్పత్తి సంస్థలతో గత ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలన్నింటినీ జగన్ రద్దు చేశారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సంప్రదాయేతర ఇంధన వనరుల సంస్థలు హైకోర్టును ఆశ్రయించాయి. ఒప్పందాలను (పీపీఏ) ఏకపక్షంగా రద్దు చేయడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. దీంతో.. మళ్లీ ఆ పీపీఏలను డిస్కమ్‌లు కొనసాగించాల్సిన పరిస్థితి ఎదురైంది. కానీ.. జగన్మోహనరెడ్డి నిర్ణయాన్ని యాక్సిస్ సంస్థ మాత్రం అప్పట్లో తప్పుబట్టలేదు. ప్రభుత్వ పెద్దలతో సంప్రదింపులు జరిపి..మళ్లీ పీపీఏలను చేసుకుంది. గత ప్రభుత్వ హయాంలో చేసుకున్న ఒప్పందాలన్నింటినీ జగన్ రద్దు చేయడంతో యాక్సిస్, సుజలాన్ సంస్థలు సంయుక్తంగా చేసుకున్న ఒప్పందాలు సహజంగానే రద్దవుతాయి. ఈ నేపథ్యంలో ట్రాన్స్‌కోతో చేసుకున్న ఒప్పందాన్ని సుజలాన్ రద్దు చేసుకుంది. కానీ, యాక్సిస్ మాత్రం డిస్కమ్‌లతో 774.90 మెగావాట్ల విండ్ ఎనర్జీ కోసం 21 ఒప్పందాలను చేసుకుంది. మిగిలిన సంప్రదాయేతర ఇంధనోత్పత్తి సంస్థలన్నింటితోనూ ఒప్పందాలను రద్దు చేసుకున్నాక .. యాక్సిస్‌తో మాత్రమే ప్రత్యేకంగా డిస్కమ్‌లు ఒప్పందం చేసుకోవడం వెనుక బలమైన కారణాలే ఉన్నాయని ప్రభుత్వవర్గాల్లో గుసగుసలు వినిపించాయి. డిస్కమ్‌లతో తాము చేసుకున్న కొనుగోలు ఒప్పందం మేరకు .. విద్యుత్తు ధరను నిర్ధారించాలంటూ రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ సంస్థను 'యాక్సిస్' ఆశ్రయించింది. ఒప్పందాన్ని పరిగణనలోకి తీసుకుని ధర ఖరారుచేస్తే.. రాష్ట్ర వినియోగదారులపై రూ.7300 కోట్ల భారం పడుతుందని ఈఆర్‌సీ తేల్చి చెప్పింది. వినియోగదారుల విస్తృత ప్రయోజనాల దృష్ట్యా తాము ధరను ఖరారు చేయడం సాధ్యం కాదని ఈ నెల 19వ తేదీన తేల్చి చెప్పింది. బహిరంగ మార్కెట్లో సోలార్‌ఎనర్జీ కార్పొరేషన్‌కు (సెకీ) కరెంటును అమ్ముకోవాలంటూ యాక్సిస్‌కు ఈఆర్‌సీ సూచిస్తూ ఆ పీపీఏలను తోసిపుచ్చింది. మరోవైపు, మరో అస్మదీయ సంస్థ ఇండోసోల్ దరఖాస్తు చేయడమే ఆలస్యం 21వేల ఎకరాల భూములను కట్టబెడుతూ జగన్ సర్కారు ఆగమేఘాల మీద నిర్ణయం తీసుకుంది. గతఏడాది నవంబరు 27వ తేదీన తమకు భూమి కేటాయించాలంటూ న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ సంస్థకు ఇండోసోల్ లేఖ రాసింది. అయితే, అనూహ్యంగా అదేరోజున ఇండోసోల్ అడిగిన భూములను ఎక్కడెక్కడ ఎంతెంత ఇవ్వాలో సర్వే నంబర్లతో సహా ఆ సంస్థ... రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి సిఫారసు చేసింది. ఈ సిఫారసు చేయడమే ఆలస్యమన్నట్లుగా కేబినెట్ ఆమోదానికి పంపేయడం .. మంత్రివర్గం ఆమోదించడం .. జరిగిపోయాయి. ఇండోసోల్‌కు అది అడిగినన్ని భూములు కట్టబెట్టేశారు. రాష్ట్రానికి తీవ్ర నష్టం చేసేలా సార్వత్రిక ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి తీసుకున్న ఈ నిర్ణయంపై దర్యాప్తు జరిపించాలని బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి లంకా దినకర్ శుక్రవారం డిమాండ్ చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

స్లిప్పులు-లెక్కలు

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)లలో నమోదైన ఓట్లన్నింటినీ వీవీప్యాట్ స్లిప్పులతో నూటికి నూరుశాతం సరిపోల్చిన తరువాతే విజేతలను నిర్ణయించాలంటూ దాఖలైన పిటిషన్లను శుక్రవారం సుప్రీంకోర్టు కొట్టివేసింది. రెండురోజుల పాటు విచారణ జరిపి, సరిగ్గా తొలిదశ పోలింగ్ ముందురోజున తీర్పును రిజర్వుచేసిన ఇద్దరు న్యాయమూర్తులూ పదిరోజుల్లోనే దానిని ప్రకటించేయడం వారు ఈ కేసుకు ఇచ్చిన ప్రాధాన్యానికి నిదర్శనం. ఈవీఎంలమీద నిరసన ప్రదర్శనలు, చర్చాకార్యక్రమాలు జరుగుతూండటం, ఎన్నికల సంఘాన్ని ఉద్దేశించి ప్రముఖులు లేఖలు రాయడం వంటి పరిణామాల నేపథ్యంలో పిటిషన్ల విచారణ, తీర్పు ప్రకటన త్వరితంగా జరగడం అత్యవశ్యకమని సర్వోన్నత న్యాయస్థానం భావించి ఉంటుంది.

ఈవీఎం వ్యవస్థమీద న్యాయమూర్తులు అపరిమిత విశ్వాసాన్ని వెలిబుచ్చారు. ఇద్దరు న్యాయమూర్తులు వేర్వేరు తీర్పుల్లో ఏకాభిప్రాయాన్ని ప్రకటించడం మరీ విశేషం. పిటిషన్‌దారులు వెలిబుచ్చిన అన్ని అభ్యంతరాలు, అనుమానాలు, చేసుకున్న విన్నపాలు అన్నింటినీ కొట్టివేస్తూ తీవ్రమైన వ్యాఖ్యలే చేశారు. బ్యాలెట్ పేపర్ వాడిన రోజుల్లో దేశం ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నమాట నిజం. బూతుల స్వాధీనం, బ్యాలెట్ పత్రాలను నాశనం చేయడం వంటివి చాలా జరిగాయి. ఈవీఎంలు వచ్చిన తరువాత ఆ తరహా అక్రమాలకు పూర్తిగా తెరపడింది. అంతమాత్రాన ఈవీఎంలను ఎంతమాత్రం అనుమానించకూడదని ఏమీ లేదు. వాటిని ట్యాంపర్ చేయవచ్చునన్న వాదనలు, ప్రదర్శనలు జరుగుతున్నప్పుడల్లా ఎన్నికల సంఘం ఖండిస్తూ వస్తున్నది. న్యాయమూర్తులే అన్నట్టుగా, గుడ్డిగా ఒక వ్యవస్థను అనుమానించడం సరైనది కాదు. దానితోపాటే, ఆ వ్యవస్థ చక్కనిదని, అభేద్యమైనదని, ఎవరూ దానిని తాకలేరని అతిగా నమ్మడమూ సరికాదు. సాంకేతిక అంశాలను, నమోదైన డేటాను పరిశీలించిన తరువాత ఈవీఎంలపై అనుమానాలు సహేతుకమైనవి కావని నిర్ధారణకు వచ్చినట్టుగా న్యాయమూర్తులు ప్రకటించారు. ఎన్నికల సంఘం అందించిన డేటా, అది చేసిన వాదనలు న్యాయమూర్తులకు ఈ అభిప్రాయానికి రావడానికి విశేషంగా ఉపకరించినట్టుంది.

కొందరు స్వార్థపరశక్తులు ఈ దేశం సాధించిన విజయాలను తక్కువచేయాలని చూస్తున్నారని, అభివృద్ధిని బలహీనపరచేందుకు ప్రయత్నిస్తున్నారని, అటువంటి ప్రయత్నాలను మొగ్గలోనే తుంచేయాలని ఒక న్యాయమూర్తి ఆగ్రహించారు. పిటిషన్లు వేసిన సంస్థలు, వ్యక్తులు ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్నవారే తప్ప ప్రచారకాంక్షతోనో, దేశాన్ని అప్రదిష్టపాల్జేసేందుకో ప్రయత్నిస్తున్నారని అనుకోలేం. ఈవీఎం, వివిప్యాట్ వ్యవస్థ పనితీరును నిగ్గుతేల్చి, ఇప్పుడున్న వ్యవస్థ నూరుశాతం బలమైనదేనా, దానిని మెరుగుపరచుకోవాల్సినదేమైనా ఉన్నదా అన్నవి నిర్ధారించడానికి ఇటువంటి పిటిషన్లు ఉపకరిస్తాయి. విచిత్రమేమంటే, పిటిషన్‌దారులు అడిగినవన్నీ కాదని, ఈవీఎంలమీద మరింత నమ్మకం పెంచేందుకంటూ న్యాయమూర్తులు ఓ రెండు ఆదేశాలు జారీచేశారు. లోడింగ్ యూనిట్లను 45రోజుల పాటు భద్రపరచడం అటుంచితే, ఓడిన అభ్యర్థులకు ఐదుశాతం ఈవీఎంలను పరీక్షించుకోగలిగే అవకాశం ఇచ్చారు. నూరుశాతం వీవీప్యాట్‌లను సరిపోల్చాలన్న పిటిషన్‌దారుల అభ్యర్థన నచ్చకపోయినప్పటికీ, ప్రస్తుత పరిమాణాన్ని మరికాస్తంత పెంచివుంటే బాగుండేది. ఈవీఎంలు వచ్చిన తరువాత ఎన్నికల నిర్వహణ, ఫలితాల ప్రకటన సులభం, వేగవంతం అయిన మాట నిజం. ఆ వ్యవస్థమీద నమ్మకాన్ని పెంచేందుకు వీవీప్యాట్ వచ్చి చేరింది. అనంతరకాలంలో, పరిమితసంఖ్యలోనైనా పేపర్ స్లిప్పులను లెక్కించాల్సిందేనన్న నియమమూ వచ్చింది. 97కోట్ల మంది ఓటర్లున్న దేశంలో నూరుశాతం పేపర్‌స్లిప్పులను సరిపోల్చడం అసాధ్యం, తిరోగామి చర్య అని భావించిన న్యాయస్థానం మరోపక్క ఈ స్లిప్పుల కౌంటింగ్‌కు ఎలక్ట్రానిక్ యంత్రాలు వాడే అంశాన్ని పరిశీలించమన్నది. పోలింగ్ బూతులోకి ఓటరు అడుగుపెట్టిన క్షణం నుంచి ఫలితాల ప్రకటన వరకూ ప్రస్తుత వ్యవస్థ ఎంత పటిష్టంగా పని చేస్తున్నదో చెప్పడానికి న్యాయమూర్తులు ఈసీ వాదనలను ఈ తీర్పులో అధికంగా ఉటంకించారు. అగ్రరాజ్యాలతో సహా అనేక దేశాలు ఈవీఎంలను వదిలి తిరిగి బ్యాలెట్‌వైపు మళ్ళిన విషయాన్ని అటుంచితే, ఈవీఎంలను మించిన పకడ్బందీ విధానం మరేదీలేదన్న ఈ తీర్పు తాత్కాలికంగానైనా ఆ వివాదాన్ని చల్లార్చుతుందని ఆశిద్దాం.

కాంగ్రెస్ మానిఫెస్టో : మోదీ కొత్త భాష్యం!

ప్రధాన ప్రతిపక్షం అయిన భారత జాతీయ కాంగ్రెస్ పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అపూర్వ సుహృద్భావాన్ని సహకార వైఖరిని చూపారు! ఇటీవల కాంగ్రెస్ పార్టీ మానిఫెస్టోను తిరగరాసి అందులో తన ఆంతరతమ (ఇన్నర్ మోస్ట్) ఆలోచనలు, భావాలను చేర్చే కార్య భారాన్ని ఆయన స్వచ్ఛందంగా తన మీద వేసుకున్నారు. మునుపెన్నడూ జరగని ఈ పని రాజకీయచర్చ గుణాధిక్యతను పెంచుతుందని ఆయన విశ్వసించారు. పాఠక మహాశయా, గతవారం చోటు చేసుకున్న సంచలనాత్మక రాజకీయ పరిణామంపై మహా ఉదార వైఖరితో నేను ఇవ్వగల వివరణ, చేయగల వ్యాఖ్య అది.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఆ పరిణామం వెనుక ఆసక్తికరమైన కథ ఒకటి ఉన్నది. ఈ నెల 14న బీజేపీ మానిఫెస్టో విడుదలయింది. రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని ఒక కమిటీ రూపొందించిన ఆ ఎన్నికల ప్రణాళిక పట్ల నరేంద్ర మోదీ ఏ మాత్రం సంతోషంగా లేరని రాజకీయ పరిశీలకులు మొదటి నుంచీ ఘంటాపథంగా చెప్తున్నారు. తాము రూపొందించిన మానిఫెస్టో ఒక రాజకీయ పార్టీ ఎన్నికల ప్రణాళిక కాదని అంగీకరిస్తూ 'పార్టీకి కేంద్రంగా భాసిల్లుతున్న' ఒక నాయకుడి ప్రజ్ఞా పాటవాలకు అది ఒక ప్రశంస అని రాజ్‌నాథ్ సింగ్ సారథ్యంలోని ఆ కమిటీ పేర్కొంది. ఆ డాక్యుమెంట్‌ను 'మోదీకి గ్యారంటీ' అని పేరు పెట్టడం ద్వారా నరేంద్ర మోదీ పట్ల తన విధేయతను ఆ కమిటీ ప్రదర్శించింది. అయితే మోదీ సరిగ్గానే ఊహించినట్టు, విడుదలయిన కొద్ది గంటలలోనే 'మోదీకి గ్యారంటీ' ఎటువంటి ఆచూకీ లేకుండా పోయింది. ఇప్పుడు బీజేపీ మానిఫెస్టో గురించి నరేంద్ర మోదీతో సహా ఏ ఒక్కరూ మాట్లాడటం లేదు.

నరేంద్ర మోదీ 'మోదీకి గ్యారంటీ'ని ఒక చెత్త డాక్యుమెంట్‌గా కొట్టివేయలేరు. ఆ ప్రణాళికను రూపొందించిన కమిటీ అసమర్థంగా తన బాధ్యతను నిర్వర్తించిందని తప్పుపట్టలేరు. రాజ్‌నాథ్ సింగ్ నాయత్వంలోని కమిటీకి ఏవో అజ్ఞాత ఉద్దేశాలనూ ఆపాదించలేరు. ఇలా ఇరకాటంలో పడిన నరేంద్ర మోదీ కాంగ్రెస్ మానిఫెస్టోను తీసుకుని, ఆ ప్రణాళికపై తన వ్యాఖ్యానంతో దానికి మరింత ప్రచారాన్ని కల్పించి, పాఠక జనాన్ని మరింతగా పెంపొందించేందుకు నిర్ణయించుకున్నారు. మోదీ నిర్ణయం భారతీయ సారస్వత మహా సంప్రదాయాలకు అనుగుణంగా ఉన్నది. మన సంప్రదాయంలో మౌలిక కృతుల కంటే వాటిపై భాష్యాలు, వ్యాఖ్యానాలకే ఎక్కువ ప్రాధాన్యమున్నది.

కాంగ్రెస్ మానిఫెస్టోలో నరేంద్ర మోదీ చేసిన మార్పుల్లో రత్నాల లాంటి మాటలు ఉన్నాయి. అవేమిటో చూడండి: కాంగ్రెస్ అధికారానికి వస్తే ప్రజల భూములు, బంగారం, ఇంకా ఇతర విలువైన ఆస్తులను ముస్లింలకు పంపిణీ చేస్తుంది; ప్రతి ఒక్కరి ఆస్తి, స్త్రీల సొత్తు అయిన బంగారం, గిరిజన కుటుంబాల వద్ద ఉన్న వెండి విలువ తెలుసుకునేందుకు దేశవ్యాప్తంగా ఒక సర్వేను నిర్వహిస్తుంది. ఆ ఆస్తులను సొంతదారుల నుంచి లాక్కొంటుంది; ప్రభుత్వోద్యోగులకు సంబంధించిన భూమి, నగదును కాంగ్రెస్ ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రజలకు పంపిణీ చేస్తుంది; దేశ సహజ వనరులపై మొదటి హక్కు ముస్లింలదేనని డాక్టర్ మన్మోహన్ సింగ్ అన్నారు. ఆయన ఈ ఉద్ఘాటన చేసిన సభలో (గుజరాత్ ముఖ్యమంత్రిగా) నేనూ ఉన్నాను; కాంగ్రెస్ మీ మంగళసూత్రాన్ని, స్త్రీ ధనాన్ని తీసుకుని, అధిక సంతానం ఉన్న వారికి ఇస్తుంది; మీకు స్వగ్రామంలో ఒక ఇల్లు, పట్టణంలో ఒక చిన్న ఫ్లాట్ ఉంటే ఆ రెండు గృహాలలో ఒకదాన్ని కాంగ్రెస్ తీసుకుని ఎవరో ఒకరికి ఇస్తుంది.

మోదీ స్ఫూర్తితో ఆయన విశ్వసనీయ సహచరుడు, సలహాదారు అమిత్ షా ఇలా అన్నారు: దేవాలయాల ఆస్తులను కాంగ్రెస్ స్వాధీనం చేసుకుని, పంపిణీ చేస్తుంది. ఇక రాజ్‌నాథ్ సింగ్ తన వంతుగా ఇలా అన్నారు: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల ఆస్తులను కైవసం చేసుకుని, చొరబాటుదారులకు పునః పంపిణీ చేస్తుంది. ఈ వ్యాఖ్య చేసిన మరుసటి రోజే రాజ్‌నాథ్ సింగ్ మరొక 'సత్యాన్ని' వెల్లడించారు: సాయుధ బలగాలలో మత ప్రాతిపదికన రిజర్వేషన్లను ప్రవేశపెట్టేందుకు కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ వ్యాఖ్యాతల సంఖ్య పెరిగిపోయి, ఒకరిని మించి ఒకరు పోటా పోటీగా వివిధ అంశాలపై వ్యాఖ్యలు చేస్తున్న తరుణంలో కాంగ్రెస్ 'వారసత్వ పన్ను'ను ప్రవేశపెట్టనున్నదని నరేంద్ర మోదీ కనుగొన్నారు! వెన్వెంటనే దాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్‌ను దుయ్యబట్టడం ప్రారంభించారు.

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రంగంలోకి దిగారు. వారసత్వ పన్ను భావనపై తన అపార పాండిత్యాన్ని వెల్లడించారు. 1985లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్టేట్ సుంకం (ఇది ఒక విధమైన వారసత్వ పన్ను)ను రద్దు చేసిందని, 2015లో బీజేపీ ప్రభుత్వం సంపద పన్నును రద్దు చేసిందన్న విషయాలు ఆమెకు తెలిసినట్టు లేదు. అయితే ఇందుకు ఆమెను క్షమించవచ్చు.

కాంగ్రెస్ మానిఫెస్టోపై ఈ సమన్వయ దాడి ఎప్పుడు, ఎందుకు ప్రారంభమయిందో చూడడం కష్టమేమీ కాదు. ఏప్రిల్ 19న తొలి విడత పోలింగ్ అనంతరం ప్రధానమంత్రి కార్యాలయాన్ని, బీజేపీని భయాందోళనలు ఆవహించాయి. ఏప్రిల్ 21న రాజస్థాన్‌లోని జలోర్, బాన్సవారాలో జరిగిన బీజేపీ ఎన్నికల ప్రచార సభలలో కాంగ్రెస్ మానిఫెస్టోపై తీవ్ర విమర్శలు చేయడాన్ని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఆయన విమర్శలు విడ్డూరంగా, విపరీతంగా ఉన్నాయి. ఆయన మంత్రివర్గ సహచరులు కూడా ముందువెనుక ఆలోచించకుండా వ్యాఖ్యలు, విమర్శలు చేయసాగారు.



akbar

'మోదీకి గ్యారంటీ'ని ఒక చెత్త డాక్యుమెంట్‌గా నరేంద్ర మోదీ కొట్టివేయలేరు. ఆ ప్రణాళికను రూపొందించిన కమిటీ తన బాధ్యతను అసమర్థంగా నిర్వర్తించిందని తప్పుపట్టలేరు. రాజ్‌నాథ్ సింగ్ నాయత్వంలోని ఆ కమిటీకి ఏవో ఉద్దేశాలనూ ఆపాదించలేరు. ఇలా ఇరకాటంలో పడిన నరేంద్ర మోదీ కాంగ్రెస్ మానిఫెస్టోను తీసుకుని, ఆ ప్రణాళికపై తన వ్యాఖ్యానంతో దానికి మరింత ప్రచారాన్ని కల్పించి, పాఠక జనాన్ని పెంపొందించేందుకు నిర్ణయించుకున్నారు!

ఈ ఉన్మాద విమర్శలను నిలిపివేయాలని అధికార పక్షానికి విజ్ఞప్తి చేయడం మీడియా విధ్యుక్త ధర్మం. అయితే వార్తా పత్రికలు ఆ విధిని విస్మరించి వివాదాస్పద అంశాలను 'వివరించాయి'. గంభీరమైన సంపాదకీయాలు రాశాయి. టీవీ ఛానెల్స్ రాజకీయ, ఆర్థిక రంగ ప్రముఖులతో ఇంటర్వ్యూలు ప్రసారం చేశాయి. నిపుణుల బృందాలతో చర్చలు నిర్వహించాయి. కాంగ్రెస్ మానిఫెస్టోపై నరేంద్ర మోదీ ప్రారంభించిన విమర్శలు అదే రీతిలో మరింతగా ఉధృతమయ్యాయి.

ఏప్రిల్ 5, 19 తేదీల మధ్య దేశవ్యాప్తంగా ప్రజల మాటా మంతీలో కాంగ్రెస్ మానిఫెస్టో ఒక ప్రధానాంశంగా ఉన్నది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీ మీద అన్ని వర్గాల వారూ విస్తృతంగా చర్చించుకున్నారు. ఆ హామీలు వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా సామాజిక, ఆర్థిక సర్వే, నిర్వహణ, కులాలవారీ జన గణన; విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఉపసంహరించడం; గ్రామీణ ఉపాధి హామీ కూలీల దినసరి వేతనాన్ని రూ. 400కి పెంచడం; పేద కుటుంబాలకు మహాలక్ష్మి ఆర్థిక సహాయ పథకం; వ్యవసాయక ఉత్పత్తుల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం; వ్యవసాయ రుణాల మాఫీ విషయమై ప్రభుత్వానికి తగు సలహా ఇచ్చేందుకు ఒక కమిషన్ నేర్పాటు చేయడం; యువతకు అప్రెంటిస్‌షిప్ హక్కు కల్పించడం; అగ్నివీర్ పథకం రద్దు; కేంద్ర ప్రభుత్వంలోని 30 లక్షల ఉద్యోగ ఖాళీలను ఒక ఏడాదిలోగా భర్తీ చేయడం మొదలైనవి.

కాంగ్రెస్ మానిఫెస్టో 'లోక్‌సభ ఎన్నికల హీరో' అని తమిళనాడు ముఖ్యమంత్రి ఎమ్.కె.స్టాలిన్ అభివర్ణించారు. చాలా యథార్థమైన అభివర్ణన అది. కాంగ్రెస్ సంకల్ప పత్రంపై స్టాలిన్ అభిప్రాయం మోదీకి కోపం తెప్పించి ఉంటుంది. కనుకనే కాంగ్రెస్ మానిఫెస్టోను ఒక విలన్‌గా తూర్పారపట్టేందుకు నిర్ణయించుకున్నారు. మోదీ దురదృష్ట మేమిటంటే కాంగ్రెస్ మానిఫెస్టోలోని ఏ అంశమూ తప్పు పట్టేందుకు వీలు లేనిదే. అందుకే కాంగ్రెస్ సంకల్ప పత్రంపై మోదీ విమర్శలను ప్రజలు హర్షించడం లేదు. దీంతో ఒక దెయ్యం రాసిన మానిఫెస్టోను ఊహించుకుని దాన్ని దుయ్యబడుతున్నారు! ఇది, కాంగ్రెస్ పార్టీ నిజ మానిఫెస్టోకు బీజేపికి చెందిన ప్రధానమంత్రి ఒకరు ఇవ్వగల ఒక అంతిమ ప్రశంస అని నేను భావిస్తున్నాను.

బీజేపీ మూడోసారి విజయం సాధించి నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయితే ఎటువంటి వక్రీకరణలు, అసత్యాలు, నిందలు, దుర్భాషలను చవిచూడవలసివస్తుందో ప్రజలు తెలుసుకునేలా చేసినందుకు 'థాంక్యూ, ప్రైమ్ మినిస్టర్' అని ఆయనకు కాంగ్రెస్ ధన్యవాదాలు చెప్పాలి. మానిఫెస్టోలను పునః రచించడంలో విశేష ప్రతిభా సమన్వితంగా పట్టభద్రుడైన నరేంద్ర మోదీ భారత రాజ్యాంగాన్ని మళ్లీ రాయవచ్చు సుమా!

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

అమెరికా స్వప్నం ఇప్పుడు అంత సులువు కాదు!

'అవకాశాల పుట్టినిగడ్డ'గా (land of opportunity) పేరుగాంచిన అమెరికాలో ఇప్పటికీ అదే వాతావరణం ఉన్నదా? ఈ ప్రశ్నకు అంత సులువుగా సమాధానం చెప్పలేని పరిస్థితి నేడు ఆ దేశంలో నెలకొని ఉన్నది. అమెరికాకు తరలి వచ్చే భారతీయ యువత ఆ దేశ వాస్తవిక పరిస్థితులను పూర్తిగా అర్థం చేసుకున్నాకనే ఒక నిర్ణయం తీసుకోవటం మంచిది.

ఇండియాలో ఇంజినీరింగ్ చదివే ప్రతి కుర్రాడికీ అమెరికాలో మంచి అవకాశం వస్తే వెళ్లి ఉద్యోగం చేయాలనే కోరిక ఉంటుంది. చదువుకునే రోజుల నుంచీ ఆ దిశగా ప్రయత్నాలు ఎక్కుపెడతారు. మామూలు పరిస్థితుల్లో అయితే ఇది మంచి స్వప్నమే. కానీ ఇప్పుడు అమెరికాలో ఐటీ కొలువు అనేది కష్టసాధ్యంగా మారింది. అమెరికాలో ఐటీ ఉద్యోగ వాతావరణాన్ని, పర్యవసానాల్ని దగ్గరి నుంచి గమనిస్తున్న వ్యక్తిగా ఔత్సాహిక ఇంజినీర్లకు చెప్పగలిగిన మాట ఒక్కటే- హెచ్-1బీ వీసా వచ్చినంత మాత్రాన అమెరికా బయల్దేరేందుకు తొందరపడవద్దు!



ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికాలో ఉద్యోగార్థులుగా అడుగుపెట్టడం సాహసమే. పరిస్థితి ఎల్లకాలం ఇలాగే ఉండదు. అమెరికా ఇలాంటి సంక్షోభాలను అనేకం చూసింది. ఐటీ ఉద్యోగ వాతావరణం కూడా మళ్లీ కుదుటపడుతుంది. అప్పటిదాకా నిరీక్షించడం తెలివైన పని.

నేడు అమెరికాలో పనిచేస్తున్న వారే వేల సంఖ్యలో ఉద్యోగాలను కోల్పోతున్నారు. కొత్త వారికి ఉద్యోగాలు వచ్చే అవకాశం కనిపించడం లేదు. ఐటీ మినహా తతిమ్మా రంగాలు బాగానే వృద్ధిలో ఉన్నాయి. భారతీయ యువతరానికి అత్యంత ఆకర్షణీయమైన ఐటీ రంగం మాత్రం కుదేలైపోయింది. కరోనా అనంతర వాతావరణంలో ఇంత తీవ్రంగా ఐటీ రంగం దెబ్బ తిన్నది ఎన్నడూ లేదని నిపుణులు చెబుతున్నారు.

దీని పర్యవసానాలు ఇబ్బందికరంగా వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే హెచ్-1బీతో ఇక్కడకు వచ్చి, భారీ ప్యాకేజీలున్న ఉద్యోగాలు సంపాదించి, ఆ ధైర్యంతో లోనుతో సొంత ఇల్లు కల తీర్చుకున్నవాళ్లు ఇప్పుడు వాయిదాలు కట్టడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఐటీ ఉద్యోగ వాతావరణం ఊహించినట్టుగా లేకపోవడం వలన కొత్త దంపతుల మధ్య కలహాలు ముదురుతున్నాయి. హెచ్-1బీ ఉన్నది కదాని అమెరికాకు వచ్చేసే మధ్యతరగతి భారతీయ కుటుంబాలకు చెందిన యువతీ యువకులు ఇక్కడ ఉద్యోగాలు దొరక్క, ఇంటి నుంచి ఆర్థికంగా జరుగుబాటు అందక అనేక ఇతర పనుల్లోకి దిగుతున్నారు.

హెచ్-1బీ వీసా ద్వారా వచ్చినవారు తమ ప్రాజెక్ట్ అయిపోయినట్లయితే 60 రోజులకు మించి అమెరికాలో ఉండడానికి అవకాశం ఉండదు. కానీ వివిధ కన్సల్టెన్సీ కంపెనీల ద్వారా ఇక్కడ ఉద్యోగాలు దక్కించుకుంటున్న వారికి ఒక సౌకర్యం ఉంది. భారతదేశానికి ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు సంబంధించినంత వరకు ఎక్కువ కన్సల్టెన్సీ కంపెనీలు తెలుగువారివే. ఇది మన హెచ్-1బీ వీసాదారులకు కలిసి వస్తున్న అంశం. ఎలాగంటే- ఒకవేళ వారికి ప్రాజెక్ట్ అయిపోయినప్పటికీ ఈ కంపెనీలు వారిని పేరోల్స్ నుంచి తొలగించకుండా ఇన్సూరెన్స్ కూడా కొనసాగిస్తున్నాయి. అందువల్ల వారు కొత్త ప్రాజెక్టు చూసుకోవడానికి వీలు కలుగుతోంది. ఇక్కడ గమనించాల్సిన సంగతి ఏంటంటే ఇటువంటి సందర్భాలలో అమెరికన్ యాజమాన్యంలో ఉన్న కన్సల్టెన్సీలకు సంబంధించినంత వరకు ప్రాజెక్టు అయిపోయిన తర్వాత వాళ్లు 60 రోజుల లోపు దేశాన్ని ఖచ్చితంగా విడిచి వెళ్లిపోవాలి.

ఈ గడ్డు పరిస్థితిలో భారతీయ యువత స్వయంకృతాపరాధం కూడా కొంత ఉంది. కోవిడ్ సమయంలో అమెరికన్ కంపెనీలు పెద్దఎత్తున రిక్రూట్‌మెంట్ చేపట్టాయి. ఈ అవకాశాన్ని భారతీయ విద్యార్థులు అడ్డదారుల్లో కూడా వినియోగించుకున్నారు. నకిలీ సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగాలు పొందినవారు కొల్లలుగా ఉన్నారు. విద్యార్హతలు, నైపుణ్యాలు, అనుభవం అన్నింటిలోనూ నకిలీ సర్టిఫికెట్లే. కానీ పనిలో చేరిన తర్వాత వారిలోని డొల్లతనం బయటపడింది. పనికి సరిపడిన జ్ఞానం, నైపుణ్యం వారి వద్ద లేకుండా పోయాయి. చివరకు భారతీయ విద్యార్థులు అంటేనే అనుమానంతో చూసే పరిస్థితి ఏర్పడింది. ఇది ఇప్పుడు కొత్తగా ఉద్యోగాలు ఆశిస్తున్న వారికి ఇబ్బందిగా పరిణమించింది.

ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగు రాష్ట్రాల నుంచి అమెరికా రావాలనుకునే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఒకటికి పదిసార్లు ఆలోచించుకోవాలి. ఒకవేళ వారు పనిచేసే కంపెనీ స్పాన్సర్ చేసినట్లయితే వారికి ఎటువంటి ఇబ్బందులు ఉండకపోవచ్చు. అలాగాక సాధారణ కన్సల్టెన్సీల ద్వారా హెచ్-1బీ వీసాతో అమెరికాకు రావడం మంచి నిర్ణయం కాకపోవచ్చు. ముఖ్యంగా భారతదేశంలో ఇప్పటికే ఉద్యోగాలలో ఉన్నవారు కొందరు ఆ ఉద్యోగాలను వదిలేసి ఇక్కడకు వస్తున్నారు. ఇక్కడ ఉద్యోగాలు దొరక్క, దొరికిన ఉద్యోగాల్లో స్థిరత్వం లేక మానసిక ఒత్తిడికి లోనవటంతో పాటు, అనేక ఆర్థిక ఇబ్బందులు కూడా పడుతున్నారు.

ఈ సమస్యకు పరిష్కారాలు పరిమితంగానే ఉన్నాయని చెప్పాలి. ముందుగా హెచ్-1బీ వీసాల మీద అమెరికా వస్తున్నవారికి వారి ఎంప్లాయర్ నుంచి పూర్తి మద్దతు ఉండాలి. ఈ క్లిష్ట సమయంలో ఎంప్లాయర్లు ఇతర కంపెనీలలోనైనా ఉద్యోగాలు చూసిపెట్టగలగాలి. ఏఐ వంటి సాంకేతికత నేపథ్యంలో చాలా ఉద్యోగాలు ప్రమాదంలో పడుతున్నాయి. సాంకేతికంగా వచ్చే ప్రతి మార్పునకు ఉద్యోగార్థులు అప్‌డేట్ అవుతూ ఉండాలి. తమను తాము ఉత్తమ ప్రమాణాలతో ఎప్పటికప్పుడు నవీకరించుకుంటూ ఉంటే ఉద్యోగాలకు ప్రమాదం ఉండదు. అవకాశాలు పొందడం కూడా సులువు అవుతుంది. కంపెనీలు తమ మీద ఆధారపడే స్థాయిలో తమ నైపుణ్యాలను వృద్ధి చేసుకోవడంపై నిత్యం శ్రద్ధ పెట్టాలి. విధాన నిర్ణయాల్లో మార్పు వస్తే కూడా కొంత మేలు జరుగుతుంది. ఉదాహరణకు 60 రోజుల్లోగా తిరిగి భారత్‌కు వెళ్లిపోవాలనే నిబంధనను కొంత సడలిస్తే భారతీయ విద్యార్థులకు ఊరట.

అమెరికాలో గతంలో అనేకసార్లు ఐటీ రంగానికి సంబంధించి మార్కెట్‌లో స్తబ్ధత వచ్చినప్పటికీ ఇంతటి స్థాయిలో ఎప్పుడూ లేదు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. కరోనా సమయంలో అన్ని కంపెనీలు అవసరానికి మించి ఉద్యోగులను తీసుకున్నాయి. అప్పటి పరిస్థితుల్లో కరోనా ఎన్ని రోజులు ఉంటుందో తెలియక, ముందు జాగ్రత్త చర్యగా కంపెనీలు ఈ విధంగా చేశాయి. అప్పట్లో అవసరానికి మించి నియమించుకున్న ఉద్యోగులను ఇప్పుడు క్రమంగా తొలగిస్తున్నాయి. దానితోపాటు ఆర్థిక మాంద్యం నుంచి పూర్తిగా బయటపడకపోవడంతో కంపెనీలు ఖర్చులను తగ్గించుకుంటున్నాయి.

2022లో అమెరికాకు భారత్ నుంచి 1,90,512 మంది విద్యార్థులు వెళ్లారు. 2023 జూన్ నాటికి అలా వెళ్లిన వారి సంఖ్య లక్ష దాటింది. అమెరికాలోని మొత్తం విద్యార్థుల్లో 25 శాతం మంది భారతీయులే అని ఒక అంచనా. ఈ స్థాయిలో అక్కడ భారతీయ యువతరం ప్రాతినిధ్యం పెరిగిపోతోంది. కానీ ఉద్యోగాల దామాషాలో చూస్తే వారి ప్రాతినిధ్యం తగ్గిపోతోంది. ఇప్పటికే అమెరికాకు వచ్చి ఇక్కడ ఉంటున్న వారికే ఉద్యోగాలు దొరక్కపోతుండగా కొత్తగా కేవలం ఉద్యోగాల కోసం హెచ్-1బీ వీసాలతో వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు.

అమెరికా ఆశావహులు గుర్తుంచుకోవాల్సింది ఒక్కటే. ఇప్పుడు అమెరికాలో పరిస్థితి ఏమంత బాగా లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికాలో ఉద్యోగార్థులుగా అడుగుపెట్టడం సాహసమే! కానీ పరిస్థితి ఎల్లకాలం ఇలాగే ఉండదు. అమెరికా ఇలాంటి సంక్షోభాలను అనేకం చూసింది. ఐటీ ఉద్యోగ వాతావరణం కూడా మళ్లీ కుదుటపడుతుంది. అప్పటిదాకా నిరీక్షించడం తెలివైన పని.

• కృష్ణమోహన్ దాసరి
డల్లాస్

'ప్రకాశం పంతులు'కు ముసుగు అవసరమా?

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో వివిధ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు. కానీ ప్రకాశం పంతులు వంటి వారి విగ్రహాలకు కూడా ఎందుకు ముసుగులు వేయాలో అర్థం కావట్లేదు. నిజానికి ప్రకాశం పంతులు వంటి త్యాగశీలురు, ధీరోదాత్తులైన నాయకుల గురించి ఎన్నికల సమయంలో ప్రజలకు తెలియజెబితే వారికి తమ బాధ్యతను గుర్తు చేసినట్లవుతుంది.

వేల కోట్ల రూపాయలు వెచ్చించి, సంకుచిత రాజకీయాలు నడిపి ముఖ్యమంత్రి పదవులు సంపాదించి, తిరిగి అదే పదవులను అడ్డు పెట్టుకుని, ఖర్చు పెట్టిన దానికి రెట్టింపు సంపాదిస్తూ, అధికారంతో శాసన, కార్య నిర్వాహక, న్యాయ వ్యవస్థలను ప్రభావితం చేస్తూ తమ నేరాల నుంచి రక్షణ పొందుతున్న వ్యక్తులను ముఖ్యమంత్రులుగా, పార్టీ అధినేతలుగా చూస్తున్న కాలంలో ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి వేసుకున్న చొక్కాకు చిరుగులు ఉంటే బాగుండదని వల్లెవాటు శాలువా కప్పుకున్న ప్రకాశం పంతులు చాదస్తులుగా, పిచ్చివారుగా కనిపిస్తారేమో?

ప్రభుత్వం నుంచి ఉద్యోగ నోటిఫికేషన్లు, ఉచిత పథకాలు, సంక్షేమం, అభివృద్ధి కోరుకోవడం ప్రజల హక్కే కావచ్చు. కానీ, ఓటరుగా తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించినపుడే ఆ హక్కు తమకు దఖలుపడుతుందనే విషయం ప్రజలు గుర్తుంచుకోవాలి. నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఎంతోమంది పుణ్యమూర్తుల ధన, మాన, ప్రాణ త్యాగాల ఫలితం. స్వతంత్ర భారతం నేడు సాధించిన అభివృద్ధి... దార్శనికులు, మేధావులైన నాయకుల కృషి ఫలితమేగానీ, ప్రజలను మభ్యపెడుతూ ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చిన నాయకుల వల్ల కానేకాదు.

ప్రకాశం పంతులు తన బిడ్డలకు రాజకీయ వారసత్వం అందించలేదు. అధికారం ద్వారా ఆస్తులు సంపాదించి బినామీల పేరిట పంచి ఇవ్వలేదు. అటువంటి వారి విగ్రహాలకు ముసుగులు వేసి ప్రజలకు ఎటువంటి సందేశం ఇవ్వదలిచారో మరి? ఎన్నికల సమయంలో న్యాయదేవత కళ్ళకు గంతలు, మహానుభావుల విగ్రహాలకు ముసుగులు తొలగిస్తేనే ప్రజాస్వామ్యం అపహాస్యం పాలు కాకుండా ఉంటుంది.

– గౌరాబత్తిన కుమార్‌బాబు

రాష్ట్రానికీ, దేశానికీ 'కూటమి' అవసరం

వివిధ దేశాల ఆర్థికాభివృద్ధి రేటులో భారతదేశం 2024–25 సంవత్సరానికి 7.5 శాతం వృద్ధిరేటుతో ప్రపంచంలో అగ్రగామిగా నిలిచినట్లు ప్రపంచ బ్యాంకు ఇటీవల ప్రకటించింది. గత సంవత్సరం ఇదే ప్రపంచ బ్యాంకు భారత ఆర్థికాభివృద్ధి 6శాతం ఉంటుందని అంచనా వేసింది. ఈ సందర్భంగా రష్యా అధ్యక్షుడు పుతిన్ 'ప్రపంచ ఆర్థిక లావాదేవీలు రూపాయలలో జరగాలి' అని అభిలషించడం భారతీయులకు గర్వకారణం. ఇదే సందర్భంలో భారతదేశంలో అత్యంత పేద రాష్ట్రాలైన బీహార్, ఉత్తరప్రదేశ్‌ల ఆర్థిక పరిస్థితిని గమనిస్తే ఉత్తరప్రదేశ్ లోటు బడ్జెట్ నుంచి 74 వేల కోట్ల రూపాయలు మిగులు బడ్జెట్‌కి పుంజుకోవడం ఎంత ఆనందదాయకమో, అక్షయ పాత్ర అనదగిన ఆంధ్రప్రదేశ్ 10 వేల లక్షల కోట్ల రూపాయల అప్పుల కుప్పగా మారడం; ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి కుటుంబానికి అక్షరాలా 8 లక్షల రూపాయల ప్రభుత్వ అప్పులు తేలడం ఆందోళనకరం.

భారతదేశం ఫెడరల్ సమాఖ్య. భిన్న రాష్ట్రాలు, సంస్కృతులు, పార్టీలు, ప్రభుత్వాలు, సమానత్వం, పన్నుల ఆదాయంలో నిర్దిష్ట వాటాలు, కష్ట సమయాలలో అదనపు చెల్లింపులు, పేదలకు కూడు, గూడు, విద్య, వైద్యం, బతకడానికి భరోసా కల్పించడం కేంద్రం బాధ్యత. ధనికులు, వ్యాపారస్తులతో పాటు మధ్యతరగతివారు తమ అవసరాలను, ఆనంద వికాసాలను కొంతమేర త్యాగం చేసి చెల్లించిన పన్నులు సద్వినియోగం అయ్యేలా చూడడం కూడా కేంద్ర ప్రభుత్వం బాధ్యత. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా బడుగుల బాగు కోసం సంక్షేమ పథకాలు అమలు చేయాలి. కేంద్రం నుంచి రాష్ట్రాలకు, అక్కడి నుంచి గ్రామస్థాయి వరకు ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల పర్యవేక్షణలో అర్హులకు పంపిణీ చేయాలని రాజ్యాంగం నిర్దేశించింది. బడుగుల, రైతుల, కార్మికుల అవసరాలను, సమాజ శ్రేయస్సుని–అభివృద్ధిని బేరీజు వేసుకుంటూ ఆయా ప్రభుత్వాలు కేంద్రం మంజూరు చేసిన మొత్తాలను పంపిణీ చేయాలి.

సంక్షేమ పథకాలు ఎంత ప్రధానమైనవో విద్యా, వైద్య సంస్థలు, ఉపాధిని కల్పించే పరిశ్రమలు, ఇరిగేషన్ ప్రాజెక్టులు, రోడ్లు, నీటి పారుదల సదుపాయాలు, రైతులకు చేయూత, కొత్త రైలు మార్గాలు అంతే అవసరం. ప్రకృతి విపత్తులు, యుద్ధాలు సంభవించినప్పుడు ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవడం కద్దు. గ్రామీణులు విద్య, వైద్య, ఉపాధి కోసం పట్నాల వైపు చూస్తే నీటి ఎద్దడి, కాలుష్యం, ఇంటి సమస్యలు, రవాణా సమస్యలు, జీవన వ్యయం పెరుగుతాయి. ప్రత్యామ్నాయంగా గ్రామ వికాసానికి ప్రాధాన్యత ఇస్తే పట్నాలు పల్లెల వైపు చూస్తాయి; ఆరోగ్యకరమైన పరిష్కారం దొరుకుతుంది. కానీ ఈ గణతంత్ర రాజ్యంలో కొన్ని ప్రభుత్వాలు తమ కుటుంబాలకు, తమ పార్టీలకు, తమ అనుచర గణాలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల రాష్ట్ర అభివృద్ధి, నిధుల వినియోగం దారి మళ్లుతోంది. అప్పుచేసే అధికారం రాష్ట్రాలకు ఉంది; ఆదాయాన్ని అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని అప్పు చేయడం ప్రజా ప్రభుత్వాల విచక్షణ. ప్రకృతిని, సహజ వనరులను ధ్వంసం చేసే అధికారం ఎవరికీ లేదు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మిగతా రాష్ట్రాలకు ఇచ్చినట్లుగానే ఆంధ్రప్రదేశ్‌కి 183 పథకాలకు నిధులు విడుదల చేసింది. విభజన చట్టంలోని హామీలకు కట్టుబడి లక్షల కోట్ల రూపాయలతో పాటు కేంద్రం రాష్ట్రాలకు కేటాయించే ఉచిత గృహాలను అధికంగా, విభజన హామీలలో లేని మరెన్నో పథకాలను ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసింది. కానీ రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం నిర్మాణాల కన్నా కూల్చివేతలకు ప్రాధాన్యత ఇచ్చింది. లక్షల కోట్లతో నిర్మాణంలో ఉన్న అమరావతి రాజధానిని, ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా నిలిపివేసింది. కేంద్రం అమలు చేసే పథకాలకు తన పేరు పెట్టుకుని, తన బొమ్మ వేసుకొని గ్రామాల అభివృద్ధికి కేటాయించిన లక్షల కోట్ల రూపాయలు దారి మళ్ళించింది. సారా వ్యాపారం మొదలుపెట్టింది; రానున్న పాతికేళ్లలో సారాపై వచ్చే ఆదాయాన్ని చూపించి అప్పులు తెచ్చింది. మధ్యతరగతి వారు తమ పిల్లల అవసరాలను తగ్గించుకుని చెల్లించిన పన్నులు శిథిల రాళ్ల నిర్మాణాలుగా కళ్ళ ఎదుటే కనిపిస్తుంటే– తాగు, సాగు నీటికి నోచుకోని రైతాంగం ఉరికొయ్యలకు వేలాడుతోంది. ప్రజలు 151 అసెంబ్లీ సీట్లు, 22 పార్లమెంటు సీట్లు కట్టబెట్టిన ప్రభుత్వాన్ని కూల్చివేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకి మచ్చ. అదే సమయంలో నిరంకుశ, నికృష్ట పాలనకు చరమగీతం పలకడం చారిత్రక అవసరం.. భావితరాల భవిష్యత్తుకు అవశ్యం.

ప్రజాబలంతో – ఓటు బలంతో అధికారానికి వచ్చిన పార్టీని అదే ఓటుతో గద్దె దించాలి. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చకూడదన్న లక్ష్యంతో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిగా ఏర్పడ్డాయి. రాష్ట్రానికి అవసరమైన నిధులను మంజూరు చేయడం ఎంత ముఖ్యమో, ఆ నిధులు సద్వినియోగం కావడం అంతే ముఖ్యం. అదే జరగకపోతే రాష్ట్రం పాతాళానికి కూరుకుపోతుంది; దేశ ప్రగతికి ప్రతిబంధకం అవుతుంది. ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం కోసమే ఈ కూటమి.



ఆంధ్ర రాష్ట్రంలో పౌరహక్కులు హరించారు. హత్యా రాజకీయాలకు ఆమోదముద్ర వేశారు. ఇసుక, మట్టి దోపిడీ చేశారు. యువత భవితను హరించే గంజాయి, డ్రగ్స్, సారా వ్యాపారాన్ని ఆర్థిక వనరుగా మార్చారు. పరిశ్రమలు లేవు. అప్పులు.. అప్పులు.. ప్రభుత్వ ఆస్తులను, ఆఖరికి రాష్ట్ర ప్రభుత్వ సచివాలయాన్ని కూడా తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారు. ప్రపంచంలో ఆర్థికంగా నెంబర్ 1 స్థానానికి దూసుకుపోయిన భారత్ ప్రగతికి కంట్లో నలుసులా తయారైన రాష్ట్రాల్లో ప్రథమ స్థానం ఆంధ్రప్రదేశ్‌దే! తక్షణమే ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా, పారిశ్రామికంగా, వ్యవసాయంగా– ఒకటనేమిటి అన్నీ రంగాలలో పుంజుకోవాలి. రాజధాని లేని అనాథ ఆంధ్రప్రదేశ్‌కి తక్షణమే అమరావతి నిర్మాణం పూర్తి కావాలి. అందుకు అవసరమైన నిధులను మంజూరు చేయడం ఎంత ముఖ్యమో, ఆ నిధులు సద్వినియోగం కావడం అంతే ముఖ్యం. అదే జరగకపోతే రాష్ట్రం పాతాళానికి కూరుకుపోతుంది; దేశ ప్రగతికి ప్రతిబంధకం అవుతుంది.

ప్రజాబలంతో – ఓటు బలంతో అధికారానికి వచ్చిన పార్టీని అదే ఓటుతో గద్దె దించాలి. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చకూడదన్న లక్ష్యంతో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిగా ఏర్పడ్డాయి. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర సహకారం ఎంత అవసరమో, ఆ నిధులు సద్వినియోగం అయ్యేలా పర్యవేక్షణ అంతే అవసరం. ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం కోసమే ఈ కూటమి. సంక్షేమ పథకాలు బడుగులకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కు. ప్రభుత్వాలు మారినంత మాత్రాన ఈ పథకాలు ఆగవు, ఆగిపోతాయని ఎవరైనా చెబితే వారు ఉన్నతమైన ఆ పదవికి అనర్హులు. 2047 నాటికి భారత్ స్వాతంత్ర్యం సంపాదించి నూరేళ్ళు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా వికసిత్ భారత్ ఆవిర్భావానికి అంకురం ఈ కూటమి. 2024 ఎన్నికలు స్వతంత్ర భారత చరిత్రలో ఓ సువర్ణ అధ్యాయం. దానికి ఓటుతో శుభం పలుకుదాం.

■ పాతూరి నాగభూషణం
బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జ్

గ్రంథాలయాలను సంస్కరించాలి

మనం చెల్లించే ప్రతి పన్నులోనూ లైబ్రరీ పన్ను కలిసే ఉంటుంది. ఇలా పన్నుల ద్వారా ఏర్పాటయిన గ్రంథాలయాలు పాఠకులకు సౌకర్యంగా ఉంటున్నాయా లేదా అని ఆలోచించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఒక పుస్తకం తీసుకుందామని లైబ్రరీకి వెళ్తే అక్కడ కేటలాగ్ ఉండదు. కావలసిన పుస్తకం ఎక్కడ ఉంటుందో ఎవరూ చెప్పరు, వెతుక్కోమంటారు. పోనీ, పుస్తకం అట్టమీద రచయిత పేరు, పుస్తకం పేరూ ఉంటే కొంచెం సులభంగా వెతుక్కోవచ్చు. అది కూడా ఉండదు. పది బీరువాలనిండా పుస్తకాలుంటాయి. వెతుక్కోమంటారు. కేటలాగ్ ఉంటే నేరుగా వెళ్ళి కావలసిన పుస్తకం తీసుకోవచ్చు. కొన్ని పుస్తకాలు దుమ్ముకొట్టుకొని ఉంటాయి. కొన్ని పుస్తకాలు నిలబడి వెతుక్కోవాలి. మరి కొన్ని కూర్చొని వెతుక్కోవాలి. ఈ పరిస్థితి సీనియర్ సిటిజెన్స్‌కి ఇబ్బంది కలిగిస్తోంది.

గ్రంథాలయాలు ప్రపంచవ్యాప్తంగా నాలుగువేల సంవత్సరాలనాడే ఏర్పడ్డాయి. మొగల్ చక్రవర్తి అక్బర్ లైబ్రరీలో ఆ రోజుల్లోనే కోటి రూపాయల విలువగలిగిన 20 వేల పుస్తకాలుండేవి. విశాఖపట్టణంలో 1886లో తొలి పౌర గ్రంథాలయం ఏర్పడింది. 1914లో విజయవాడలో ఆంధ్ర గ్రంథాలయం ఏర్పడింది. ఇంతటి ఘనమైన చరిత్ర గ్రంథాలయ వ్యవస్థకు ఉంది. మన కన్నా ముందుతరాల మహనీయుల చరిత్రను మనకి అందించేది గ్రంథాలయాల ద్వారానే. అలాంటి వాటిని మనం రక్షించుకోవాలి. కానీ గ్రంథాలయాలలో సరైన సౌకర్యాలు, పద్ధతి లేకపోతే అక్కడికి వెళ్లేవారి సంఖ్య తగ్గిపోతుంది. కనుక రాష్ట్ర గ్రంథాలయ శాఖ ఛైర్మన్ వెంటనే అన్ని పౌర గ్రంథాలయాల్లో కేటలాగ్స్ ఏర్పాటు చేసేలా చూడాలి. ప్రతి పుస్తకం అట్టమీద పుస్తకం పేరు, రచయిత పేరు ఖచ్చితంగా ఉండేట్లు చూడాలి. అప్పుడే పాఠకుల సంఖ్య పెరుగుతుంది.

– నార్నె వెంకటసుబ్బయ్య

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ABN ఆంధ్రజ్యోతి

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఘోలకం అనే మసాలా పెరుగు

మస్తునారహితం గాల్యం దధి శుభ్రతరే పటే!
జీర సైంధవం సమ్మిశ్రం ఘోలం ఘనతరం స్మృతమ్!

క్షేమశర్మ తన 'క్షేమకుతూహలం'లో మసాలాలు కలిపిన పెరుగు గురించి చక్కని వివరణ ఇచ్చాడు. చాలా పాల ఫ్యాక్టరీలవాళ్లు మసాలా మజ్జిగ ప్యాకెట్లు తయారు చేసి అమ్ముతుంటారు. ప్లాస్టిక్ కవర్లలో నిల్వ ఉంచి, ఫ్రిజ్‌లో పెట్టిన ఈ మజ్జిగని మనం దాహార్తి తీరటం కోసం వాడుకోక తప్పడంలేదు. అయితే ఇంట్లో ఆరోగ్యదాయకంగా మసాలా పెరుగు తయారు చేసుకుని తగిన రీతిలో వాడుకోవటం అన్నిటికంటే ఉత్తమ మార్గం. ప్లాస్టిక్ కంటైనర్లలోని ఆహార పదార్థాలు తినడంవల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు. కానీ రక్తం నుంచి దగ్గు మందుల దాకా దాదాపు అన్నిటినీ ప్లాస్టిక్ కంటైనర్లలోనే నిల్వ చేస్తున్నారు. ఇక పాలు, పెరుగుల గురించి పట్టించుకొనేదెవరు? కనుక ఉన్నంతలో మనమే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలి. ప్యాకెట్లలో నిల్వ ఉంచే పెరుగుకు బదులుగా ఇంట్లో కుండలోనో, గిన్నెలోనో పెరుగు తోడుపెట్టుకుని వాడుకోవటం ఉత్తమం.



'వస్త్రే దృఢతరం బద్ధం దధి దుగ్ధేన గాలితమ్! హింగునా ధూపితే పాత్రే స్థాపితే సైంధవాన్వితమ్'... ఈ సూత్రంలో ఘోలకాన్ని తయారుచేసుకొనే మరో పద్ధతి చెబున్నాడు క్షేమశర్మ. పైన చెప్పినట్టు పెరుగును వస్త్రగాయితం పట్టి, అందులో సమానంగా పాలు కలిపి, బాగా చిలకండి. ఓ చిన్న ప్రమిదలో మండుతున్న బొగ్గు తీసుకుని, దాని మీద ఇంగువ పొడి చల్లి, మంచి కుండను ఆ నిప్పు మీద బోర్లించండి. కుండ లోపలంతా ఇంగువ పొగపట్టుకుంటుంది. ఆ కుండలో ఉంచిన పెరుగుకు ఇంగువ పరిమళం బాగా అంటుకుంటుంది. బొగ్గు దొరకకపోతే మరో ఉపాయం ఉంది. రెండు లేదా మూడు చెంచాల నెయ్యి ఆ కుండలోకి తీసుకుని, పొయ్యి మీద పెట్టి, అందులో ఇంగువ వేసి, పొంగించి ఆ నేతిని కుండ లోపలంతా పట్టించండి. ఇప్పుడు అందులో పెరుగు, పాల మిశ్రమాన్ని వేసి, చిలికి అందులో తగినంత సైంధవ లవణం కలపండి. ఇది అప్పటికప్పుడు తాగటానికి అనుకూలంగా ఉంటుంది. ఇంగువ పరిమళం ఇష్టపడేవారే ఇలా చేయండి. వద్దనుకునేవారు ఇంగువ గురించిన అంశాన్ని వదిలేసి, ఘోలకం తయారు చేసుకోండి. వాతాన్ని హరించటానికీ పాలు, పెరుగు విశ్రమం బాగా తోడ్పడుతుంది. బలాన్నిస్తుంది. వేడిని తగ్గిస్తుంది. రక్తస్రావం అవుతున్నవారికి, బీపీ వ్యాధితో బాధపడేవారికి ఇది అనుకూలం. అల్సర్లను తగ్గిస్తుంది. పేగు పూతవల్ల కలిగే నొప్పిని హరిస్తుంది.

పాలను రెండుమూడు పొంగులు వచ్చేంతగా మరిగించి తోడుపెడితే గట్టిగా తోడుకొంటుంది. ఈ పెరుగు మీద మీగడ తీసేయండి. దాన్ని ఒక తెల్లని వస్త్రంలో వేసి మూటగట్టి లోపల ఉండే నీరు మొత్తం వడగట్టేయండి. ఇందులో జీలకర్రపొడి, సైంధవ లవణం తగినంత కలిపితే 'ఘోలకం' అంటారు ఈ పెరుగుని. దీన్ని ఓ కప్పులో వేసుకుని చెంచాతో తింటే కమ్మగా ఉంటుంది. ఇందులో కొద్దిగా అన్నం కలిపి తింటే ఉదయంపూట మంచి ఉపాహారం. టిఫిన్లు మానేయాలనుకునే వారికి ఇది మంచి ప్రత్యామ్నాయం. రాగి ముద్దతో గానీ, జొన్నరవ్వ ఉప్మాతో గానీ దీన్ని కలిపి తీసుకుంటే ఎంతో రుచిగా ఉంటుంది. షుగరు రోగులకు మంచిది. ఇది వాతాన్ని నాశనం చేస్తుందని, విరేచనాలను ఆపుతుందని, జఠరాగ్ని పెంచి, జీర్ణశక్తిని బలపరుస్తుందని, సంపూర్ణాహారంగా తోడ్పడుతుందని, జీర్ణాశయ వ్యవస్థని బలసంపన్నం చేస్తుందనీ క్షేమశర్మ పేర్కొన్నాడు.

ఘోలకం తయారీకి 'ఆవు పాలకన్నా గేదె పాలే ఉత్తమం' అన్నాడు క్షేమశర్మ. చిక్కదనానికి గేదెపాలు పెట్టింది పేరు కదా! ఒక గ్లాసుడు గట్టి పెరుగును ఓ కుండలోకి తీసుకుని, నాలుగు గ్లాసుల నీళ్లు కలపండి. అందులో తగినంత ఇంగువ పొడి, జీలకర్ర పొడి, ఉప్పు, నల్ల ఆవాల పొడి తగినంత కలిపి, బాగా చిలికిన మజ్జిగ చాలా రుచిగా ఉంటుంది. 'ఇలాంటి మజ్జిగను ఇష్టపడని వారెవరుంటారో చెప్పండి'... అంటాడు క్షేమశర్మ.

పేగుల్ని అన్ని విధాలా కాపాడటమే ఈ మజ్జిగ లక్ష్యం. జీర్ణశక్తిని పెంచుతుంది. గ్యాసు, అల్సర్లు, అమీబియాసిస్ వ్యాధుల్లో ఇది దివ్యౌషధం. ఇరిటబుల్ బోవెల్ సిండ్రోమ్ ఉన్నవాళ్లు రాత్రే దీన్ని తయారు చేసుకుని మూత పెట్టి, బయటే ఉంచి ఉదయాన్నే తాగితే గొప్పగా పని చేస్తుంది. కాల విరేచనం అవుతుంది.

మసాలాలంటే అల్లం వెల్లుల్లి మాత్రమేననే దురభిప్రాయం చాలామందిలో ఉంది. మితిమీరిన అల్లం, వెల్లుల్లి తెలుగువారికి శాపంలాంటి ఒక చెడ్డ అలవాటు. అల్లం వెల్లుల్లి గురించి హెచ్చరించబోతే, అల్లం ఉపయోగాన్ని, వెల్లుల్లి గొప్పదనాన్ని కొందరు ఉపన్యసిస్తూ ఉంటారు. నిజమే ఆ రెండూ గొప్ప ఔషధ ద్రవ్యాలే! కానీ, ఏ ఔషధానికైనా ఒక మోతాదు ఉంటుంది. బలం ఇస్తుంది కదా అని డజన్ మాత్రలు ఒకేసారి మింగేస్తే వికటిస్తుంది కదా. అల్లం, వెల్లుల్లి అతివాడకం కూడా అలాగే వికటిస్తుందని మనం గమనించాలి.

అల్సర్లున్నవారైనా వాడదగిన మసాలా ద్రవ్యాలు జీలకర్ర, ధనియాలు, యాలకులు, గసగసాలు, మెంతులు, ఆవాలు... ఇలాంటివి. జాజికాయ జాపత్రి, పచ్చకర్పూరం లాంటివి ఎంతో మేలు చేసే ద్రవ్యాలు. వీటిని సద్వినియోగపరచుకోవటం మీద దృష్టి పెట్టాలి.

బ్లాక్ సాల్ట్ పేరుతో ఒక విధమైన వాసన ఉన్న ఉప్పు దొరుకుతుంది. గ్లాసుడు ఘోలకం మజ్జిగలో చిటికెడంత నల్ల ఉప్పు కలిపితే... ఈ మసాలా మజ్జిగ రుచే వేరు! వేసవి కాలం ఇలాంటి ఉపాయాలు పాటిస్తే సత్ఫలితాలు ఉంటాయి.

• గంగరాజు అరుణాదేవి





వంటిల్లు

వెజ్‌లో పనీర్‌కు ఉండే గిరాకీనే వేరు. మెత్తని పనీర్ ముక్కలతో చేసిన డిష్‌లను తినటానికి నాన్‌వెజ్ ప్రియులూ ఇష్టపడతారు. పనీర్ కట్‌లెట్, పనీర్ మెజిస్టిక్, పనీర్ టిక్కా లాంటి వంటలను సులువుగా చేసుకోండిలా...

పనీర్‌తో పసందుగా

పనీర్ టిక్కా

కావాల్సిన పదార్థాలు

పనీర్ క్యూబ్స్- 6, పెరుగు- అరకప్పు, పసుపు- అరటీస్పూన్, కారం పొడి- 1 టీస్పూన్, ధనియాల పొడి- అర టీస్పూన్, జీలకర్ర పొడి- పావు టీస్పూన్, గరం మసాలా- అర టీస్పూన్, కసూరీ మేతీ- అర టీస్పూన్, చాట్ మసాలా- అర టీస్పూన్, జింజర్, గార్లిక్ పేస్ట్- టీస్పూన్, శనగపిండి- 2 టీస్పూన్లు, నిమ్మకాయ రసం- టేబుల్ స్పూన్, చతురస్రాకార ఆనియన్ పెటల్స్- 8, రెడ్ క్యాప్సికమ్ క్యూబ్స్- 8, గ్రీన్ క్యాప్సికమ్ క్యూబ్స్- 8, నూనె- టీస్పూన్

తయారీ విధానం



బౌల్‌లో పెరుగుతో పాటు పసుపు, కారం పొడి, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరం మసాలా, కసూరీ మేతీ, చాట్ మసాలా, జింజర్-గార్లిక్ పేస్ట్, శనగపిండి వేశాక నిమ్మకాయ రసం కలపాలి. చివరలో తగినంత ఉప్పువేసి స్పూన్‌తో మిశ్రమాన్నంతా బాగా కలపాలి. ఎర్రటి పేస్ట్‌లా వస్తుంది. ఇందులోకి పనీర్, ఆనియన్ పెటల్స్, క్యాప్సికమ్ క్యూబ్స్ వేశాక నూనె కలపాలి. స్పూన్‌తో మిశ్రమాన్ని కలపాలి. దీని వల్ల పనీర్ ముక్కలకు బాగా పడుతుంది. దీన్ని ముప్పావు గంట మారినేట్ చేసుకోవాలి. ఆ తర్వాత టిక్కా స్టిక్స్ తీసుకుని ఆనియన్, రెడ్ క్యాప్సికమ్, గ్రీన్ క్యాప్సికమ్ క్యూబ్స్ తర్వాత పనీర్ క్యూబ్ గుచ్చాలి. ఆ తర్వాత మళ్లీ అదే వరుసలో స్టిక్‌కు గుచ్చాలి.

టిక్కా ప్యాన్‌మీద బ్రష్‌తో నూనె పూసి ఈ స్టిక్స్‌ను ఉంచి గ్రిల్ చేసుకోవాలి. అన్నివైపులా కాల్చుకోవాలి. పనీర్ టిక్కా రెడీ. పుదీనా లేదా కొత్తిమీర చట్నీతో తింటే రుచిగా ఉంటాయి.

పనీర్ మెజిస్టిక్

కావాల్సిన పదార్థాలు : పొడవుగా కట్ చేసిన పనీర్ ముక్కలు- పావు కేజీ, కార్న్‌ఫ్లోర్- రెండున్నర టేబుల్ స్పూన్లు, మైదా- రెండున్నర టేబుల్ స్పూన్లు, ఉప్పు- తగినంత, అల్లం, వెల్లుల్లిపేస్ట్- ఒకటిన్నర టేబుల్ స్పూన్, పసుపు- తగినంత, నూనె- మూడున్నర టేబుల్ స్పూన్లు, జీలకర్ర- ముప్పావు టీస్పూన్, సన్నగా తరిగిన వెల్లుల్లి మిశ్రమం- ఒకటిన్నర టేబుల్ స్పూన్లు, జీడిపప్పు- 15, ఎండు మిరపకాయలు- 2, తరిగిన ఉల్లిపాయ ముక్కలు- రెండున్నర టేబుల్ స్పూన్లు, పచ్చిమిర్చి- 3 (సన్నగా తరగాలి), క్యాప్సికమ్- 1 (సన్నగా పొడవుగా కట్ చేసుకోవాలి), కారం పొడి- తగినంత, గరం మసాలా- ముప్పావు టీస్పూన్, ధనియాల పొడి- ముప్పావు టీస్పూన్, జీలకర్ర పొడి- ముప్పావు టీస్పూన్, కరివేపాకులు- 10, పెరుగు- ముప్పావు కప్పు, పుదీనా- టేబుల్ స్పూన్

తయారీ విధానం : బౌల్‌లో కార్న్‌ఫ్లోర్, మైదా, ఉప్పు, అల్లం- వెల్లుల్లి పేస్ట్, పసుపు వేసి తగినన్ని నీళ్లు పోసి మెత్తటి పేస్ట్‌లా చేసుకోవాలి. మరీ గట్టిగా కాకుండా మరీ జావగా కాకుండా మిర్చిబజ్జీలకోసం శనగపిండి కలిపినట్లు కలపాలి. ఈ కార్న్‌ఫ్లోర్ మిశ్రమంలో పనీర్ ముక్కలను ముంచి నూనెలో డీప్ ఫ్రై చేసుకోవాలి.

మరో ప్యాన్‌లో మూడు స్పూన్ల నూనె వేసి అందులో జీలకర్ర, జీడిపప్పు, ఎండిన మిరపకాయలు, తరిగిన ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, క్యాప్సికమ్ ముక్కలు వేసి ఉల్లిపాయల రంగు మారేంత వరకూ గరిటెతో కదుపుతూ వేయించాలి. ఆ తర్వాత కారంపొడి, గరం మసాలా, తగినంత ఉప్పుతో పాటు పసుపు, ధనియాల పొడి, జీలకర్ర పొడి వేసి బాగా కలపాలి. ఆ తర్వాత కరివేపాకు, పెరుగు వేసి మూడు నిముషాల పాటు కలపాలి. పుదీనా వేసి రెండు నిముషాలు కలిపిన తర్వాత వేయించి పక్కనబెట్టుకున్న పనీర్ ముక్కలు వేసి.. వీటికి మిశ్రమం పట్టేట్లు బాగా కలపాలి. పనీర్ మెజిస్టిక్ రెడీ.



పనీర్ కట్‌లెట్

కావాల్సిన పదార్థాలు : తురిమిన పనీర్ మిశ్రమం- 2 కప్పులు, ఉడికించిన బంగాళాదుంపలు- 2, ఉల్లిపాయ ముక్కలు- 2 టేబుల్ స్పూన్లు, తురివిన క్యారెట్- అర కప్పు, కొత్తిమీర- 2 టేబుల్ స్పూన్లు, పచ్చిమిర్చి-1 (సన్నగా తరగాలి), అల్లం పేస్ట్- అర టీస్పూన్, కారం పొడి- అర టీస్పూన్, ఆమ్‌చూర్- అర టీస్పూన్, గరం మసాలా- అరటీస్పూన్, ఉప్పు- తగినంత, కార్న్‌ఫ్లోర్- ముప్పావు కప్పు, మైదా- 2 టేబుల్ స్పూన్లు, పెప్పర్- పావు టీస్పూన్, ఎండిన బ్రెడ్ ముక్కలు- 2, నూనె- ఫ్రైకి తగినంత



తయారీ విధానం : బౌల్‌లో పనీర్‌తో పాటు తొక్కతీసి పెట్టుకున్న బంగాళ దుంపలను మెత్తగా పిసికి వేయాలి. ఇందులోనే ఉల్లిపాయ ముక్కలు, క్యారెట్, కొత్తమీర, పచ్చిమిర్చి, అల్లం పేస్ట్, కారం పొడి, ఆమ్‌చూర్, గరం మసాలా, రెండు టేబుల్ స్పూన్ల కార్న్‌ఫ్లోర్‌తో పాటు తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. చపాతీ ముద్దలా మెత్తగా చేసుకోవాలి.

మరొక బౌల్‌లో మిగిలిన కార్న్‌ఫ్లోర్, మైదా వేశాక పెప్పర్‌ను నలగ్గొట్టి వేసి కొద్దిగా ఉప్పువేసి అరకప్పు నీళ్లు వేసి స్పూన్‌తో బాగా మిక్స్ చేయాలి. ఉండలు లేకుండా చూసుకోవాలి. ఆ తర్వాత మరో బౌల్‌లో బ్రెడ్ ముక్కలను చేత్తో పిసికి పొడిలా చేసుకోవాలి. ఆ తర్వాత పనీర్ ముద్దను చిన్న ఉండలుగా తీసుకుని పెద్ద బిస్కెట్ అంత సైజులో గుండ్రంగా చేసుకోవాలి. దీన్ని మైదా పిండిలో బాగా ముంచి బ్రెడ్ ముక్కల్లో వేయాలి. బ్రెడ్ ముక్కలు దీనికి అంటుకుంటాయి. ఈ పనీర్ కట్‌లెట్స్‌ను రెండు వైపులా రంగు మారేంత వరకూ కాల్చుకోవాలి. ఈ పనీర్ కట్‌లెట్స్‌ను వేడివేడిగా పుదీనా చట్నీతో లేదా టమోటా కెచప్‌తో తింటే రుచిగా ఉంటాయి.

జిడ్డు చర్మం అయితేనేం?



మేకప్

పెద్ద చర్మ రంధ్రాలు, మెరుస్తూ ఉండే టి జోన్, జిడ్డు కారే ముఖం. ఇవి మీ సమస్యలా? అయితే జిడ్డు చర్మానికి తగిన మేకప్ వేసుకుని, అందాల బొమ్మలా వెలిగిపోండి. ఆయిల్ ఫ్రీ మేకప్ ఎలా వేసుకోవాలంటే...

మాయిశ్చరైజర్: లైట్ వెయిట్ మాయిశ్చరైజర్ ఎంచుకోవాలి. చర్మం మీదున్న జిడ్డును తగ్గించి, అప్లై చేసిన తర్వాత చర్మంలో చక్కగా ఇంకిపోయి, చర్మాన్ని మృదువుగా మార్చేసే లైట్ వెయిట్ మాయిశ్చరైజర్‌ను మాత్రమే వాడుకోవాలి. దీంతో తర్వాత అప్లై చేసే మేకప్ ఉత్పత్తులన్నీ చర్మం మీద ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా నిలిచి ఉంటాయి.

ప్రైమర్: ఎత్తుపల్లాలు లేకుండా బేస్‌ను సమంగా మలిచి, మేకప్‌కు అనువుగా మార్చే సాధనం ప్రైమర్. ప్రైమర్‌లోని ఆయిల్ ఫ్రీ ఫార్ములా చర్మ రంధ్రాలు, మచ్చలు, డాగులు కనిపించకుండా చేస్తుంది.

మ్యాట్ ఫార్ములా: ముఖం మీది జిడ్డుతో కలిసిపోయి మరింత జిడ్డుగా మారే ఫౌండేషన్‌కు బదులుగా మ్యాట్ ఫార్ములా కలిగి ఉండే ఫౌండేషన్‌ను ఎంచుకోవాలి. దీంతో ప్రైమర్ వేసినా కనిపిస్తూ ఉండే మచ్చలు, డాగులు మటుమాయమవుతాయి.

మేకప్ పలుచగా: ఫౌండేషన్, కన్‌సీలర్లతో మందపాటి మేకప్‌కు బదులుగా వీలైనంత పలుచగా మేకప్ అద్దుకోవాలి. అవసరమైతేనే రీఅప్లై చేయాలి. వెట్ బ్యూటీ స్పాంజ్‌తో మేకప్‌ను బ్లెండ్ చేసుకోవాలి.

నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/ryFJQHQలో చదవండి.

'దిక్సూచి' వెబ్ పేజీలో... సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/SG1yge4లో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

వినోదాన్ని పంచే పరదా



'సినిమా బండి' చిత్రంతో దర్శకుడిగా ప్రశంసలు అందుకున్నారు ప్రవీణ్ కాండ్రేగుల. ఆయన దర్శకత్వంలో అనుపమా పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'పరదా'. విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువ నిర్మాతలు. శనివారం ఫస్ట్‌లుక్, కాన్సెప్ట్ వీడియోను సమంత, దర్శక ద్వయం రాజ్ అండ్ డీకే చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ లుక్‌లో ముఖంపై పరదాతో ఉన్న మహిళల మధ్యన అనుపమ నిరాసక్తంగా చూస్తూ కనిపించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్‌లో చిత్రీకరణ జరిగింది. వచ్చే నెల్లో హైదరాబాద్ షెడ్యూల్‌తో చిత్రీకరణ పూర్తవుతుంది. 'పరదా'తో ప్రేక్షకులకు వినోదాన్ని పంచడంతో పాటు మంచి సందేశం అందిస్తాం' అని చెప్పారు. ఇదొక కథ మాత్రమే కాదు ప్రేక్షకులను మరో ప్రపంచంలోకి తీసుకెళ్లే ప్రయాణం కూడా అని నిర్మాతలు అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: గోపీ సుందర్. సినిమాటోగ్రఫీ: మృదుల్ సుజిత్ సేన్

కల్కి సినిమాతో ప్రారంభం



హైదరాబాద్‌లో తొలి స్టూడియోగా సారథి స్టూడియోకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. కాలానికి తగినట్లుగా మారుతూ ఆధునాతన టెక్నాలజీతో, అన్ని రకాల హంగులతో ఈ స్టూడియోను తీర్చిదిద్దారు. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోనే అధునాతమైన డాల్బీ విక్సింగ్ స్టూడియోను ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి, సౌండ్ డిజైన్ స్టూడియోను మరో సంగీత దర్శకుడు శేఖర్‌చంద్ర శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టూడియో చైర్మన్ ఎం.ఎస్.ఆర్.వి. ప్రసాద్ మాట్లాడుతూ 'మొదట ఈ స్టూడియోను మల్టీప్లెక్స్ థియేటర్స్‌గా మార్చాలని ఆలోచించాం. కానీ తర్వాత ఆ ఆలోచన విరమించుకుని నేటి కాలంతో పోటీ పడే విధంగా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌కు కావాల్సిన అధునాతన టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చాం. ప్రభాస్‌గారు నటించిన 'కల్కి' సినిమాతో మా డాల్బీ మిక్సింగ్ థియేటర్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉంది' అన్నారు. 'మా స్టూడియోలో షూటింగ్ ప్రారంభిస్తే పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌తో సహా తొలి కాపీని సిద్ధం చేసే సదుపాయాలన్నీ ఉన్నాయి' అని స్టూడియో డైరెక్టర్ కె.వి.రావు చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు కె.ఎస్.రామారావు, కె.ఎల్.నారాయణ, రచయిత విజయేంద్రప్రసాద్, తెలుగు నిర్మాతలమండలి అధ్యక్షుడు దామోదర ప్రసాద్, సంగీత దర్శకుడు భీమ్స్, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి డైరెక్టర్ భాను తదితరులు పాల్గొన్నారు.

కొత్త తేదీన కృష్ణమ్మ



సత్యదేవ్ కథానాయకుడిగా నటించిన 'కృష్ణమ్మ' చిత్రానికి కొత్త రిలీజ్ డేట్ ఖరారైంది. మే 10న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు చిత్ర బృందం శుక్రవారం ప్రకటించింది. యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిన ఈ చిత్రానికి వీవీ గోపాలకృష్ణ దర్శకుడు. దర్శకుడు కొరటాల శివ సమర్పణలో కృష్ణ కొమ్మలపాటి నిర్మించారు. అతీరారాజ్ కథానాయిక. సంగీతం: కాలభైరవ. సినిమాటోగ్రఫీ: సన్నీ కూరపాటి

ఆటకట్టించే ఐపీఎస్



ఆర్కే సాగర్ కథానాయకుడిగా రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'ది 100'. రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకత్వంలో రమేశ్ కరుటూరి, వెంకీ పూశడపు, జే తారక్‌రామ్ నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ చిత్రం టీజర్‌ను మెగా మదర్ కొణిదెల అంజనాదేవి చేతుల మీదుగా విడుదల చేశారు. నేరస్తుల ఆటకట్టించే ఐపీఎస్ అధికారి విక్రాంత్‌గా టీజర్‌లో ఆర్కే సాగర్ ఆకట్టుకున్నారు. ఈ చిత్రంలో మిషా నారంగ్ కథానాయిక. ధన్య బాలకృష్ణ కీలకపాత్ర పోషిస్తున్నారు. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: శ్యామ్ కే నాయుడు.

మహిళ విజయం వెనుక మగాడు



కిరణ్‌కుమార్, భవ్యశ్రీ జంటగా నటించే 'దీక్ష' చిత్రం షూటింగ్ శుక్రవారం ప్రారంభమైంది. తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో ఈ సినిమాను నిర్మిస్తున్నారు.. హీరోహీరోయిన్లపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు తూముకుంట నర్సారెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేయగా, ఆర్.కె. గౌడ్ తొలి క్లాప్ ఇచ్చారు. యోగానంద కృష్ణమాచార్య తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'దీక్ష, పట్టుదల ఉంటే ఏ పని చేసినా తప్పకుండా విజయం సాధిస్తాం అనే పాయింట్‌తో ఈ సినిమా తీస్తున్నాం. ప్రతి మగవాడి విజయం వెనుక ఒక ఆడది ఉంటుందని అంటారు. అలాగే ఒక మహిళ విజయం వెనుక కూడా మగాడు ఉంటాడు. ఈ అంశం కూడా చిత్రకథలో ఉంది. మంచి కథాబలం ఉన్న సినిమా కనుక అవార్డులు కూడా వస్తాయని అనుకుంటున్నాం. మే ఒకటి నుంచి రెగ్యులర్ షూటింగ్ ఉంటుంది. హైదరాబాద్‌లో ఒక షెడ్యూల్, దుబాయ్‌లో ఒక షెడ్యూల్ చేస్తున్నాం. పాటల రికార్డింగ్ పూర్తయింది. దీని తర్వాత స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో ఒక సినిమా చేస్తున్నాం. ఇక పై మా బేనరుపై వరుసగా సినిమాలు తీస్తాం' అని చెప్పారు.

టీనేజ్ లవ్‌స్టోరీ



ఎస్.కె.ఎస్. ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించే చిత్రం షూటింగ్ శుక్రవారం ప్రారంభమైంది. మురళీ అలకపల్లి దర్శకత్వంలో రాహుల్ శ్రీవాత్సవ్ నిర్మిస్తున్నారు. దేవుని ఫొటోలపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు జర్నలిస్టు పర్వతనేని రాంబాబు కెమెరా స్విచ్ ఆన్ చేయగా, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్టు ప్రభు క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'మా సంస్థ నుంచి వస్తున్న మూడో సినిమా ఇది. రెండో చిత్రం షూటింగ్ జరుగుతోంది. దర్శకుడు మురళి చెప్పిన కథ నచ్చి మూడో చిత్రం ప్రారంభించాం. మూడు పాత్రల చుట్టూ జరిగే టీనేజ్ లవ్‌స్టోరీ ఇది. పేరున్న నటీనటులు నటిస్తారు. వారు ఎవరనేది ప్రస్తుతానికి సస్పెన్స్. మే రెండో వారం నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. ఆగస్టు లేదా సెప్టెంబర్‌లో విడుదల చేయాలనుకుంటున్నాం' అని చెప్పారు. గ్రామీణ నేపథ్యంగా సాగే ప్రేమ కథాచిత్రమిది. ముగ్గురు వ్యక్తుల మధ్య జరుగుతుంది. మంచి టీమ్‌తో త్వరలోనే మీ ముందుకు వస్తాం' అని చెప్పారు దర్శకుడు. ఈ చిత్రానికి ఆంజనేయులు జక్క ఎగ్జిక్యూటివ్ నిర్మాత.

హెచ్‌సీఎల్ టెక్ లాభం

రూ. 3,986 కోట్లు

మొత్తం ఆదాయం రూ.28,499 కోట్లు .. ఒక్కో షేరుకు రూ.18 మధ్యంతర డివిడెండ్


విజయ్ కుమార్

న్యూఢిల్లీ: టెక్నాలజీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్ మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ.3,986 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.3,983 కోట్లతో పోల్చితే లాభం నామమాత్రంగానే పెరిగింది. అయితే అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో ఆర్జించిన రూ.4,350 కోట్లతో పోల్చితే మాత్రం లాభం 8.4 శాతం క్షీణించిందని కంపెనీ తెలిపింది. పన్ను చెల్లింపుల ముందు లాభం (ఎబిటా) సైతం ముందు త్రైమాసికంతో పోల్చితే 10.6 శాతం దిగజారి రూ.5,018 కోట్లకే పరిమితమైంది. ఇక ఇదే కాలంలో కంపెనీ ఆదాయం 7.11 శాతం పెరిగి రూ.26,606 కోట్ల నుంచి రూ.28,499 కోట్లకు పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా ఐటీ వ్యయాలు తగ్గిపోవటంతో పాటు ఉద్యోగుల వ్యయాలు గణనీయంగా పెరగటం పనితీరుపై ప్రభావం చూపించిందని హెచ్‌సీఎల్ టెక్ సీఈఓ సీ విజయ్ కుమార్ వెల్లడించారు. మార్చి త్రైమాసికంలో ఫైనాన్షియల్ సర్వీసెస్ విభాగం 12.1 శాతం, మాన్యుఫ్యాక్చరింగ్ రంగం 9.8 శాతం వృద్ధి చెందిందన్నారు. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో స్థిర కరెన్సీ విలువల ప్రకారం కంపెనీ ఆదాయం 3 నుంచి 5 శాతం మేరకు, ఎబిటా మార్జిన్ 18 నుంచి 19 శాతం మేరకు పెరగవచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. అయితే మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.1,09,913 కోట్ల ఆదాయంపై రూ.15,702 కోట్ల లాభం ఆర్జించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఆదాయం 8.33 శాతం, లాభం 5.73 శాతం పెరిగాయి. కంపెనీ డైరెక్టర్ల బోర్డు రూ.2 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ.18 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. మే 15వ తేదీన మధ్యంతర డివిడెండ్‌ను వాటాదారులకు చెల్లించనున్నట్లు కంపెనీ తెలిపింది.

10,000 మంది ఫ్రెషర్స్ నియామకాలు

మార్చి త్రైమాసికంలో ఉద్యోగులపై వ్యయాలు 11.5 శాతం మేరకు పెరిగాయని, వలస రేటు మాత్రం గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే 19.5 శాతం నుంచి 12.4 శాతానికి తగ్గిందని కంపెనీ ప్రకటించింది. కాగా మార్చి ముగిసే నాటికి కంపెనీ మొత్తం ఉద్యోగుల సంఖ్య 2,27,481గా ఉందని పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 10,000 మంది ఫ్రెషర్స్‌ను నియమించుకున్నామని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా అదే స్థాయిలో నియామకాలు చేపట్టే వీలుందని కంపెనీ చీఫ్ పీపుల్ ఆఫీసర్ రామచంద్రన్ సుందరరాజన్ తెలిపారు. 2023-24లో మొత్తం 73 డీల్స్‌ను కుదుర్చుకోగా ఇందులో 21 డీల్స్‌ను ఒక్క మార్చి త్రైమాసికంలోనే కుదుర్చుకున్నట్లు చెప్పారు.

ఐదు రోజుల ర్యాలీకి బ్రేక్

సెన్సెక్స్ 609 పాయింట్లు డౌన్

ముంబై: వరుసగా ఐదు రోజుల పాటు లాభాల్లో పయనించిన ప్రామాణిక ఈక్విటీ సూచీలు శుక్రవారం నష్టాల్లోకి మళ్లాయి. అంతర్జాతీయ మార్కెట్ల మిశ్రమ సంకేతాల నేపథ్యంలో మదుపరులు బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగ షేర్లలో లాభాల అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. ముడి చమురు ధరల పెరుగుదల, రూపాయి క్షీణత, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ మార్కెట్‌పై ఒత్తిడిని మరింత పెంచాయి. వారాంతం ట్రేడింగ్ ముగిసేసరికి సెన్సెక్స్ 609.28 పాయింట్లు కోల్పోయి 73,730.16 వద్దకు జారుకుంది. నిఫ్టీ 150.40 పాయింట్ల నష్టంతో 22,419.95 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 24 నష్టపోయాయి.

బజాజ్ ఫైనాన్స్ 7.73 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. బజాజ్ ఫిన్‌సర్వ్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, నెస్లే షేర్లు మూడు శాతానికి పైగా నష్టపోయాయి. టెక్ మహీంద్రా షేరు మాత్రం 7.34 శాతం ఎగిసి సెన్సెక్స్ టాప్ గెయినర్‌గా నిలిచింది. ప్రధాన షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనైనప్పటికీ చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లలో కొనుగోళ్లు కొనసాగాయి. దాంతో బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.83 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.27 శాతం పెరిగాయి. రంగాలవారీ సూచీల్లో బ్యాంకెక్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అర శాతానికి పైగా నష్టపోయాయి.

అపోలో 24/7లో

అడ్వెంట్ పెట్టుబడులు

రూ.2,475 కోట్లతో 12.1% వాటా కొనుగోలు

హైదరాబాద్: దేశ ఫార్మా రిటైల్ రంగంపైనా అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. అపోలో 24/7 పేరుతో హెల్త్‌కేర్ రిటైల్ రంగంలో ఉన్న అపోలో హాస్పిటల్స్ గ్రూప్ సంస్థ అపోలో హెల్త్ కంపెనీ లిమిటెడ్ (ఏహెచ్‌ఎల్) ఈక్విటీలో ప్రముఖ పీఈ సంస్థ అడ్వెంట్ ఇంటర్నేషనల్ 12.1 శాతం వాటా తీసుకుంటోంది. ఇందుకోసం రూ.2,475 కోట్లు చెల్లించనుంది.అడ్వెంట్ ఇంటర్నేషనల్ రెండు విడతలుగా కన్వర్టబుల్ డిబెంచర్ల ద్వారా ఈ వాటా కొనుగోలు చేయనుంది. దీనికి తోడు అపోలో 24/7 హోల్‌సేల్ ఫార్మా డిస్ట్రిబ్యూషన్ కంపెనీ కీమెడ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను వచ్చే 24-30 నెలల్లో మాతృసంస్థలో విలీనం చేయాలని అడ్వెంట్ ఇంటర్నేషనల్ షరతు విధించింది.

ఎవరి వాటా ఎంత?

విలీనం తర్వాత అపోలో హెల్త్ కంపెనీ లిమిటెడ్ (అపోలో 24/7) ఈక్విటీలో అడ్వెంట్ ఇంటర్నేషనల్‌కు 12.1 శాతం, కీమెడ్ వాటాదారులకు 25.7 శాతం, ప్రధాన ప్రమోటర్ అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏహెచ్‌ఈఎల్)కు 59.2 శాతం వాటా ఉంటుంది. విలీనానికి ముందు రెండు కంపెనీల విలువను రూ.22,481 కోట్లుగా లెక్కించారు. ఇందులో అపోలో 24/7 విలువను రూ.14,478 కోట్లుగా, కీమెడ్ విలువను రూ.8,003 కోట్లుగా లెక్కకట్టారు.

విలీనం భేష్..

అపోలో 24/7లో కీమెడ్ ప్రైవేట్ లిమిటెడ్ విలీనాన్ని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ సీ ప్రతాప్ రెడ్డి స్వాగతించారు. 'ప్రతి భారతీయుడికి అందుబాటు ధరల్లో విశ్వసనీయమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడమే మా లక్ష్యం. అపోలో 24/7 ఈ లక్ష్యాన్ని సాధించింది. కొద్ది కాలంలోనే 3.3 కోట్ల మంది భారతీయులకు తన సేవలు అందించింది. అడ్వెంట్ పెట్టుబడులు, కీమెడ్ విలీనంతో రిటైల్ హెల్త్ కంపెనీల్లో అపోలో 24/7లో ప్రధాన కంపెనీగా నిలుస్తుంది' అని ఒక ప్రకటనలో తెలిపారు. 'అపోలో 24/7 చరిత్రలో ఇదో మైలురాయి. ఈ విలీనంతో 140 కోట్ల మంది భారతీయులకు వారంలో అన్ని రోజులూ అసలు సిసలు ఔషధాలను 24 నిమిషాల నుంచి 24 గంటల్లో అందిస్తాం' అని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్‌పర్సన్ శోభనా కామినేని అన్నారు.

స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లకు ఆర్‌బీఐ ఆఫర్!

సార్వజనిక బ్యాంక్‌గా మారేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ముంబై: సార్వజనిక (యూనివర్సల్) బ్యాంకులుగా మారేందుకు అర్హత కలిగిన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్స్ (ఎస్ఎఫ్‌బీ) నుంచి ఆర్‌బీఐ దరఖాస్తులను ఆహ్వానించింది. యూనివర్సల్ బ్యాంక్‌గా మారాలనుకుంటున్న ఎస్ఎఫ్‌బీలు ఈ మార్చితో ముగిసిన త్రైమాసికం నాటికి కనీసం రూ.1,000 కోట్ల నెట్‌వర్త్‌ను కలిగి ఉండాల్సి ఉంటుంది. అలాగే, ఎస్ఎఫ్‌బీల షేర్లు స్టాక్ మార్కెట్లో లిస్టయి ఉండాలని శుక్రవారం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఆర్‌బీఐ స్పష్టం చేసింది. అంతేకాదు, గడిచిన రెండు ఆర్థిక సంవత్సరాల్లో నికర లాభాలను నమోదు చేసుకోవడంతో పాటు స్థూల నిరర్థక ఆస్తులు (గ్రాస్ ఎన్‌పీఏ) 3 శాతం అంతకన్నా తక్కువగా, నికర ఎన్‌పీఏలు ఒక శాతం అంతకన్నా తక్కువగా ఉండాలి. 2014 నవంబరులో ఆర్‌బీఐ ఎస్ఎఫ్‌బీల లైసెన్సు మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రస్తుతం దేశంలో ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ సహా దాదాపు డజను ఎస్ఎఫ్‌బీలున్నాయి.

ఎల్ఎస్‌పీలకు కొత్త నిబంధనలు

బ్యాంకులకు ఏజెంట్లుగా వ్యవహరించే లెండింగ్ సర్వీస్ ప్రొవైడర్ల (ఎల్ఎస్‌పీ)కు ఆర్‌బీఐ కొత్త నిబంధనలను ప్రతిపాదించింది. ఇకపై ఎల్ఎస్‌పీలు తాము ఆఫర్ చేసే అన్ని రుణాల సమాచారాన్ని రుణగ్రహీతలకు తెలియజేయాల్సి ఉంటుంది. తద్వారా రుణగ్రహీతలు మరింత మెరుగ్గా నిర్ణయం తీసుకోగలగడంతో పాటు ఎల్ఎస్‌పీల సేవల్లో పారదర్శకత పెరగనుంది. చాలా ఎల్ఎస్‌పీలు ఏక కాలంలో పలు బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థలకు చెందిన రుణ పథకాల విక్రయ ఏజెంట్లుగా వ్యవహరిస్తుంటాయి.

11 % పెరిగిన ఎస్‌బీఐ కార్డ్ లాభం

ముంబై: ఎస్‌బీఐ కార్డ్ కంపెనీ ఈ ఏడాది మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికంలో నికర లాభంలో 11 శాతం వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం రూ.596 నుంచి రూ.662 కోట్లకు పెరిగింది. మొత్తం ఆదాయం కూడా 14 శాతం పెరిగి రూ.3,917 కోట్ల నుంచి రూ.4,475 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం 28 శాతం వృద్ధితో రూ.2,139 కోట్లకు చేరింది. కాగా ఏడాది మొత్తానికి లాభం 7 శాతం పెరిగి రూ.2,408 కోట్లుగా నమోదైంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,710 ▲	66,650 ▲	88,000 ▲
ముంబై	72,448 ▲	66,362 ▲	81,374 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



27వ తేదీ			
హైదరాబాద్	350	విజయవాడ	380
వరంగల్	352	గోదావరి	380
చిత్తూరు	453	విశాఖపట్నం	400
		డజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	గోదావరి	131
వరంగల్	125	విజయవాడ	131
కరీంనగర్	125	గుంటూరు	135
మహబూబ్‌నగర్	125	ఒంగోలు	135
కర్నూలు	125	చిత్తూరు	128
విశాఖపట్నం	123		

2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థ

రూ.83 లక్షల కోట్లకు...

సీఐఐ తెలంగాణ చైర్మన్ సాయి డి ప్రసాద్

హైదరాబాద్: తెలంగాణ ఆర్థిక వృద్ధి రేటు జాతీయ సగటు స్థాయిని మించిపోయింది. గత పదేళ్లలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధి రేటు జాతీయ సగటు కంటే అధికంగా ఉంది. ఈ కాలంలో తెలంగాణ ఏటా సగటున 10 శాతం చొప్పున వృద్ధి రేటు నమోదు చేసింది. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), తెలంగాణ చాప్టర్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి డి ప్రసాద్ ఈ విషయం చెప్పారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ జీఎస్‌డీపీ రూ.14.49 లక్షల కోట్లు (17,500 కోట్ల డాలర్లు)గా ఉండొచ్చని అంచనా వేస్తున్నామన్నారు. కాగా రానున్న సంవత్సరాల్లో రాష్ట్రం ఇదే వృద్ధి రేటు కొనసాగిస్తే 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థ రూ.83.35 లక్షల కోట్ల (లక్ష కోట్ల డాలర్లు) స్థాయికి చేరుతుందన్నారు. ఈ లక్ష్య సాధన కోసం సీఐఐ తెలంగాణ చాప్టర్ వ్యవసాయం, ఎంఎస్ఎంఈలు, పర్యాటక రంగం, మెడికల్ టూరిజంపై ప్రధానంగా దృష్టి పెడుతుందని సాయి ప్రసాద్ చెప్పారు. విధానపరంగా ఎంఎస్ఎంఈలకు ఎదురయ్యే సమస్యల పరిష్కారంతో పాటు ఖాయిలా పడిన ఎంఎస్ఎంఈల పునరుద్ధరణకూ కృషి చేస్తామని సీఐఐ తెలంగాణ చాప్టర్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన రాచమల్లు ఫోర్జింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి తెలిపారు.

లాభాల్లో మారుతి సుజుకీ రికార్డు

క్యూ4 లాభం రూ.3,879 కోట్లు • రూ.5 ముఖవిలువ కలిగిన ప్రతి షేరుకు రూ.125 డివిడెండ్

న్యూఢిల్లీ: మారుతి సుజుకీ 2023-24 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.3,877.8 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. కంపెనీ చరిత్రలో ఒక త్రైమాసికంలో ఆర్జించిన లాభంలో కొత్త రికార్డు ఇది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఇదే కాలం లాభం రూ2,623.6 కోట్లతో పోల్చితే ఇది 47.8 శాతం అధికం. ఎస్‌యూవీలు భారీగా అమ్ముడుపోవడంతో పాటు కమోడిటీ ధరల తగ్గుదల కారణంగా పెరిగిన మార్జిన్లు, వ్యయ నియంత్రణ చర్యలు, సామర్థ్యాల వినియోగం పెంపు లాభంలో వృద్ధికి కారణాలుగా ఉన్నాయని మారుతి సుజుకీ తెలిపింది. మార్చి త్రైమాసికంలో కంపెనీ 5.84 లక్షల కార్లు విక్రయించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే కార్ల విక్రయాలు 13.4 శాతం పెరిగాయి. మొత్తం అమ్మకాల్లో యుటిలిటీ వాహనాల వాటా 24 శాతం నుంచి 36 శాతానికి పెరిగింది. వరుసగా మూడో ఏడాది కూడా కంపెనీ అత్యధిక కార్ల ఎగుమతిదారుగా నిలిచింది. దేశం నుంచి ఎగుమతి అయిన కార్లలో మారుతి వాటా 41.8 శాతం ఉంది. కాగా ఏడాది మొత్తానికి కంపెనీ 21,35,323 కార్లు విక్రయించింది. త ఏడాదితో పోల్చితే ఇది 8.6 శాతం అధికం. వీటిలో దేశీయ అమ్మకాలు 18,52,256 యూనిట్లు కాగా 2,83,067 కార్లు ఎగుమతి చేసింది. ఇదిలా ఉండగా కంపెనీ డైరెక్టర్ల బోర్డు రూ.5 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ.125 డివిడెండ్‌ను సిఫారసు చేసింది. కంపెనీ చరిత్రలో చెల్లిస్తున్న అత్యధిక డివిడెండ్ ఇదే. 2022-23 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.90 డివిడెండ్ చెల్లించింది.

బీఓఎం లాభంలో 45% వృద్ధి

ముంబై: మార్చి త్రైమాసికంలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 45 శాతం వృద్ధితో రూ.1,218 కోట్ల నికరలాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన లాభం రూ.840 కోట్లు. ఇదే కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.5,317 కోట్ల నుంచి రూ.6,488 కోట్లకు పెరిగింది. ఇందులో వడ్డీ ఆదాయం రూ.5,467 కోట్లుంది. స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 2.47 శాతం నుంచి 1.88 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.25 శాతం నుంచి 0.20 శాతానికి దిగి వచ్చాయి.

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లి (బెంగళూరు)	హర్షల్ పటేల్ (పంజాబ్)
430 (9 మ్యాచ్‌లు)	14 (9 మ్యాచ్‌లు)




262.. ఉఫ్


బెయిర్‌స్టో (48 బంతుల్లో 8 ఫోర్లు, 9 సిక్సర్లతో 108 నాటౌట్)

18.4 ఓవర్లలోనే ఖతం

పంజాబ్ రికార్డు ఛేదన
- బెయిర్‌స్టో సూపర్ సెంచరీ
- రాణించిన శశాంక్, ప్రభ్‌సిమ్రన్
- కోల్‌కతాకు భంగపాటు

1 పురుషుల టీ20 క్రికెట్‌లో అత్యధిక ఛేదన (262) చేసిన జట్టుగా పంజాబ్

టీ20 మ్యాచ్‌లో అత్యధిక సిక్సర్లు (42) నమోదు కావడం ఇదే తొలిసారి. అలాగే ఓ ఐపీఎల్ ఇన్నింగ్స్‌లో ఎక్కువ సిక్సర్లు (24) బాదిన జట్టుగా పంజాబ్.

ఐపీఎల్‌లో ఇరు జట్ల ఓపెనర్లు 50+ స్కోర్లు సాధించడం ఇదే తొలిసారి.

ఈడెన్ గార్డెన్స్‌లో అత్యధిక స్కోరు (262) చేసిన ఐపీఎల్ జట్టుగా పంజాబ్.

6 ఈ సీజన్‌లో 250+ స్కోర్లు నమోదు కావడం ఇది ఆరోసారి.

ఈ ఐపీఎల్ సీజన్‌లో అసలేం జరుగుతోంది? ప్రతీ మ్యాచ్ అంతకు మించి అన్నట్టుగా సాగుతున్న ఈ లీగ్‌లో మరో కళ్లుచెదిరే పోరు. బ్యాటింగ్‌కు స్వర్గధామంగా మారిన ఈడెన్ గార్డెన్స్‌లో ఏకంగా 262 పరుగుల రికార్డు ఛేదనను పంజాబ్ కింగ్స్ బ్యాటర్లు మరో 8 బంతులుండగానే ఊదిపారేశారు. ఇది టీ20 చరిత్రలోనే అత్యధిక ఛేదన. కలయా.. నిజమా అనే రీతిలో ప్రభ్‌సిమ్రన్ శుభారంభానికి బెయిర్‌స్టో శతకం తోడవ్వగా.. చివర్లో శశాంక్ సింగ్ సుడిగాలి ఇన్నింగ్స్‌తో కోల్‌కతా బౌలర్లు బిత్తరపోవాల్సి వచ్చింది. అంతకుముందు కేకేఆర్ బ్యాటర్లు సాగించిన జోరు కూడా కింగ్స్ ఆట ముందు చిన్నబోయింది. మొత్తంగా ఈ మ్యాచ్‌లో 523 పరుగులు నమోదు కావడం విశేషం.


నరైన్ (71) సాల్ట్ (75)

కోల్‌కతా: ఈడెన్ గార్డెన్స్‌లో పరుగుల సునామీ. 261 పరుగులు సాధించాక ఇక గెలుపు తమదే అనుకున్న కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ఇది నిజంగా ఊహించని పరిణామమే. అసాధ్యమనుకున్న ఛేదనను అనూహ్యరీతిలో సాగిన ఆటతీరుతో పంజాబ్ కింగ్స్ సుసాధ్యం చేసింది. జానీ బెయిర్‌స్టో (48 బంతుల్లో 8 ఫోర్లు, 9 సిక్సర్లతో 108 నాటౌట్) కీలక మ్యాచ్‌లో ఫామ్ అందుకోగా.. హిట్టర్ శశాంక్ సింగ్ (28 బంతుల్లో 2 ఫోర్లు, 8 సిక్సర్లతో 68 నాటౌట్), ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (20 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 54) కోల్‌కతా బౌలర్లను చెడుగుడు ఆడారు. దీంతో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో పంజాబ్ 8 వికెట్లతో ఘనవిజయం సాధించింది. ముందుగా కోల్‌కతా 20 ఓవర్లలో 6 వికెట్లకు 261 పరుగులు చేసింది. సాల్ట్ (37 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 75), నరైన్ (32 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 71) రాణించారు. అర్ష్‌దీప్‌నకు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో పంజాబ్ 18.4 ఓవర్లలో 2 వికెట్లకు 262 పరుగులు చేసి గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా బెయిర్‌స్టో నిలిచాడు.

బాదుడే బాదుడు: భారీ ఛేదనను పంజాబ్ కళ్లు చెదిరే రీతిలో ఆరంభించింది. ఆరంభంలో ప్రభ్‌సిమ్రన్.. మధ్య ఓవర్లలో బెయిర్‌స్టో.. చివర్లో శశాంక్ ప్రతాపం సాగింది. స్పిన్నర్ నరైన్ మాత్రం రన్స్‌ను కట్టడి చేయగలిగాడు. ప్రభ్‌సిమ్రన్ మూడో ఓవర్‌లోనే 6,4,6,4తో 23 పరుగులు అందించాడు. ఐదో ఓవర్‌లో మరో 4,6తో 18 బంతుల్లోనే ఫిఫ్టీ కూడా పూర్తయ్యింది. ఇక ఆరో ఓవర్‌లో బెయిర్‌స్టో 4,6,4,4,6తో 24 రన్స్ రాగా ఆఖరి బంతికి ప్రభ్ రనౌటయ్యాడు. దీంతో పవర్‌ప్లేలో 93/1తో నిలిచింది. వన్‌డౌన్‌లో రొసో (26) కూడా ఉన్న కాసేపు వేగం కనబరిచాడు. అటు బెయిర్‌స్టో సిక్సర్‌తో 23 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. రస్సెల్ ఓవర్ (12)లో రొసో సిక్సర్, జానీ రెండు సిక్సర్లతో 24 రన్స్ రాబట్టగా అటు స్కోరు 173/1కి చేరింది. రొసోను నరైన్ అవుట్ చేసినా.. శశాంక్ రాకతో పంజాబ్ దూకుడు ఆగలేదు. 14వ ఓవర్‌లో రెండు, 16వ ఓవర్‌లో మూడు సిక్సర్లతో పాటు 18వ ఓవర్‌లో 6,6,4తో పంజాబ్ విజయాన్ని లాంఛనం చేసేశాడు. ఈ దెబ్బకు 23 బంతుల్లోనే శశాంక్ ఫిఫ్టీ పూర్తి కాగా.. మరోవైపు 45 బంతుల్లోనే బెయిర్‌స్టో తన సెంచరీని పూర్తి చేశాడు. 12 బంతుల్లో 9 పరుగులు కావాల్సిన వేళ శశాంక్ మరో సిక్సర్‌తో 8 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

ఓపెనర్ల విధ్వంసం: 10 ఓవర్లలో 137.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కేకేఆర్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు నరైన్, సాల్ట్ విజృంభించిన తీరిది. ఒకరికి వించి మరొకరు అన్నట్టు అలవోకగా పంజాబ్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. పైగా నరైన్ 16 పరుగుల వద్ద, సాల్ట్ 34, 35 రన్స్ వద్ద ఇచ్చిన సులువైన క్యాచ్‌లను ఫీల్డర్లు వదిలేయడం కూడా కలిసివచ్చింది. ఆ తర్వాత కూడా ప్రతీ బ్యాటర్ వేగం కనబర్చడంతో కోల్‌కతా అవలీలగా 250+ దాటేసింది. మూడో ఓవర్‌లోనే సాల్ట్ 6,4,6తో 18 రన్స్ రాబట్టగా.. ఆ వెంటనే నరైన్ 4,6,4తో 21 రన్స్ సమకూర్చాడు. ఈ దెబ్బకు పవర్‌ప్లేలోనే జట్టు 76 పరుగులు సాధించింది. ఆ తర్వాత కూడా కేకేఆర్ జోరు తగ్గలేదు. ఎనిమిదో ఓవర్‌లో నరైన్ రెండు ఫోర్లతో 23 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేయగా.. అదే ఓవర్‌లో సాల్ట్ 4,6తో 22 రన్స్ వచ్చాయి. దీంతో స్కోరు కూడా వంద దాటింది. స్పిన్నర్ రాహుల్ చాహర్ ఓవర్‌లో నరైన్‌ను ఎల్బీగా ప్రకటించినా వెంటనే అతడు రివ్యూకు వెళ్లి బతికిపోయాడు. 25 బంతుల్లోనే సాల్ట్ అర్ధసెంచరీ కూడా పూర్తయ్యింది. ఈ దశలో రాహుల్ చాహర్ కేకేఆర్‌కు ఝలక్ ఇచ్చాడు. 11వ ఓవర్‌లో నరైన్ వికెట్ తీయడంతో పంజాబ్ కాస్త ఊపిరి పీల్చుకుంది. తొలి వికెట్‌కు ఈ జోడీ 138 పరుగులు జత చేయడం విశేషం. కాసేపటికే తన ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లతో ఊపు మీదున్న సాల్ట్‌ను సామ్ కర్రాన్ చక్కటి యార్కర్‌తో బౌల్డ్ చేశాడు. ఓవైపు వెంకటేశ్ అయ్యర్ భారీ షాట్లు ఆడలేకపోగా.. హిట్టింగ్ కోసం ముందుగానే పంపిన రస్సెల్ (24) కాసేపే క్రీజులో నిలిచాడు. 16వ ఓవర్‌లో అర్ష్‌దీప్ అతడిని అవుట్ చేశాడు. అప్పటికే కేకేఆర్ స్కోరు 200 దాటేసింది. 18వ ఓవర్‌లో శ్రేయాస్ (28) బ్యాట్ ఝుళిపిస్తూ వరుసగా 6,4,6,6తో 24 రన్స్‌తో జోరు చూపాడు. కానీ చివరి రెండు ఓవర్లలో కోల్‌కతాకు 22 పరుగులే రాగా శ్రేయాస్, రింకూ (5), వెంకటేశ్ వికెట్లను కోల్పోయింది.


శశాంక్ సింగ్ (28 బంతుల్లో 2 ఫోర్లు, 8 సిక్సర్లతో 68 నాటౌట్)

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	8	7	1	0	14	0.698
కోల్‌కతా	8	5	3	0	10	0.972
హైదరాబాద్	8	5	3	0	10	0.577
లఖ్‌నవూ	8	5	3	0	10	0.148
చెన్నై	8	4	4	0	8	0.415
ఢిల్లీ	9	4	5	0	8	-0.386
గుజరాత్	9	4	5	0	8	-0.974
పంజాబ్	9	3	6	0	6	-0.187
ముంబై	8	3	5	0	6	-0.227
బెంగళూరు	9	2	7	0	4	-0.721

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

కోల్‌కతా: సాల్ట్ (బి) కర్రాన్ 75, నరైన్ (సి) బెయిర్‌స్టో (బి) చాహర్ 71, వెంకటేశ్ (రనౌట్) 39, రస్సెల్ (సి) హర్షల్ (బి) అర్ష్‌దీప్ 24, శ్రేయాస్ (సి) రబాడ (బి) అర్ష్‌దీప్ 28, రింకూ (సి) అశుతోష్ (బి) హర్షల్ 5, రమణ్‌దీప్ (నాటౌట్) 6, **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 20 ఓవర్లలో 261/6; వికెట్ల పతనం:** 1-138, 2-163, 3-203, 4-246, 5-253, 6-261; **బౌలింగ్:** కర్రాన్ 4-0-60-1, అర్ష్‌దీప్ 4-0-45-2, హర్షల్ 3-0-48-1, రబాడ 3-0-52-0, రాహుల్ చాహర్ 4-0-33-1, హర్‌ప్రీత్ బ్రార్ 2-0-21-0.

పంజాబ్: ప్రభ్‌సిమ్రన్ (రనౌట్) 54, బెయిర్‌స్టో (నాటౌట్) 108, రొసో (సి) శ్రేయాస్ (బి) నరైన్ 26, శశాంక్ (నాటౌట్) 68, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 18.4 ఓవర్లలో 262/2; వికెట్ల పతనం:** 1-93, 2-178; **బౌలింగ్:** చమీర 3-0-48-0, హర్షిత్ 4-0-61-0, అనుకూల్ 2-0-36-0, నరైన్ 4-0-24-1, వరుణ్ 3-0-46-0, రస్సెల్ 2-0-36-0, రమణ్‌దీప్ 0.4-0-9-0.

నేటి మ్యాచ్‌లు

ఢిల్లీ x ముంబై	మ.3.30 గం. నుంచి
లఖ్‌నవూ x రాజస్థాన్	రాత్రి 7.30 గం. నుంచి

స్పోర్ట్స్

టైటిల్ నిలబెట్టుకునేనా?

- భారీ అంచనాలతో భారత పురుషుల జట్టు
- సీనియర్లు లేకుండానే మహిళల బృందం
- నేటినుంచే థామస్, ఉబెర్ కప్ చాంపియన్‌షిప్


ప్రణయ్

చెంగ్డూ (చైనా): ప్రపంచ బ్యాడ్మింటన్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే ఆసియా జట్ల మధ్య సమరమైన థామస్ కప్, ఉబెర్ కప్‌లకు రంగం సిద్ధమైంది. పురుష జట్లు పోటీపడే థామస్ కప్, మహిళల జట్ల మధ్య జరిగే ఉబెర్ కప్ శనివారం మొదలవనుంది. ఇక, రెండేళ్ల క్రితం థామస్ కప్‌లో చాంపియన్‌గా నిలిచి చరిత్ర సృష్టించిన భారత పురుషుల బ్యాడ్మింటన్ జట్టు మరోసారి ఆ స్థాయి ప్రదర్శనతో ఆకట్టుకోవాలనుకుంటోంది. నాడు జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన సీనియర్లు కిడాంబి శ్రీకాంత్, ప్రణయ్, లక్ష్యసేన్‌తో పాటు ప్రియాన్షు రజావత్, కిరణ్ జార్జ్, డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి, ధ్రువ్ కపిల/అర్జున్ జంట ఈసారీ బరిలోకి దిగుతున్నారు. అయితే, సాత్విక్ జోడీని మినహాయిస్తే సింగిల్స్ స్టార్లు శ్రీకాంత్, ప్రణయ్, లక్ష్య ఫామ్‌లేమితో తంటాలు పడుతుండడం భారత్‌ను ఆందోళనపరుస్తోంది. ఈ నేపథ్యంలో డిఫెండింగ్ చాంపియన్ హోదాలో పోటీపడుతున్న భారత జట్టు.. తమ గ్రూప్-సిలోని మాజీ విజేత ఇండోనేసియా, థాయ్‌లాండ్, ఇంగ్లండ్ జట్లను ఎలా ఎదుర్కొంటుందన్నది ఇప్పుడు కీలకంగా మారింది. భారత పురుషుల బృందం తన తొలి పోరులో భాగంగా శనివారం థాయ్‌లాండ్‌తో తలపడనుంది. సోమవారం ఇంగ్లండ్‌తో, బుధవారం ఇండోనేసియాతో భారత్ మిగతా రెండు మ్యాచ్‌లను ఆడనుంది.

అస్మిత సారథ్యంలో మహిళల బృందం: మహిళల ఈవెంట్ ఉబెర్ కప్‌కు ఈసారి భారత్ నుంచి సీనియర్లు సింధు, డబుల్స్ స్టార్ జోడీలు పుల్లెల గాయత్రి/ట్రీసా జాలీ, అశ్విని పొన్నప్ప/తనీషా క్యాస్ట్రో దూరమయ్యారు. వీరంతా పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలో భాగంగా వరుస టోర్నీల్లో పోటీపడాల్సి ఉండడంతో ఉబెర్ కప్ నుంచి తప్పుకొన్నారు. దీంతో అస్మితా చాలిహా సారథ్యంలో అన్మోల్ ఖర్బ్, ఇషారాణి, తన్వీ శర్మ, డబుల్స్ జోడీలు శ్రుతి మిశ్రా/ప్రియ, సిమ్రన్/రితికలతో కూడిన బృందం భారత్ నుంచి అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. చైనా, కెనడా, సింగపూర్ జట్లతో పాటు భారత్ గ్రూప్-ఎ నుంచి తలపడనుంది. తొలిపోరులో భాగంగా శనివారం కెనడాతో అస్మిత బృందం అమీతుమీ తేల్చుకోనుంది.


అస్మిత

ఫార్మాట్ ఇలా..

థామస్, ఉబెర్ కప్‌లో జట్లన్నీ నాలుగు గ్రూపులు (ఎ, బి, సి, డి)గా విడిపోయి పోటీపడతాయి. ప్రతి గ్రూపులో తొలి రెండుస్థానాల్లో నిలిచిన జట్లు క్వార్టర్‌ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. మే 2న క్వార్టర్స్ 3న సెమీఫైనల్స్ జరుగుతాయి. మే 5న ఫైనల్ జరుగుతుంది.

సెయిలింగ్‌లో నేత్రకు ఒలింపిక్ బెర్త్

న్యూఢిల్లీ: గత టోక్యో ఒలింపిక్స్‌లో పోటీపడ్డ మహిళా సెయిలర్ నేత్రా కుమనన్ పారిస్ విశ్వక్రీడలకు అర్హత సాధించింది. ఫ్రాన్స్‌లోని హైరెస్‌లో శుక్రవారం జరిగిన ఒలింపిక్ క్వాలిఫయర్ ఈవెంట్ ఎమర్జింగ్ నేషన్స్ ప్రోగ్రామ్ రెగెట్టా పోటీల్లో నేత్ర ఐదో స్థానంలో నిలిచి ఒలింపిక్ కోటా అందుకుంది.

ఫైనల్లో కార్తీక్ జోడీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వరల్డ్ టూర్ టెన్నిస్ 15కే ఐటీఎఫ్ ఫ్యూచర్స్ టోర్నమెంట్ డబుల్స్‌లో హైదరాబాదీ గంటా సాయికార్తీక్ రెడ్డి జోడీ ఫైనల్ చేరింది. శుక్రవారం కజకిస్థాన్‌లో జరిగిన సెమీఫైనల్స్‌లో కార్తీక్-ప్రజ్వల్ (కర్ణాటక) ద్వయం 7-5, 6-3తో భారత్‌కే చెందిన చిరాగ్-కరణ్ జోడీని ఓడించింది.

మిక్స్‌డ్ ఫైనల్లో సురేఖ ద్వయం

షాంఘై: వరల్డ్‌కప్ స్టేజ్-1లో తెలుగు ఆర్చర్ జ్యోతి సురేఖ మూడో పతకం ఖాయం చేసుకుంది. శుక్రవారం జరిగిన కాంపౌండ్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో సురేఖ-అభిషేక్ జోడీ 155-151తో బెక్రా-మెండెజ్ (మెక్సికో)పై నెగ్గి ఫైనల్ చేరింది. మహిళల వ్యక్తిగత రికర్వ్‌లో దీపిక కుమారి 3-1తో హాన్‌యంగ్ (కొరియా)పై గెలిచి సెమీస్ చేరింది. మొత్తంగా భారత ఆర్చర్లు నాలుగు ఈవెంట్లలో ఫైనల్ చేరి పతకాలు ఖాయం చేశారు. ఇక, రికర్వ్ మిక్స్‌డ్ సెమీస్‌లో తెలుగు కుర్రాడు బొమ్మదేవర ధీరజ్-అంకిత జోడీ 0-6తో లిమ్-కిమ్ వుజిన్ (కొరియా) ద్వయం చేతిలో ఓటమిపాలైంది.



ఎన్నికల రణరంగంలో చిత్ర విచిత్రాలు నమోదవుతున్నాయి. గెలుపు కోసం తొక్కాల్సిన అడ్డదారులన్నీ తేలిగ్గా తొక్కేస్తున్నారు. ప్రతిపక్షాల అపజయమే ప్రధాన అజెండాగా అధికార పార్టీ అన్ని కుట్రలు, కుయుక్తులు పన్నుతోంది. ఇందుకు కీలకమైన నామినేషన్ల ప్రక్రియనూ వదల్లేదు. గెలుపు గుర్రాల రేసులో ఉన్న అభ్యర్థులను టార్గెట్ చేసుకుని, వారి పేరిట డమ్మీ అభ్యర్థులను రంగంలోకి దింపుతున్నారు. అదే పేరు, పోలిన గుర్తుతో నామినేషన్లు వేయిస్తున్నారు. మచిలీపట్నం పార్లమెంట్ జనసేన అభ్యర్థి ఎంపీ బాలశౌరిని టార్గెట్ చేసి సిటింగ్ ఎమ్మెల్యే పేర్ని నాని తెరవెనుక నామినేషన్లు వేయించడం కలకలం రేపింది. - (విజయవాడ-ఆంధ్రజ్యోతి)

పేరు వెనుక పన్నాగం



పేర్ని నాని పీఏ శ్యాంసన్ (రెడ్ సర్కిల్) దగ్గరుండి అభ్యర్థులు బాలశౌరమ్మ, బాలశౌరితో (బ్లాక్ సర్కిళ్లలో ఉన్నవారు) నామినేషన్లు వేయిస్తున్న దృశ్యం

ఎన్నికల రణరంగంలో అధికార పార్టీ అడ్డదారులు



సీహెచ్ బాలశౌరి



పి.బాలశౌరమ్మ

- రంగంలోకి ప్రతిపక్ష నాయకుల పేర్లతో ఉన్న డమ్మీలు
- ఎంపీ బాలశౌరి పేరుతో ఉన్న ఇద్దరితో నామినేషన్లు
- దగ్గరుండి నామినేషన్లు వేయించిన ఎమ్మెల్యే పేర్ని నాని పీఏ
- గ్లాసును పోలిన బకెట్, పెన్నుల స్టాండ్ గుర్తు కోసం సిఫారసు
- చాలా నియోజకవర్గాల్లో ఇవే దుష్ట పన్నాగాలు
- నందిగామలో విఫలమైన మొండితోక బ్రదర్స్ కుయుక్తులు
- స్వతంత్ర అభ్యర్థి తంగిరాల సౌమ్య నామినేషన్ తిరస్కరణ

బాలశౌరి పేరిట మరో ఇద్దరు

మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ జనసేన అభ్యర్థిగా వల్లభనేని బాలశౌరి పోటీ చేస్తున్నారు. ఐదేళ్లుగా చేసిన అభివృద్ధి పనులు ఆయనను గెలుపు దిశగా నడిపిస్తున్నాయి. మరోవైపు వైసీపీ ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్ ప్రచారంలో వెనుకబడ్డారు. ఆయనకు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల నుంచి సహకారం అంతంతమాత్రంగానే ఉంది. ఈ పరిస్థితుల్లో పేర్ని నాని రంగంలోకి దిగారు. బాలశౌరితో గతంలో ఉన్న వైరాన్ని దృష్టిలో పెట్టుకుని ఎలాగైనా ఆయన్ను ఓడించాలన్న లక్ష్యంతో పావులు కదుపుతున్నారు. మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గం మొత్తం జల్లెడ పట్టి బాలశౌరి పేరుతో ఉన్న ఇద్దరిని గుర్తించారు. వారితో నామినేషన్లు వేయించారు. చోడబత్తిన బాలశౌరి పేరుతో ఓ నామినేషన్ దాఖలైంది. అది కూడా జాతీయ జనసేన పార్టీ పేరుతో. పాముల బాలశౌరమ్మ పేరుతో మరో నామినేషన్ వేయించారు. ఈమె నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఉన్నారు. వీరిద్దరితోనూ పేర్ని నాని పీఏ శ్యాంసన్ దగ్గరుండి నామినేషన్లు వేయించారు. నానికి సన్నిహితంగా ఉండే న్యాయవాదులు వీరి నామినేషన్లను దగ్గరుండి ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేయించారు. బాలశౌరమ్మకు బకెట్ గుర్తు కేటాయించాలని శుక్రవారం స్ర్కూటినీ సమయంలో కోరారు. ఈ గుర్తయితే, జనసేన అభ్యర్థి గుర్తయిన గ్లాసుకు దగ్గరగా ఉంటుంది. కానీ, బకెట్ గుర్తు వేరే వారికి కేటాయించడంతో ఆమెకు కేటాయించలేమని అధికారులు తేల్చిచెప్పారు. దీనిపై పేర్ని నాని అనుచరులు కాసేపు హడావిడి చేసేందుకు ప్రయత్నించారు. జాతీయ జనసేన పార్టీ తరఫున నామినేషన్ వేసిన బాలశౌరికి పెన్నుల స్టాండు గుర్తును ఇవ్వాలని కోరారు. ఇది కూడా గ్లాసుకు దగ్గరగా ఉండే గుర్తే. నేరుగా తలపడి బాలశౌరిని ఓడించే సాహసం చేయలేక పేర్ని నాని ఇలా అడ్డదారులు తొక్కుతున్నారని జనసేన, టీడీపీ నాయకులు విమర్శిస్తున్నారు.

మరికొన్నిచోట్ల..

అవనిగడ్డలో బోయిన బుద్ధప్రసాద్ పేరుతో నామినేషన్ దాఖలైంది. ఇక్కడ జనసేన అభ్యర్థిగా మండలి బుద్ధప్రసాద్ పోటీ చేస్తున్నారు. పెడనలో కాగిత శ్రీహరి కృష్ణప్రసాద్ పేరుతో నామినేషన్ దాఖలైంది. ఇక్కడ టీడీపీ అభ్యర్థిగా కాగిత కృష్ణప్రసాద్ పోటీలో ఉన్నారు. తిరువూరులో కొలికపోగు శ్రీను పేరుతో నామినేషన్ వేశారు. ఈ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా కొలికపూడి శ్రీనివాస్ బరిలో ఉన్నారు. నందిగామలో టీడీపీ అభ్యర్థి తంగిరాల సౌమ్య పేరుతోనే ఉన్న మరో తంగిరాల సౌమ్యతో మొండితోక బ్రదర్స్ నామినేషన్ వేయించగా, శుక్రవారం నాటి స్ర్కూటినీలో అధికారులు తిరస్కరించారు.

ఆ మూడింట రివర్స్

చాలాచోట్ల ప్రతిపక్ష పార్టీ అభ్యర్థుల ఓట్లకు గండికొట్టేందుకు అదే పేర్లతో ఉన్న డమ్మీ అభ్యర్థులతో అధికార పార్టీ నాయకులు నామినేషన్లు వేయించగా, గుడివాడ, గన్నవరం, విజయవాడ తూర్పులో మాత్రం రివర్స్ గేర్ పడింది. ఇక్కడ వైసీపీ అభ్యర్థుల పేర్లతో ఉన్న వారితో ప్రతిపక్ష నాయకులు నామినేషన్లు వేయించారు. గన్నవరంలో వల్లభనేని మోహన వంశీకృష్ణ పేరుతో నామినేషన్ దాఖలైంది. ఇక్కడ వైసీపీ అభ్యర్థిగా వల్లభనేని వంశీ పోటీలో ఉన్నారు. విజయవాడ తూర్పులో వైసీపీ అభ్యర్థి దేవినేని అవినాశ్ బరిలో ఉండగా, సద్దెల అవినాశ్ పేరుతో నామినేషన్ దాఖలైంది.

గుడివాడలో హైడ్రామా

గుడివాడలో వైసీపీ అభ్యర్థిగా కొడాలి వెంకటేశ్వరరావు (నాని) పోటీలో ఉన్నారు. అదే పేరుతో ఉన్న మరో కొడాలి వెంకటేశ్వరరావుతో నామినేషన్ దాఖలైంది. అయితే ఇక్కడ కొడాలి నాని చక్రం తిప్పడంతో డమ్మీ కొడాలి వెంకటేశ్వరరావు నామినేషన్ తిరస్కరణకు గురైంది.

ముగిసిన నామినేషన్ల స్ర్కూటినీ

ఎన్టీఆర్‌లో 125, కృష్ణాలో 151 నామినేషన్లకు ఆమోదం

విజయవాడ-ఆంధ్రజ్యోతి : రెండు జిల్లాల్లో నామినేషన్ల స్ర్కూటినీ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా నామినేషన్ల స్ర్కూటినీ అనంతరం విజయవాడ పార్లమెంట్ సహా తిరువూరు, జగ్గయ్యపేట, మైలవరం, నందిగామ, విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలకు సంబంధించి 125 నామినేషన్లు ఆమోదం పొందాయి. 85 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా మొత్తం 332 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక కృష్ణాజిల్లాలోని మచిలీపట్నం పార్లమెంట్ సహా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నామినేషన్ల స్ర్కూటినీ శుక్రవారం ముగిసింది. మచిలీపట్నం పార్లమెంట్ స్థానానికి 28 నామినేషన్లు దాఖలు కాగా, పరిశీలన అనంతరం 25 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందాయి. మూడు తిరస్కరణకు గురయ్యాయి. కృష్ణాజిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 35 మంది అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించారు. 113 మంది అభ్యర్థులకు సంబంధించి 151 నామినేషన్లు సక్రమంగా ఉండటంతో వాటిని ఆమోదించారు.

గులకరాయిలో రహస్యమేంటి?

ప్రధాన నిందితుడు సతీష్‌తో ఉన్నది ఎవరు..? రాయి విసరొద్దని వారించిన మరో వ్యక్తి ఎవరు?

- నేటితో ముగియనున్న సతీష్ కస్టడీ
- కేసులో ఇంకా తేలని ఏ2 పాత్ర

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : సీఎం జగన్‌పై ఈనెల 13వ తేదీన జరిగిన గులకరాయి దాడికి సంబంధించి పోలీసులు కొత్త సమాచారాన్ని రాబట్టారా? పోలీసు కస్టడీలో ప్రధాన నిందితుడు వేముల సతీష్ కుమార్ ఏ విషయాలు వెల్లడించాడు? అనే అంశాలు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారాయి. సతీష్ కుమార్‌ను రెండు రోజుల క్రితం పోలీసులు కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ కస్టడీ గడువు శనివారంతో ముగిస్తుంది. ఇప్పటికే పోలీసులు రిమాండ్ రిపోర్టులో కొన్ని విషయాలను పేర్కొన్నారు. ఏ2 ప్రోద్బలంతో సతీష్ కుమార్ రాయితో దాడి చేశాడని స్పష్టం చేసిన విషయం తెలిసిందే. పోలీసులు ఏ2గా వేముల దుర్గారావును అనుమానించి అదుపులోకి తీసుకుని విచారించారు. సతీష్ కుమార్‌ను కోర్టులో హాజరుపరిచిన రోజే దుర్గారావును ఇంటికి పంపారు.

విషయం చెప్పాడా?

గులకరాయి దాడి కేసులో ప్రధాన నిందితుడు సతీష్ కుమార్ అన్నది పోలీసుల వాదన. తమ కుమారుడికి ఏ పాపం తెలియదన్నది సతీష్ తల్లిదండ్రుల వాదన. ప్రస్తుతం పోలీసుల కస్టడీలో ఉన్న సతీష్‌తో పోలీసులు సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసినట్టు సమాచారం. 13వ తేదీన పని నుంచి ఇంటికి వచ్చిన తర్వాత సతీష్ వడ్డెర కాలనీలో ఉన్న సిమెంట్ బల్లపై స్నేహితులతో కూర్చున్నట్టు సమాచారం. అక్కడే వడ్డెర కాలనీకి చెందిన మరో వ్యక్తి కూర్చున్నాడు. ఇద్దరూ కలిసి కాసేపు మాట్లాడుకున్నట్టు సమాచారం. ఈ వివరాలను సతీష్ పోలీసులకు వివరించాడని తెలిసింది. సతీష్ వద్ద కూర్చుని మాట్లాడిన వ్యక్తి ఎవరన్నది ప్రశ్నార్థకంగా మారింది. సీఎం వాహనం అజిత్‌సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ దిగగానే అక్కడ రాయి విసరడానికి ప్రదేశాన్ని ఎంచుకున్నానని సతీష్ చెప్పినట్టు తెలిసింది. అప్పటికే ఫ్లై ఓవర్‌కు ఊడిపోతున్న శ్లాబ్ రాయిని జేబులో వేసుకున్నానని వాంగ్మూలం ఇచ్చినట్టు సమాచారం. గులకరాయి వేయడానికి ప్రయత్నించగా, సీఎం బస్సుకు చుట్టుపక్కల ఉన్న రోప్ పార్టీలు పక్కకు తోసేశాయని వివరించినట్టు తెలిసింది. రెండోసారి వేయడానికి ప్రయత్నించగా, పక్కనే ఉన్న స్నేహితుడు వద్దని వారించాడని చెప్పినట్టు సమాచారం. ఆ సమయంలో సతీష్ పక్కనే ఉన్న స్నేహితుడు ఎవరన్న వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. తర్వాత బస్సుతో పాటే కార్యకర్తలతో కలిసి వివేకానంద స్కూల్ వరకు వెళ్లి అక్కడ రాయి విసిరానని సతీష్ పోలీసులకు చెప్పినట్టు లీకులు వస్తున్నాయి. వివిధ వీడియో క్లిప్పింగ్‌లను ఫోరెన్సిక్ ల్యాబ్‌లు సాంకేతికంగా విశ్లేషించినప్పుడు సతీష్ రాయి విసిరిన దృశ్యాలు కనిపించాయని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. వాటిని కోర్టుకు అందజేస్తామంటున్నాయి. సతీష్ ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నాడు. న్యాయాధికారి ఎదుట వాంగ్మూలం ఇప్పించాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్ తీర్పు ఈనెల 29వ తేదీకి వాయిదా పడింది. సతీష్ వాంగ్మూలం ఆధారంగా ఆ రోజున సతీష్‌ను కలిసిన వ్యక్తిని, దాడి వద్దని వారించిన స్నేహితుడిని విచారించడానికి పోలీసులు సిద్ధమవుతున్నట్టు తెలిసింది.



మైలవరంలో వైసీపీ ఫ్యాక్షన్ గ్యాంగ్

- సూపర్ మార్కెట్‌ను అద్దెకు తీసుకుని మకాం
- సుమారు 70 మందికి అన్ని వసతులతో ఏర్పాట్లు
- భయపడిపోతున్న స్థానికులు
- వైసీపీ అభ్యర్థి పోల్ మేనేజ్‌మెంట్ కోసమేనా?

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : మైలవరంలోకి వైసీపీ ఫ్యాక్షన్ గ్యాంగ్ ప్రవేశించింది. బైపాస్ రోడ్డులోని శ్రీకృష్ణ సూపర్ మార్కెట్‌ను కొంతకాలం కిందట మూసేశారు. దీనిని వైసీపీ నాయకులు అద్దెకు తీసుకున్నారు. అందులో మంచాలు, ఏసీలు ఏర్పాటు చేశారు. కొద్దిరోజుల క్రితం రాయలసీమలోని కడప, నెల్లూరు తదితర ప్రాంతాల నుంచి సుమారు 70 మంది ఇక్కడికి వచ్చి ఉంటున్నారు. ఉదయం వెళ్లడం, రాత్రికి రావడం చేస్తుండటంతో స్థానికులకు అనుమానం వచ్చి నిలదీశారు. తాము వైసీపీ కార్యకర్తలమని వారు చెప్పడంతో ఖిన్నులయ్యారు. రాయలసీమ వైసీపీ కార్యకర్తలకు ఇక్కడేం పని అని ప్రశ్నించగా, తాము అన్నింటికీ సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని వారు వెనుదిరిగారు. వీరు స్థానిక వైసీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు తరఫున పోల్ మేనేజ్‌మెంట్, డబ్బు పంపిణీ తదితర విషయాలను పర్యవేక్షించేందుకు వచ్చారని సమాచారం. మైలవరం నియోజకవర్గాన్ని వైసీపీ అధినేత జగన్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఇక్కడ ఎలాగైనా గెలవాలన్న లక్ష్యంతో పావులు కదుపుతున్నారు. ఎంత ఖర్చయినా చేయాలని, అవసరమైతే భయపెట్టయినా ఓట్లు వేయించుకోవాలన్న ఉద్దేశంతోనే రాయలసీమ గ్యాంగులను ఇక్కడికి తీసుకొచ్చారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. వైసీపీ ఫ్యాక్షన్ గ్యాంగ్ మైలవరంలో తిష్ట వేయడంపై టీడీపీ పట్టణ అధ్యక్షుడు రాధాకృష్ణ ఆధారాల సహా రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు.

నామినేషన్.. టెన్షన్..!





1. పాత మున్సిపల్ కార్యాలయ వివరాలు తెలపకుండా నాని వేసిన నామినేషన్ 2. పాత మున్సిపల్ కార్యాలయ భవనాన్ని నాని అద్దెకు తీసుకున్నట్టు కమిషనర్ ఉత్తర్వులు

అధికార, విపక్ష అభ్యర్థుల నామినేషన్లపై అభ్యంతరాలు

ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులకు నామినేషన్ పరిశీలన ప్రక్రియ టెన్షన్ పెట్టింది. గుడివాడలో వైసీపీ అభ్యర్థి కొడాలి నాని నామినేషన్‌లో తప్పులున్నాయంటూ టీడీపీ నాయకులు ఆధారాల సహా ఫిర్యాదు చేశారు. రిటర్నింగ్ అధికారి ఏకపక్షంగా వ్యవహరించి కనీసం ఫిర్యాదును కూడా స్వీకరించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- గుడివాడలో కొడాలి నాని నామినేషన్‌పై ఫిర్యాదు
- పట్టించుకోని రిటర్నింగ్ అధికారి.. ఫిర్యాదు స్వీకరణకు నో
- మైలవరంలో వసంత నామినేషన్‌పై అభ్యంతరాలు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/ గుడివాడ) : గుడివాడ వైసీపీ అభ్యర్థి కొడాలి నానీని ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హుడిగా ప్రకటించాలని రిటర్నింగ్ అధికారికి టీడీపీ నాయకుడు తులసి శుక్రవారం ఫిర్యాదు చేశారు. గుడివాడ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సులో కొడాలి నాని తన క్యాంప్ ఆఫీసు నిర్వహించారు. ఇటీవల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చాక క్యాంప్ కార్యాలయాన్ని ఖాళీ చేయాలని మున్సిపల్ కమిషనర్ నోటీసు ఇవ్వడంతో నాని క్యాంప్ ఆఫీసును ఖాళీ చేశారు. అయితే, నామినేషన్‌లో తాను ప్రభుత్వ వసతి ఉపయోగించుకోలేదని పేర్కొన్నారు. ఇలా పేర్కొనడం నిబంధనలకు విరుద్ధమని తులసి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే, ఈ ఫిర్యాదును రిటర్నింగ్ అధికారి తీసుకోలేదు. ఆర్వో తీరుపై టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడాలి నాని అఫిడవిట్‌లో తప్పుడు సమాచారమిచ్చారని, తమకు అభ్యంతరాలు తెలిపే సమయం కూడా ఇవ్వకుండా ఆర్వో ఏకపక్షంగా వ్యవహరించారని, ఆమె వైసీపీకి తొత్తుగా వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకుడు, ఫిర్యాదుదారు కె.తులసీబాబు ఆరోపించారు. కొడాలి నాని నామినేషన్ పత్రాల్లో అసలు ఎటువంటి ప్రభుత్వ ఆస్తులను వినియోగించుకోలేదని పేర్కొన్నారని, కానీ, పాత మున్సిపల్ కార్యాలయాన్ని ఐదేళ్లుగా సొంత జాగీరులా వినియోగించుకున్నారని, ఈ విషయాన్ని అఫిడవిట్‌లో పేర్కొనలేదన్నారు. అలాగే, నానీపై ఉన్న ఐదు క్రిమినల్ కేసుల్లో మూడింటి సమాచారం మాత్రమే ఇచ్చారని, మరో రెండు కేసుల సమాచారాన్ని అసంపూర్తిగా పేర్కొన్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని స్ర్కూటినీ సమయంలో తెలిపేందుకు ప్రయత్నించగా, ఆర్వో అసలు పట్టించుకోలేదన్నారు. తమపై నోరు పారేసుకున్నారని ఆరోపించారు. తాను సంతకం చేయక ముందే అభ్యంతరం తెలపాలని ఉచిత సలహా ఇచ్చారన్నారు.

ఆర్వో తీరుపై విమర్శలు

గుడివాడ ఆర్డీవో పి.పద్మావతి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఆమె తొలి నుంచి వైసీపీకి అనుకూల వైఖరితో ఉన్నారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో ఉన్న నాని ఇళ్ల పట్టాల విషయంలో ఆర్డీవోకు ఫోన్ చేయగా, వాట్సాప్ కాల్ చేయాలని ఆమె తెలిపిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. గుడ్లవల్లేరు మండలం కుచ్చికాయలపూడి గ్రామానికి చెందిన దివ్యాంగుడు కొడాలి వెంకటేశ్వరరావు నామినేషన్ దాఖలు చేయడానికి వస్తే అతనిపై చిందులు తొక్కి, దురుసుగా ప్రవర్తించిన విషయం తెలిసిందే. క్రిమినల్ కేసు బనాయిస్తానని ఆర్డీవో తనను బెదిరించినట్లు కొడాలి వెంకటేశ్వరరావు ఆరోపించారు. తాజాగా కొడాలి నాని అఫిడవిట్‌లోని అభ్యంతరాలను మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు కె.తులసీబాబులు లేవనెత్తేందుకు ప్రయత్నిస్తే కనీసం అవకాశం కూడా ఇవ్వకుండా ఏకపక్షంగా నాని నామినేషన్ పత్రాలు సవ్యంగా ఉన్నాయని సర్టిఫై చేయడం విమర్శలకు తావిస్తోంది.

మరికొన్నిచోట్ల..

మైలవరం నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్, ఆయన భార్య వేసిన నామినేషన్లను తిరస్కరించాలని న్యాయవాది, స్వతంత్ర అభ్యర్థి వల్లభనేని నాగపవన్ కుమార్ ఫిర్యాదు చేశారు. ఆర్వో నాలుగు సెట్ల నామినేషన్లను మాత్రమే అనుమతిస్తామని చెప్పినా వసంత ఐదు సెట్లు వేశారని ఆరోపించారు. తనపై ఉన్న క్రిమినల్ కేసులు, ఆస్తుల వివరాలను కూడా దాచారని అభియోగం చేశారు. నోటరీ అఫిడవిట్‌లో తేదీలు లేవని పేర్కొన్నారు. వసంత సతీమణి శిరీష సైతం తప్పుగా నామినేషన్ పత్రాలు దాఖలు చేశారని తెలిపారు. అయితే, ఈ ఆరోపణలను ఆర్వో తోసిపుచ్చారు. అలాగే, గన్నవరంలో వైసీపీ అభ్యర్థి వంశీ నామినేషన్‌పై టీడీపీ నాయకులు అభ్యంతరాలు వ్యక్తం చేయగా, వాటిని ఆర్వో తోసిపుచ్చారు. నందిగామలో స్వతంత్ర అభ్యర్థి తంగిరాల సౌమ్య నామినేషన్ తిరస్కరణకు గురైంది.



పిల్లారిశెట్టిపాలెంలో ఎన్నికల ప్రచారంలో కొల్లు రవీంద్ర

ప్రజా ప్రభుత్వంతోనే జిల్లా అభివృద్ధి

- ఎన్నికల ప్రచారంలో కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 26 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో రానున్న శాసనసభలో ప్రజాప్రభుత్వం ఏర్పడుతుందని, కూటమి అభ్యర్థుల విజయాన్ని ఎవరూ ఆపలేరని మాజీ మంత్రి, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. శుక్రవారం పిల్లారిశెట్టిపాలెం, బైరాగిపాలెం, పిల్లనగొల్లపాలెం, బొర్రపోతుపాలెం, బుద్దాలపాలెం, పొట్లపాలెం, కొత్తపూడి, పోతేపల్లి గ్రామాల్లో కొల్లు రవీంద్ర విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అవినీతి అక్రమాలలో కూరుకుపోయిన వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ప్రజలు బంగాళాఖాతంలో కలిపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎక్కడికి వెళ్లినా ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీ, జనసేన అభ్యర్థులను స్వాగతిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ లంకే నారాయణప్రసాద్, రూరల్ అధ్యక్షుడు కుంచే నాని, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ తలారి సోమశేఖర్, లంకే హరికృష్ణ, కాగిత సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. పర్యటనలో రవీంద్రకు రైతులు సమస్యలను ఏకరువుపెట్టారు.



ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడుతున్న వెనిగండ్ల రాము

గుడివాడ రూరల్‌లో వెనిగండ్ల ప్రచారం..

గుడివాడ రూరల్ : గుడివాడ రూరల్ మండలంలో టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైదేపూడి గ్రామంలో వెనిగండ్ల ప్రచారానికి బ్రహ్మరథం పడుతూ ప్రజలు స్వాగతం పలికారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, గత ఐదేళ్లుగా నియోజకవర్గంలో అభివృద్ధి కుంటు పడిందని, కనీసం తాగునీరు కూడా సక్రమంగా ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. గుడివాడ నియోజకవర్గంలో అరాచక శక్తులు ఆట కట్టించి అవినీతిని అంతం చేస్తామన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. రైతన్నలకు సాగునీటితోపాటు ఇంటింటికి కుళాయి ద్వారా సురక్షిత నీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో చోరగుడి సురేఖ, నూతక్కి కుటుంబరావు, లింగమనేని వీరబసవయ్య, అమర్ బాబు, ముసునూరి రాజేంద్ర ప్రసాద్, చోరగుడి బుజ్జి, కూటమి పార్టీల నాయకులు, తెలుగు మహిళలు, తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్, ఐటీడీపీ, జనసేన అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు.



చల్లపల్లి ఆత్మీయ సమావేశంలో ప్రసంగిస్తున్న మండలి బుద్ధప్రసాద్

వైసీపీ నుంచి భారీగా చేరికలు

చల్లపల్లి, ఏప్రిల్ 26 : జనసేనలో చేరితే తన కుటుంబంలో చేరినట్టేనని అవనిగడ్డ నియోజకవర్గ కూటమి అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. చల్లపల్లిలో అడపా రాంబాబు ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం, జనసేనలో చేరికలు జరిగాయి. రాంబాబుతోపాటు ఓసీ, బీసీ, ఎస్సీ వర్గాలకు చెందిన సుమారు 200 మంది జనసేనలో చేరగా, ఎంపీ తనయుడు వల్లభనేని అనుదీప్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరిని కలుపుకుని నడుస్తానని అన్నారు. జనసేన యువశక్తిని భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దుతానని చెప్పారు. కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను వివరించారు. లక్ష్మీపురం సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు, ముస్లిం నేత షేక్ నసీం ఖోరిలు వైసీపీని వీడి జనసేనలో చేరారు. మోపిదేవి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోసూరు రామాంజనేయులుతోపాటు మోపిదేవి, చల్లపల్లి మండలాలకు చెందిన పలువురు పెద్దఎత్తున జనసేనలో చేరారు. కార్యక్రమంలో ఎంపీ సోదరుడు వల్లభనేని బాలకోటేశ్వరరావు, పలువురు టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.



కొనకళ్ల సమక్షంలో పార్టీలో చేరిన మాజీ జడ్పీటీసీ కన్నా నాగరాజు

టీడీపీలోకి వైసీపీ మాజీ జడ్పీటీసీ

నాగాయలంక/మచిలీపట్నం : నాగాయలంక మాజీ జడ్పీటీసీ, వైసీపీ నేత కన్నా నాగరాజు శుక్రవారం మచిలీపట్నంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, తొలినుంచి తాము టీడీపీలో ఉన్నా 2019లో స్థానిక పరిస్థితుల దృష్ట్యా వైసీపీలోకి చేరామని, వైసీపీ విధానాలు నచ్చక తిరిగి మాతృ పార్టీలోకి చేరినట్టు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు, తలశిల స్వర్ణలత, విశ్వనాథపల్లి భిక్షంతోపాటు అవనిగడ్డ, కోడూరు, చల్లపల్లి మోపిదేవి, ఘంటసాల మండలాల టీడీపీ నేతలు పాల్గొన్నారు. నాగాయలంక మండలం నాచుగుంట గ్రామ సర్పంచ్ సైకం నాగజ్యోతి భర్త నాగబాబు మచిలీపట్నం జనసేన పార్లమెంట్ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి ఆధ్వర్యంలో జనసేనలోకి చేరారు.

ఎన్నికల నాటికి వైసీపీ ఖాళీ : కొనకళ్ల నారాయణ

మచిలీపట్నం టీడీపీ పార్లమెంటు కార్యాలయంలో శుక్రవారం అవనిగడ్డ, నాగాయలంక మండలాలకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. ఉమ్మడి కృష్ణాజిల్లాల ఎన్నికల కో- ఆర్డినేటర్ దోనేపూడి పవన్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వ అరాచకాలకు నిరసనగా దివిసీమ నాయకులు టీడీపీలో చేరారన్నారు. కార్యక్రమంలో లుక్కా సాయిరామ్ గౌడ్, గోపు సత్యనారాయణ, తలశిల స్వర్ణలత, లక్ష్మణరావుతో పాటు మోర్ల రాంబాబు, యాసం చిట్టిబాబు, బడే శ్రీను, మాచవరపు ఆదినారాయణ, పైడిపాముల కృష్ణకుమారి, సయ్యద్ ఖాజా, పిప్పళ్ల కాంతారావు, కర్రా సుధాకర్, లంకే శేషగిరి, బత్తిన దాసు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి కృష్ణా లీగల్ ఎయిడ్ లయన్స్ క్లబ్ చైర్మన్‌గా లంకిశెట్టి

మచిలీపట్నం టౌన్ : ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల లీగల్ ఎయిడ్ లయన్స్ క్లబ్ చైర్మన్‌గా ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీని నియమించారు. శుక్రవారం లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గద్దే శేషగిరి ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా మచిలీపట్నం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి పంచపర్వాల ప్రభాకర్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు జి.రామబ్రహ్మం, చలమలశెట్టి నరసింహారావు, పంచపర్వాల సత్యనారాయణ, ధవళేశ్వరపు ఉమామహేశ్వరరావు, చలమలశెట్టి సుబ్రహ్మణ్యం అభినందించారు.

రేపల్లె రైలు మార్గం నిర్మిస్తాం

- బందరు పోర్టు నిర్మాణానికి నిధులు తెచ్చా
- కంకిపాడు-గుడివాడ బైపాస్ రోడ్డు నిర్మిస్తా
- ఓటమి భయంతోనే డూపు నామినేషన్లు
- మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి బాలశౌరి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 26 : ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే మచిలీపట్నం-రేపల్లె రైలు మార్గం నిర్మించి తీరుతామని, ఇందుకు డీపీఆర్ సిద్ధం చేశామని బందరు ఎంపీ, మచిలీపట్నం పార్లమెంటు ఉమ్మడి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి అన్నారు. బందరులో శుక్రవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో జిల్లాస్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ, వైసీపీ నేతలకు ఓడిపోతామనే భయం పుట్టుకొచ్చిందన్నారు. అందుకే తన పేరుతో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులతో నామినేషన్లను పేర్ని నాని వేయించారన్నారు. కూటమి అధికారంలోకి రాగానే కంకిపాడు-గుడివాడ బైపాస్ రోడ్డు నిర్మిస్తామన్నారు. బందరు పోర్టుకు అనుబంధంగా పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. టీడీపీ నాయకులు పెద్ద మనసుతో జనసేన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అవనిగడ్డలో రెండు గ్లాస్ గుర్తులు ఉంటాయన్నారు. పామర్రు-చల్లపల్లి జాతీయ రహదారిగా నిర్మిస్తామన్నారు. గుడివాడలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేశానన్నారు. మాజీ ఎంపీ, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో తొలిసారిగా జనసేన, టీడీపీ కలిసి పోటీ చేస్తోందన్నారు. కార్యకర్తలు అభ్యర్థుల గుర్తులను ప్రజలకు చెప్పాలన్నారు. టీడీపీకి గ్రామస్థాయిలో కార్యవర్గం ఉందని, అయితే జనసేన, బీజేపీలకు పోలింగ్ కేంద్ర స్థాయిలో కమిటీలు అన్ని ప్రాంతాల్లో పటిష్టంగా లేవని, అందువల్ల మూడుపార్టీలతో కలిసి మండలస్థాయి, పోలింగ్ కేంద్ర స్థాయి కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజాబాబు మాట్లాడుతూ, కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు పవన్‌కళ్యాణ్ రాజమండ్రి వచ్చి పూర్తి స్థాయిలో మద్దతు ప్రకటించారన్నారు.జనసేన కృష్ణా జిల్లా కార్యదర్శి బండి రామకృష్ణ మాట్లాడుతూ, పవన్‌కళ్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు జనసేన కార్యకర్తలు టీడీపీ, బీజేపీ కార్యకర్తలతో సమన్వయంతో పనిచేయాలన్నారు. ఓట్ల ట్రాన్స్‌ఫర్‌పై కార్యకర్తలు ఓటర్లకు చెప్పాలన్నారు. బ్యాలెట్ పేపరు నమూనా వచ్చిన తరువాత నమూనా ఈవీఎంలను ఓటర్ల వద్దకు తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో పరిశీలకులు హరిబాబు, గాంధీ, చలమలశెట్టి రమేష్, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, గల్లా తిమోతి, గడ్డం రాజు, బీజేపీ నాయకుడు శేషుకుమార్, టీడీపీ కృష్ణాజిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, తెలుగుమహిళ కృష్ణాజిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, ఎండి ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, హసీంబేగ్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి టీడీపీ, బీజేపీ, జనసేన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వల్లభనేని బాలశౌరి

ముగిసిన నామినేషన్ల స్క్రూటినీ

- ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 332 దాఖలు
- 125 ఆమోదం, 85 తిరస్కరణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా నామినేషన్ల స్క్రూటినీలో భాగంగా విజయవాడ పార్లమెంట్, తిరువూరు, జగ్గయ్యపేట, మైలవరం, నందిగామ, విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలకు సంబంధించి 125 నామినేషన్లు ఆమోదం పొందగా.. 85 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మొత్తం 332 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. ఒకే అభ్యర్థి నాలుగు సెట్ల వరకు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ క్రమంలో 122 సెట్ల నామినేషన్లు అదనంగా వచ్చాయి.

● తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 13 ఆమోదం పొందగా 5 తిరస్కరణకు గురయ్యాయి. విజయవాడ పశ్చిమలో 17 నామినేషన్లు ఆమోదం పొందగా 21 తిరస్కరణకు గురయ్యాయి. జగ్గయ్యపేటలో 14 నామినేషన్లు ఆమోదం పొందగా 9 తిరస్కరణకు గురయ్యాయి. మైలవరంలో 12 ఆమోదం పొందగా, 15 తిరస్కరణకు గురయ్యాయి. నందిగామలో 11 నామినేషన్లు ఆమోదం పొందగా 6 తిరస్కరణకు గురయ్యాయి. విజయవాడ తూర్పులో 17 ఆమోదం పొందగా 10 తిరస్కరణకు గురయ్యాయి. విజయవాడ సెంట్రల్‌లో 22 ఆమోదం, 4 తిరస్కరణకు గురయ్యాయి.

● విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియను జిల్లా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు మంజూ రాజ్‌పాల్ , నరేంద్ర సింగ్ బాలిలు పరిశీలించారు. అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు కూడా పాల్గొన్నారు.

● విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 50 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. వాటిలో 19 మంది నామినేషన్లు మాత్రమే చెల్లుబాటు అయ్యాయి. మరో 15 వివిధ కారణాలతో తిరస్కరించారు. టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ సతీమణి కేశినేని జానకీ లక్ష్మి, వైసీపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ తనయ కేశినేని శ్వేతా చౌదరిల నామినేషన్లను తిరస్కరించారు.

● తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 28 నామినేషన్లకు గాను 13 నామినేషన్ల ఆమోదమయ్యాయి. ఐదు నామినేషన్లను తిరస్కరించారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల సతీమణులు నామినేషన్లు తిరస్కరించటం జరిగింది.

● విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో అత్యధికంగా 61 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో 17 నామినేషన్లు ఆమోదం పొందాయి. షేక్ ఆసిఫ్ - వైసీపీ, వై సుజనా చౌదరి - బీజేపీ, మద్దిరాల వినోద్‌కుమార్ - బీఎస్పీలతో పాటు గుర్తింపు పొందిన పార్టీలు, స్వతం త్రులకు సంబంధించి మరో 14 నామినేషన్లు ఆమోదమయ్యాయి.

● జగ్గయ్యపేట నియోజకవర్గంలో మొత్తం 39 సెట్ల నామినేషన్లకు గాను 14 నామినేషన్లు ఆమోదమయ్యాయి. శ్రీరాం రాజగోపాల్-టీడీపీ, సామినేని ఉదయభాను-వైసీపీ, కర్నాటి అప్పారావు-కాంగ్రెస్, కొదమల ప్రభుదాస్-బీఎస్పీల అభ్యర్థుల నామినేషన్లతో పాటు రిజిస్టర్డ్ పార్టీలు, స్వతంత్రులకు సంబంధించి మరో 6 ఆమోదమయ్యాయి.

● మైలవరం నియోజకవర్గంలో మొత్తం 39 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో 12 నామినేషన్లు ఆమోదం పొందాయి. వసంత క్రిష్ణ ప్రసాద్- టీడీపీ, సర్నాల తిరుపతిరావు-వైసీపీ, బొర్రా కిరణ్-కాంగ్రెస్, జి.వెంకటే శ్వరరావు-బీఎస్పీలులతో పాటు గుర్తింపు పొందిన పార్టీలు, స్వతంత్రులకు సంబంధించి 10 నామినేషన్లు ఆమోదమయ్యాయి.

● నందిగామ నియోజకవర్గంలో మొత్తం 24 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో 11 నామినేషన్లు ఆమోదమయ్యాయి. 6 నామినేషన్లు తిరస్కరణ అయ్యాయి. తంగిరాల సౌమ్య-టీడీపీ, బర్రె ఉదయకిరణ్-బీఎస్పీ, మొండితోక జగన్మోహనరావు-వైసీపీ, మందా వజ్రయ్య-కాంగ్రెస్‌ల నామినేషన్లు ఆమోదం కాగా మరో 7 నామినేషన్లు గుర్తింపు పార్టీ, స్వతంత్ర అభ్యర్థులవి ఆమోదమయ్యాయి.

● విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 43 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో మొత్తం 17 నామినేషన్లు ఆమోదం పొందాయి. పది తిరస్కరణకు గురయ్యాయి. దేవినేని అవినాశ్-వైసీపీ, కనపర్తి మురళి-బీఎస్పీ, గద్దె రామమోహన్-టీడీపీ, పొనుగుపాటి నాంచారయ్య-కాంగ్రెస్ అభ్యర్థులతో పాటు మరో 13 నామినేషన్లు ఆమోదమయ్యాయి.

● విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో మొత్తం 48 సెట్ల నామినేషన్లు దాఖలు కాగా 22 నామినేషన్లు ఆమోదం పొందాయి. 4 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. బిరాజేంద్ర ప్రసాద్-బీఎస్పీ, చిగురుపాటి బాబూరావు-సీపీఎం, బోండా ఉమామహేశ్వరరావు-టీడీపీ, వెలంపల్లి శ్రీనివాసరావు-వైసీపీలతో పాటు మరో 18 గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందాయి.

కృష్ణా జిల్లాలో 38 నామినేషన్ల తిరస్కరణ..

- మచిలీపట్నం పార్లమెంటు స్థానంలో మూడు నామినేషన్లు, అసెంబ్లీ స్థానాలకు 35 తిరస్కరణ
- 113మంది అభ్యర్థులకు సంబంధించి 151 నామినేషన్లు ఆమోదం

మచిలీపట్నం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, మచిలీపట్నం పార్లమెంటు స్థానానికి సంబంధించి నామినేషన్ల పరిశీలన కార్యక్రమం శుక్రవారం ముగిసింది. మచిలీపట్నం పార్లమెంటు స్థానానికి 28నామినేషన్లు దాఖలు కాగా పరిశీలన అనంతరం 25మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదించారు. ముగ్గురు అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 35మంది అభ్యర్థుల నామినేషన్‌లను తిరస్కరించారు. 113మంది అభ్యర్థులకు సంబంధించి 151నామినేషన్లు సక్రమంగా ఉండటంతో వాటిని ఆమోదించారు.

● అవనిగడ్డ నియోజకవర్గంలో 13మంది అభ్యర్థులకు సంబంధించిన నామినేషన్‌లను ఆమోదించారు. స్వతంత్ర అభ్యర్థి మండలి వెంకట్రామ్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అందె శ్రీవాణి, వైసీపీ అభ్యర్థి సింహాద్రి వికాస్ నామినేషన్‌లను తిరస్కరించారు. ఈ ముగ్గురు అభ్యర్థులకు 10మందికి ప్రతిపాదకుల సంతకాలు లేకపోవడంతో వీరి నామినేషన్‌లను తిరస్కరించినట్టు ఆర్వో తెలిపారు.

● గుడివాడ నియోజకవర్గంలో 26నామినేషన్లు దాఖలు కాగా వాటిలో నామినేషన్ల పరిశీలన అనంతరం 17 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్టు రిటర్నింగ్ అధికారి పద్మావతి తెలిపారు. 9మంది అభ్యర్థులకు సంబంధించిన నామినేషన్‌లను తిరస్కరించినట్టు ఆమె చెప్పారు. నామినేషన్లు తిరస్కరించబడిన అభ్యర్థులలో నలుగురు స్వతంత్ర అభ్యర్థులు, టీడీపీ, వైసీపీ అభ్యర్థుల తరపున డమ్మీ నామినేషన్‌లు వేసిన ఇద్దరు, జైబీమ్ భారత్‌పార్టీ, జై మహాభారత్‌పార్టీ అభ్యర్థుల నామినేషన్‌లు తిరస్కరణకు గురయ్యాయి.

● మచిలీపట్నం నియోజకవర్గంలో 14మంది అభ్యర్థులకు నామినేషన్‌లు సక్రమంగా ఉన్నట్టు రిటర్నింగ్ అధికారి ఎం.శ్రీవాణి తెలిపారు. టీడీపీ, వైసీపీ అభ్యర్థుల తరపున డమ్మీ అభ్యర్థులుగా నామినేషన్‌లు దాఖలు చేసిన కొల్లు నీలిమ, పేర్ని వెంకట్రామయ్య మరో స్వతంత్ర అభ్యర్థి నామినేషన్‌లను తిరస్కరించారు.

● పెడన నియోజకవర్గంలో 10 మంది అభ్యర్థుల నామినేషన్‌లు సక్రమంగా ఉన్నట్టు పెడన నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి.వెంకటరమణ తెలిపారు. టీడీపీ, వైసీపీ అభ్యర్థుల తరపున డమ్మీ అభ్యర్థులుగా నామినేషన్‌లు దాఖలు చేసిన ఇద్దరు అభ్యర్థుల నామినేషన్‌లను తిరస్కరించారు..

● పామర్రు నియోజకవర్గంలో ఎనిమిది మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉండటంతోవాటిని ఆమోదించారు. టీడీపీ, వైసీపీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు డమ్మీ అభ్యర్థులుగా నామినేషన్‌లు దాఖలుచేసిన వర్లరామయ్య, కైలే జ్ఞానమణి, దోవారి అమర్నాథ్ నామినేషన్లు తిరస్కరణకు గురైనట్టు రిటర్నింగ్ అధికారి తెలిపారు.

● పెనమలూరు నియోజకవర్గంలో 12మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉండటంతో ఆమోదించారు. వైసీపీ అభ్యర్థికి డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన జోగి రాజీవ్, స్వతంత్ర అభ్యర్థి దొండపాటి సతీష్, జాతీయ జనసేనపార్టీ అభ్యర్థి జి.సీతారామయ్య జై భారత్‌పార్టీ అభ్యర్థి కరుణాకరదాస్ నామినేషన్లను తిరస్కరించారు.

రంగంలోకి.. ఎన్నికల పరిశీలకులు

- వన్ టూ వన్ కార్యక్రమాలకు శ్రీకారం
- రాజకీయ నేతలు, ప్రజల నుంచి నేరుగా విజ్ఞాపనలు, ఫిర్యాదులకు ఆహ్వానం
- నిర్దిష్ట సమయాలలో కలిసేందుకు అవకాశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లాలో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల పరిశీలకులుగా నియమితులైన అధికారులు రంగంలోకి దిగారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను సమీక్షిస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారి దిల్లీరావు, ఇతర రిటర్నింగ్ అధికారుల నుంచి విషయాలను తెలుసుకుంటున్నారు. గతానికి భిన్నంగా పరిశీలకులు ప్రజాబాహుళ్యంలోకి రావాలని నిర్ణయించారు. ఎన్నికల



ఏర్పాట్లు, అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి రాజకీయ నాయకుల నుంచి సాధారణ ప్రజల వరకు తమ దృష్టికి ఎలాంటి అంశాలనైనా తీసుకు వచ్చేందుకు వీలుగా వన్ టూ వన్ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ విషయాన్ని ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి దిల్లీరావు శుక్రవారం మీడియాకు తెలిపారు. జిల్లా ఎన్నికల పరిశీలకులకు విజ్ఞాపనలు, ఫిర్యాదులు అందించవచ్చని చెప్పారు. తిరువూరు, విజయవాడ పశ్చిమ, విజయవాడ సెంట్రల్, విజయవాడ తూర్పు నియోజకవర్గాలకు మంజూ రాంపాల్ ఎన్నికల పరిశీలకులుగా నియమితులయ్యారు. మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గాలకు నరేందర్ సింగ్ బాలిలు సాధారణ పరిశీలకులుగా వచ్చారు. సాధారణ పరిశీలకులు పోలింగ్ తేదీ వరకు ప్రజలకు అందుబాటులో ఉంటారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు మునిసిపల్ గెస్ట్ హౌస్ - నందమూరి రోడ్డు, బృందావన్ కాలనీ - లబ్బీపేటలో అందుబాటులో ఉంటారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, ప్రజలు ఎన్నికల ఉల్లంఘనలకు సబంధించి ఫిర్యాదులు, విజ్ఞాపనలు ఇవ్వవచ్చు. సాధారణ పరిశీలకురాలు మంజూ రాంపాల్‌ను 8121526777 నెంబర్ ద్వారా సంప్రదించవచ్చు. మరో సాధారణ పరిశీలకులు నరేందర్ సింగ్ బాలిని 9154883009 నెంబర్ ద్వారా సంప్రదించవచ్చు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పోలీసు అబ్జర్వర్ ప్రీతీందర్ సింగ్ ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు పోలీసు గెస్ట్‌హౌస్‌లో అందుబాటులో ఉంటారు. ప్రీతీందర్‌సింగ్‌ను 9154883014 నెంబర్ ద్వారా సంప్రదించవచ్చు. విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గం ఎన్నికల వ్యయ పరిశీలకులుగా నియమితులైన వారు కూడా ప్రజలకు అందుబాటులో ఉండాలని నిర్ణయించారు. విజయవాడ పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకులు వీ జస్టిన్, తిరువూరు - విజయవాడ పశ్చిమ - విజయవాడ సెంట్రల్ - మైలవరం అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులు సౌరబ్‌శర్మ, విజయవాడ తూర్పు - నందిగామ - జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు మదన్‌కుమార్ మధ్యాహ్నం 4 గంటల నుంచి 5 గంటల వరకు పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌లో అందుబాటులో ఉంటారు. జస్టిన్‌ను 8121490777, సౌరబ్ శర్మను 8121405777, మదన్‌కుమార్‌ను 9154883050 నెంబర్లలో సంప్రదించవచ్చు.

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా జంపాల



జి.కొండూరు, ఏప్రిల్ 26 : టీడీపీ రాష్ట్ర నేత, మాజీ కార్యదర్శి, నందిగామ నియోజకవర్గ ఎలక్షన్ కో-ఆర్డినేటర్ జంపాల సీతారామయ్యకు రాష్ట్ర కమిటీలో చోటు దక్కింది. శుక్రవారం ప్రకటించిన రాష్ట్ర కమిటీలో జంపాలను మైలవరంలో నియోజకవర్గం నుంచి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024లో పార్టీ విజయానికి, చంద్రబాబు నాయుడు సీఎం అయ్యేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. ఆయనను ఇబ్రహీంపట్నంలో స్థానిక నాయకులు కలిసి ప్రత్యేక అభినందలు తెలిపారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా బూరగడ్డ నారాయణ కిషన్ తేజ్



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 26 : టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా బూరగడ్డ వేదవ్యాస్ కుమారుడు బూరగడ్డ నారాయణ కిషన్ తేజ్‌ను నియమిస్తూ శుక్రవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు ఆన్‌లైన్‌లో నియామక ఉత్తర్వులు జారీ చేశారు. నూతనంగా రాష్ట్ర కమిటీల్లో కొందరికి అవకాశం ఇచ్చిన నేపథ్యంలో కృష్ణాజిల్లా నుంచి కిషన్‌తేజ్‌ను నియమించారు. ఈ సందర్భంగా కిషన్‌తేజ్ మచిలీపట్నంలో మీడియాతో మాట్లాడారు. పెడన టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ విజయానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

వైసీపీ నుంచి వలసలు.. కూటమిలో జోష్

అవనిగడ్డ : నియోజకవర్గంలోని మత్స్యకార గ్రామాల్లో వైసీపీ నుంచి తెలుగుదేశం, జనసేన పార్టీలోకి పెద్ద ఎత్తున వలసలు పెరగటంతో వైసీపీ శ్రేణులు ఆందోళన చెందుతుండగా.. కూటమి నేతల్లో జోష్ పెంచింది. సైకం అర్జునరావు వర్గీయులు పది రోజుల క్రితమే వైసీపీకి రాజీనామా చేసి తమ అనుచరులతో కలిసి తెలుగుదేశం పార్టీలోకి చేరగా, శుక్రవారం కన్నా జనార్ధనరావు కుటుంబం టీడీపీ తీర్థం పుచ్చుకుంది. మత్స్యకార గ్రామాలను ఏకతాటిపైకి తీసుకురావటంతో సైకం అర్జునరావు గణనీయమైన పాత్ర పోషించారు. వారంతా తిరిగి తెలుగుదేశం పార్టీలో చేరటంతో ఎదురుమొండి దీవుల్లో, మత్స్యకార గ్రామాల్లో పార్టీకి పునర్ వైభవం వస్తుందని పార్టీ శ్రేణులు హర్షం చేస్తున్నారు.

జయపురం వైసీపీ నేతలు టీడీపీలో చేరిక

కోడూరు : మండల పరిధిలోని జయపురం గ్రామ ప్రముఖ వైసీపీ నేత కనకమేడల రామబ్రహ్మం, కనకమేడల హరికుమార్‌తోపాటు 20 కుటుంబాలు టీడీపీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. జనసేన నేతలు మండలి వెంకట్రామ్, గోగినేని సోమశేఖరరావు, వేములపల్లి రాజేష్, మద్దూరి కాంతారావు, కూరాకుల ప్రసాద్ తోపాటు ఎత్తున పార్టీ నేతలు పాల్గొన్నారు.



వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన నాయకులు

రూ.1350 కోట్లు టర్నోవర్ లక్ష్యం

- కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

చిట్టినగర్, ఏప్రిల్ 26 : 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1350కోట్లు టర్నోవర్ చేయాలని కృష్ణా మిల్క్ యూనియన్ లక్ష్యంగా పెట్టుకున్నట్టు చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. శుక్రవారం పాల ఫ్యాక్టరీలో పాలకవర్గ సమావేశం అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. రానున్న ఐదేళ్లను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్ కార్యాచరణకు పలు అంశాలపై సమావేశంలో చర్చించడం జరిగిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ చలసాని ఆంజనేయులు

విదేశాలకు విజయ ఉత్పత్తులు

కృష్ణా మిల్క్ యూనియన్(విజయడెయిరీ) పాలు, పాల ఉత్పత్తులకు ప్రజల్లో మంచి ఆదరణ ఉందని, ఇప్పటికే పాల ఉత్పత్తులను మార్కెట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చిందని చలసాని ఆంజనేయులు చెప్పారు. అలాగే విదేశాలకు విజయ డెయిరీ పాలు, పాల ఉత్పత్తులను ఎగుమతులు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే విదేశాల్లో విజయ డెయిరీ ఉత్పత్తులకు మంచి ఆదరణ ఉందని, విదేశాల్లో ఉండే భారతీయులు విజయ డెయిరీ ఉత్పత్తులను కోరుకుంటున్నారని వారి కోరిక మేరకు తమ ఉత్పత్తులు ఎగుమతి చేసేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తున్నామన్నారు.

రైతుల పిల్లల విద్యకు చేయూత

ఇటీవల ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో వెంట్రప్రగడ గ్రామానికి చెందిన యూనియన్ రైతు కొల్లిపల్లి తిరుమలరావు కుమార్తె రిషిత 470కి 466 మార్కులు సాధించి రాష్ట్రంలో రెండోస్థానంలో నిలిచిందన్నారు. ఆమె పై చదువుల నిమిత్తం యూనియన్ తరుపున రూ 25000, గ్రామ సొసైటీ తరపున రూ 10000 ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరబాబు, డైరెక్టర్లు దాసరి వెంకట బాలవర్ధనరావు, వేమూరి సాయి వెంకటరమణ, అంజిరెడ్డి, నాని, చక్రపాణి, కొండలరావు, నగేష్ పాల్గొన్నారు.



ఇంటర్ విద్యార్థిని రిషితకు రూ.35వేల చెక్కును అందజేస్తున్న చలసాని

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	258
చికెన్ స్కిన్‌లెస్	268

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 3.80

సిద్ధార్థ మహిళా కళాశాలలో అన్వేషణ-2కే24



లబ్బీపేట, ఏప్రిల్ 26: టెక్నాలజీతో ప్రయాణం చాలా సౌకర్యవంతంగా ఉంటుందని, నూతన ఆవిష్కరణలు చేసే విధంగా విద్యార్థులు కృషి చేయాలని కమిషనర్ ఆఫ్ ఇన్‌కంటాక్స్ ఎంఎస్‌వీఎం ప్రసాద్ పేర్కొన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాలలో శుక్రవారం అన్వేషణ-2కే24 కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కాలంలో ఏ బిజినెస్‌లోనైనా ఆధునిక విధానాలను సద్వినియోగం చేసుకుని ముందుకు వెళితే మంచి ఫలితాలు ఉంటాయని అన్నారు. డి.రాజేష్ కుమార్, కె.రాఘవరావు, కళాశాల డైరెక్టర్ టి.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ ఎస్.కల్పన తదితరులు పాల్గొన్నారు.

పిచ్చుకలను కాపాడుకోవడం మన బాధ్యత

పోలుపర్తి దాలినాయుడు

మొగల్రాజపురం, ఏప్రిల్ 26: జీవ వైవిధ్యం కాపాడుకోవాలంటే పిచ్చుకలను కూడా మనం కాపాడుకోవడం బాధ్యతగా తీసుకోవాలని, యువతరం ఇది ఒక ఉద్యమంగా చేపట్టాలని విశాఖపట్నం జిల్లాకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, హరిత వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పోలుపర్తి దాలినాయుడు చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం పిచ్చుకల సంరక్షణ కోసం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నగరీకరణ వల్ల పిచ్చుకలు కనుమరుగవుతున్నాయని ఇది పర్యావరణానికి చాలా హాని చేస్తుందన్నారు. కనుక పిచ్చుకలను కాపాడుకోవాలని, వాటికి ఆహారాన్ని అందించే ఏర్పాటు ఇళ్లలో చేయాలని సూచించారు. పక్షుల వల్ల ప్రకృతి సమతుల్యత ఉంటుందన్నారు. ఇందు కోసం వరికంకులను ఇళ్లలో ఎలా ఏర్పాటు చేయాలో చూపించారు. కళాశాల సరస్వతీ మందిరంలో, ఉద్యానవనంలో కొన్ని చోట్ల ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాకర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబురావు, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.శ్రీనివాసరావు, అధ్యాపకులు డాక్టర్ సాంబానాయక్, శ్రావణి, శిరీష, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్య చికిత్సకు ఆర్థికసాయం

చిట్టినగర్: చిన్నారి వైద్య చికిత్సకు గౌతమ్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు రూ.50 వేల ఆర్థికసాయం అందించారు. గౌతమ్ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న రోమియా సిద్ధిక అనారోగ్యంతో బాధపడుతుండగా తల్లిదండ్రులు ప్రిన్సిపాల్ సూర్యారావును ఆశ్రయించారు. స్పందించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు విద్యార్థి తల్లి జమీనాకు ఆర్థికసాయం అందించారు.

నేడు బ్రాహ్మణ ఆత్మీయ సదస్సు

విద్యాధరపురం: భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులోని ఎస్.కన్వెన్షన్ హాలులో శనివారం 5 గంటలకు బ్రాహ్మణ ఆత్మీయ సదస్సు జరుగుతుందని బ్రాహ్మణ ఐక్య వేదిక ఆహ్వాన కమిటీ కన్వీనర్ శివ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాహ్మణ సామాజిక వర్గ సమస్యలను ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు తాజా రాజకీయ అంశాలపై చర్చ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

54వ డివిజన్ ప్రచారంలో సుజనాచౌదరి



54 వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న సుజనా చౌదరి, పక్కన నాగుల్‌మీరా, జలీల్‌ఖాన్



ఎన్నికల ప్రచారంలో సుజనా చౌదరి సోదరి ధనలక్ష్మి

వన్‌టౌన్, ఏప్రిల్ 26: మీలో ఒకడిని, మీ ముందుకు వస్తున్నా, ఆదరించండి, నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం వన్‌టౌన్‌లోని 54 వ డివిజన్‌లో సుజనా చౌదరి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు స్థానికుల సమస్యలను పరిష్కరించే బాధ్యత తనదేనన్నారు. అమరావతిని అటకెక్కించిన జగన్‌రెడ్డి మూడు రాజధానులంటూ ఆటలాడారన్నారు. ముస్లిం మైనార్టీల అభివృద్ధికి ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తాను గెలిచిన మూడు నెలల లోపల పంజా సెంటర్‌లో ఈట్ స్ట్రీట్‌ను ఏర్పాటు చేయిస్తానన్నారు. టీడీపీ బీసీ మైనార్టీ నాయకుడు నాగుల్ మీరా మాట్లాడుతూ చెత్తమీద పన్ను వేసిన చెత్త సీఎంను ఓడించి ఇంటికి పంపించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు హజ్ హౌస్ నిర్మాణానికి సేవా భావం కలిగిన సుజనా చౌదరిని గెలిపించాలని కోరారు. స్థానికులు సుజనా చౌదరికి గజమాల సమర్పించి స్వాగతం పలికారు. టీడీపీ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ సలీం, డివిజన్ జనసేన అధ్యక్షుడు కందినానిల ఆధ్వర్యంలో అమ్మహోటల్, బీఆర్‌పీ రోడ్డు కృష్ణవేణి మార్కెట్, పంజా సెంటర్, గాంధీబొమ్మ తదితర ప్రాంతాల్లో ప్రచారం సాగింది. అమరావతి రాజధాని రైతు ఐక్యకార్యాచరణ సమితి నాయకులు జి స్వరాజ్యరావు, కొమ్మినేని సత్యనారాయణ, కొండిపాటి బుజ్జి, బీజేపీ నాయకుడు అడ్డూరి శ్రీరామ్, మిల్లన్ జైన్ ఎలకళ్ల బాబు, పీయూష్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

భవానీపురం: 44వ డివిజన్ కొండ ప్రాంతమైన పిడుగు బంగారమ్మ వీధి, మర్రిచెట్టు సెంటర్ అగ్గిపెట్టెల ఫ్యాక్టరీ, కొండబడి ప్రాంతం, సొరంగం వద్ద పశ్చిమ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి విజయాన్ని కాంక్షిస్తూ ఆయన సోదరుడి కుమారులు కౌశిక్, నవీన్‌లు శుక్రవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఎన్డీఏ కూటమి పాలనలో గతంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ టీడీపీ, జనసేన అధ్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాసరావు, మల్లెపు విజయలక్ష్మి, బీజేపీ నాయకులు దూండీలతో కలిసి ఎంపీగా కేశినేని శివనాథ్‌ను, ఎమ్మెల్యేగా సుజనా చౌదరిలను అఖండ మెజారిటీతో గెలిపించాలని, సూపర్ సిక్స్ పథకాలపై ముద్రించిన కరపత్రాలను ఇంటింటికి పంచారు. తెలుగు యువత పశ్చిమ ఉపాధ్యక్షులు కుప్పిలి నాగబాబు, గణేష్, రాజేష్, ఏడుకొండలు, పైలా సోమినాయుడు తనయుడు సురేష్, సత్యనారాయణ సింగ్‌లు పాల్గొన్నారు.

● 41వ డివిజన్ అధ్యక్షుడు షేక్ సుభానీ సూపర్ సిక్స్ పథకాలు, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాలను వివరిస్తూ ఓటర్ల వెరిఫికేషన్ చేపట్టారు. ఎంపీగా శివనాథ్‌ను, ఎమ్మెల్యేగా సుజనాను మైనార్టీలు ఐక్యంగా గెలిపించుకోవాలన్నారు.

● 45వ డివిజన్‌లో జనసేన, టీడీపీ అధ్యక్షులు బొమ్ము గోవిందలక్ష్మి, రాంబాబు, పేరం సత్యనారాయణ, బీజేపీ అధ్యక్షులు రమాదేవిల ఆధ్వర్యంలో జోజినగర్, రమణయ్య బడ్డీ కొట్లు, రాము క్వారీ, కబేళా పెట్రోల్ బంకు, రోటరీనగర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించి సుజనా, శివనాథ్‌లను గెలిపించాలని కోరారు.

పశ్చిమలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మిస్తాం: ధనలక్ష్మి

విద్యాధరపురం: పశ్చిమలో కూటమి బలపరచిన బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి గెలిచి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మింపచేస్తామని సుజనా చౌదరి సోదరి ధనలక్ష్మి చెప్పారు. సోదరుడు తరపున ఆమె శుక్రవారం 42వ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. శివాజీ, తిరుపతి అనూష, తిరుపతి సురేష్, సతీష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సుజనాకు రాజధాని రైతుల మద్దతు

రాజధాని రైతులు శుక్రవారం భవానీపురంలోని బీజేపీ ఎన్నికల కార్యాలయానికి వచ్చి కూటమి బలపరచిన బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరికి మద్దతు పలికారు. అమరావతి రాజధాని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ జేఏసీ నాయకురాలు కామినేని గోవిందమ్మ మాట్లాడుతూ రైతుల ఉద్యమానికి సుజనా చౌదరి ఎంతో సహకరించారన్నారు. జనసేన నాయకురాలు రజని మాట్లాడుతూ అమరావతి రైతుల ఉద్యమం విజయవంతంలో సుజనా చౌదరి పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. కొమ్మినేని వరలక్ష్మి, కోలు దుర్గ, స్వరాజ్యరావు, అనుమోలు గణేష్, కొమ్మినేని సత్యనారాయణ, కట్టా రాజేంద్ర, జమ్ముల శాంతి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో సుజనా సోదరుడి తనయులు, కౌశిక్, నవీన్, జనసేన, టీడీపీ అధ్యక్షులు



సుజనా చౌదరికి మద్దతు తెలిపిన రాజధాని రైతులు

సైకో జగన్‌ను ఇంటికి పంపాలి: కేశినేని జానకీ లక్ష్మి

చిట్టినగర్, ఏప్రిల్ 26: వందశాతం హామీలు అమలు చేస్తా రాష్ట్రంలో దశల వారీగా మద్యపాన నిషేధం చేసి ఓట్లు అడుగుతానని మాట ఇచ్చిన జగన్ మాట తప్పాడు, ఇచ్చిన హామీలు అమలు చేయలేదని కేశినేని శివనాథ్ సతీమణి కేశినేని జానకీ లక్ష్మి అన్నారు. శుక్రవారం 48వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కుమారుడు వెంకట్‌తో కలిసి జానకీ లక్ష్మి ఇంటింటికి వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుపుకున్నారు. రాష్ట్రాన్ని సర్వనాశం చేసి ప్రజలను మోసం చేసిన సైకో జగన్ ఇంటికి పంపించాలన్నారు. ఎన్డీఏ కూటమిని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్నారు.

అప్పుడే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందన్నారు. పి.రమణ, యు.రాము, పశ్చిమ తెలుగుయువత అధ్యక్షుడు ఆర్. మాధవ్, ఈది పార్వతి, దాసరి నాగమణి, లింగం వాణి, అడ్డూరి శంకర్, పిల్లా సాయి, పొన్నాడ రాము, బీజేపీ మండలాధ్యక్షుడు దేవిన హరిప్రసాద్ పాల్గొన్నారు.



48వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో కేశినేని జానకీ లక్ష్మి



64వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో కేశినేని స్నిగ్ధ

వైసీపీ పాలన అంతా విధ్వంసమే

కేశినేని స్నిగ్ధ

పాయకాపురం: రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో విధ్వంసం, అరాచకం రాజ్యమేలిందని టీడీపీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) కుమార్తె కేశినేని స్నిగ్ధ విమర్శించారు. 64వ డివిజన్ కండ్రికలో శుక్రవారం 64వ డివిజన్ ప్రచారంలో కేశినేని స్నిగ్ధ, నేతలు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అనంతరం కేశినేని స్నిగ్ధ మాట్లాడుతూ జగన్‌ను ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పరుచూరి ప్రసాద్, సూరవరపు నాగరాజు పాల్గొన్నారు.



ఊర్మిళానగర్‌లో ఎన్నికల ప్రచారంలో శ్రీదేవి, ఆషా

ఊర్మిళానగర్‌లో శ్రీదేవి ప్రచారం

భవానీపురం: 43వ డివిజన్‌లోని ఊర్మిళానగర్, రెడ్డి కాలనీ, పార్కు సెంటర్, సీతారెడ్డి ప్లాట్స్, బ్రహ్మంగారి గుడి ప్రాంతాల్లో శివనాథ్ సోదరీ కేశినేని శ్రీదేవి శుక్రవారం ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్డీయే అభ్యర్థులైన ఎంపీగా కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేగా సుజనా చౌదరిలను అఖండ మెజారిటీతో గెలిపించాలని శ్రీదేవి కోరారు. టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి, రాష్ట్ర మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా, వల్లభనేని ప్రసన్నలక్ష్మి, టీడీపీ నాయకులు మల్లెబోయిన కొండ, టీడీపీ డివిజన్ అధ్యక్షుడు కొనికి కొండయ్య, వల్ల మాగం ఆత్మారామ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు నిజమైన వారసురాలు షర్మిలారెడ్డి

ఏపీసీసీ ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ

వన్‌టౌన్, ఏప్రిల్ 26: వైఎస్ రాజశేఖరరెడ్డికి షర్మిలారెడ్డి నిజమైన వారసురాలని ఏపీసీసీ ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ అన్నారు. గాంధీనగర్‌లోని ఆయన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లుగా విధ్వంసపాలన సాగిస్తున్న జగన్ వైఎస్ వారసుడు కాదని ప్రజలే చెప్పుకుంటున్నారని చెప్పారు. షర్మిలకు పెరుగుతున్న ప్రజాదరణ చూసి జగన్ గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. కడపలో ఈసారి షర్మిల విజయం సాధించబోతున్నారని పేర్కొన్నారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన మరుక్షణమే వివేకానందరెడ్డి హత్య కేసులో పాత్రధారులు, సూత్రధారులు జైలుకు పోవడం ఖాయమన్నారు.

మేధోసంపత్తితో వ్యాపార రంగంలో కొత్త ఆవిష్కరణలు

వన్‌టౌన్: మేధోసంపత్తి ద్వారా వ్యాపార రంగంలో కొత్త ఆవిష్కరణలు చేయవచ్చునని జిల్లా పరిశ్రమల కేంద్ర పారిశ్రామిక ప్రోత్సాహక అధికారి కేశం వేణు అన్నారు. పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం ఎంట్రప్రెన్యూర్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ప్రపంచ మేధోసంపత్తి హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పారిశ్రామిక కార్యకలపాలపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మేధోసంపత్తి హక్కుల ప్రాముఖ్యతను, అది ఎలా ఉపయోగపడుతుందన్న దానిపై సోదాహరణంగా వివరించారు. విభాగాధిపతి డాక్టర్ ఏ.రమాదేవి, అడ్మిన్ డీన్, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ విజయదుర్గాప్రసాద్, ఈడీసీ కన్వీనర్ వై.సుధాచంద్ర పాల్గొన్నారు. ఆయనకు జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

రిజర్వాయర్లు నిర్మించిన ఘనత టీడీపీదే

● **ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్**



ఐదవ డివిజన్లో ఎమ్మెల్యే గద్దె ఎన్నికల ప్రచారం

గుణదల, ఏప్రిల్ 26: కొండ ప్రాంతాల్లో నివాసాలు ఉండేవారికి తాగునీరు కొరత లేకుండా ఉండాలన్న ఆలోచనతో రిజర్వాయర్లు నిర్మించిన ఘనత టీడీపీకే దక్కుతుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఐదవ డివిజన్లోని కొండ ప్రాంతంలో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోజుకు 10 గంటలు తగ్గకుండా నీరు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. మరో రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న రాష్ట్రాన్ని ఆర్థికంగా గాడిలో పెట్టడం చంద్రబాబు నాయుడుకే సాధ్యం అని చెప్పారు. డివిజన్ అధ్యక్షుడు నందిపాటి దేవానంద్, అల్లిబిల్లి రామకృష్ణ, కోటేశ్వరరావు, దోమకొండ రవి, కోడూరు సుబ్రహ్మణ్యం, దుట్టం దుర్గాప్రసాద్, పి.శివ, గుడిపాటి కెనడి, రాచమల్ల ఆంజనేయులు, టి.రామకృష్ణ పాల్గొన్నారు.

భారతీనగర్: టీడీపీ అధికారంలోకి రాగానే టిడ్కో ఇళ్లను పంపిణీ చేయనున్నట్లు జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ తెలిపారు. 4వ డివిజన్లోని శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలో శుక్రవారం గద్దె అనురాధ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో గద్దెను ఎమ్మెల్యేగా, కేశినేని చిన్నిని ఎంపీగా సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. మాజీ కార్పొరేటర్ దేవినేని అపర్ణ, డివిజన్ అధ్యక్షుడు గొల్లపూడి నాగేశ్వరరావు, భాస్కర్, వడ్లపాటి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఇండియా కూటమి అభ్యర్థుల విజయంతో ప్రజాస్వామ్యానికి రక్ష

పాతరాజరాజేశ్వరి పేట, ఏప్రిల్ 26 : ఇండియా కూటమి అభ్యర్థును గెలిపించడం ద్వారా లౌకిక ప్రజాస్వామ్యానికి రక్షణ ఉంటుందని సీపీఐ రాష్ట్ర నాయకులు రావులపల్లి రవీంద్రనాథ్ అన్నారు. కాంగ్రెస్, సీపీఎం బలపరిచిన పశ్చిమ సీపీఐ అభ్యర్థి జి. కోటేశ్వరరావు శుక్రవారం 34వ డివిజన్ కేదారేశ్వరపేటలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రావులపల్లి రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి టీడీడీ, వైసీపీ నుంచి అన్నదమ్ములు పోటీ చేస్తున్నారని, ఇక్కడ కత్తులు దూసుకుంటున్న వాళ్లు ఎవరూ గెలిచినా ఢిల్లీలో బీజేపీతో భాయీ...భాయీ అంటారని చెప్పారు. మతోన్మాద బీజేపికి మద్దతు ఇచ్చే ఆ పార్టీల అభ్యర్థులను ఓడించాలని, కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసే అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కంకి కొడవలి గుర్తుపై ప్రజలు ఓటు వేసి సీపీఐ అభ్యర్థి కోటేశ్వరరావును గెలిపించాలని కోరారు. సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు బుట్టి రాయప్ప, తాడి పైడియ్య, పంచదార్ల దుర్గాంబ, కొట్టు రమణారావు, సీపీఎం నాయకులు కార్పొరేటర్ బోయి సత్తిబాబు, వాముక్షరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల విజయం కోసం

మధురానగర్‌లో జనసేన, నాగవంశీయుల ప్రచారం



మధురానగర్, ఏప్రిల్ 26: బీజేపీ, జనసేన పార్టీలు బలపరచిన పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్, అసెంబ్లీ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావును గెలిపించాలని మధురానగర్‌లో జనసేన సెంట్రల్ విభాగం, నాగవంశీయుల సెంట్రల్ కమిటీ ప్రచారం నిర్వహించాయి. మధురాగర్ బోయిన గంగాధరరావు వీధి, రైల్వే సొసైటీ కాలనీ, లెక్చరర్స్ కాలనీలో జనసేన సెంట్రల్ సమన్వయకర్త బోలిశెట్టి వంశీకృష్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో చిరంజీవి యువత నాయకులు శ్యాంప్రసాద్, డివిజన్ జనసేన అధ్యక్షుడు కెంబూరి కృష్ణ, టీడీపీ డివిజన్ అధ్యక్షుడు పీవీఆర్, అంగిరేకుల రాంబాబు, రత్తయ్య, వెంకన్న తదితరులు ఉన్నారు. నాగవంశీయుల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ ఎరుబోతు రమణరావు ఆధ్వర్యంలో సెంట్రల్ కన్వీనర్ రాచిల్లి పైడి రాజు అధ్యక్షతన మధురానగర్ కొబ్బరితోట, కాల్వగట్టు తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. కుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

జన కేతనం

- నియోజకవర్గ ఆవిర్భావం నుంచి ఎగిరిన ఎర్రజెండా
- తర్వాత కాంగ్రెస్‌కు పట్టం కట్టిన ప్రజలు
- ఆరుసార్లు విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థులు
- టీడీపీ, పీఆర్పీలకు చెరో అవకాశం
- ఒకసారి గెలిచినవారు తరువాత ఓడే అనవాయితీ..

పశ్చిమలో పట్టు ఎవరిదో..

కూటమి నుంచి సుజనా.. వైసీపీ నుంచి ఆసిఫ్ బరిలో..



ఆధ్యాత్మిక కేంద్రం ఇంద్రకీలాద్రిని అనుకుని ఉన్న కొండలపై పేద ప్రజల జీవితాలు ఒకవైపు. హోల్‌సేల్ వ్యాపారాల కేంద్రం మరోవైపు. ఇదీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నైసర్గిక స్వరూపం. ఒకసారి గెలిచిన అభ్యర్థులు ఆ తర్వాత జరిగే ఎన్నికల్లో గెలవరు అన్న సెంటిమెంట్ ఉన్న పశ్చిమ నియోజకవర్గంలో కొత్త ముఖాలు బరిలోకి దిగాయి. ఈసారి ప్రజల ఆశీస్సుల కోసం కొత్త అభ్యర్థులు ఇద్దరూ పోటీపడుతున్నారు. ఎంతో ఘనచరిత్ర ఉన్న పశ్చిమపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

– విజయవాడ, ఆంధ్రజ్యోతి

ఇదీ నియోజకవర్గ చరిత్ర

తూర్పు, సెంట్రల్, పశ్చిమ నియోజకవర్గాలు కలిపితే విజయవాడ రాజకీయ స్వరూపం. ఇప్పుడు మూడు నియోజకవర్గాలుగా ఉన్న విజయవాడ ఒకప్పుడు ఒకే నియోజకవర్గంగా ఉండేది. 1952లో విజయవాడ అంతా ఒకే నియోజకవర్గం ఉండేది. తర్వాత ఉత్తర, దక్షిణ నియోజకవర్గాలు ఏర్పడ్డాయి. 1955 నుంచి ప్రస్తుతం ఉన్న పశ్చిమ ప్రాంతమంతా విజయవాడ ఉత్తర నియోజకవర్గంలో ఉండేది. తర్వాత 1967లో పశ్చిమ నియోజకవర్గం రాజకీయ స్వరూపాన్ని తీసుకుంది. ఈ నియోజకవర్గ భౌగోళిక స్వరూపంలో భిన్నత్వంలో ఏకత్వం కనిపిస్తోంది. మొత్తం ఓటర్లలో బీసీలు ఎక్కువగా ఉంటారు. ఆ తర్వాత స్థానంలో మైనారిటీలో ఉన్నారు. బీసీల్లో నగరాల సామాజికవర్గ ప్రాబల్యం ఈ నియోజకవర్గంలో ఎక్కువగా ఉంటుంది. నియోజకవర్గ ఆవిర్భావం నుంచి ఈ సామాజికవర్గానికి చెందిన నేతలే ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. తర్వాత ముస్లిం వర్గానికి చెందిన నేతలు ఎమ్మెల్యేలుగా గెలిచారు. తమ్మిన పోతరాజు, మరుపిళ్ల చిట్టి, పోతిన చిన్న వంటి వాళ్లంతా నగరాల సామాజికవర్గీయులే. అసిఫ్ పాషా, ఎంకే బేగ్, షేక్ నాసర్‌వలీ, జలీల్ ఖాన్‌లు ముస్లిం సామాజికవర్గానికి చెందినవారు. ఈ నియోజకవర్గంలో బీసీలు, మైనారిటీలే రాజకీయ తలరాతలను రాస్తుంటారు. ఈ రెండు సామాజికవర్గాల తర్వాతి స్థానం మార్వాడీలది. ఉత్తరాది నుంచి వ్యాపారం నిమిత్తం విజయవాడకు వచ్చిన మార్వాడీలు పశ్చిమలో స్థిరనివాసాలను ఏర్పాటు చేసుకున్నారు. విజయవాడలో భిన్న స్వరూపాలున్న నియోజకవర్గం పశ్చిమ. ఇంద్రకీలాద్రి ఆధ్యాత్మికతకు కొలువుగా ఉంది. దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం ఈ నియోజకవర్గంలోనే ఉంది. మరోపక్క వాణిజ్యానికి ప్రధాన కేంద్రం ఈ నియోజకవర్గం. వస్త్ర వ్యాపారం, బంగారం వ్యాపారం, హోల్‌సేల్ వ్యాపారాలకు పశ్చిమ పెద్దదిక్కుగా ఉంది.

'అమ్మ' ఆశీస్సులు ఎవరికో...



సుజనా చౌదరి (కూటమి అభ్యర్థి)



ఆసిఫ్ (వైసీపీ అభ్యర్థి)

నియోజకవర్గం ఆవిర్భావం, దానికి ముందు నుంచి ఇక్కడ 15 సార్లు ఎన్నికలు జరిగాయి. మొదటి నుంచి ఇక్కడ కమ్యూనిస్టులు జెండాను రెపరెపలాడించారు. 1956లో తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో సీపీఐ తరపున మరుపిళ్ల చిట్టి విజయం సాధించారు. ఇప్పటి వరకు ఈ నియోజకవర్గంలో ఆరుసార్లు కాంగ్రెస్ అభ్యర్థులను ఓటర్లు గెలిపించారు. ఐదుసార్లు సీపీఐ అభ్యర్థులు విజయం సాధించారు. వైసీపీ అభ్యర్థులు రెండుసార్లు, ప్రజారాజ్యం, తెలుగుదేశం పార్టీ ఒక్కోసారి గెలుపొందారు. ఒకసారి గెలుపొందిన అభ్యర్థి తర్వాత ఎన్నికల్లో గెలుపొందిన దాఖలాలు లేవు. ఒకే అభ్యర్థి వరుసగా రెండుసార్లు గెలవరన్న సెంటిమెంట్ మొదటి నుంచి ఉంది. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఇక్కడ విచిత్ర పరిస్థితి ఏర్పడింది. 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి విజయం సాధించి మంత్రిగా పనిచేసిన వెలంపల్లి శ్రీనివాసరావును అధిష్టానం ఈసారి నియోజకవర్గం మార్చింది. ఇప్పుడు వైసీపీ నుంచి షేక్ ఆసిఫ్ పోటీ చేస్తున్నారు. కూటమి అభ్యర్థిగా పారిశ్రామికవేత్త సుజనాచౌదరి బరిలోకి దిగారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 22 డివిజన్లు ఉన్నాయి. 34, 35, 37, 38, 39, 40, 41, 42, 43, 44, 45, 46, 47, 48, 49, 50, 51, 52, 53, 54, 55, 56 డివిజన్లు ఈ నియోజకవర్గ ప్రజలు ఎవరికి పట్టం కడతారో చూడాలి.

ఇదీ ఓటర్ల లెక్క

నియోజకవర్గం జనాభా : 3,26,978

పురుషులు : 1,63,973, స్త్రీలు : 1,63,004

మొత్తం ఓటర్లు : 2,51,514

పురుషులు : 1,24,435, స్త్రీలు : 1,27,048

సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ
1952	తమ్మిన పోతరాజు	సీపీఐ	మరుపిళ్ల చిట్టి	కాంగ్రెస్
ఉత్తర నియోజకవర్గం				
1955	మరుపిళ్ల చిట్టి	కాంగ్రెస్	తమ్మిన పోతరాజు	సీపీఐ
1962	తమ్మిన పోతరాజు	సీపీఐ	మరుపిళ్ల చిట్టి	కాంగ్రెస్
పశ్చిమ నియోజకవర్గం				
1967	మరుపిళ్ల చిట్టి	కాంగ్రెస్	తమ్మిన పోతరాజు	సీపీఎం
1972	అసిఫ్ పాషా	కాంగ్రెస్	తమ్మిన పోతరాజు	సీపీఎం
1978	పోతిన చిన్న	కాంగ్రెస్	ఎండీ ఇంతియాజుద్దీన్	జనతా
1983	బీఎస్ జయరాజ్	టీడీపీ	యు.రామచంద్రరాజు	సీపీఐ
1985	యు.రామచంద్రరాజు	సీపీఐ	ఎంకే బేగ్	కాంగ్రెస్
1989	ఎంకే బేగ్	కాంగ్రెస్	శేఖరబాబు	సీపీఐ
1994	కాకర్లపూడి సుబ్బరాజు	సీపీఐ	ఎంకే బేగ్	కాంగ్రెస్
1999	జలీల్‌ఖాన్	కాంగ్రెస్	నాగుల్‌మీరా	టీడీపీ
2004	షేక్ నాసర్‌వలీ	సీపీఐ	ఎంకే బేగ్	టీడీపీ
2009	వెలంపల్లి శ్రీనివాసరావు	పీఆర్పీ	మల్లికాబేగం	కాంగ్రెస్
2014	జలీల్‌ఖాన్	వైసీపీ	వెలంపల్లి శ్రీనివాసరావు	బీజేపీ
2019	వెల్లంపల్లి శ్రీనివాసరావు	వైసీపీ	షబనా ముసరత్	టీడీపీ



ఊడినా వాడాల్సిందే!

'ఆర్టీసీ' సిటీ బస్సుల్లో కాలం తీరినవెన్నో..

- నగర రూట్ పరిధిలో 20 లక్షల జనాభా
- అవసరాలకు తగ్గట్టులేని బస్సులు
- 95 శాతం స్క్రాప్‌కు సిద్ధం
- ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆర్టీసీ

చట్టం ఇదీ

కేంద్ర ప్రభుత్వం ఇటీవల సవరించిన మోటారు వాహనాల చట్టం ప్రకారం పదేళ్లు దాటిన తర్వాత వాహనాలను స్క్రాప్‌కు పంపాల్సిందే. ఆ వాహనాలను ఎట్టిపరిస్థితుల్లోనూ వాడకూడదు.

ఆచరణ ఇదీ

14 లక్షల మంది కలిగిన విజయవాడ నగరంలో సిటీ బస్ ఆపరేషన్ అంతా డొల్లగా మారిపోయింది. బస్సులన్నీ డొక్కుగా మారిపోయాయి. బస్సుల బాడీలు ఊగిపోతూ, ఎక్కడ పడితే అక్కడ ఆగిపోతూ ప్రయాణికులకు నరకాన్ని చూపిస్తున్నాయి. నగర పరిధిలో 350 పైచిలుకు బస్సులు నడుస్తున్నాయి. వీటిలో కేవలం పది శాతం బస్సులు మాత్రమే ఓ మాదిరిగా ఉన్నాయి. ఇవి కూడా నిర్ణీత కాలం పూర్తి చేసుకుని స్క్రాప్‌కు పంపటానికి సిద్ధంగా ఉన్నాయి. పదేళ్లు దాటి పదిహేను సంవత్సరాలు గడిచినా వాటిని స్క్రాప్ చేయటం లేదు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రవాణా రంగ రాజధానిగా ఉన్న విజయవాడలో ఆర్టీసీ పరిస్థితి దయనీయంగా మారింది. ఆర్టీసీ స్టేషన్లను డొక్కు బస్సుల స్టేషన్లుగా మార్చేశారు. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న సిటీ బస్సుల ఆపరేషన్ జాతీయకరణ తర్వాత ఆర్టీసీలో అంతర్భాగమయ్యాయి. ఇలాంటి సిటీ బస్ ట్రాన్స్‌పోర్టేషన్‌ను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా పడుకోబెట్టింది. ఐదేళ్లలో ఒక్క కొత్త బస్సు కూడా ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. విజయవాడ నుంచి మైలవరం వరకు, విజయవాడ నుంచి కంకిపాడు దాటి ఉయ్యూరు, గుడివాడ వరకు, విజయవాడ నుంచి నున్న దాటి ఆగిరిపల్లి వరకు సిటీబస్ రూట్ విస్తరించి ఉంది.

20 లక్షల మందికి 350 బస్సులే..

విజయవాడలోని 14 లక్షల మంది జనాభాతో పాటుగా సిటీ రూట్ పరిధిలోని ఎండ్ పాయింట్ల వరకు మరో 6 లక్షలు జనాభా కలిపితే మొత్తంగా 20 లక్షల జనాభా అవసరాల కనుగుణంగా సిటీ బస్సులను నడుపుతున్నారు. ప్రస్తుతం సిటీలో ఉన్న 350 బస్సుల్లో 200 వరకు సీఎన్‌జీ బస్సులు ఉన్నాయి. ఇవి కూడా కాలం తీరిపోయి స్క్రాప్‌కు సిద్ధంగా ఉన్నాయి. ఇలాంటి బస్సులతో ఐదేళ్లుగా ప్రయాణికులు ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.





చినదళితవాడలో కట్టిన బ్యానర్

బ్యానర్‌లో రాసిన డిమాండ్

హామీ ఇస్తేనే.. ఓట్లు అడగండి

మరో పక్షం రోజుల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఓట్ల కోసం అభ్యర్థులు తెగ ప్రచారం చేస్తున్నారు. ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు సామదానబేధ దండోపాయాలు ప్రదర్శిస్తున్నారు. ఓటర్లు కూడా ఆలోచనాత్మకంగా అడుగులేస్తున్నారు. నోటు ఇస్తే ఓటు వేస్తామనే ఈ రోజుల్లో మాకు డబ్బు వద్దు పనిచేసే నాయకుడు కావాలని సంకల్పించే జనం కూడా ఉన్నారని చాటారు ఘంటసాల మండలం ఘంటసాలపాలెం ప్రాంతంలోని వేమూరి గోపాలనగర్ (చినదళితవాడ) ప్రజలు. అభివృద్ధి చేస్తానని హామీ ఇస్తేనే ఓట్లు అడిగేందుకు రమ్మని బ్యానర్లు కట్టి రాజకీయ నాయకులకు సందేశమిచ్చారు. దళితవాడను అభివృద్ధి చేస్తేనే ఓట్లు అడగటానికి రావాలని కోరారు. ఈ ఫ్లెక్సీ వివిధ రాజకీయ పార్టీలను ఆలోచింపజేసింది. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సూక్తిని ప్రస్తావిస్తూ బ్యానర్ ఏర్పాటు చేశారు. దళితవాడకు వెళ్లే మూడు ప్రధాన రహదారుల్లోనూ బ్యానర్లు ఏర్పాటు చేశారు. – ఘంటసాల

వెల్లంకిలో వెతలు

- తాగునీరు లేక తిప్పలు
- అధ్వాన రోడ్లతో అవస్థలు
- వెక్కిరిస్తున్న శిలాఫలకాలు

వీరులపాడు : పెద్దాపురం శివారు వెల్లంకిలో జనం నెల రోజుల నుంచి దాహార్తితో అల్లాడిపోతున్నారు. సుమారు 4,500 జనాభా ఉన్న గ్రామంలో తాగునీటితో పాటు అధ్వాన రోడ్లతో అవస్థలు పడుతున్నారు. గ్రామం పక్కనే వైరా ఏరు ఉన్నా గ్రామస్తులకు తాగునీరు అందటం లేదు. గ్రామంలో ఎప్పుడో నిర్మించిన వాటర్ ట్యాంక్‌లు సైతం శిథిలావస్థకు చేరాయి. వేసవిలో తాగునీరు అందక గ్రామస్థులు డబ్బులిచ్చి ట్యాంకర్ల వద్ద కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. పెరిగిన జనాభాకు అనుగుణంగా తాగునీటి సరఫరా పెంచాల్సిన అధికారులు పాలకులు చర్యలు తీసుకోవడంతో మూడు రోజులకొకసారి తాగునీరు సరఫరా అవుతోంది. ఇప్పుడు అవికూడా లేవు. నెల రోజుల నుంచి గ్రామంలో తాగునీరు లేక ప్రజలు దాహంతో అల్లాడిపోతున్నారు.

సమస్యలు కోకొల్లలు

వెల్లంకి - జుజ్జూరు రోడ్డు గుంతలమయంగా తయారైంది. నీటి సమస్యతో జగనన్న కాలనీలో ఒక్క పక్కా గృహం కూడా నిర్మించలేదు. కాలనీలో ఏర్పాటు చేసిన శిలాఫలకం నేతల పాలన తీరును వెక్కిరిస్తోంది. సుమారు 1,200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే వెల్లంకి ఎత్తిపోతల పథకం పాలకుల తీరుతో మూలనపడింది. రైతులు సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా గ్రామంలోని నెల నుంచి తాగునీరు రాకున్నా పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడు. వెల్లంకి వెతలు ఎప్పటికి తీరుతాయా అని ప్రజలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.



శిథిలావస్థలో ఉన్న తాగునీటి ట్యాంక్

తాగునీటి వెతలు తీర్చే వారికే ఓటు



గ్రామంలో తాగునీటి వెతలు తీర్చే వారులేరు. నెల నుంచి అధికారులకు ఫోన్ చేసినా ఫలితం ఉండటం లేదు. బబుల్ నీళ్లను కొనుక్కోవాల్సి వస్తోంది. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే ముస్ముందు ఎన్ని సమస్యలు ఎదుర్కోవాలోనని భయమేస్తోంది. మాకు తాగునీటి సమస్యను తీర్చేవారికే ఓటు వేస్తాం.

– తోట శ్రీను, వెల్లంకి

ఓటుతో బుద్ధిచెబుతాం



వెల్లంకి - జుజ్జూరు రోడ్డుతో అధ్వానంగా తయారైంది. గుంతల్లో పడి ద్విచక్ర వాహనాలు గుల్లవుతున్నాయి. పంటలు తరలించుకోవాలంటే నరకం కనబడుతోంది. గ్రామంలో సరైన డ్రెయినేజీ వ్యవస్థ కూడా లేదు. మురుగు నీరు రహదారులపైకి వస్తోంది. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. ఈ ఐదేళ్లలో ఎవరూ పట్టించుకోలేదు. ఈ ఎన్నికల్లో ఓటుతో బుద్ధిచెబుతాం.

– లంక నాగేశ్వరరావు (వెల్లంకి)



బొబ్బర్లంక వద్ద బ్యారేజీ నిర్మాణం చేసే ప్రాంతం

వృథా వరదగాథ!

కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజీ దిగువన వృథా నీటి వినియోగం కోసం రెండు బ్యారేజీల నిర్మాణం చేస్తామని వైసీపీ ఇచ్చిన హామీ ప్రతిపాదనలను దాటలేదు. వీటి నిర్మాణం ఎక్కడివేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. ఈ రెండు బ్యారేజీల నిర్మాణానికి డీటెయిల్ట్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారుచేసి ప్రభుత్వానికి పంపినా ఆమోదం తెలపకుండా తొక్కిపెట్టింది. సాకులు చెబుతూ ఈ రెండు బ్యారేజీల నిర్మాణానికి నిధులు విడుదల చేయకుండా జాప్యం చేస్తోంది. 2020 నుంచి సాగదీస్తూనే ఉంది. ప్రతిపాదనలు ఎప్పటికి ఆమోదం పొందుతాయి? ఎప్పటికి నిర్మాణం చేస్తారు? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

- వరద నీటిని ఒడిసిపట్టే మినీ బ్యారేజీల నిర్మాణం తుస్..
- కృష్ణానదిపై చోడవరం ఒకటి.. బొబ్బర్లంక మరొక బ్యారేజీ నిర్మిస్తామని నాలుగేళ్ల క్రితం సీఎం ప్రకటన
- 9 టీఎంసీలకుపైగా నీటిని నిల్వ సామర్థ్యం
- సముద్రతీర ప్రాంతంలోని భూములకు సాగునీరు, తాగునీరు అందించే అవకాశం
- ప్రతిపాదనలే తప్ప ఆమోదం లేని దైన్యం
- నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- ప్రకాశం బ్యారేజీ దిగువ ప్రాంతాల ప్రజల గగ్గోలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణానదికి ఎగువన, పరివాహక ప్రాంతాల్లో భారీవర్షాలు కురిస్తే ప్రకాశం బ్యారేజీ ద్వారా వరదనీరు సముద్రంలోకి వదలాల్సిన స్థితి. ఏడాదికి కనీసంగా 250 టీఎంసీలకుపైగా వరదనీటిని సముద్రంలోకి వదిలేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ ఎగువన నీటి నిల్వ సామర్థ్యం మూడు టీఎంసీలుగానే ఉండటంతో పూర్తిస్థాయిలో ఈ నీరు పంటలను కాపాడేందుకు సరిపోనిస్థితి ఏర్పడుతోంది. దీంతో కాలువలకు సరిపడా నీటిని వదలలేని స్థితి ఏర్పడుతోంది. ఈ ఏడాది ఇదే స్థితి ఏర్పడింది. వైసీపీ అధికారం చేపట్టిన తరువాత మొదటి సంవత్సరమే దాళ్వా పంటకు నీరిచ్చి, మిగిలిన మూడేళ్లు చేతులెత్తేసింది. కాలువలకు నీటిని సరిపడా వదలకపోవడంతో ఖరీఫ్ సీజన్‌లోనూ పంటలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో సముద్రంలోకి వృథాగా పోతున్న వరదనీటిని ఒడిసిపట్టే ప్రయత్నంలో భాగంగా ప్రకాశం బ్యారేజీ దిగువన రెండు బ్యారేజీల నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2020 సెప్టెంబరు నెలలో తయారయ్యాయి.

చోడవరం, బొబ్బర్లంక వద్ద రెండు బ్యారేజీలు

ప్రకాశం బ్యారేజీ దిగువన 16వ కిలోమీటరు తోట్లవల్లూరు మండలం చోడవరం వద్ద రూ.2235.41కోట్లతో మినీ బ్యారేజీ నిర్మాణానికి అంచనాలు రూపొందించారు. రెండో బ్యారేజీ ప్రకాశం బ్యారేజీకి దిగువన 67వ కిలోమీటరు మోపిదేవి మండలం బొబ్బర్లంక వద్ద రూ.2526.35 కోట్లతో అంచనాలు రూపొందించారు. చోడవరం వద్ద నిర్మాణం చేసే బ్యారేజీ వద్ద 4.131 టీఎంసీలను, బొబ్బర్లంక బ్యారేజీవద్ద 4.095 టీఎంసీ నీటిని నిల్వ ఉంచేలా నమూనాలను రూపొందించారు. బొబ్బర్లంక వద్ద నిర్మాణం చేసే బ్యారేజీ నుంచి దివిసీమ ప్రాంతంలోని కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ, చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి, తదితర మండలాలకు సాగు, తాగునీరు అందించాలని నిర్ణయించారు. బొబ్బర్లంక వద్ద బ్యారేజీ నిర్మాణం చేస్తే భూగర్భజలాలు పెరిగి కృష్ణానదీ పరివాహకప్రాంతంలోని లంకభూముల్లోని బోర్లకు పూర్తిస్థాయిలో నీరు అంది పంటలు పండటానికి అవకాశం కూడా ఉంటుందని నిర్ధారణ చేశారు.



బొబ్బర్లంకవద్ద సాయిల్‌టెస్టులు చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలన చేస్తున్న అధికారులు ప్రజాప్రతినిధులు

రూపాయి విదల్చలేదు

కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజీ దిగువన రెండు బ్యారేజీల నిర్మాణానికి డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టును అధికారులు తయారుచేసి ప్రభుత్వానికి పంపారు. ఈ ప్రతిపాదనలకు స్టేజ్-1పరిపాలనా ఆమోదం పొంది అక్కడకే పరిమితమైపోయాయి. 2023-24 రేట్లకు అనుగుణంగా నివేదికలు తయారుచేసి పంపాలని ప్రభుత్వం సూచించింది. ఇలా నాలుగేళ్లుగా నివేదికలు కోరుతూనే ఉంది. కానీ నిధులు మాత్రం విడుదల చేయడం లేదు. బ్యారేజీల పనులు ప్రారంభిస్తున్నట్లుగా చూపేందుకు రెండు ప్రాంతాల్లో సాయిల్ టెస్టులు, ఇతరత్రా టెస్టులు చేసి వదిలేసింది. ప్రభుత్వం ఈ రెండు బ్యారేజీల నిర్మాణానికి నిధులు విడుదల చేయకుండా సాంకేతిక కారణాలను సాకుగా చూపి జాప్యం చేస్తూ వస్తోంది.

జనానికి నీటిపాట్లు

ఈ ఏడాది దివిసీమ ప్రాంతంలోని పంటపొలాలకు నీరందక కోడూరు, నాగాయలంక మండలాల్లో వరిపైరు కళ్లెదుటే ఎండిపోయింది. ప్రస్తుతం వేసవిలో తాగునీటి కోసం పులిచింతల ప్రాజెక్టులో ఉన్న కొద్దిపాటి నీటిని దిగువకు వదలాల్సి వచ్చింది. ఈ బ్యారేజీల నిర్మాణం ఇప్పటికే పూర్తయి ఉంటే జిల్లాలో సాగు, తాగునీటి సమస్యలు ఏర్పడేవి కావు. ఈ రెండు బ్యారేజీల నిర్మాణానికి వచ్చే ప్రభుత్వమైనా నిధులు సమకూర్చాలని జిల్లా వాసులు కోరుతున్నారు.



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన మాజీ మంత్రి డొక్కా

వైసీపీకి డొక్కా గుడ్‌బై

» ఉదయం రాజీనామా, సాయంత్రానికి టీడీపీలోకి

గుంటూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఊహించిన విధంగానే మాజీ మంత్రి, వైసీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. శుక్రవారం ఉదయం పార్టీ నుంచి వైదొలగిన ఆయన.. సాయంత్రం హైదరాబాద్‌లో మాజీ సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. ముఖ్యమంత్రి జగన్ తీరుకు నిరసనగా ఆయన కొంతకాలంగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎస్సీలకు మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు (తాడికొండ, ప్రత్తిపాడు, వేమూరు), ఒక లోక్‌సభ నియోజకవర్గం (బాపట్ల) ఉండగా.. వాటిలో ఎందులోనూ తనకు టికెట్ ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురయ్యారు. ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దక్కకపోవడంతో వైసీపీకి గుడ్‌బై చెప్పారు.

టీడీపీకి యనమల కృష్ణుడు రాజీనామా

తుని రూరల్, ఏప్రిల్ 26: కాకినాడ జిల్లాలో తుని నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత యనమల కృష్ణుడు టీడీపీ సభ్యత్వానికి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పదవికి శుక్రవారం రాజీనామా చేశారు. ఆయనతో పాటు జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్, పోల్నాటి శేషగిరిరావు, అనుచరగణం రాజీనామా చేసి వైసీపీలోకి చేరుతున్నట్టు తెలిపారు.

టీడీపీ అధికార ప్రతినిధిగా ఉండవల్లి శ్రీదేవి

అమరావతి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గానికి చెందిన ఉండవల్లి శ్రీదేవి టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. చిలకలూరిపేట నియోజకవర్గానికి చెందిన మల్లెల రాజేష్‌నాయుడు టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు.

పవన్‌ను ఓడించేందుకు కడప గూండాలు

» ఎంతమంది వస్తారో రండి.. మేం రెడీ: నాగబాబు

పిఠాపురం, ఏప్రిల్ 26: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఎలాగైనా ఓడించాలని వైసీపీ నేతలు కడప నుంచి గూండాలు, రౌడీలను పంపించారని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు ఆరోపించారు. "మీరు ఎంత మందిని పంపిస్తారో పంపించండి.. మేం రెడీగా ఉన్నాం. మా పిఠాపురం ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారు. ఎవ్వరికీ బెదిరేది లేదు. పిఠాపురం ప్రజల మద్దతు ఉన్నంత కాలం ఎవరేమి చేయలేరు' అని స్పష్టం చేశారు.

పోలింగ్ విధుల్లో అంగన్వాడీలు: మీనా

అమరావతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సిబ్బంది కొరతను దృష్టిలో ఉంచుకుని పోలింగ్ విధుల్లో అంగన్వాడీ కార్యకర్తలు, కాంట్రాక్టు ఉద్యోగుల సేవలను ఉపయోగించుకోవచ్చని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ మేరకు సీఈవో ముఖేష్‌కుమార్ మీనా ఆదేశాలు జారీచేశారు. పోలింగ్ అధికారుల కొరత ఉన్న జిల్లాల్లో ఓపీవోలుగా వారి సేవలు వినియోగించుకోవాలని మీనా సూచించారు. సార్వత్రిక ఎన్నికలవిధుల్లోని అన్ని కేటగిరీల ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12ను ఇవ్వడానికి గడువును మే నెల 1వ తేదీ వరకు కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, పోలీస్ సిబ్బంది, వీడియో గ్రాఫర్లు, డ్రైవర్లు, ఇతర సిబ్బందికి కేంద్ర ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించింది. అలాగే, ఓటర్ల జాబితాలో సర్వీస్ ఓటరుగా నమోదైన వివిధ సైనిక దళాల సిబ్బంది, ప్రజాప్రతినిధి చట్టం 1951 సెక్షన్ 60 ప్రకారం 40 శాతం అంగవైకల్యం గల దివ్యాంగులు, ఓటర్ జాబితా ప్రకారం 85 సంవత్సరాలు దాటిన వయో వృద్ధులైన ఓటర్లు, ప్రస్తుతం కొవిడ్ బాధితులుగా ఉన్న ఓటర్లు, అత్యవసర సేవలుగా గుర్తించబడిన ప్రభుత్వ శాఖల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవచ్చు.

జగన్‌రెడ్డి ఆస్తులు రూ.750 కోట్లు, నావి 70 లక్షలు



పెత్తందారు ఎవరో.. పేద ఎవరో గుర్తించండి

» చెల్లెలి దుస్తుల గురించి మాట్లాడడం దారుణం: బీటెక్ రవి

కడప, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): 'పులివెందుల వైసీపీ అభ్యర్థి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నామినేషన్‌లో చూపిన ఆస్తులు రూ.750 కోట్లు. నా ఆస్తులు రూ.70లక్షలు. దీనినిబట్టి మాలో ఎవరు పెత్తందారో, పేదవాడు ఎవరో ప్రజలు గుర్తించాలి' అని టీడీపీ అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి) అన్నారు. శుక్రవారం కడపలో ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి పులివెందుల సభలో తన చెల్లెలు కట్టుకున్న చీరల మాట్లాడడం చూస్తుంటే ఆయన ఏ స్థాయికి దిగజారాడో అర్థం చేసుకోవాలన్నారు. రాజశేఖర్‌రెడ్డి చనిపోయినపుడు రిలయన్స్ వారే చంపించారంటూ వాళ్ల పెట్రోల్ బంకులను దహనం చేసి.. ఎంతోమంది అమాయకులు బలైపోవడానికి కారణమయిన జగన్.. ముఖ్యమంత్రి అయ్యాక అంబానీ అనుచరుడికి రాజ్యసభ సీటు ఇచ్చారని విమర్శించారు. తన నాన్నను కాంగ్రెస్ వాళ్లే సీబీఐ కేసులో ఇరికించారని చెప్పిన జగన్.. తన లాయర్ ద్వారా ఆయనే వైఎస్ పేరును ఎఫ్‌ఐఆర్‌లో చేర్చేలా చేశారని ఆరోపించారు. 2017లో వివేకానందరెడ్డి ఎమ్మెల్సీగా పోటీ చేసినప్పుడు తాము ఆయన వ్యక్తిగత జీవితం కూడా మాట్లాడలేదని, జగన్ మాత్రం వివేకానందరెడ్డి రెండో పెళ్లి గురించి పులివెందుల నుంచే మాట్లాడడం సిగ్గుచేటన్నారు. పులివెందులలో అదనంగా ఒక్క ఎకరాకు కూడా జగన్ నీరు ఇవ్వలేదని, డ్రిప్ సిస్టంను పూర్తిగా నాశనం చేశారని విమర్శించారు. గతంలో ఉన్న స్టీల్ ప్లాంట్ నిర్మాణ స్థలాన్ని మార్చి కాంపౌండ్ వాల్ స్టేజ్‌లోనే పెట్టాడన్నారు. కడప-బెంగళూరు రైల్వేలైన్ ఊసే లేదని, ఇవన్నీ ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు.

వైసీపీకి ఓటేస్తే నాశనమే!

పిఠాపురంలో నన్ను ఓడించడానికి ఎర్రచందనం దొంగలను దింపారు. పవన్ ధైర్యవంతుడు. జగన్ పదో తరగతి చదువుకుంటున్న రోజుల్లో నేను చెగువేరా విప్లవం గురించి చదివాను. ఆయన పిచ్చివేషాలు వేస్తున్న రోజుల్లో 'తాకట్టులో భారతదేశం' పుస్తకాలు చదివాను. ఆయనలాంటి గూండాలకు బెదరను.

- పవన్ కల్యాణ్

(మొదటి పేజీ తరువాయి)

వస్తేనే జనం రోడ్లపైకి వస్తున్నారని.. అన్యాయం జరిగితే మాత్రం బయటకు రావడం లేదని.. బయటకు వచ్చి పోరాడాలని.. వారి ప్రాణాలకు తన ప్రాణాలు అడ్డు వేస్తానని భరోసా ఇచ్చారు. ఈ నెల 30న కూటమి మేనిఫెస్టో విడుదల చేస్తామని, అందులో అన్ని వర్గాలకు సమన్యాయం ఉంటుందని తెలిపారు. సమయం మించిపోవడంతో ద్రాక్షారామ సభలో ఆయన ఐదు నిమిషాలే మాట్లాడారు. పవన్ ఇంకా ఏమన్నారంటే..



రాజోలు నియోజకవర్గంలో జరిగిన సభకు హాజరైన జనం, టీడీపీ, జనసేన గుర్తులను చూపుతున్న పవన్

ఆలోచించి ఓట్లేయకుంటే..

జగన్ పాలనలో ఎదురుతిరిగి మాట్లాడితే కేసులు పెట్టి వేధిస్తున్నారు. రాజధాని అమరావతి కోసం ఆందోళన చేసిన దళిత రైతులపై అట్రాసిటీ కేసులు పెట్టించారు. నాపైనా అట్రాసిటీ కేసులు పెట్టారు. ఎన్నికలకు ఇంకా 18 రోజులు ఉన్నాయి. ఆలోచించి ఓట్లేయకపోతే జగన్ ఎవరినీ బతకనివ్వడు. వివేకానందరెడ్డిని నరికి చంపిన వారిని భుజాలపై ఎత్తుకుని మోస్తున్నాడు. దీనిని ప్రశ్నించిన చెల్లెలి దుస్తులపై కామెంట్ చేస్తున్నాడు. సొంత చెల్లెలి వస్త్రాలను ఎవరైనా చూస్తారా..? వేసుకునే దుస్తుల రంగుల గురించి మాట్లాడతామా? పసుపు చొక్కా వేసుకున్నారని బంతిపూలు దేవుడికి వేయడం మానేస్తామా? ఎవరు ఏ దుస్తులు వేసుకుంటే ఏంటి? నా భార్యను తిడుతున్నారు. నాపై వ్యక్తిగతంగా దాడి చేస్తున్నారు. చంద్రబాబు భార్యను కూడా వదలకుండా బూతులు తిట్టారు. జగన్ మళ్లీ వస్తే రాష్ట్రంలో మహిళలకు రక్షణ ఉండదు. జగన్ వచ్చాక కోనసీమ జిల్లాలో 20వేల ఎకరాల్లో రైతులు క్రాప్‌హాలిడే ప్రకటించారు.

దుష్టపరిపాలన ఆగాలి..

జగన్‌పై గులకరాయి విసిరిన నిందితుడిని పోలీసులు వెంటనే పట్టుకున్నారు. మరి అంతర్వేదిలో రథం అగ్నికి ఆహుతైతే నిందితులను ఇంకా ఎందుకు పట్టుకోలేదు? రకరకాల కారణాలు చెప్పి కేసును నీరుగార్చేశారు. పిచ్చోడి పని అన్నారు. తర్వాత తేనెపట్టుకు పెట్టిన మంటవల్ల రథం దగ్ధమైందన్నారు. రథం కాలిపోతే ఏమవుతుందని ఓ మంత్రి అపహాస్యం చేశారు. చివరకు కోనసీమలో కులాల మధ్య చిచ్చుపెట్టారు. ఇప్పటికీ అల్లర్ల కేసులో ఏ-1 అన్నె సాయిని మంత్రి విశ్వరూప్ పక్కనపెట్టుకుని తిరుగుతున్నారు. వారే గొడవలు సృష్టించారు. అందుకే దుష్ట పరిపాలన ఆగాలి.

ఆయన మళ్లీ వస్తే నాశనం కొని తెచ్చుకున్నట్లే. ఆ పార్టీకి ఓటేస్తే ఇక ఉద్యోగాలు ఉండవు. రైతులకు మద్దతు ధర ఉండదు. రాష్ట్రంలో ఎక్కడకు వెళ్లినా ప్రభుత్వం మారుతోంది అనేది తెలిసిపోతోంది. వైసీపీ ఓడిపోతుందనడంలో సందేహమే లేదు.

దేహీ అని బతకాలా..?

వైసీపీ అక్రమాలపై నిలదీస్తున్నందుకు ప్రతి అడ్డమైన వెధవతో మాటలు అనిపించుకున్నాను. నా సినిమా వకీల్‌సాబ్ విడుదలప్పుడు నేను వెళ్లి జగన్ కాళ్లపై పడాలని అనుకున్నారు. కాళ్లమీద పడేకంటే సినిమాను యూట్యూబ్‌లో అయినా విడుదల చేస్తానని చెప్పాను. దేహీ అని బతకడం నా వల్ల కాదు. ఎర్రచందనం నరికి అమ్ముకునేవారి ఎదుట, కులాల మధ్య చిచ్చుపెట్టే వారు, తెలుగు సినీ రంగ ప్రముఖులను అవమానించిన వారి వద్దకు వెళ్లి నేను మోకరిల్లాలా? జగన్ గుర్తుపెట్టుకో.. ఇది 2024. గతంలో ఓ వివాహంలో ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ మా పీలేరు జోలికి వస్తే ఊరుకోం. మా జోలికి వచ్చినా ఊరుకోం అన్నారు. అంటే.. ఎవరూ మీకు ఎదురు మాట్లాడకూడదా? మీరు మాత్రం అన్ని చోట్లా వేలు పెట్టేయొచ్చా? మిథున్‌రెడ్డి, పెద్దిరెడ్డి, జగన్‌కు మేం భయపడం.

అవినీతి కోటలు బద్దలు కొడతాం

రాష్ట్రంలో సంపద వైసీపీకి, కష్టాలు మాత్రం ప్రజలకు! గనులు దోపిడీ చేసేవాళ్లే అందలం ఎక్కుతున్నారు. వారంతా మనలో ధైర్యం చంపేస్తున్నారు. ధైర్యం నింపే నాయకత్వం వస్తోంది. వైసీపీ అవినీతి కోటలు బద్దలు కొట్టబోతున్నాం. వలసలు ఆగాలన్నా,గుంతలు లేని రహదారులు కావాలన్నా ప్రతి ఒక్కరికీ అండగా ఉండే కూటమి ప్రభుత్వం రావాలి. పిఠాపురంలో గెలవబోతున్నాను.

వైసీపీ అభ్యర్థి విద్యాసంస్థలో

రూ.కోటి పట్టివేత?!



విశాఖపట్నం, కూర్మన్నపాలెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్‌కు చెందిన 'రామబాణం' విద్యా సంస్థలో భారీగా నగదు నిల్వలు ఉన్నాయని శుక్రవారం ఫిర్యాదు అందింది. ఈ మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు 104 ఏరియాలో ఉన్న ఆ సంస్థకు వెళ్లి తనిఖీ చేశారు. సుమారుగా కోటి రూపాయల నగదు పట్టుకున్నట్టు తెలిసింది. కాగా, సీఎం జగన్, వైసీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి, ఆ పార్టీ విశాఖ జిల్లా గాజువాక అభ్యర్థి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బొమ్మలతో ఉన్న 280 టీ షర్టులను శుక్రవారం ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు.

పిఠాపురంలో వైసీపీ నేతల

ఇళ్లలో గోవా మద్యం

» రూ.80లక్షల విలువైన మద్యం పట్టివేత



పిఠాపురం జగ్గయ్యచెరువులోని ఓ వైసీపీ నేతదిగా భావిస్తున్న ఇంట్లో ఉన్న మద్యం బాక్సులు

పిఠాపురం, ఏప్రిల్ 26: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేస్తున్న కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని పలువురు వైసీపీ నేతల ఇళ్లలో భారీగా మద్యం నిల్వలను సెబ్ అధికారులు పట్టుకున్నారు. మొత్తం రూ.80లక్షల విలువైన మద్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలివీ.. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పోటీ చేస్తుండడంతో పిఠాపురంలో ఆయన ఓటమే లక్ష్యంగా వైసీపీ నేతలు కుట్రలకు తెరలేపుతున్నారు!. ఇప్పటికే డబ్బు ఇతర కానులకలతో ఓటర్లను మభ్యపెడుతున్నారు. ఇదే కోవలో ఓటర్లకు పంచేందుకు ఇతర ప్రాంతాలనుంచి భారీగా మద్యం తెచ్చి పలుచోట్ల నిల్వ చేశారు. దీనిపై సమాచారం అందుకున్న స్టేట్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, పోలీసు అధికారులు పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీ, సాలిపేట, వైఎస్సార్ గార్డెన్స్‌లతోపాటు పిఠాపురం మండలం కుమారపురంలో.. మొత్తం నాలుగు ఇళ్లపై శుక్రవారం రాత్రి ఏకకాలంలో దాడి చేశారు. మొత్తం 1015 బాక్సుల్లో ఉన్న 48,720 మద్యం బాటిళ్లను సెబ్, పోలీసు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నాలుగు ఇళ్లూ వైసీపీకి చెందిన వారివే కావడంతో ఆ పార్టీకి చెందిన నాయకులే ఇక్కడకు తెచ్చి మద్యాన్ని నిల్వ చేసినట్లు చెబుతున్నారు. వీటి విలువ రూ.80లక్షలకు పైగా ఉంటుందని అంచనా. పవన్‌పై గెలవలేమని తెలిసి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత ఇటువంటి కుట్రలకు తెరలేపారని, దీనివెనుక వైసీపీ పెద్దల హస్తం ఉందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆరోపించారు. మద్యం నిల్వలు వెనుక ఉన్న గీతను అరెస్టు చేయాలన్నారు. అలాగే, నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో భారీగా మద్యం, నగదును డంప్ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జగన్ పాలనలో అన్నీ మోసాలే

» ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు

» తిరువూరు, చింతలపూడి, దెందులూరు సభల్లో షర్మిల నిప్పులు

ఏలూరు/చింతలపూడి/దెందులూరు(ఆంధ్రజ్యోతి)/తిరువూరు, ఏప్రిల్ 26: 'జగన్ పాలనలో అన్నీ మోసాలే.. ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు' అంటూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా తిరువూరు, ఏలూరు జిల్లా చింతలపూడి, దెందులూరు నియోజకవర్గ పరిధిలోని గోపన్నపాలెం వద్ద జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ఆమె ప్రసంగించారు. 'మేనిఫెస్టో తనకు భగవద్గీత, బైబిల్, ఖురాన్ అన్నాడు. సీఎం అయిన తర్వాత ఒక్కసారి కూడా ప్రజల వద్దకు వచ్చిందే లేదు. మంత్రులు, ఎమ్మెల్యేలకే అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. రాష్ట్రాన్ని అప్పుల పాల్జేశాడు. కొత్తగా ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. మనకు మాత్రం చేతిలో చిప్ప మిగిల్చాడు' అంటూ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏటా సంక్రాంతికి జాబ్ కేలెండర్ ప్రకటిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్... ఐదేళ్లలో ప్రతి సంక్రాంతికి కోడి పందేలు వేయించడం వినహా ఒక్కసారి కూడా కేలెండర్ విడుదల చేయలేదని విమర్శించారు. 'అమరావతిని భ్రమరావతి చేశారు. మూడు రాజధానులు అని మూడు ముక్కలాడారు. మెగా డీఎస్సీ అంటు దగా డీఎస్సీ ప్రకటించారు. ఎన్నికల ముందు నిద్రలేచి 6వేల టీచరు ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఇదంతా జరిగేదా..? చచ్చేదా?' అంటూ షర్మిల దుయ్యబట్టారు.



చింతలపూడిలో జరిగిన సభలో మాట్లాడుతున్న షర్మిల

వైఎస్సార్ వారసుడైతే ఇలానే చేస్తాడా?

'ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ ఇక్కడకు వచ్చారు. చింతలపూడి ప్రాజెక్టు పూర్తి చేస్తామని హామీ ఇచ్చాడు. చింతలపూడి పథకం వైఎస్సార్ కల, ఆయన తనయుడిగా జగన్ ఏమీ చేయలేకపోయారు. ఈ ఐదేళ్లలో తట్టెడు మట్టి తీయలేదు. పోలవరం పూర్తి చేస్తానని జగన్ హామీ ఇచ్చాడు. చివరికి మనం కట్టేది కాదని చేతులెత్తేశాడు. వైఎస్సార్ వారసుడైతే ఇలానే చేస్తాడా?' అని నిలదీశారు. 'మద్యనిషేధం అన్న పెద్దమనిషి నాసిరకం మద్యం అమ్మకాలు జోరుగా సాగిస్తూ పేదల ప్రాణాలు హరిస్తున్నాడు. ఇందుకేనా వీరికి అధికారం ఇచ్చింది?' అంటూ మండిపడ్డారు. గతఎన్నికల ముందు తిరువూరు వచ్చిన జగన్.. సాగర్ కాల్వ నుంచి నియోజకవర్గంలోని 300 చెరువులకు నీరు మళ్లించి ప్రతి చెరువును రిజర్వాయరు చేస్తానని, ఎ.కొండూరు మండలంలో ఫ్లోరైడ్ బాధితులు అధికంగా ఉన్నారని, కిడ్నీ బాధితులకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు రిజర్వాయర్ నిర్మిస్తానని ఇచ్చిన హామీని నిలుపుకున్నాడా అని ప్రశ్నించారు. 'రాష్ట్రంలో వ్యవసాయాన్ని దండుగలా మార్చేశారు. పామాయిల్ పంటకు గిట్టుబాటు ధర అన్నాడు. కాకుంటే నష్టపరిహారం ఇస్తానన్నాడు. 2019లో పంట తక్కువ ధరకే అమ్మితే పరిహారమిస్తానని రైతులను మోసం చేశాడు. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏమైంది? రూ.4వేల కోట్లతో పంట నష్టపరిహారం నిధి ఏర్పాటు చేస్తామన్నారు. ఒక్క ఏడాదైనా రైతులకు రూపాయి కేటాయించారా?' అని విరుచుకుపడ్డారు. 'ఈ సీఎం ఐదేళ్లు మొద్దునిద్ర పోయాడా, గాడిదలు కాశాడా? ఎన్నికలు వచ్చేసరికి సిద్ధం అంటూ ప్రజల చెవుల్లో క్యాబేజీలు పెట్టేందుకొస్తున్నాడు' అని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఇండియా కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని షర్మిల విజ్ఞప్తి చేశారు.



సునీల్ యాదవ్‌కు బెయిలిస్తే

సాక్షులు ప్రభావితం!

» నిందితులు అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి జగన్‌కు సన్నిహితులు

» పలుకుబడి గల శక్తిమంతులు.. టీ హైకోర్టుకు సునీతా నివేదన

» వివేకా హత్య కేసు విచారణ ఎల్లుండికి వాయిదా



హైదరాబాద్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వివేకా హత్య కేసులో నిందితులుగా ఉన్న అవినాశ్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి.. సీఎం జగన్‌కు సన్నిహితులని, వారి ప్రోద్బలంతో హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఏ-2 సునీల్‌యాదవ్‌కు బెయిల్ ఇవ్వొద్దని వివేకా కుమార్తె సునీతారెడ్డి కోరారు. బెయిల్ ఇస్తే సాక్షులు మరింత ప్రభావితం అవుతారని టీ-హైకోర్టుకు నివేదించారు. 32 నెలలుగా జైల్లో ఉంటున్న తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సునీల్‌యాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. సునీతారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది నళిన్‌కుమార్ వాదనలు వినిపించారు. సునీల్ యాదవ్ నాలుగుసార్లు బెయిల్ పిటిషన్లు వేయగా హైకోర్టు కొట్టేసిందని గుర్తుచేశారు. హత్యకు కుట్ర నుంచి దానిని అమలు చేయడం ఆధారాల చెరిపివేత వరకు సునీల్ యాదవ్ పాత్ర ఉందని.. కీలక సాక్షి రంగన్న అతడిని గుర్తుపట్టినట్లు వెల్లడించారు. ఐదో నిందితుడు అయిన శివశంకర్‌రెడ్డికి బెయిల్ వచ్చినందున తనకూ బెయిల్ ఇవ్వాలన్న వాదనలకు అర్థం లేదని.. సునీల్ యాదవ్‌కు బెయిల్ మంజూరు చేయొద్దని కోరారు. సునీల్ యాదవ్ తరఫున సీనియర్ న్యాయవాది బీ రమేశ్, న్యాయవాది టీఎన్ నయన్‌కుమార్ వాదనలు వినిపించారు. పిటిషనర్ అమాయకుడని.. అప్రూవర్ దస్తగిరి వాంగ్మూలం తప్ప అతడికి వ్యతిరేకంగా ఒక్క సాక్ష్యం కూడా లేదన్నారు. పిటిషనర్ గొడ్డలి వినియోగించాడని చెబుతున్నప్పటికీ ఆ గొడ్డలి జాడ ఇప్పటికీ కనిపెట్టలేకపోయారని.. గూగుల్ టేకవుట్‌కు విశ్వసనీయత లేదని.. గూగుల్ సంస్థే దానికి సర్టిఫికెట్ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. సీబీఐ వాదనల కోసం తదుపరి విచారణను న్యాయమూర్తి సోమవారాని(ఈనెల 29)కి వాయిదావేశారు. ఈ మేరకు శుక్రవారం ఆదేశాలు జారీచేశారు.

జగన్ వేదన మీకు గుర్తుకు రాలేదా?

» తండ్రి మరణం వేళ ఆయనను ఒంటరిని చేశారు

» ఉప ఎన్నికల్లో మీ స్వార్థం మీరు చూసుకున్నారు

» వివేకా సతీమణి సౌభాగ్యమ్మకు అవినాశ్ తల్లి లక్ష్మి లేఖ

పులివెందుల, ఏప్రిల్ 26: వైఎస్ జగన్ 2009లో తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని కోల్పోయినప్పుడు పడిన వేదన మీకు గుర్తుకు రాలేదా అని మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి సతీమణి సౌభాగ్యమ్మను ఎంపీ అవినాశ్‌రెడ్డి తల్లి వైఎస్ లక్ష్మి ప్రశ్నించారు. సొంత చిన్నాన్న పట్ల జగన్ తీరుకు ఆవేదన చెందుతూ సౌభాగ్యమ్మ ఆయనకు లేఖ రాసిన విషయం తెలిసిందే. దానికి కౌంటరుగా వైఎస్ లక్ష్మి లేఖ రాసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. "2010లో కాంగ్రెస్ ప్రభుత్వం జగన్‌ను చిన్నచూపు చూసింది. ఆ సమయంలో మీరందరూ కలిసి ఆయనను ఒంటరివాడిని చేసి... మీ స్వార్థం మీరు చూసుకున్నారు. 2011లో నీ భర్తను మీరు, మీ కుమార్తె, అల్లుడు.... విజయమ్మపై పోటీ చేయించినప్పుడు వాళ్లు మనోవేదనకు గురికాలేదా? మీ కుమార్తె, అల్లుడు.. పూలంగళ్ల వద్ద డిగ్రీ కాలేజీలో కించపరిచే మాటలు మాట్లాడినప్పుడు వారు ఎంత మనోవేదన అనుభవించారో మీకు తెలియదా? వివేకా.... జగన్‌ను సీఎంగా చూడాలని కోరుకున్న మాట వాస్తవం. అలాగే 14 మార్చి 2019 రాత్రి కూడా అవినాశ్‌ను ఎంపీగా గెలిపించాలని వివేకా ప్రచారం చేసిన మాట కూడా వాస్తవమే. ఒకప్పుడు మీరు కూడా ఈ విషయం అంగీకరించారు. అలాంటిది మళ్లీ ఇప్పుడు ఎంపీ టికెట్ కోసం హత్య జరిగిందని తప్పుడు ప్రచారం చేయడం, సంబంధం లేని వారిని ఈ కేసులో ఇరికించడం తప్పు అనిపించడం లేదా?" అని తన లేఖలో ప్రశ్నించారు.



సమర్థ్ మొబైల్ యాప్ పనితీరును పరిశీలిస్తున్న సీఈవో ఎంకే మీనా

ఎన్నికల్లో క్విక్ పోలీసింగ్ కోసం

'సమర్థ్' మొబైల్ యాప్

» యాప్‌ను రూపొందించి ప్రయోగాత్మకంగా వినియోగిస్తున్న బాపట్ల ఎస్పీ

» శాంతి భద్రతల్లో తక్షణ చర్యలకు ఉపయోగం

» బాపట్ల ఎస్పీకి సీఈవో మీనా అభినందనలు

» ఎస్పీలు, సీపీలు, సెక్టార్ అధికారులు వినియోగించాలని ఆదేశాలు

అమరావతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మే 13న జరగనున్న ఎన్నికల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టేందుకు సమర్థ్ మొబైల్ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని, ఈ యాప్‌ను అన్ని జిల్లాల ఎస్పీలు, సీపీలు, సెక్టార్ ఆఫీసర్లు వినియోగించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్ కుమార్ మీనా ఆదేశించారు. ఎన్నికల వేళ స్మార్ట్ అండ్ క్విక్ పోలీసింగ్ కోసం ఈ యాప్ ఎంతో దోహదపడుతుందన్నారు. సమస్యాత్మక, సాధారణ పోలింగ్ కేంద్రాల లొకేషన్లను ఎంతో సులభంగా గుర్తించవచ్చని తెలిపారు. తద్వారా మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్, స్పెషల్ స్ట్రైకింగ్ బృందాలను తక్షణమే పంపించే అవకాశం ఉంటుందన్నారు. కంట్రోల్ రూమ్ నుండే పోలీస్ బలగాల లొకేషన్‌లు గూగుల్ మ్యాప్ ద్వారా ట్రాక్ చేయవచ్చని అభిప్రాయం వ్యక్తంచేశారు. ఎన్నికల సమయంలో ఇటువంటి స్మార్ట్ అండ్ క్విక్ పోలీసింగ్ మొబైల్ యాప్‌ను అభివృద్ధిపరిచి ప్రయోగాత్మకంగా బాపట్ల జిల్లాలో వినియోగిస్తున్న బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్‌ను మీనా అభినందించారు. అంతకుముందు సీఈవో మీనాను ఎస్పీ జిందాల్ అమరావతి సచివాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి తమ జిల్లాలో ఉపయోగిస్తున్న ఈ సమర్థ్ మొబైల్ యాప్ గురించి వివరించారు. తమ జిల్లా ఐటీ కోర్ విభాగం రూపొందించిన ఈ యాప్‌ను ప్రయోగాత్మకంగా ఈ నెల 22నుంచి వినియోగిస్తూ మంచి ఫలితాలను సాధిస్తున్నట్లు తెలిపారు. ఈ యాప్ ద్వారా పోలీస్ అధికారులు డైరెక్ట్‌గా కాల్ చేయవచ్చని, ఒక్క నోటిఫికేషన్ ద్వారా జిల్లాలో ఉన్న 2000 వేల మంది పోలీసులకు ఒకేసారి ఆదేశాలు జారీ చేయవచ్చని తెలిపారు. సమస్యాత్మక, సాధారణ పోలింగ్ కేంద్రాలను గుర్తించడానికి, యాప్ నుంచి నేరుగా కంట్రోల్ రూమ్‌కు కాల్ చేయడానికి, సమస్యాత్మక ప్రాంతాలకు తక్షణమే పోలీస్ బలగాలు చేరుకోవడానికి, శక్తివంతమైన, బలమైన నిజ సమయ అప్లికేషన్‌గా ఈ యాప్ పనిచేస్తుందని సీఈవో మీనాకు ఆయన వివరించారు.

సీఎం వస్తున్నారని చెట్లు నరికేశారు


తాడిపత్రి టౌన్, ఏప్రిల్ 26: ఎన్నికల ప్రచారం కోసం 28న అనంతపురం జిల్లా తాడిపత్రికి సీఎం జగన్ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడి పుట్లూరు రోడ్డులోని పచ్చని చెట్లను శుక్రవారం నరికివేశారు. కర్నూలు వెంచర్ సమీపంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ నుంచి పుట్లూరు రోడ్డు, గాంధీసర్కిల్ మీదుగా వైఎస్ఆర్ సర్కిల్‌కి జగన్ చేరుకోనున్నారు. ఈ రోడ్డు మీదుగా సీఎం వస్తుండటంతో చెట్లు అడ్డుగా ఉన్నాయని మున్సిపల్ అధికారులు వాటిని కొట్టించేశారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరుడు దాసరి కిరణ్ ఎన్నికల ఆర్వోకు ఫిర్యాదు చేశారు.



అనంతపురం జిల్లా తాడిపత్రిలో నరికేసిన చెట్లు

ఏపీ ఎన్నికల ప్రత్యేకం-2024
ప్రజా అజెండా

జన కేతనం





కౌంట్ డౌన్ 16 రోజులు

ఆంధ్రజ్యోతి
శనివారం ◇ 27-4-2024



సుందరతీరం... చక్కటి నగరం! విశాఖపట్నం అంటే ఇష్టంలేని వాళ్లు ఎవరుంటారు? మనకే కాదు... వైసీపీ నేతలకూ విశాఖ అంటే ఇష్టమే! కానీ... ఆ ఇష్టం విశాఖనగరంలోని ఆస్తుల మీద! చుట్టూ విస్తరించిన వనరుల మీద! విశాఖపై ఎప్పటి నుంచో కన్నేసి... ఓ 'స్కెచ్' గీసిపెట్టుకున్న వైసీపీ పెద్దలు, అధికారంలోకి రాగానే దానిని అమలు చేయడం ప్రారంభించారు. ఇందులో భాగంగా పెట్టుబడిదారులనూ వేధించి, వారు ఇక్కడి నుంచి పారిపోయేలా చేశారు. కోట్ల విలువైన ప్రాజెక్టుల్లో వాటాలు కొట్టేశారు. విపక్ష నేతల ప్రహరీలు కూల్చేయడం మొదలుకుని... రుషికొండకు గుండు కొట్టడం దాకా అంతా ఒక 'పద్ధతి' ప్రకారం జరిగింది! ఈ ఐదేళ్లలో విశాఖలో వైసీపీ గ్యాంగ్ చేసిన దందాలు, దోపిడీలు... మచ్చుకు కొన్ని!

- వందల కోట్ల విలువైన ప్రాజెక్టులు హస్తగతం
- ప్రవాసాంధ్రుడికి బెదిరింపులతో దందాలు షురూ
- వచ్చీ రాగానే విపక్ష నేతల ఆస్తులపై దాడులు
- బెదిరింపులకు లొంగని వారికి వేధింపులు
- జగన్ కుటుంబం మనసు పడగానే 'బే పార్క్' గాయబ్
- బెదిరించి, తాళాలు వేయించి 'కార్తీకవనం'లో వాటాలు
- వేలకోట్ల విలువైన దసపల్లా భూములతో జల్సా
- ఉచిత సభ్యత్వం ఇవ్వలేదని వాల్తేరు క్లబ్బుపై పగ
- రామానాయుడు స్టూడియో భూములతో వ్యాపారం
- విశాఖలో సామాన్యుల ఆస్తులకూ భద్రతలేక భయం

బే పార్కు... బినామీల హస్తగతం

రుషికొండలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన హెల్త్‌స్పా.. 'బే పార్క్'! ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే లీజుకు తీసుకున్న 37 ఎకరాల్లో ఇండో అమెరికన్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ సంస్థ దీనిని ఏర్పాటు చేసింది. అది 33 ఏళ్ల లీజు ఒప్పందం. 1998లో భూమిని ఇవ్వగా, కష్టపడి కేంద్రం నుంచి అనుమతులు, బ్యాంకుల నుంచి రుణాలు తీసుకువచ్చి నిర్మాణాలు చేపట్టి..11 ఏళ్ల కిందట సేవలు ప్రారంభించింది. 'బే పార్క్' 28 ఎకరాలు కొండపై ఉండగా, దానికి ఎదురుగా తీరాన్ని ఆనుకొని మరో 9 ఎకరాలు ఉంది. దీనిపైనా వైసీపీ పెద్దల కన్ను పడింది. 'మూడు ముక్కలాట' మొదలుపెట్టిన అనంతరం... జగన్ కుటుంబ సభ్యులు విశాఖలో బే పార్క్‌ను చూసి ముచ్చటపడి, 'ఇక్కడే మన కాపురం' అని డిసైడ్ అయ్యారట! అంతే మొత్తం సీన్ మారిపోయింది. బే పార్క్ నిర్వాహకులకు బ్యాంకుల్లో కొంత రుణం ఉంది. 'ఆ బ్యాంకు రుణం మేం మేం చూసుకుంటాం. భూమి ఎలాగూ ప్రభుత్వానిదే! ఇన్నాళ్లూ మీరు చేసిన కష్టానికి ఓ పది శాతం వాటా ఇస్తాం' అంటూ బే పార్కును లాగేసుకున్నారు. ఆ సంస్థ లీజు గడువులో 25 ఏళ్లు గడిచిపోయాయి. ఇంకో ఎనిమిదేళ్లు మాత్రమే ఉంది. ఈ మిగులు కాలంలో దానిపై వెచ్చించిన మొత్తం తిరిగి వచ్చే పరిస్థితి కనిపించలేదు. దాంతో లీజు కాలం పొడిగించాలని నిర్ణయించారు. అధికారం చేతిలో ఉండడంతో అనుకున్నదే తడవుగా లీజును 99 ఏళ్లకు పెంచేశారు.

జాగో.. వైజాగ్!

'ఒక్క చాన్స్' రాగానే విశాఖపై వైసీపీ పంజా

పెద్దల కన్ను పడితే వాటాలు ఇవ్వాల్సిందే


బే పార్క్

చిత్రబ్రహ్మ!



చింటూ: బటన్ నొక్కాడు కదరా!
చిన్నూ: పోలవరం పోయిందిరా!
చింటూ: బటన్ నొక్కాడు కదరా!
చిన్నూ: అమరావతి ఆగిందిరా!
చింటూ: బటన్ నొక్కాడు కదరా!
చిన్నూ: రోడ్లన్నీ గుంతలేరా!
చింటూ: బటన్ నొక్కాడు కదరా!
చిన్నూ: పరిశ్రమలు పోయాయి రా!
చింటూ: బటన్ నొక్కాడు కదరా!
చిన్నూ: స్టేటు అప్పు 10 లక్షల కోట్లకు చేరిందిరా!
చింటూ: బటన్ నొక్కాడు కదరా!
చిన్నూ: భూములూ నొక్కేశారురా!
చింటూ: బటన్ నొక్కాడు కదరా!
చిన్నూ: అన్నీ పాత పథకాలేరా స్వామీ! ఇంకో మాట ఏదైనా చెప్పు!
చింటూ: చెప్పుకోడానికి అదొక్కటే ఉందిరా నాయనా! అర్థం చేసుకోవూ...!



'సినిమా' చూపించారు..



విశాఖపట్నానికి సినీ పరిశ్రమ విస్తరించాలని ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు భీమిలి బీచ్‌రోడ్డులో కొండపై 34.44 ఎకరాలను రామానాయుడుకు చెందిన సురేశ్ ప్రొడక్షన్స్‌కు కేటాయించారు. ఆ భూమిని కేవలం సినిమా షూటింగ్‌లు, స్టూడియో నిర్మాణాలకు మాత్రమే వినియోగించాలి. అందులో కొంత భూమి మాత్రమే ఉపయోగించుకొని భవిష్యత్తులో విస్తరించాలని మరికొంత ఖాళీగా ఉంచారు. దానిపై వైసీపీ పెద్దల కన్ను పడింది. 'వాటా ఇస్తారా? ఖాళీ భూమిని వెనక్కి తీసేసుకొమ్మంటారా?' అని బెదిరించారు. ఖాళీ స్థలంలో లేఅవుట్ వేసి కొన్ని ప్లాట్లు ఇవ్వాలని ప్రతిపాదించారు. మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) కమిషనర్ ఒకరు ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిపోతూ అడ్డగోలుగా ఈ లేఅవుట్‌కు అనుమతి ఇస్తూ సంతకం చేసేశారు. 15.18 ఎకరాల్లో లేఅవుట్.. అందులో రెండొంతులు వైసీపీ పెద్దలకు! ఇదీ తెరవెనుక ఒప్పందం! దీనిపై విశాఖ తూర్పు ఎమ్మెల్యే రామకృష్ణబాబు కోర్టుకు వెళ్లడంతో... ప్లాట్ల విక్రయాలు ఆగిపోయాయి.

భూముల కోసం భయపెట్టి...

ఏపీలో ఐటీ అంటే విశాఖే. ఇండియన్ సిలికాన్ వ్యాలీగా పేరుంది. చంద్రబాబు కృషి వల్ల పేటీఎం, ఐబీఎం, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, ఎడెక్కొ (రిక్రూటింగ్ కంపెనీ), కార్డిలిటిక్స్ (అమెరికా కంపెనీ), హెచ్ఎస్‌బీసీ వంటి ప్రముఖ సంస్థలు ఏర్పాటయ్యాయి. వైసీపీ అధికారంలోకొచ్చాక కంపెనీల్లో వాటాలు కోరడం మొదలైంది. భూములు వెనక్కి తీసుకుంటామని బెదిరించారు. దీంతో ఐబీఎం, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ సహా పైన పేర్కొన్న కంపెనీలన్నీ విశాఖ నుంచి వెళ్లిపోయాయి. ఇంకో 50 చిన్న కంపెనీలు మూతపడ్డాయి. అంతర్జాతీయంగా పేరుపొందిన లులూ సంస్థ బీచ్‌రోడ్డులో 13 ఎకరాల విస్తీర్ణంలో భారీ షాపింగ్‌మాల్, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి టీడీపీ హయాంలో ఒప్పందం జరిగింది. వైసీపీ వచ్చాక పర్సంటేజీలు డిమాండ్ చేయడంతో.. లులూ హైదరాబాద్‌కు వెళ్లిపోయింది. ఆ భూమిని అతి తక్కువగా రూ.1450 కోట్లకు అస్మదీయులకు అమ్మి సొమ్ము చేసుకోవాలని వైసీపీ పెద్దలు ప్రయత్నించారు. కానీ... పలువురు కోర్టుకు వెళ్లి స్టే తీసుకువచ్చారు.

కార్తీకవనమూ... కైవసం



విశాఖపట్నంలో చేతులు మారిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల్లో 'కార్తీకవనం' ఒకటి. ఇప్పుడు అందులో రాడీసన్ బ్లూ పేరుతో 5 స్టార్ హోటల్ నడుస్తోంది. విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ఓ ప్రైవేటు సంస్థతో 20 ఏళ్ల క్రితం చేసుకున్న బీఓటీ ప్రాజెక్టు ఇది. విశాఖ-భీమిలి బీచ్‌రోడ్డులో సాగర్‌నగర్ దగ్గర బీచ్‌ను ఆనుకొని పది ఎకరాల స్థలాన్ని 33 ఏళ్ల లీజుకు ఇచ్చారు. ఆ ప్రాజెక్టు పూర్తవుతున్న దశలో వైసీపీ అధికారంలోకి వచ్చింది. దానిపై అధికార పార్టీ పెద్దల కన్ను పడింది. అంతే... ఆ ప్రాజెక్టు ప్రాంగణానికి ఒక పోలీస్ అధికారి తాళాలు వేయించారు. పెద్దలతో మాట్లాడుకోవాలని పరోక్షంగా సందేశాలు ఇచ్చారు. ప్రాజెక్టు భాగస్వాములకు విషయం అర్థమైంది. విశాఖలో పార్టీ వ్యవహారాలు చూస్తున్న ఓ నేతను కలిశారు. అందులో 50 శాతం వాటా సమర్పించుకున్నారు. ఆ తర్వాత... పనుల పూర్తికి సహకరించడంతోపాటు ప్రభుత్వ కార్యక్రమాలన్నీ అక్కడే నిర్వహిస్తూ వ్యాపారాభివృద్ధికి కూడా తోడ్పాటు అందిస్తున్నారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

క్లబ్బుపై గబ్బు

విశాఖపట్నంలో వాల్తేరు క్లబ్‌కు వందేళ్ల చరిత్ర ఉంది. అనేక మంది ప్రముఖులు ఇందులో సభ్యులు! కొత్తగా సభ్యత్వం కావాలంటే... రూ.50 లక్షలు కట్టాలి. కానీ... కొందరు 'పెద్దలు' తమకు ఫ్రీగా క్లబ్బు మెంబర్‌షిప్ కావాలని డిమాండ్ చేశారు. నిర్వాహకులు అందుకు అంగీకరించలేదు. క్లబ్బు నిబంధనలు ఒప్పుకోవని చెప్పారు. అంతే... వైసీపీ పెద్దల్లో గబ్బు ఆలోచనలు మొదలయ్యాయి. అందులో ప్రభుత్వ భూమి ఉందని, క్లబ్బును స్వాధీనం చేసుకొంటామని బెదిరించారు. కొలతలు వేశారు. రికార్డులు విజయవాడ తీసుకువెళ్లారు. క్లబ్బు ప్రతినిధులు దీనిపై కోర్టును ఆశ్రయించారు. వైసీపీ రాజ్యసభ సభ్యుడు, నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి పది రోజుల క్రితం వాల్తేరు క్లబ్బు గురించి ప్రస్తావించారు. "వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే వాల్తేరు క్లబ్‌లో ప్రభుత్వ భూమి తీసుకుంటాం" అని ఆయన చెప్పడం గమనార్హం.



దసపల్లా భూములు హస్తగతం



విశాఖలో దసపల్లా భూముల వివాదం కొన్ని దశాబ్దాలుగా నడుస్తోంది. నగరం నడిబొడ్డున ఉన్న ఆ భూముల విలువ రూ.3 వేల కోట్లు. వాటిని 15 ఏళ్ల కిందటే నిషేధిత (22-ఏ) జాబితాలో చేర్చారు. వైసీపీ అధికారంలోకి రాగానే విజయసాయిరెడ్డి రంగంలోకి దిగారు. అయితే... సుప్రీంకోర్టు ఇచ్చిన ఓ తీర్పును అడ్డం పెట్టుకొని ఆ భూములను ప్రభుత్వ జాబితా నుంచి తప్పించి, 65 మందికి దఖలు పడేలా చేశారు. ఆ తర్వాత వారందరినీ బెదిరించి... 75,600 చ.గ. స్థలాన్ని డెవలప్‌మెంట్ పేరుతో తీసుకొని, తమ బినామీలతో ఏర్పాటుచేసిన కంపెనీతో ఒప్పందం చేయించారు. ఆ 65 మందికి నామమాత్రపు వాటా ఇచ్చి, అత్యధిక వాటా సాయిరెడ్డి అండ్ కో తీసుకున్నారు. అధికారులను బెదిరించి తక్కువ ఫీజుతో డెవలప్‌మెంట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

కోడికత్తి కేసులో కక్ష.. వ్యాపారం బంద్

విశాఖ విమానాశ్రయంలో జగన్‌పై కోడికత్తితో దాడి చేసిన నిందితుడు శ్రీను పని చేస్తున్న రెస్టారెంట్ టీడీపీ సానుభూతిపరుడైన హర్షవర్ధన్‌ది. వైసీపీ రాగానే ఆయనపై కక్షగట్టారు. సిరిపురంలో వీఎంఆర్‌డీ నుంచి లీజుకు తీసుకున్న స్థలంలో నిర్వహిస్తున్న 'ఫ్యూజన్ ఫుడ్స్'ను రాత్రికి రాత్రి ఖాళీ చేయించారు. 50 మంది సిబ్బందితో, ఓ 25 మంది పోలీసులతో సామగ్రిని వాళ్లే పది లారీల్లోకి ఎక్కించేశారు. ఆ తరువాత గేటుకు నోటీసు అంటించారు. దీనిపై ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఏడాది తిరగకుండానే దానిని వెనక్కి ఇవ్వాలని తీర్పు వచ్చింది.

విల్లాలతో విలాసం..

అనకాపల్లి జిల్లాలో వైసీపీ పెద్దలు ఏకంగా 403 ఎకరాల్లో అత్యంత రహస్యంగా 'భూయజ్ఞం' చేశారు. అడవులు, కొండలు, గోర్జీలు కలిపేసుకున్నారు. చివరికి 'వింటేజ్ మౌంట్ వ్యాలీ రిసార్ట్' పేరుతో విల్లాల వ్యాపారం మొదలుపెట్టారు. ప్రారంభ ఆఫర్‌గా 500 గజాల ప్లాటు రూ.25 లక్షలకే ఇస్తున్నామని చెప్పి అమ్మేసుకుంటున్నారు. ఈ దందాను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపి ఇచ్చిన నివేదిక బుట్టదాఖలైపోయింది. ఈ మొత్తం కథ నడిపిస్తున్నది వైసీపీ పెద్దలే!

కక్ష సాధింపే...

పల్లా శ్రీనివాస్ భవనం కూల్చివేత



గాజువాక మాజీ ఎమ్మెల్యే, టీడీపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ జిల్లా అధ్యక్షుడైన పల్లా శ్రీనివాసరావును వైసీపీలోకి రావాలని ఎంపీ విజయసాయిరెడ్డి ఆహ్వానించారు. ఎమ్మెల్సీ పదవి ఇస్తామన్నారు. దీనిని ఆయన సున్నితంగా తిరస్కరించారు. అంతే... పల్లాపై పగ మొదలైంది. ఆయన గాజువాకలో అన్ని అనుమతులతో నిర్మించుకుంటున్న షాపింగ్ కాంప్లెక్స్‌లో నిబంధనల ఉల్లంఘన ఉందంటూ 2021 ఏప్రిల్ 25న కొంత భాగం కూలగొట్టించారు. భవనానికి మూడు శ్లాబులు వేసిన తరువాత ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఓ ఆదివారం తెల్లవారుజామున 200 మంది పోలీసులు, జీవీఎంసీ సిబ్బంది జేసీబీలతో వచ్చి నిర్మాణం కూల్చివేత ప్రారంభించారు.

'గీతం'పై పదేపదే దాడులు

ప్రతిష్ఠాత్మక గీతం విశ్వవిద్యాలయంపై వైసీపీ పెద్దలు పగబట్టినట్లు వ్యవహరించారు. ఈ సంస్థ టీడీపీ నేతలది కావడం, చంద్రబాబు కుటుంబంతో బంధుత్వం ఉండడమే దీనికి కారణం. విస్తరణలో భాగంగా తన ప్రాంగణాన్ని ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూములు కావాలని టీడీపీ హయాంలోనే గీతం దరఖాస్తు చేసుకుంది. వాటికి ధర చెల్లిస్తామనీ పేర్కొంది. ఆ మేరకు వాటిని తన ఆధీనంలో ఉంచుకుంది. దీనిని సాకుగా చేసుకుని.. ఈ ఐదేళ్లలో మూడుసార్లు వర్సిటీలోకి అర్ధరాత్రి వేళ పోలీసుల సాయంతో ప్రవేశించారు. ప్రహరీలు కూలగొట్టి నానా రభస చేశారు.

సబ్బం హరి ఇంటిపైనా దాడి

మాజీ ఎంపీ, విశాఖ మాజీ మేయర్ సబ్బం హరి గత ఎన్నికల్లో టీడీపీ తరఫున భీమిలి నుంచి పోటీ చేశారు. నిత్యం టీవీ చర్చల్లో వైసీపీని, జగన్‌ను విమర్శించారని ఆయనపై కసి పెంచుకున్నారు. సీతమ్మధారలో ఆయన ఇంటి పక్కనున్న 4 అడుగుల పార్కు స్థలాన్ని కలిపి ప్రహరీ నిర్మించారనే ఆరోపణలతో 2020 అక్టోబరు 3 తెల్లవారు జామున పోలీసులు, జేసీబీలతో వెళ్లి ప్రహరీని కూల్చి, నానా రచ్చ చేశారు.

ది లీడర్


వావిలాల గోపాలకృష్ణయ్య

నాలుగుసార్లు ఎమ్మెల్యే

పెన్షన్‌తోనే బతికారు

ఓసారి ఎమ్మెల్యే అయితేనే.. ఖరీదైన కార్లు, చుట్టూ గన్‌మెన్, వందిమాగధులు.. హంగామా మామూలుగా ఉండదు. అలాంటిది.. నాలుగుసార్లు ఎమ్మెల్యే అయినా చాలా సాధారణ జీవితం గడిపేవారు. రైలులో ప్రయాణికులతో కలసి థర్డ్ క్లాస్‌లో ప్రయాణించేవారు. జీవితం చివరి దశలో మాజీ ఎమ్మెల్యేగా తనకు వచ్చే పెన్షన్‌పైనే ఆధారపడి జీవనం సాగించారు. ఆయనే... ఆంధ్రా గాంధీగా, అపర భీష్ముడిగా పేరొందిన పద్మవిభూషణ్ వావిలాల గోపాలకృష్ణయ్య. 1906 సెప్టెంబరు 17న సత్తెనపల్లిలో జన్మించారు. స్వరాజ్య భిక్ష పేరుతో ఇంటింటికీ తిరిగి బియ్యం, జొన్నలు సేకరించి వాటితో కార్యకర్తలకు భోజన సదుపాయం కల్పించేవారు. ప్రజాఉద్యమాలే ఊపిరిగా జీవించారు. తెల్లదొరలను ఎదిరించి జైలు జీవితం గడిపారు. పాత్రికేయుడిగా, రచయితగా, అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా బహుముఖ పాత్రలు పోషించారు. సత్తెనపల్లి నుంచి వావిలాల మూడుసార్లు స్వతంత్ర అభ్యర్థిగా, ఒకసారి సీపీఐ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఒక పర్యాయం ఆయన హైదరాబాద్ వెళ్లేందుకు టికెట్ బుక్ చేసుకుని స్టేషన్‌కు వెళ్లారు. తీరా రైలు ఎక్కేటప్పుడు చూసుకుంటే తాను తీసుకున్న టికెట్ మరుసటి రోజుదని గ్రహించారు. ఇది పొరపాటున జరిగింది. వెంటనే ఆయన ప్రయాణం వాయిదా వేసుకుని, రైలు దిగి స్టేషన్ ప్రాంగణం నుంచి బయటకు నడవసాగారు. విషయం తెలుసుకున్న టీసీలు పరుగున వచ్చి.. 'ఫస్ట్ ఏసీలో ఖాళీలు ఉన్నాయి. మీరు ప్రయాణించేందుకు ఏర్పాట్లు చేస్తాం' అని విజ్ఞప్తి చేశారు. అయితే వావిలాల సున్నితంగా తిరస్కరించి వెనక్కి వచ్చేశారు. 90 ఏళ్ల వయసులో కూడాఉద్యమాల పేరుతో ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా ఆయన విస్తృతంగా పర్యటించేవారు. చివరి శ్వాస వరకు సమాజ హితం కోసం పరితపిస్తూ, కుటుంబ బాంధవ్యాలకు దూరంగా ఉంటూ 2003 ఏప్రిల్ 29న బ్రహ్మచారిగానే తనువు చాలించారు.

-గుంటూరు, ఆంధ్రజ్యోతి

ఇదే మొదటి దెబ్బ..

'వైసీపీతో ఇలాగే ఉంటుంది' అని జగన్ ముఖ్యమంత్రి అయిన కొన్ని రోజులకే విశాఖ వాసులకు తెలిపిన ఉదంతమిది! 'ఇక మన భూములు, స్థలాలు భద్రం కాదు' అని అందరూ జాగ్రత్తపడాల్సి వచ్చింది. అంతే కాదు.. ఈ దందాల వెనుక నేరుగా సర్కారు పెద్దలు ఉన్నారని కూడా అర్థమైపోయింది. ఆ సంఘటన ఏమిటంటే... విశాఖలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఐదెకరాల భూమిని ప్రవాసాంధ్రుడైన లలితేశ్ 19 ఏళ్ల క్రితం కొనుగోలు చేశారు. అది అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూమి. వైఎస్ హయాంలో రూ.10 కోట్ల రుసుము చెల్లించి మరీ క్రమబద్ధీకరించుకున్నారు. కాలక్రమంలో ఆ భూమి ధర పెరుగుతూ వచ్చింది. వైసీపీ అధికారంలోకి రాగానే.. కొందరు సీమ నేతలు విశాఖలో దిగారు. లలితేశ్ భూమిపై కన్నేశారు. "ఈ భూమి రూ.100 కోట్ల విలువ చేస్తుంది. లిటిగేషన్ ఉందని భయపెడితే డబ్బులొస్తాయి" అని ప్లాన్ వేశారు. పులివెందుల బ్యాచ్ లలితేశ్ బావమరిది నరేశ్‌కుమార్ ఇంటికి వెళ్లారు. "మాకు కొంత వాటా ఇవ్వాల్సిందే. లేదంటే.. వివాదాస్పదమంటూ మొత్తం భూమి లాగేసుకుంటాం" అని తుపాకీ చూపించి బెదిరించారు. పులివెందుల రౌడీలు బెదిరించిన కొన్ని రోజులకే.. ఆ భూమిని స్వాధీనం చేసుకుంటూ అమరావతి నుంచి జీవో జారీ అయ్యింది. దీనిపై లలితేశ్ హైకోర్టును ఆశ్రయించారు. అనుకూలంగా తీర్పు వచ్చింది. వెంటనే లలితేశ్ బంధువులు ఆ భూమిలో నర్సరీ, బేకరీ ఏర్పాటు చేసుకున్నారు. అయినా... ఇప్పటికీ వైసీపీ నేతలు వారిని వదలడం లేదు. ఏదో ఒక గొడవ సృష్టించి, అధికారులను అక్కడికి పంపి నిర్మాణాలు చేపట్టకుండా అడ్డుపడుతున్నారు.


ఎన్ఆర్ఐ లలితేశ్ భూములు

రాజధాని పేరుతో విశాఖకు వంచన

ప్రత్యేక కథనం రేపటి సంచికలో

ప్రతిఘటన ఒక్కటే సరిపోదు. మార్పు కావాలంటే ఓటు వేయాలి



దషాన్ స్టోక్స్ (అమెరికన్ రచయిత)



కేఏ పాల్, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు

అబ్బ ఛా!

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అడ్డుకున్నా

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నా వల్లే ఆగింది. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా చేసేందుకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో లాయర్ లేకుండా నేనే వాదించాను. ఆర్డర్ తీసుకొచ్చి స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేశాను. ఫలితంగా నా సత్తా ఏంటో సీఎం జగన్, ప్రధాని మోదీకి తెలిసింది.



వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రామతీర్థంలో కోదండరాముడి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. అంతర్వేదిలో రథం తగులబెట్టారు. దుర్గ గుడిలో అమ్మవారి వెండి రథానికి ఉన్న వెండి సింహాలు చోరీ అయ్యాయి. ఇవికాకుండా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను ధ్వంసం చేసిన ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. దేవాలయాలను గాలికొదిలేసిన జగన్ సర్కారు.. నిత్యం దేవుడి సేవలో ఉంటూ లోకకల్యాణం కోసం పూజలు నిర్వహించే అర్చకుల భద్రతను కూడా పట్టించుకోలేదు.







అర్చకులపై అమానుషం!

విచక్షణ లేకుండా ఆలయాల్లోనే దాడులు

- భక్తుల ఎదుటే దుర్భాషలు, బూతుపురాణం.. జంధ్యం తెంచేసి.. చెంప దెబ్బలు కొడుతూ
- కర్రలు, చెర్నాకోలాతో వాతలు పడేలా దాడి.. పూజారులపై వైసీపీ నాయకుల రాక్షసత్వం
- దాడులను ఏనాడూ ఖండించని సీఎం జగన్.. బాధ్యులపై చర్యలు లేకపోగా కాపాడే యత్నం
- 'ధూపదీప నైవేద్యం' అమలులో భారీ కోతలు.. వేతన పెంపు రూ.3,125తో సరిపెట్టిన సర్కారు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అధికార మదం తలకెక్కిన కొందరు వైసీపీ నేతలకు కన్నూమిన్నూ కనిపించడం లేదు. భక్తితో మొక్కాల్సిన దేవుడన్నా, ఆయనకు సేవ చేసేవారన్నా అమితమైన ద్వేషం పెంచుకొని వారిపట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. దైవ సన్నిధిలో విజ్ఞతతో మెలగాలన్న కనీసం జ్ఞానం కూడా లేకుండా భక్తుల ఎదుటే బూతు పురాణం ఎత్తుకుంటూ, అర్చకులు, పురోహితులపై విచక్షణ మరిచి రౌడీల్లా దాడులకు తెగబడి, వారి ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తున్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచీ ఈ తరహా ఘటనలు తరచూ జరుగుతునే ఉన్నాయి. ఆయా సందర్భాల్లో అర్చకులు, పురోహితులు, హిందూ సంఘాలు రోడ్డెక్కి నిరసనలు తెలిపినా అధికార పార్టీ నేతల్లో ఏమాత్రం మార్పు రావడం లేదు. ప్రభుత్వం కూడా ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో పాటు తమ పార్టీ నేతలను కాపాడే ప్రయత్నాలు చేయడం.. బాధ్యులపై చర్యలు తీసుకొనే నాథుడు లేకపోవడంతో వారు మరింతగా రెచ్చిపోతున్నారు. గత ఐదేళ్లలో వందల మంది అర్చకులపై దాడులు జరిగాయి. సీఎం జగన్ ఒక్కసారి కూడా ఈ ఘటనలను ఖండించలేదు. పైగా తమ పార్టీ నాయకుల్ని కాపాడుకునే ప్రయత్నంలో బాగంగా కేసులు పెట్టకుండా అడ్డుకుంటూ, పోలీసులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఆలయాల్లో ఏ చిన్న సమస్య వచ్చినా పూజారులనే బాధ్యుల్ని చేస్తున్నారు. దీంతో వారంతా తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.

బూటకపు హామీలతో బురిడీ!



అర్చకుల రిటైర్మెంట్ విధానాన్ని రద్దుచేస్తామని, 6సీ ఆలయాల్లో అర్చకులకు 25 శాతం జీతాలు పెంచుతామని గత ఎన్నికల మేనిఫెస్టోలో వైసీపీ అధినేత జగన్ హామీ ఇచ్చారు. దేవాలయాల్లో ధూప, దీప నైవేద్యాలు, అర్చకుల వేతనాలకు నెలకు రూ.10వేల నుంచి రూ.35వేల వరకూ ఇస్తామని మాటిచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మరిన్ని హామీలు ఇచ్చారు. కానీ మేనిఫెస్టోలో పొందుపరిచిన వాటినే పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. అర్చకుల రిటైర్మెంట్ విషయం పక్కన పెడితే జీతాల పెంపులో పూర్తిగా మోసం చేశారు. 6సీ ఆలయాల్లో విధులు నిర్వహించే అర్చకులకు గత టీడీపీ ప్రభుత్వంలోనే రూ.12,500 వరకూ వేతనం ఇచ్చేవారు. తామొస్తే అర్చకుల్ని ఉద్ధరిస్తామని ప్రగల్భాలు పలికిన జగనన్న అర్చకులకు పెంచింది కేవలం రూ.3,125 మాత్రమే. అదీ మొదటి నాలుగేళ్లు గాలికి వదిలేసి, అర్చకులు పోరాటం చేస్తే ఎన్నికల ఏడాది కావడంతో అమలు చేశారు. మరోవైపు ధూప దీప నైవేద్యం కిందకు ఇప్పటికీ చాలా ఆలయాలు రాలేదు. ఇదో బూటకపు హామీగా మిగిలిపోయింది. గ్రామ పంచాయతీ పరిధిలో దాదాపు 7 ఆలయాలు ఉంటేనే ఆయా గ్రామాల్లో ఉన్న అర్చకులకు రూ.35 వేల వరకూ ఈ పథకం కింద వస్తాయి. పంచాయతీ పరిధిలో ఒకటి, రెండు ఆలయాలుంటే రూ.5వేల నుంచి రూ.10 వేలు మాత్రమే వస్తుంది. ఆలయం దేవదాయ శాఖ సూచించిన నిబంధనల ప్రకారం ఉంటేనే ధూప దీప నైవేద్యం పథకంలోకి వస్తుంది. లేకుంటే ఆ రూ.5వేలు కూడా ఇచ్చే పరిస్థితి ఉండదు. ఈ మొత్తం అర్చకుల జీవనోపాధికి ఏమాత్రం సరిపోవడంలేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్చకులకు ఇళ్ల స్థలాలు కేటాయించి, అదే స్థలంలో వారికి ఇళ్లు కట్టిస్తామని జగన్ హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని వేల మంది అర్చకులుంటే కేవలం 1,150 మందిని మాత్రమే అర్హులుగా ప్రకటించారు. మరోవైపు అర్చకులకు ఇళ్ల కోసం ప్రభుత్వం ఎప్పుడు దరఖాస్తులు ఆహ్వానించిందో కూడా ఎవరికీ తెలియదు. తమకు కేవలం 1,400 దరఖాస్తులే వచ్చాయని అధికారులు చెబుతున్నారు. అందులో 1,150 మందిని అర్హులుగా గుర్తించగా, కేవలం 750 మందికి మాత్రమే ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఈ మాత్రానికే అర్చకులందరికీ ఇళ్లు ఇచ్చేసినట్లు వైసీపీ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. దీనిపై అర్చకులు, అర్చక సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి.



కాకినాడ బాలాత్రిపురసుందరి సమేత భీమేశ్వర స్వామి ఆలయానికి మార్చి 25న ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా భక్తులు పోటెత్తారు. ఇదే సమయంలో వైసీపీకి చెందిన మాజీ కార్పొరేటర్ గర్భగుడిలోకి వచ్చారు. ఆయన ఇచ్చిన పూజా సామగ్రిని తీసుకుని అర్చకుడు పూజ చేశారు. అయితే తాను తెచ్చిన పాలు శివలింగంపై సరిగ్గా పోయలేదని, దేవుడి ముందే చెంపపై కొట్టారు. తనేం తప్పు చేశానని ప్రశ్నించిన అర్చకుడిని 'నాకే ఎదురు సమాధానం చెబుతావా' అంటూ అసభ్య పదజాలంతో దూషిస్తూ కాలుతో తన్నారు. బండబూతులు తిడుతూ రెచ్చిపోయారు. మీ అంతు చూస్తానని బెదిరించారు. దీనిపై అర్చకులు ఫిర్యాదు చేసినా ఈవో పట్టించుకోలేదు. పైగా అర్చకుడిపై దాడి జరిగే సమయంలో ఆలయంలో ఉన్న సీసీ కెమెరాలు ఆపేశారు. వైసీపీ నాయకుడికి కొమ్ముకాసేలా అధికారులు వ్యవహరించారు. బాధిత అర్చకులకు న్యాయం జరగకుండానే... వివాదం ఏమీ లేదని, అంతా చక్కబడినట్లేనని వైసీపీ నేతలు వారితోనే బలవంతంగా చెప్పించారు. చివరికి పోలీసు కేసు పెట్టినా బలహీనమైన సెక్షన్లతో దాడిచేసిన వ్యక్తిని కాపాడే ప్రయత్నం చేశారు.

అర్చకులపై జరిగిన దాడుల్లో కొన్ని...



పంచారామ క్షేత్రాల్లో ఒకటైన భీమవరం సోమేశ్వరాలయంలో సహాయ అర్చకుడిపై ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ భర్త దాడి చేశాడు. అంతరాలయంలో అడ్డుగా నిలబడిన ఆయన్ను పక్కకు జరగాలని చెప్పినందుకు అమానుషంగా దాడి చేయడంతో పాటు అర్చకుడి మెడలోని జంధ్యాన్ని తెంచేశాడు. రాజమహేంద్రవరంలోని ప్రముఖ ఆలయంలో కూడా ఇలాంటి ఘటనే వెలుగులోకి వచ్చింది.

- కాకినాడ వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకుడిగా ఉన్న రాధాకృష్ణపై అదే ఆలయ వాచ్‌మన్ నూకరాజు గతేడాది దీపావళి రోజున దాడి చేశారు. ఆలయంలో శాస్త్రవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్న నూకరాజును రాధాకృష్ణ మందలించారు. ఇది మనసులో పెట్టుకుని రాధాకృష్ణ కుటుంబ సభ్యులపై బాణసంచా విసురుతూ, అసభ్య పదజాలంతో నూకరాజు దూషించారు. ప్రశ్నించడానికి వెళ్లిన రాధాకృష్ణపై తీవ్రంగా దాడి చేశారు.
- అనంతపురం జిల్లా గుత్తి మండలం జక్కలచెరువు నుంచి కొంతమంది అర్చకులు ఆరు నెలల క్రితం కమిషనర్‌ను కలిసి ఆంజనేయ స్వామి ఆలయానికి సంబంధించిన ఇనాం భూముల్లో వ్యవసాయం చేసుకునేందుకు అనుమతివ్వాలని కోరారు. వారికి అనుకూలంగా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కమిషనర్‌కు చూపించారు. జిల్లా అధికారులు కోర్టు ఆదేశాలను అమలు చేయడం లేదని చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఉన్నతాధికారి ఒకరు ఆగ్రహంతో ఊగిపోయారు. అర్చకులకు ఫోన్లు చేసి భయభ్రాంతులకు గురిచేశారు. అర్చకులు భూముల్లోకి ప్రవేశించకుండా.. స్థానికులను వారిపై దాడులకు ఉసిగొల్పారు.



గుంటూరు జిల్లా గోరంట్లలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ అర్చకుడు సాయిచరణ్‌పై గత సెప్టెంబరులో వైసీపీ నేత, ఆలయ కమిటీ కార్యదర్శి దాడి చేశాడు. సెలవు కావాలని అడిగినందుకు దూషించి, కర్రతో కొట్టారు.

సత్యసాయి జిల్లా కదిరిలో ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గతేడాది ఆగస్టులో జరిగిన పాలక మండలి సమావేశానికి ప్రధాన అర్చకుడు హాజరైతే ఆయన్ను బయటకు పోవాలని ఈవో దుర్భాషలాడారు.

- నంద్యాల జిల్లాలో కొత్తూరు సుబ్బరాయుడి ఆలయానికి ఆనుకొని శివాలయం ఉంది. నాలుగు నెలల కిందట ఈ ఆలయానికి మహానంది ఈవో వచ్చారు. సుబ్రహ్మణ్యస్వామి దర్శనం అనంతరం శివాలయంలోకి ప్రవేశించారు. స్వామికి నైవేద్యం పెడుతున్నామని, కాసేపు ఆగాలని అక్కడున్న పూజారి చెప్పడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నన్నే ఆపుతావా.. నీ అంతు చూస్తానంటూ వెళ్లిపోయారు. తర్వాత 24 గంటల్లోనే సదరు పూజారిని విధుల నుంచి తొలగించారు. మళ్లీ విధుల్లోకి తీసుకోలేదు.





- ఉమ్మడి కర్నూలు జిల్లా బండిఆత్మకూరు మండలం ఓంకార క్షేత్రంలో 2020 నవంబరులో పూజారులపై ఆలయ చైర్మన్ తదితరులు చర్నాకోలాతో దాడి చేసి వాతలు పడేలా కొట్టారు. కార్తీక పౌర్ణమి నాడు భక్తులకు టికెట్ల ద్వారానే కాకుండా ఉచితంగా కూడా దర్శనానికి అనుమతి ఇవ్వాలని సూచించడమే వారు చేసిన నేరం. ఈ ఘటన కలకలం రేపడంతో ఆలయ చైర్మన్‌తో రాజీనామా చేయించి వదిలేశారు.

నోట్ దిస్ పాయింట్!



స్వతంత్రులకూ సత్తా ఉంది బ్రో!

రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇండిపెండెంట్ అభ్యర్థుల హోరు జోరుగా సాగుతోంది. వీరి ప్రభావం ఏముంటుందిలే అనుకుంటే పొరపాటే! ఎందుకంటే.. ఒక్కొక్కసారి ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు ఓటములను వీరు తీవ్రంగా ప్రభావితం చేస్తున్నారు. మెజారిటీ లెక్కలను కూడా తారుమారు చేస్తున్నారు. రాష్ట్ర విభజన తర్వాత జరిగిన రెండు శాసన సభ ఎన్నికల్లోనూ స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచిన వారు భారీ సంఖ్యలో ఓట్లను చీల్చడమే కాదు ఒకరిద్దరు గెలుపు గుర్రం కూడా ఎక్కారు. స్వతంత్రుల సత్తా అలా ఉంది మరి!!

ఎన్నికలు	చీల్చిన ఓట్లు	గెలిచిన నేతలు
2014	5,14,12(1.80%)	ఇద్దరు
2019	2,86,85(0.91%)	-----

ఎన్నికల దెబ్బ



పెట్రోల్ బంకు మూత

విశాఖపట్నంలో వైసీపీ అభ్యర్థి నిర్వహించిన ప్రచార ర్యాలీకి వచ్చిన కార్యకర్తలకు పెట్రోల్ కూపన్లు తాయిలాలుగా పంచారు. అయితే.. ఈ కూపన్లపై పెట్రోల్ పోసినందుకు రిలయన్స్ బంక్ లైసెన్స్‌ను అధికారులు శుక్రవారం తాత్కాలికంగా రద్దు చేశారు. ఇటీవల ఎన్నికల సంఘానికి పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో నోటీసు జారీ చేశారు. రాజకీయ నాయకుల వద్ద డబ్బులు తీసుకుని కూపన్లపై కార్యకర్తలకు పెట్రోల్, డీజిల్ పోయవద్దని జిల్లా అధికారులు సూచించారు. దానిని పలువురు ఉల్లంఘించారు. దీనిపై కూడా ఫిర్యాదులు అందడంతో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులతో తనిఖీలు చేయించారు. ఎన్ఏడీ జంక్షన్ సమీపంలో ఉన్న రిలయన్స్ పెట్రోల్ బంక్(బర్మానీ పెట్రోలియం ప్రొడక్ట్స్)లో ఈ నెల 19న 860 వాహనాలకు కూపన్లపై పెట్రోల్ పోసినట్టుగా గుర్తించారు. వైసీపీ అభ్యర్థి ఆనంద కుమార్ తరఫున ఆయన అనుచరులు వచ్చి, ఒకేసారి రుసుము చెల్లించి కూపన్లు తీసుకున్నారని, ఆ తరువాత కూపన్లతో వచ్చిన వాహనాలకు పెట్రోల్ పోసినట్టు విచారణలో గుర్తించారు. ఈ విషయం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు నివేదించడంతో ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘనేనని పేర్కొంటూ సదరు బంక్ లైసెన్స్‌ను తాత్కాలికంగా రద్దు చేశారు. అదేవిధంగా ఆ కూపన్లు కొనుగోలు చేసి, పంపిణీ చేసిన వారిపై కూడా కేసులు పెట్టాలని పశ్చిమ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారిని ఆదేశించారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



జబర్దస్తగా.. దోసెలు!

జనసేన అధినేత పవన్ కల్యాణ్ వీరాభిమాని జబర్దస్త్ హైపర్ ఆది.. ఎన్నికల ప్రచారంలోకి దిగారు. విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా పోటీచేస్తున్న వంశీకృష్ణ యాదవ్‌కు మద్దతుగా శుక్రవారం ఆయన జ్ఞానాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ హోటల్‌లో దోసెలు వేసి ఆకట్టుకున్నారు.



మీటర్లతో.. జగన్‌కు షాక్!

వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తే.. మీ అధికారానికి ఉరితాడు బిగిస్తామని సీఎం జగన్‌ను హెచ్చరించిన వామపక్షాలు.. చెప్పినట్టుగానే ఎన్నికల ప్రచారానికి మీటర్లను తీసుకొచ్చారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి ఇండియా కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీపీఎం నాయకుడు చిగురుపాటి బాబూరావు శుక్రవారం స్థానిక 29వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ బాక్సులు పట్టుకుని.. వ్యవసాయ విద్యుత్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం చేశారు.

ఎన్నికల ప్రచారంలో.. వైఎస్!

రాష్ట్ర విభజన చేసిన నేరానికి రాష్ట్రంలో ఉనికిలో లేకుండా పోయిన కాంగ్రెస్ పార్టీ.. ఈ ఎన్నికల్లో వైఎస్ షర్మిల పీసీసీ పగ్గాలు చేపట్టడంతో మళ్లీ ఊపిరిపోసుకుంది. వామపక్షాలతో కలిసి రాష్ట్రంలోని అన్ని ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ కొన్నిచోట్ల బలమైన అభ్యర్థులనే బరిలోకి దింపింది. షర్మిల ప్రచార సభలూ జనంతో కళకళలాడుతున్నాయి. రాష్ట్రమంతటా అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం చేస్తున్న షర్మిల.. తన ప్రచారంలోకి తండ్రి వైఎస్‌నూ దింపేశారు. వైఎస్‌లా తలపాగా ధరించిన వ్యక్తి.. తమ పార్టీ గుర్తు హస్తంను చూపెడుతున్న... బొమ్మలు షర్మిల ఎన్నికల ప్రచారంలో ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.



'పింఛను'పై అదే కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

తెరలేపింది. ఏప్రిల్ 3 తర్వాతే పింఛన్ల పంపిణీ ఉంటుందని ముందగానే ప్రకటించినప్పటికీ... విపక్షాలవల్లే పింఛన్లు ఆలస్యమవుతున్నట్లు తప్పుడు ప్రచారం చేసింది. 4వ తేదీ సాయంత్రందాకా అరకొరగానే నిధులు విడుదల చేసింది. అదే సమయంలో... మంచానపడిన వృద్ధులను వైసీపీ శ్రేణులు రోడ్లపైకి తీసుకొచ్చి, టీడీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సచివాలయాల వద్ద పింఛన్లకోసం పడిగాపులు కాసేలా చేశారు. గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది, అంగన్వాడీలు, పంచాయతీరాజ్ సిబ్బంది ద్వారా ఒకటి రెండు రోజుల్లోనే నేరుగా అవ్వా తాతలకు వారి ఇళ్ల వద్దే పింఛను ఇచ్చే అవకాశమున్నప్పటికీ అలా చేయలేదు. నడవలేని వృద్ధులు, దివ్యాంగులకు మాత్రమే ఇళ్ల వద్ద పింఛను ఇస్తామని సర్కారు ఉత్తర్వులు జారీచేసింది. చంద్రబాబుతో పాటు విపక్ష నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. మే 1వ తేదీన ఇళ్లవద్దే పింఛను పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎన్నికల కమిషన్, ఎన్నికల స్పెషల్ అబ్జర్వర్‌కు సీఎస్ జవహర్ రెడ్డి సమాధానమిచ్చారు. 'ఇంటింటికీ పింఛను పంపిణీ' అవకాశాలపై ఇప్పటికే సెర్ప్ అధికారులతో, కలెక్టర్లతో సమీక్షించామని.. అది సాధ్యంకాదనే నిర్ణయానికి వచ్చామని తెలిపారు. మరోవైపు ఇదే అంశంపై పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్నికల ప్రత్యేక పరిశీలకుడికి లేఖ రాశారు. "15,004 గ్రామ, వార్డు సచివాలయాల్లో 1.60 లక్షల మందికిగాను 1.26 లక్షల మంది మాత్రమే పనిచేస్తున్నారు. అంటే... సగటున ఒక్కో సచివాలయంలో పని చేస్తున్నది 8 మందిమాత్రమే. ఇక... ఏఎన్‌ఎంలు/వార్డుహెల్త్ సెక్రటరీలు, అగ్రికల్చరల్ అసిస్టెంట్లకు జాబ్ చార్ట్ మేరకు వారి పనులు వారికి ఉంటాయి. 41 వేల మంది బీఎల్‌వో విధులతో చాలా బిజీగా ఉన్నారు. 55,900 మంది ఓపీఓ డ్యూటీల్లో ఉన్నారు. అందువల్ల ఇంటింటికీ వెళ్లి పింఛను ఇవ్వడం కుదరదు" అని తేల్చేశారు. గత నెలలో లాగా దివ్యాంగులు, నడవలేని వృద్ధులకు మాత్రమే ఇళ్లవద్ద పింఛను అందిస్తామని స్పష్టం చేశారు. గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందికి 'జాబ్ చార్ట్' మేరకు పనులుంటాయంటున్న ప్రభుత్వం అవ్వాతాతల కోసం ఒక్కరోజు సిబ్బందిని కేటాయించలేరా అనే ప్రశ్న వినిపిస్తోంది. గతంలో టీచర్లకు రకరకాల డ్యూటీలు వేయలేదా? మరి... సచివాలయ సిబ్బందితో ఇంటింటికీ పింఛను పంపిణీ చేయిస్తే తప్పేంటి?

ఎవరూ మరణించలేదు...

పింఛను కోసం వెళ్లి అనేక మంది వృద్ధులు మరణించారని... దీనికి చంద్రబాబే కారణమని వైసీపీ నేతలు నానా రచ్చ చేశారు. కానీ... అవకాశముండి ఇంటింటికీ పింఛను ఇవ్వకుండా వృద్ధుల మరణానికి కారణమయ్యారని, ఇవి ప్రభుత్వ హత్యలేనని చంద్రబాబు ధ్వజమెత్తారు. అయితే.. పింఛను పంపిణీలో జాప్యం, ఇబ్బందుల వల్ల ఏ ఒక్కరూ మరణించలేదని పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ స్పష్టం చేయడం గమనార్హం. ఈసారి 30వ తేదీ నాటికే పెన్షన్లకు అవసరమైన సొమ్ము సిద్ధంగా ఉంచుతామని, గరిష్ఠంగా 3వ తేదీలోపు పంపిణీ పూర్తి చేస్తామని సీఎస్ హామీ ఇచ్చారు. పింఛను పంపిణీకి దాదాపు 10వేల అదనపు కేంద్రాలను గుర్తించామని... వృద్ధులకు ఇబ్బంది లేకుండా నీడ కోసం టెంట్లు, నీళ్ల ఏర్పాటు చేస్తామన్నారు. తీవ్రమైన ఎండల నేపథ్యంలో ఉదయం 7 నుంచే పంపిణీ మొదలుపెట్టి... రాత్రి 7 గంటల వరకు కొనసాగిస్తామని తెలిపారు.

కూటమిదే గెలుపు

(మొదటి పేజీ తరువాయి)

భాగంగా సీనియర్ జర్నలిస్టు అర్ణబ్ గోస్వామికి శుక్రవారం ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో చంద్రబాబు పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని జగన్ అడిగితే ప్రజలు ఇచ్చారని.. కానీ ఆయన దుష్పరిపాలన చూసిన తర్వాత మరో అవకాశం ఇవ్వకూడదని నిర్ణయించుకున్నారని చెప్పారు. మోదీ పరిపాలనను జనం చూశారని, అదే విధంగా తన పాలనతో జగన్ పాలనను సరిపోల్చుకుంటున్నారని.. ఫలితంగా తమవైపు మొగ్గుతున్నారని తెలిపారు. 2017లోనే తాను జమిలి ఎన్నికలను సమర్థించానని, ఐదేళ్లకోసారి ఎన్నికలు జరిగితే అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించవచ్చని చెప్పారు. 2047కల్లా వికసిత్ భారత్ కావాలన్న మోదీ లక్ష్యానికి అనుగుణంగా పనిచేస్తామన్నారు.

అప్పటికి, ఇప్పటికి ఏం తేడా?

2019లో చంద్రబాబు బీజేపీని వ్యతిరేకించిన విషయం గుర్తు చేస్తూ అప్పటికీ ఇప్పటికీ తేడా ఏముందని అర్ణబ్ అడిగారు. విభజన తర్వాత ఏపీ చాలా నష్టపోయిందని, 2019లో ప్రత్యేక హోదా అడిగామని చంద్రబాబు చెప్పారు. జగన్ హయాంలో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని, అక్కడ ప్రజాస్వామ్యమే లేదని.. ఏపీని, తెలుగు ప్రజలను కాపాడేందుకు ఎన్డీయేతో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. అదే సమయంలో గత పదేళ్ల మోదీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. జగన్ ప్రభుత్వం పట్ల ప్రతి ఒక్కరిలో నిరాశా నిస్పృహలు నెలకొన్నాయని, ప్రతి ఒక్కరూ బాధితుడేనన్నారు.

బీజేపీతో పొత్తు ఎందుకు?

బీజేపీ నుంచి మీరేం ప్రయోజనాలు కోరుతున్నారు.. గత ఎన్నికల్లో నోటా కంటే తక్కువ ఓట్లు సాధించిన ఆ పార్టీతో ఎందుకు పొత్తు పెట్టుకున్నారని అర్ణబ్ అడిగారు. చంద్రబాబు స్పందిస్తూ ఎన్డీయేలో తానెప్పుడూ ఏ హోదానూ ఆకాంక్షించలేదని, మంత్రి పదవులూ కోరుకోలేదన్నారు. ఈ మహోన్నత దేశానికి తన వంతు సేవ చేయడమే ఏకైక లక్ష్యమని చెప్పారు. జాతి నిర్మాణంలో ఎన్డీయేకి సహకరిస్తామన్నారు. దేశం అభివృద్ధి చెందితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే తన అభిప్రాయమని.. మోదీ ప్రభుత్వంపై జాతీయ స్థాయిలో సదభిప్రాయం నెలకొని ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో 1999లో 2020 కోసం తాను విజన్ రూపొందించానని, అది ఇప్పుడు వాస్తవంగా మారిందని చెప్పారు.

> రాష్ట్ర సంక్షేమాన్ని పణంగా పెట్టి జగన్ రాజకీయాలు చేస్తున్నారు. నాకు, మోదీకి మధ్య సుహృద్భావ, సన్నిహిత సంబంధాలున్నాయి. ఆయన గుంటూరు వచ్చినప్పుడు మాట్లాడుకున్నాం. అమిత్ షా, నడ్డాతో కూడా చర్చిస్తున్నాను. - చంద్రబాబు

నాపై అవినీతి ఆరోపణల్లేవ్..

జగన్మోహన్‌రెడ్డితో సంబంధాలు ఎందుకు దెబ్బతిన్నాయని అర్ణబ్ అడుగగా.. ఆయన తండ్రి, తాను 80వ దశకంలో మిత్రులమని, సన్నిహితంగా ఉండేవాళ్లమని చంద్రబాబు తెలిపారు. తర్వాత తమ మార్గాలు వేరయ్యాయని, తాను తెలుగుదేశంలోనూ, ఆయన కాంగ్రెస్‌లోనూ ఉండిపోయారని చెప్పారు. తనపై ఏనాడూ అవినీతి ఆరోపణలు లేవని, ఎప్పుడూ స్వచ్ఛమైన, నిజాయితీతో కూడిన సుపరిపాలనను ప్రజలకు ఇవ్వాలని భావించాలని.. కానీ 2019లో జగన్ ముఖ్యమంత్రి కాగానే మొత్తం నాశనం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదన్నారు. పదేళ్ల తర్వాత కూడా రాష్ట్రానికి రాజధాని లేదని, అమరావతి ఏమి పాపం చేసిందని ప్రశ్నించారు. మూడు రాజధానుల ప్రతిపాదనను వ్యతిరేకిస్తే తమను శత్రువులా చూశారని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును కూడా నాశనం చేశారని.. తనతో ఎవరు విభేదించినా ఆయన వారిపై యుద్ధం ప్రకటిస్తారని చెప్పారు. గత ఐదేళ్లుగా జగన్ చర్యలను చూస్తే ఎవరైనా ఆయన మానసికంగా దెబ్బతిన్నారని అంటారని తెలిపారు. సుబ్బారావు అనే వ్యక్తి భూమి రికార్డులను ఆన్‌లైన్‌లో మార్చారని, ఆయన, ఆయన కూతురు ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చిందని తెలిపారు. లక్ష్మి అనే మహిళ నిరసన తెలిపేందుకు వేలు కోసుకుందని చెప్పారు.

దక్షిణాదిన వేళ్లూనుకుంటోంది..

మోదీకి దక్షిణాది వ్యతిరేకంగా ఉందా అని అర్ణబ్ అడుగగా.. దక్షిణాదిన సాంప్రదాయికంగా ప్రాంతీయ పార్టీల ఆధిపత్యం రాజకీయాల్లో సాగిందని, అయితే బీజేపీ కూడా దక్షిణాదిన వేళ్లూనుకుంటోందని చంద్రబాబు చెప్పారు. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీకి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. గత నాలుగు దశాబ్దాల్లో టీడీపీ, బీజేపీ అనేకసార్లు కలిసి పనిచేశాయని, తాము సహజ భాగస్వాములమని తెలిపారు. ఇద్దరం కలిసి రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం పనిచేశామని చెప్పారు. ఇప్పుడు మిత్రపక్షంగా తమకు మరింత బాధ్యత ఉంటుందని చెప్పారు. జగన్ తనను జైలుకు పంపినందుకు ఎలాంటి విద్వేష భావం లేదని, తాను తప్పు చేయలేదని తనకు తెలుసని, మొత్తం దేశానికీ తెలుసని చెప్పారు. ప్రతి ఒక్కరూ తనకే మద్దతిచ్చారని తెలిపారు.



మంగళగిరిలో ఎన్నికల ప్రచారంలో ఉన్న లోకేశ్‌తో మాట్లాడుతున్న వృద్ధురాలు

జగన్‌వి శవ రాజకీయాలు

- ఇక ఆయనను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరు
- కృష్ణాయపాలెం ఎన్నికల ప్రచారంలో లోకేశ్

మంగళగిరి, ఏప్రిల్ 26: ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ శవ రాజకీయాలు చేయడం సీఎం జగన్‌కు అలవాటుగా మారిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన గుంటూరు జిల్లాలోని రాజధాని గ్రామం కృష్ణాయపాలెంలో పర్యటించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ 2014లో తండ్రి శవం, 2019లో బాబాయి శవంతో జగన్ రాజకీయం చేశాడని ఆరోపించారు. ఈసారి పెన్షన్లను ఇవ్వకుండా 32మంది వృద్ధుల ఉసురు పోసుకుని మళ్లీ శవ రాజకీయాలు మొదలుపెట్టారని ధ్వజమెత్తారు. జగన్ ఏం చేసినా ప్రజలు ఆయన్ను నమ్మే పరిస్థితుల్లో లేరని చెప్పారు. ఈ ఎన్నికల్లో జగన్ పని అయిపోతుందని.. ఆయన శాశ్వతంగా తాడేపల్లి ప్యాలెస్‌కు పరిమితం కావాల్సిందేనని అన్నారు. భవిష్యత్తులో కూడా జగన్ అధికారంలోకి రాడనే నమ్మకం కలిగితేనే రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు వస్తాయని పేర్కొన్నారు. ఐదేళ్లపాటు జగన్ చేసిన విధ్వంసంతో ఏపీ బ్రాండ్ పూర్తిగా దెబ్బతినడమే ఇందుకు కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి రాగానే అమరావతి రాజధాని నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన ఆరంభిస్తామని హామీ ఇచ్చారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో వాహనాలకు దేశం మొత్తంమీద అతితక్కువ పన్నులు ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాబోయే ఐదేళ్లలో ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను దశల వారీగా భర్తీ చేస్తామని చెప్పారు. రాష్ట్రానికి పరిశ్రమలను రప్పించడం ద్వారా ప్రైవేట్ రంగంలో 20లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. తాము వచ్చాక టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక సదుపాయాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని హామీ ఇచ్చారు.

తల్లి, భార్యను కూడా టీడీపీ అంటాడేమో!

"జగన్ సొంత చెల్లి పసుపు చీర కట్టుకుంటే తెలుగుదేశం అంటున్నారు. పసుపు రంగు చీర కట్టుకున్న వాళ్లంతా టీడీపీ అయిపోతారా? ఆయన తల్లి, భార్య కూడా పసుపు చీర కట్టుకుంటే రేపు వారిని కూడా టీడీపీ అంటారేమో" అని లోకేశ్ వ్యంగ్యాస్త్రాలను సంధించారు. మంగళగిరి నియోజకవర్గం పెదపాలెం గ్రామంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన రచ్చబండ సభలో ఆయన మాట్లాడారు. సొంత తల్లిని, చెల్లిని మెడపట్టి గెంటేసిన వాడు మహిళలకు ఏం న్యాయం చేస్తాడో ప్రజలంతా ఆలోచించాలని కోరారు.

మాయలు, మోసాలకు వైసీపీ సిద్ధం

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- నెల్లూరు జిల్లా రోడ్ షోలో బాలకృష్ణ

నెల్లూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో మరోసారి మాయలు, మోసాలు చేసేందుకు వైసీపీ సిద్ధమవుతోందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హిందూపురం ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నాయకుడు, నటుడు నందమూరి బాలకృష్ణ హెచ్చరించారు. స్వర్ణాంధ్ర సాకార యాత్రలో భాగంగా శుక్రవారం ఆయన నెల్లూరు జిల్లాలో పర్యటించారు. ముందుగా గుడ్లూరులో రోడ్ షో నిర్వహించి, బహిరంగ సభలో ప్రసంగించారు. అనంతరం రాత్రికి నెల్లూరు చేరుకున్న బాలయ్య నగరంలోని నవాబుపేట సెంటర్ నుంచి గాంధీబొమ్మ వరకు రోడ్ షో నిర్వహించి బహిరంగ సభలో ప్రసంగించారు. మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తే ఇక ప్రజల భూములకు రక్షణ ఉండదని చెప్పారు. వైసీపీ అరాచకాలను భరించలేక రాష్ట్రం వదిలి వెళ్లిపోవాల్సి దుస్థితి దాపురిస్తుందని బాలకృష్ణ హెచ్చరించారు. తల్లిని, చెల్లిని గెంటేసిన జగన్మోహన్‌రెడ్డి ఇక రాష్ట్ర ప్రజలను ఎలా కాపాడుతారని దుయ్యబట్టారు. గత ఎన్నికలకు ముందు కోడి కత్తి, గొడ్డలి అన్నారని, ఇప్పుడు గులకరాయి అంటున్నారని ఎద్దేవా చేశారు. బాబాయ్‌ని హత్య చేసిన వారిని కాపాడుతూ చెల్లికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఎలా నడపాలో చేతగాక నవరత్నాల పేరుతో ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. వైసీపీ పాలనలో రాష్ట్రం పాతికేళ్లు వెనక్కు వెళ్లిపోయిందన్నారు. రాష్ట్రంలో వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేశారని విమర్శించారు. జే బ్రాండ్ల మద్యాన్ని ఏరులై పారించి పేదల ప్రాణాలతో చెలగాటమాడిన వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీసీల నిధులను మళ్లించడమే కాక వారిని హింసించడమే లక్ష్యంగా వైసీపీ పాలన సాగిందన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించి దళితులకు అన్యాయం చేశారని దుయ్యబట్టారు. యువతకు ఉద్యోగాలు సృష్టించకపోగా వారిని డ్రగ్స్, గంజాయికి బానిసలుగా మారుస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ఎన్డీఏ కూటమితోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం బతకాలంటే ఎన్డీఏ కూటమిని గెలిపించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని చెప్పారు. ఈ సభల్లో నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కందుకూరు, నెల్లూరు సిటీ, రూరల్ అభ్యర్థులు పొంగూరు నారాయణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో జరిగిన బహిరంగ సభకు హాజరైన జనం.. ప్రసంగిస్తున్న నటుడు బాలకృష్ణ

భువనేశ్వరి పేరిట డీప్ ఫేక్ ఆడియో

- దళితులను అవమానించారంటూ దుష్ప్రచారం
- వైసీపీ అనుకూల సోషల్ మీడియాలో వైరల్
- చర్యలు తీసుకోవాలని ఈసీకి టీడీపీ ఫిర్యాదు
- సజ్జల భార్గవ్‌రెడ్డిని అరెస్ట్ చేయాలని డిమాండ్



సజ్జల భార్గవ్‌రెడ్డి

అమరావతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నేతలను టార్గెట్ చేసి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం వైసీపీ శ్రేణులకు అలవాటుగా మారిపోయింది. గతంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, లోకేశ్, ఇతర నేతలను లక్ష్యంగా చేసుకుని ఫేక్ ప్రచారం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇప్పుడు చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పేరుతో డీప్ ఫేక్ ఆడియోను వైసీపీ వర్గాలు శుక్రవారం ప్రచారంలోకి తెచ్చాయి. ఆమె దళితులను అవమానించారంటూ వైసీపీ అనుకూల సోషల్ మీడియా ఖాతాల ద్వారా ప్రచారం చేశారు. నిజం గెలవాలి పేరుతో భువనేశ్వరి ఇటీవల రాష్ట్రమంతా పర్యటించిన సంగతి తెలిసిందే. ఆమె పర్యటనలకు మహిళల నుంచి సానుకూల స్పందన వచ్చింది. దీంతో ఈసారి ఆమెను లక్ష్యంగా చేసుకొని వైసీపీ వర్గాలు ఆడియోను సృష్టించారు. డీప్ ఫేక్ టెక్నాలజీ సాయంతో ఈ ఆడియోను తయారు చేశారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రముఖ వ్యక్తులు నిజంగా మాట్లాడినట్లుగానే నకిలీ ఆడియోను రూపొందించగల డీప్ ఫేక్ టెక్నాలజీని అందుబాటులోకి వచ్చింది. వినేవారికి అచ్చం భువనేశ్వరి గొంతులాగా ఉండేలా ఆడియో తయారు చేశారు. ఏ సందర్భంలో ఎక్కడ మాట్లాడారో ఇందులో ఎక్కడా లేదు. ఎవరినో విపరీతంగా తిడుతున్నట్లుగా మాటలు ఉన్నాయి. దళితులను తిట్టినట్లు వైసీపీ వర్గాలు ప్రచారం చేసినా అందులో ఎక్కడా దళితులన్న పదం లేదు. ఈ ఆడియోకు కొనసాగింపుగా ఆ తర్వాత మరో వీడియో తయారు చేసి వదిలారు. ఏబీఎన్ చానల్ లోగో పెట్టి మరీ దీనిని తయారు చేశారు. భువనేశ్వరి తననే తిట్టారని, దళితులను కాదని చంద్రబాబు వివరణ ఇచ్చినట్లుగా ఈ వీడియో ఉంది. ఆ వార్తను ఏబీఎన్ చానల్ ప్రసారం చేసినట్లు లోగోను పెట్టి వైసీపీ అనుకూల సామాజిక మాధ్యమాల్లో తిప్పారు.

ఈసీకి ఫిర్యాదు

డీప్ ఫేక్ ఆడియో వ్యవహారంపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి టీడీపీ నేతలు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు దళిత ఓటర్లను తప్పుదోవ పట్టించేలా వైసీపీ తప్పుడు ప్రచారాలు చేస్తోందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అమరావతి సచివాలయంలో సీఈవో ముఖేష్‌కుమార్ మీనాను టీడీపీ నేతలు వర్ల రామయ్య, దేవినేని ఉమామహేశ్వరరావు కలిసి ఫిర్యాదు చేశారు. ఇన్‌స్టాగ్రాం వేదికలో వైసీపీకి అనుకూలంగా ఉండే జగన్ కనెక్ట్ అనే ఖాతా ద్వారా ఈ ఆడియో ప్రచారంలోకి వచ్చిందని, దీని వెనుక వైసీపీ సోషల్ మీడియా విభాగం ఉందని ఆరోపించారు. సజ్జల భార్గవ్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్న వైసీపీ సోషల్ మీడియా విభాగం ఉద్దేశపూర్వకంగా ఇలాంటి తప్పుడు సమాచారాన్ని ప్రజల్లో వ్యాప్తి చేస్తోందని అన్నారు. తప్పుడు ప్రచారం చేయిస్తున్న సజ్జల భార్గవ్‌రెడ్డిని తక్షణమే అరెస్ట్ చేయాలని కోరారు. ఆడియోలోని గొంతు భువనేశ్వరిది కాదని స్పష్టం చేశారు.

'గాలి' నుంచి నా ప్రాణాలకు ముప్పు!

- వారికి విశాఖ-ఉత్తర వైసీపీ అభ్యర్థి కేకే రాజు మద్దతు
- సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ ఆరోపణ



విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తన ప్రాణాలకు ముప్పు ఉందని సీబీఐ మాజీ జేడీ, జై భారత్ నేషనల్ పార్టీ వ్యవస్థాపకుడు, విశాఖ-ఉత్తర నియోజకవర్గ అభ్యర్థి వీవీ లక్ష్మీనారాయణ సంచలన ఆరోపణ చేశారు. గతంలో సీబీఐ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసినపుడు అక్రమ మైనింగ్‌కు సంబంధించి పెద్ద కేసులను దర్యాప్తు చేశానని, అందులో ప్రధాన నిందితుడు గాలి జనార్దన్‌రెడ్డికి అనుచరుడైన నంబాల రాజేశ్‌కుమార్ ప్రస్తుతం విశాఖపట్నంలో ఉన్నారని, ఆయన వల్ల తనకు ప్రాణహాని ఉందని తెలిపారు. ఈ మేరకు విశాఖ పోలీస్ కమిషనర్‌కు శుక్రవారం రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తనకు తగిన భద్రత కల్పించాలని కోరారు. రాజేశ్‌కుమార్ విశాఖ ఉత్తర నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి కేకే రాజు వెంట తిరుగుతున్నారని, ఇటీవల ఆ పార్టీ కార్యకర్తల సమావేశంలో రాజేశ్‌కుమార్ మాట్లాడుతూ, 'బాస్' (గాలి జనార్దన రెడ్డి)ని ఇబ్బంది పెట్టిన లక్ష్మీనారాయణపై ప్రతీకారం తీర్చుకొని గిఫ్ట్ ఇస్తానని చెప్పినట్టు తనకు విశ్వసనీయంగా తెలిసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. విశాఖపట్నంలోని మురళీనగర్‌లో నివసిస్తున్న తనకు ఏదైనా ప్రాణ హాని జరిగితే దానికి రాజేశ్‌కుమార్, కేకే రాజు, గాలి జనార్దన రెడ్డిలే కారణమని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన సీపీ రవిశంకర్.. ఎన్నికల సంఘానికి లేఖ రాసి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కోడుమూరు వైసీపీలో
భగ్గుమన్న విభేదాలు

- జడ్పీటీసీ, సర్పంచ్ వర్గాల మధ్య వాగ్వాదం
- వైసీపీ జెండాలను నేలకేసి తొక్కి నిప్పు



వైసీపీ జెండాలకు నిప్పు పెట్టేందుకు ప్రయత్నిస్తున్న ఆ పార్టీ కార్యకర్తలు

కర్నూలు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీలో భగ్గుమన్న విభేదాలు, నాయకుల మధ్య వాగ్వాదం ఆ పార్టీ జెండాలకు నిప్పు పెట్టేలా చేసింది. కర్నూలు జిల్లా కోడుమూరు వైసీపీ అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో గూడూరు మండలం ఆర్.ఖానాపురం గ్రామంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. వివరాలివీ.. కోడుమూరు వైసీపీ అభ్యర్థి ఆదిమూలపు సతీష్, వైసీపీ సీనియర్ నాయకుడు, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాశ్‌రెడ్డి ఆర్.ఖానాపురం గ్రామానికి ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. అదే గ్రామానికి చెందిన గూడూరు జడ్పీటీసీ సభ్యుడు మౌలాలి, గ్రామ సర్పంచ్ మునిస్వామి వారికి స్వాగతం పలికారు. ఎన్నికల ప్రచారం తమ వీధి నుంచి మొదలు పెట్టాలని జడ్పీటీసీ, సర్పంచ్ ఇద్దరు పట్టుబట్టారు. నేతల సమక్షంలోనే ఇరువర్గాల మధ్య వాగ్వాదం మొదలైంది. ఇంతలో గ్రామ సర్పంచ్ మునిస్వామి మాటకు విలువ ఇవ్వకుండా జడ్పీటీసీ సభ్యుడు మౌలాలి సూచించిన వీధిలో ప్రచారానికి వైసీపీ అభ్యర్థి సతీష్ సహా ఆ పార్టీ నాయకులు వెళ్లారు. ఇష్టమైతే రండి.. లేదంటే వెళ్లిపోండి..! అంటూ సర్పంచ్ వర్గాన్ని ఉద్దేశించి వైసీపీ నాయకుడు ఒకరు అన్నాడు. దీంతో సర్పంచ్ వర్గం ఆగ్రహంతో రగిలిపోయింది. అప్పటి వరకు జెండాలు చేతపట్టుకొని జేజేలు పలికిన నాయకులు వైసీపీ జెండాలను నేలపడేసి కాళ్లతో తొక్కారు. వైసీపీకి, అభ్యర్థి సతీష్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నేలపై పాడేసిన వైసీపీ జెండాలను కుప్పగా పోసి నిప్పు పెట్టారు. అయితే ఆ మంటలు అంటుకోకుండానే స్థానిక నాయకులు ఆర్పేశారు.

ఎన్నికల ప్రచారంలోనే
వైసీపీ మూకల దాడి

- రోడ్డు బాగుచేయలేదన్నందుకు అక్కసు

ఈపూరు, ఏప్రిల్ 26: కనీసం రోడ్డు కూడా మరమ్మతులు చేపట్టలేదన్నందుకు ఆ వీధి యువకులు, మహిళలపై వైసీపీ మూకలు దాడి చేశాయి. ఈ సంఘటన పల్నాడు జిల్లా ఈపూరు మండలం కొచ్చెర్ల గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. గ్రామంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు తనయుడు గిరిబాబు ప్రచారం చేస్తూ కుమ్మరి శాలివాహన బజారుకు వచ్చారు. అక్కడ కొంతమంది యువకులు, మహిళలు ఐదేళ్లుగా తమ బజారు ఎలాంటి అభివృద్ధికీ నోచుకోలేదని ఆయనకు చెప్పుకుంటున్నారు. దానిని అవమానంగా భావించిన ఆ పార్టీ కార్యకర్తలు ఇత్తడి ఏసోబు మరి కొందరు.. యువకులపైనా, మహిళలపైనా దుర్భాషలాడుతూ దాడికి దిగాడు. దీనిపై బాధితులు, స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమస్యలు వినే ఓపిక కూడా లేకుండా తమపై దాడి చేయడం తగదని మండిపడ్డారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

క్రమబద్ధీకరణం

- మధురానగర్‌లో ప్రత్యక్షంగా 5వేల మంది బాధితులు
- మొన్న ఇందిరా కాలనీ.. నేడు నేతాజీ కాలనీ
- ఎన్నికలు వస్తున్నాయి.. వెళుతున్నాయి
- పరిష్కారం మాత్రం అవట్లేదు
- స్పష్టమైన హామీ ఉంటేనే పోలింగ్‌కు వస్తామంటున్న కాలనీవాసులు

ఏళ్ల తరబడి ఉన్న సమస్యను పట్టించుకోకుండా రాజకీయలను చొప్పించి సాగతీత ధోరణి ఒక చోట.. సాఫీగా వెలుతున్న చోట కొత్త సమస్యను తెరపైకి తెచ్చి స్థానికులకు కంటిపై కునుకు లేకుండా చేసిన పని ఇంకో చోట. మొదటిది ఇందిరా కాలనీ అయితే రెండోది నేతాజీ కాలనీ... ఆ సమస్య ఏంటో తెలుసుకుందాం..

మధురానగర్: పాలకులు గట్టిగా పట్టించుకుంటే చిటికెలో పరిష్కారమయ్యే స మస్యలను సాగతీస్తూ ఎన్నికలు వచ్చినపుడల్లా పరి ష్కారం పేరుతో ఓట్లకు కోసం ఉపయోగించుకోవడం, అవసరం తీరాకే ప్రజలకు కంటిపై కునుకు లేకుండా చేయడం మధురానగర్‌లో ఏళ్ల తరబడి జరుగుతున్న తతంగం. పదో పరకో దాచుకుని ఒక చిన్నపాటి స్థలం కొనుక్కొని ఇల్లు కట్టుకోవాలని ప్రతి పేద మధ్యతరగతి వారి కల. ఆ కలను పాలకులు పీడకలగా మార్చేశారు.

అసైన్డ్ పేరుతో ఆపేశారు

మదురానగర్‌లోని ఇందిరా కాలనీ ఒకపుడు అసైన్డ్ లాండ్. దీన్ని తన ఆధీనంలో ఉంచుకున్న ఓ వ్యక్తి ఒక సొసైటీకి పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చారు. (ఫొటోలో నీలి రంగు ఉన్న ప్రాంతం) ఆ సొసైటీ అధ్యక్షుడు సొసైటీలో సభ్యులకు ప్లాట్‌ను ఎలాట్ చేపి జీపీ చేశారు. రిజిస్ట్రేషన్ల శాఖ ఈ ప్రాంతం నుండి జీపీలు ఎక్కువగా వస్తున్నాయని ఆపేశారు. ఇది జరిగి దాదాపు 20 ఏళ్లు దాటింది. పోనీ తరువాతయినా చేశారా అంటే అదెప్పుడో అసైన్డ్ లాండ్ అని దాని తాలుకా వివాదాల ఉన్నాయని అంటోంది. ఎక్కడో డోర్ నెంబరు వేసి వెళితే చెల్లక పో ం ు ు నా రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నారు. విషయం రాజకీయ నేతల వద్దకు వెళ్లడంతో 2004 నుంచి ఇ ప్పటి వరకు ఎ న్నికైన ఎంపీలు, స్థానిక ఎమ్మెల్యేలు ఈ సమస్య గురించి మాట్లాడిన వారే. అందులో ఒకరిద్దరు గట్టి ప్రయత్నం చేశారు. కానీ సమస్య అలాగే ఉండిపోయింది. 2 దశాబ్దాల నుంచి అక్కడుంటున్న వారు ఇళ్లు కట్టుకున్నారు కానీ అవి కుటుంబ అవసరాలకు ఉపయోగపడటం లేదని వాపోతోన్నారు. ఇపుడు మళ్లీ ఎన్నికలొచ్చాయి. ఒక్క ప్రజా ప్రతినిధి దీని గురించి పట్టించుకోలేదు.

పాత బుడమేరు కాల్వ స్థానంలో నేతాజీ కాలనీ

వినడానికి, చదవడానికి ఆశ్చర్యంగా ఉండొచ్చు. కానీ ఇది నిజం. ఏలూరు కాల్వకు రైవస్ కాల్వకు మధ్యనున్న మధురానగర్‌లో పప్పుల మిల్లు ఏరియాలో ఒక చోట పరిస్థితి ఇది. ప్రస్తుతం నేతాజీ కాలనీగా పిలుచుకుంటున్న ఈ ఏరియాలో కాలనీ ప్రధాన రోడ్డు ఉత్తరాన ఉన్న ఏలూరు కెనాల్ నుంచి రైవస్ కాల్వ మధ్య పాత బుడమేరు (ఫొటోలో ఎరుపు రంగు మార్కు ఉన్న ప్రాంతం) అని ఒక చిన్న కాల్వ ఉంది. బుడమేరుకు వరద వచ్చినపుడు, పొంగినపుడు ఆ ప్రభావాన్ని రైవస్ కాల్వకు మళ్లించడానికి ఈ పాత బుడమేరు ఉపయోగపడేది. దీని స్థానంలో ఇపుడు ఒక పెద్ద కాలనీ వచ్చింది. గత ఏడాదిన్నరగా ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని సర్వేచేసి నోటీసులిచ్చారు. క్రమబద్ధీకరణ చేయించుకోవాలంటే అప్పటి నుంచి ఇప్పటి వరకు ఉన్నవారు మాత్రమే అర్హులంటోంది. ఇక్కడ దాదాపు 500 పైగా ఇళ్లున్నాయి. జనాభా దాదాపుగా 2వేల మంది ఉన్నారు. దీనికితోడు ఏలూరు కాల్వకు ఉత్తరం పక్క (మధురానగర్) కాల్వ గట్టు పక్కన కూడా ఇదే పరిస్థితి. (ఫొటోలో ఆకుపచ్చరంగు ఉన్న ప్రాంతం). కొద్ది నెలలుగా పౌరసంక్షేమ సంఘం రిజిస్ట్రేషన్‌లు చేయాలని పట్టాలు ఇవ్వాలని పోరాడుతున్నా ఫలితం లేదు. దీంతో ఈ రెండు ప్రాంతాల్లో కొంతమంది (పేరు చెప్పడానికి ఇష్టపడలేదు) స్థానికులు తమకు ఎవరు స్పష్టమైన పరిష్కారం చూపుతారో అప్పుడే పోలింగ్‌కు వచ్చి వారికి ఓటు వేస్తామని అంటున్నారు.



మధురానగర్ మ్యాప్‌లో ఇందిరాకాలనీ (బ్లూ రంగు) నేతాజీ కాలనీ రోడ్డు (ఎరుపు రంగు, పాత బుడమేరు), ఏలూరు కాల్వ గట్టు (ఆకుపచ్చరంగు)

హోరాహోరీగా అంతర్జాతీయ చెస్ టోర్నీ


మూడో రౌండ్ పోటీలను ప్రారంభిస్తున్న బాబూరాజేంద్రప్రసాద్

విజయవాడ స్పోర్ట్స్, ఏప్రిల్ 26: కానూరులోని షామ్‌రాక్ ఇంటర్నేషనల్ స్కూల్లో జరుగుతున్న తొలి అంతర్జాతీయ ఫిడే చెస్ టోర్నీలో శుక్రవారం రెండో రోజు హోరాహోరీగా మూడో రౌండ్ పోటీలు ముగిశాయి. భారత్‌తో పాటు ఐదు దేశాల నుంచి మొత్తం 400 మంది చెస్ ప్లేయర్స్ బరిలో దిగారు. ఎండి.ఇమ్రాన్ (విజయవాడ) ఎన్. ప్రసాద్, (ప్రకాశం), డి. లక్ష్మణరావు,(ఏలూరు) విహాన్ కార్తికేయ(వైజాగ్), రావు జె. మల్లేశ్వరంరావు(విజయవాడ), ఆఫ్రిదీ టి.ఖాన్(అనంతపురం)లు 3కు 3 పాయింట్లతో ముందంజ వేశారు. పోటీలను డైరెక్టర్ తాళ్ల నరేష్ పర్యవేక్షిస్తున్నారు.మూడో రౌండ్ పోటీలను స్ప్రింగ్ బోర్డు ఇంటర్నేషనల్ ప్లే స్కూల్ డైరెక్టర్ ఎం.బాబూ రాజేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా వచ్చి ప్రారంభించారు. చీఫ్ ఆర్బిటర్‌లు జీవీ.కుమార్, కిరణ్, ముసలయ్యలు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో 10 కిలోల గంజాయి పట్టివేత


రైల్వే పోలీసులు అరెస్టు చేసిన శంకర్ స్వాన్

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 26: స్థానిక రైల్వేస్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న ఒడిశాకు చెందిన శంకర్ స్వాన్‌న రైల్వే పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. గుంతకల్ ఎస్ ఆర్ పీ డొడేశ్వరి ఆదేశాలతో డీఎస్‌ఆర్‌పి బీవీ నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ పాల శ్రీనివాసరావు, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఆలీ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా ఉన్న ఒడిశాకు చెందిన శంకర్ స్వాన్‌ను విచారించి, అతని వద్ద 10కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. రైల్వే కోర్టులో అతనికి రిమాండ్ విధించారు.

ఏపీసీసీ సెక్రటరీ బేసికంతేశ్వరుడు రాజీనామా



వన్‌టౌన్, ఏప్రిల్ 26: కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి పార్టీ పదవులకు ఏపీసీసీ సెక్రటరీ, సర్దార్ మరుపిళ్ల చిట్టి కేంద్ర కార్యాలయం అధ్యక్షుడు పోతిన బేసికంతేశ్వరుడు (బేసు) శుక్రవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను స్వాతంత్ర్య సమరయోధుడైన పోతిన వెంకన్న కుమారుడినని 40ఏళ్లుగా కాంగ్రెస్‌లో కార్యకర్తగా, నాయకుడిగా పనిచేశానన్నారు. పార్టీకి విధేయులైన తమను కొంతకాలంగా విస్మరిస్తూ అడుగడుగున అవమానపాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మనస్తాపనకు గురై రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. రాజీనామా పత్రాన్ని పార్టీ అధ్యక్షురాలు షర్మిలకు పంపించామని, ఇదే సమయంలో సిటీ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ పదవికి, కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వానికి పైలా బాలశ్రీనివాసరావు, చిట్టి కార్యాలయ శాశ్వత మెంబర్ పణుకు రమేష్ తమ పదవులకు రాజీనామా చేశారు.

కీచక అధికారిపై మహిళా ఉద్యోగుల ఫిర్యాదు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: రైల్వే డివిజన్ పర్సనల్ కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులపై ఓ అధికారి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్టు డీఆర్ఎంకు ఫిర్యాదు అందింది. పర్సనల్ విభాగంలో పనిచేసే ఇద్దరు మహిళలు ఈ ఫిర్యాదు చేశారు. ఇక్కడ పనిచేసే ఒక వ్యక్తి మహిళా ఉద్యోగులను ట్రాప్ చేస్తున్నాడని, కొత్తగా వచ్చిన అధికారి దగ్గరకు వెళ్లేలా, తమను ప్రేరేపించేలా బెదిరింపులకు దిగుతున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్టుగా తెలుస్తోంది. తమను లైంగికంగా వేధిస్తున్న అధికారి గతంలో సికింద్రాబాద్ లోనూ అనేకమంది మహిళలను లైంగికవేధింపులకు పాల్పడ్డాడని, అతడిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

మే 3న బస్‌స్టేషన్‌లో పార్శిళ్ల వేలం

బస్టేషన్: స్థానిక ఆర్టీసీ పార్శిల్ కార్యాలయంలో యజమానులు వదిలివేసిన, గుర్తించని పార్శిళ్ల బహిరంగ వేలం మే 3న నిర్వహిస్తున్నట్టు కమర్షియల్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు పండిట్ నెహ్రూ బస్టేషన్‌లోని పార్శిల్ కార్యాలయం వద్ద ఈ వేలం జరుగుతుందని పాటదారులు ఈ వేలంలో పాల్గొనాలని కోరారు.

ఘనంగా నూతన యాగశాల ప్రారంభం

- అమ్మవారి ఆలయ దిగువ భాగంలో బంగారు తాపడానికి విరాళాల స్వీకరణ విభాగం ప్రారంభం
- భారీగా విరాళాలు సమర్పించిన దాతలు




బంగారు తాపడానికి తొలి విరాళమిస్తున్న ఈఈ కోటేశ్వరరావు ఆయన బంధువు మోర్ల వెంకట శివరామకృష్ణ, చిత్రపటాలకు హారతి ఇస్తున్న దేవదాయ కమిషనర్ సత్యనారాయణ, ఈవో కేఎస్ రామారావు తదితరులు, దుర్గమ్మను దర్శించుకున్న జస్టిస్ హరినారాయణ దంపతులు

వన్‌టౌన్, ఏప్రిల్ 26: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో రూ.5కోట్లతో నూతనంగా నిర్మించిన యాగశాలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. దేవదాయశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కరికాల వలవన్, కమిషనర్ సత్యనారాయణ, ఈవో కేఎస్ రామారావు, ఆలయ వైదిక కమిటీ సభ్యులు, స్థానాచార్యులు, ముఖ్య అర్చకులు, ఈఈలు పాల్గొన్నారు. వేదమంత్రాలు, మంగళోచ్ఛారణలు, మంగళవాయిద్యాల మధ్య యాగశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గణపతి హోమం, లక్ష్మీహోమం, వాస్తు హోమం, గోపూజ నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న యాగశాల ఇరుకుగా ఉండడంతో దాత సంగా నరసింహారావు అందజేసిన రూ.5కోట్ల భారీ విరాళంతో దీన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ఈవో రామారావు మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరిలోనే యాగశాలకు శంకుస్థాపన జరిగిందని అనతికాలంలోనే యాగశాల భక్తులకు అందుబాటులోకి రావడం ముదావహమన్నారు. విస్తరించిన యాగశాల అవసరమని చాలాకాలంగా ప్రతిపాదనలో ఉందని అయితే దాత సంగా నరసింహారావు ముందుకొచ్చి విరాళం ప్రకటించి ఆయనే స్వయంగా దగ్గరుండి నిర్మింపజేశారని, ఐఐటీ మద్రాస్, ముంబాయి నుంచి నిపుణులను రప్పించి ఆగమ విహీతంగా ఎక్కడా లోటుపాట్లు లేకుండా సాంకేతిక విధానాన్ని వినియోగించి నిర్మింపజేశారని ఇందుకు భారీ క్రెయిన్లను వినియోగించారన్నారు. దేవస్థానం తరఫున దాత నరసింహారావుకు అభినందనలు, కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఇదే సమయంలో అంతరించిపోతున్న ఒక గ్రంధాన్ని సంగా నరసింహారావు ముద్రింపజేస్తున్నారని 'అపౌరుషేయ మహా భగవాత' గ్రంథాన్ని మళ్లీ తనముందుకు తెచ్చేందుకు ఆయన సహకరిస్తున్నారన్నారు. ఈ గ్రంథాన్ని కూడా ఈరోజునే ఆవిష్కరించామని, పరిశోధకులు లక్ష్మీధర శర్మ దీన్ని రచించారన్నారు. అనంతరం లక్ష్మీధర శర్మ మాట్లాడుతూ అమ్మవారి సంపూర్ణ స్వరూపం ఈ గ్రంథం ఉంటుందన్నారు.

యాగశాల దాత దంపతులకు సత్కారం

దుర్గగుడిలో యాగశాల నిర్మాణానికి రూ.5కోట్ల విరాళమందించిన దాత సంగా నరసింహారావు దంపతులను శుక్రవారం యాగశాల ప్రారంభోత్సవం సందర్భంగా ఘనంగా సత్కరించారు. వేదమంత్రాల మధ్య వైదిక కమిటీ సిబ్బంది, స్థానాచార్యుడు శివప్రసాద శర్మ ఆశీస్సులు అందజేశారు. దేవదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవెన్, కమిషనర్ సత్యనారాయణ, ఈవో కేఎస్ రామారావు పాల్గొన్నారు. అధికారులు వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం, అపౌరుషేయ మహాభాగవత గ్రంథం ప్రతిని అందజేశారు. దాతను పలువురు అభినందించారు.

విరాళాల స్వీకరణ విభాగం ప్రారంభం

అమ్మవారి ఆలయ గోపురంలో దిగువ సగభాగానికి బంగారు తాపడం చేయించడం కోసం దాతల నుంచి విరాళాలు స్వీకరించేందుకు దేవస్థానం అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ప్రత్యేకంగా విరాళాల స్వీకరణకు శుక్రవారం ఒక విభాగాన్ని ప్రారంభించారు. దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ కార్యాలయాన్ని ప్రారంభించి పూజలు నిర్వహించారు. ఈవో కేఎస్ రామారావు, యాగశాల దాత సంగా నరసింహారావు ఇంకా పలువురు అధికారులు, వైదిక సిబ్బంది పాల్గొన్నారు. మొదటి విరాళాన్ని ఆలయ ఈఈ కోటేశ్వరరావు 1,01,116, ఆయన బంధువు మోర్ల వెంకట శివరామకృష్ణ రూ.1,01, 0116 అందజేశారు. దేవదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ, ఈవో కేఎస్ రామారావు ఈ విరాళాలను అందుకున్నారు. నగరంలోని సిద్ధార్థనగర్‌కు చెందిన కడియాల వంశీకృష్ణ, పద్మజ దంపతులు రూ.10లక్షల విరాళాన్ని అందజేశారు. దుర్గమ్మ దర్శనానంతరం దాతలకు ఆశీస్సులు, శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటాలను అందజేశారు.

మోదీ వస్తున్నారు.. పశ్చిమకు మహర్దశ

- భయం వద్దు.. ముస్లింలకు అండగా ఉంటా: కూటమి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి


55వ డివిజన్‌లో మహిళ సమస్యను తెలుసుకుంటున్న సుజనా చౌదరి

పాతరాజరాజేశ్వరి పేట, ఏప్రిల్ 26: ఓటమి భయంతోనే ముస్లింలను కొన్ని పార్టీలు బీజేపీకి వ్యతిరేకంగా రెచ్చగొడుతున్నాయని కూటమి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి విమర్శించారు. స్థానిక 55వ డివిజన్‌లోని కంసాలిపేటలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సుజనా చౌదరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో పర్యటిస్తుంటే అడుగడుగునా మహిళలు తమ సమస్యలను చెప్పుకుంటున్నారని, డివిజన్‌లో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కష్కారంతో పాటు మౌలిక సదుపాయాల కల్పన బాధ్యతను పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఓటమి భయంతోనే ముస్లింలను బీజేపీకి వ్యతిరేకంగా రెచ్చగొడుతున్నారని, వారికి అండగా ఉండే బాధ్యత తనదని స్పష్టం చేశారు. గత నేతల్లా మాటలు చెప్పే వ్యక్తిని కానని, కేంద్ర, రాష్ట్ర స్థాయిలో పనిచేసిన తన అనుభవాన్ని నియోజకవర్గం ప్రజలకు ఉపయోగిస్తానన్నారు. మే 3న ప్రధాని మోదీ పశ్చిమ నియోజకవర్గానికి వస్తున్నారన్నారు. త్వరలోనే ఈ నియోజకవర్గానికి మహర్దశ పట్టబోతోందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, జావేద్, వడ్డాది రమణ, ధనేకుల సుబ్బారావు, బీజేపీ, టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట తప్పితే రీకాల్ చేయాల్సిందే...

ఇచ్చిన హామీలు అమలు చేయని ప్రజా ప్రతినిధులను రీకాల్ చేయాలని, కూటమి సుజనా చౌదరి అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 55వ డివిజన్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. దేశంలో ప్రస్తుతం ఈ విధానం లేకపోయినా రీకాల్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. సహజంగా రాజకీయ నేతలు రీకాల్ విధానాన్ని అంగీకరించరని, అయితే ఈ విధానాన్ని అమలు చేయడం అవసరమన్నారు. ఎన్నికల సమయంలో నేతలు ఆచరణ సాధ్యం కాని హామీలు గుప్పిస్తుంటారని, ఎన్నికల్లో గెలిచాక ప్రజల గురించి పట్టించుకోకుండా ముఖం చాటేస్తుంటారన్నారు. ఇలాంటి నేతలు మరోసారి ప్రజల్లోకి రాకుండా ఉండాలంటే రీకాల్ చేయాలన్నారు. మాట తప్పే నేతలను వెనక్కు పంపించే విధానం వస్తే ప్రజలకు మేలు జరుగుతోందన్నారు. రీకాల్ విధానం అమలైతే తాను సైతం సిద్ధమేనని సుజనా చౌదరి ధీమా వ్యక్తం చేశారు.

జగన్.. నీ హామీలు ఉత్తుత్తివేనా?

తిరువూరు ఎన్నికల ప్రచారంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



బోసుబొమ్మ సెంటర్‌లో మాట్లాడుతున్న షర్మిల, పక్కన తిరువూరు అభ్యర్థి తంతియాకుమారి

తిరువూరు, ఏప్రిల్ 26: ఈ ప్రాంతానికి ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా అమలు చేశారా అని పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల ప్రశ్నించారు. ఇండియా కూటమి ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరువూరు బోసుబొమ్మ సెంటర్‌లో ఆమె మాట్లాడారు. వినగడప వద్ద కట్టలేరుపై బ్రిడ్జి నిర్మాణం, నియోజవకర్గంలో ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటు, రైతులకు సంబంధించి కోల్డ్ స్టోరేజీ, మ్యాంగో ప్రాసెసింగ్ యూనిట్ ఏమైయాయ్యన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీతో ప్రత్యేక్షంగా పొత్తుపెట్టుకుంటే, వైసీపీ పరోక్షంగా బీజేపీతో అంట కాగుతుందన్నారు. అభివృద్ధి సంక్షేమాలకు రూపమే కాంగ్రెస్ పార్టీ అని సుస్థిర ప్రభుత్వం కోసం ఇండియా కూటమిని గెలిపించాలన్నారు. విజయవాడ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వల్లూరి భార్గవ్, తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి లాం తాంతియకుమారి బహిరంగ సభలో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం పేరుతో ప్రజలకు రూ.100లు ఇస్తే మరో రూపంలో రూ. 1000లు వసూలు చేస్తుందని విమర్శించారు. ఈ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు మాజీ మంత్రి డాక్టర్ కోనేరు రంగారావు శ్రమించేవారని ఆయన ఆశయ సాధన దిశగా నియోజకవర్గాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తామన్నారు. కాంగ్రెస్ హాయంలో వైఎస్ రాజశేఖరెడ్డి ముస్లింలకు రిజర్వేషన్ కల్పిస్తే, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లింల రిజర్వేషన్ రద్దుచేసే కుట్రకు పాల్పడుతుందని ఆరోపించారు. దేశాభివృద్ధి ప్రజాసంక్షేమం కోసం ఇండియ కూటమిని గెలిపించాలని కోరారు. సభలో వామపక్షాల నాయకులు మేకల నాగేంద్రప్రసాద్, షేక్ నాగులుమీరా, పల్లెపాటి శ్రీనివాసరావు, బొడ్డు ప్రకాశరావు, తాడిశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పలపాటి లక్ష్మీదాసు, మేడా సురేష్, ఉయ్యూరు అనసూయ, పిడపర్తి లక్ష్మీకుమారి, దారా మాధవి, పర్వతనేని జగన్మోహన్ పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు


లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన తాడి శకుంతల, నగరాల నేతలు

వన్‌టౌన్, ఏప్రిల్ 26 : విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) ఆధ్వర్యంలో విజయవాడ నగరాల సామాజిక వర్గానికి చెందిన గుజ్జరి అమర్‌బాబు, మాజీ మేయర్ తాడిశకుంతల తదితరులతో పాటు 400 కుటుంబాలు శుక్రవారం ఉండవల్లిలోని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ సమక్షంలో పార్టీలో చేరారు. వారిని లోకేశ్ సాదరంగా ఆహ్వానించి కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, బలహీనవర్గాలకు టీడీపీ పుట్టినిల్లని, సామాజిక న్యాయం టీడీపీ ద్వారానే జరుగుతుందన్నారు. టీడీపీ హయాంలో ఏరోజు బీసీలపై దాడులు, వేధింపులు జరగలేదన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక 26 వేలమంది బీసీలపై తప్పుడు కేసు బనాయించారన్నారు. టీడీపీ ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీ రక్షణ చట్టాన్ని బలహీన వర్గాలకు అమలు చేస్తామని చెప్పారు. నగరాల సీతారామస్వామి దేవస్థానం అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, నగరాల ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు రాంపిళ్ల శ్రీనివాసరావు, దేవస్థానం మాజీ సెక్రటరీ ఈది యల్లరాజారావు, నగరాల ఎడ్యుకేషన్ సంక్షేమ సొసైటీ అధ్యక్షుడు లింగిపిల్లి రామకృష్ణ, దేవస్థానం గౌరవ అధ్యక్షుడు బెవర సూర్యనారాయణ, కృష్ణాజిల్లా నగరాల సంఘం అధ్యక్షుడు అడ్డూరి రాము, కార్యదర్శి కామంధుల నరసింహరావు, గూడేల శ్రీనివాసరావు, పిళ్లా విజయకుమార్, తమ్మిన సూర్యజయనారాయణరావు, బయన అచ్చుతరావు, బయన వెంకట్రావు, సుకాశి శ్రీనివాసరావు, మద్ది సాంబశివరావు, నాగోతి వాసు, గర్రె మురళీమోహన్, చింతాడ బాలకృష్ణ, కొరికాని దివాకర్, మాకిన సత్యనారాయణ, మాజీ కార్పోరేటర్ బాయన రమాదేవి, మరుపిళ్ల దాలినాయుడుతో పాటు మరికొందరు నగరాల సామాజిక వర్గ నాయకులు పార్టీలో చేరారు.

నగరంలో ముగిసిన నామినేషన్ల స్ర్కూటినీ

ఆంధ్రజ్యోతి, విజయవాడ: నగర వ్యాప్తంగా నామినేషన్ల స్ర్కూటినీలో భాగంగా విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలకు సంబంధించి 46 నామినేషన్లు ఆమోదం పొందగా, 35 తిరస్కరణకు గురయ్యాయి. నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యేనాటికి నగరంలో 152 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో అత్యధికంగా 61 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో 17 నామినేషన్లు ఆమోదం పొందాయి. షేక్ ఆసిఫ్ - వైసీపీ, వై సుజనా చౌదరి - బీజేపీ, మద్దిరాల వినోద్‌కుమార్ - బీఎస్పీతో పాటు గుర్తింపు పొందిన పార్టీలు, స్వతంత్రులకు సంబంధించి మరో 14 నామినేషన్లు ఆమోదమయ్యాయి.

తూర్పులో 17 ఆమోదం 10 తిరస్కరణ

తూర్పు నియోజకవర్గంలో 43సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో మొత్తం 17 నామినేషన్లు ఆమోదం పొందాయి. 10 తిరస్కరణకు గురయ్యాయి. ఆమోదం పొందిన వాటిలో ప్రధాన పార్టీల అభ్యర్థులకు సంబంధించి చూస్తే దేవినేని అవినాష్ - వైసీపీ, కనపర్తి మురళి - బీఎస్పీ, గద్దె రామ్మోహన్ - టీడీపీ, పొనుగుపాటి నాంచారయ్య - కాంగ్రెస్ అభ్యర్థులతో పాటు మరో 13 గుర్తింపు పొందిన పార్టీలకు చెందిన అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లు ఆమోదమయ్యాయి.

సెంట్రల్‌లో 22 ఆమోదం, 4 తిరస్కరణ

సెంట్రల్ నియోజకవర్గంలో మొత్తం 48 సెట్ల నామినేషన్లు దాఖలు కాగా 22 నామినేషన్లు ఆమోదం పొందాయి. 4 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఆమోదం పొందిన వాటిలో ప్రధాన పార్టీలకు సంబంధించి ఐ రాజేంద్ర ప్రసాద్ - బీఎస్పీ, చిగురుపాటి బాబూరావు - సీపీఎం, బొండా ఉమామహేశ్వరరావు - టీడీపీ, వెలంపల్లి శ్రీనివాసరావు - వైసీపీతో పాటు మరో 18 గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందాయి.

పారదర్శకంగా నామినేషన్ల పరిశీలన

- ప్రక్రియను వీడియోలో చిత్రీకరించాం , సెక్షన్ 36 నిబంధనలు పాటించాం
- జిల్లా ఎన్నికల అధికారి ఎస్ ఢిల్లీరావు

కృష్ణలంక, ఏప్రిల్ 26: నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విజయవాడ పార్లమెంటరీ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నామినేషన్ల పరిశీలన ప్రక్రియ నిర్వహించినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చట్ట నిబంధనలు, ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలకనుగుణంగా నామినేషన్ల పరిశీలన జరిగినట్టు తెలిపారు. మొత్తం ప్రక్రియను వీడియోగ్రఫీ చేశామని, ఎలాంటి గందరగోళానికి తావులేకుండా నిర్వహించినట్టు తెలిపారు. చెల్లుబాటయిన నామినేషన్లకు సంబంధించిన అభ్యర్థుల జాబితాను ఫారం-4 ద్వారా వెల్లడించినట్టు పేర్కొన్నారు. ఈ అభ్యర్థుల జాబితాను ఫొటో సహా నోటీసు బోర్డులో ప్రదర్శించినట్టు తెలిపారు. ఈనెల 29న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహారణకు వీలుంటుందని, అనంతరం ఫారం-7 ఏ ద్వారా పోటీలో నిలిచిన అభ్యర్థుల జాబితాను నోటిఫై చేయనున్నట్టు కలెక్టర్ ఢిల్లీరావు వెల్లడించారు.

జిల్లాలో నేడు పాలిసెట్ పరీక్షలు

భారతీనగర్: సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో 2024 పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్ పరీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నిర్వహిస్తున్నట్టు జిల్లా కో-ఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు జిల్లాలోని ప్రధాన పట్టణాలైన విజయవాడ, నందిగామ, తిరువూరు ప్రాంతాల్లోని 20 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించబడతాయి. విద్యార్థులను ఉదయం 10 గంటల నుంచి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని తెలిపారు.

రూ.6.40 కోట్ల నగలు స్వాధీనం

- బంగారం, వెండి వస్తువుల అక్రమ తరలింపు
- వాహన తనిఖీల్లో పోలీసులకు పట్టుబడిన వైనం

నెల్లిమర్ల, ఏప్రిల్ 26: అనుమతులు లేకుండా రవాణా చేస్తున్న సుమారు రూ.6 కోట్ల 40 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులను విజయనగరం జిల్లా డెంకాడ పోలీసులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎస్పీ దీపిక ఆదేశాల మేరకు డెంకాడ మండల పరిధిలోని రాజాపులోవ వద్ద డెంకాడ ఎస్‌ఐ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్నారు. రాత్రి 9 గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు లాజిస్టిక్ కొరియర్ సర్వీసు పేరుతో ఉన్న మారుతీవ్యాన్‌లో విశాఖపట్నం నుంచి విజయనగరం వైపునకు బంగారం, వెండి వస్తువులను తరలిస్తున్నారు. పోలీసులు వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా నగలను గుర్తించారు. పట్టుకున్న వాటిలో పది కేజీల బంగారు వస్తువులు, 15 కేజీల వెండి వస్తువులను ఉన్నాయి. వీటిని విశాఖ జిల్లా వేపగుంటకు చెందిన బల్ల జగదీష్, మర్రిపాలెంకు చెందిన కుబేర మంజునాథ్‌సింగ్, మందపాటి శ్రీనివాసరాజు తరలిస్తున్నారని భోగాపురం రూరల్ సీఐ బి.వి.వెంకటేశ్వరరావు వెల్లడించారు. నిందితులను అదుపులోకి తీసుకుని డెంకాడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

2019లో టెన్త్.. ఇప్పుడు పీహెచ్‌డీ!!

- వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సిత్రాలు.. నామినేషన్‌పై టీడీపీ అభ్యంతరం

విశాఖపట్నం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఎంపీ, ప్రస్తుతం విశాఖ తూర్పు నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ తన విద్యార్హతలతో అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. గత 2019 ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసినప్పుడు తాను పదో తరగతి మాత్రమే చదివినట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కానీ, ఐదేళ్లు గడిచేసరికి ఆయన పీహెచ్‌డీ చేస్తున్నారట. తాజాగా ఆయన సమర్పించిన అఫిడవిట్‌లో 2022లో పీజీ పూర్తిచేసి, ప్రస్తుతం పీహెచ్‌డీ చేస్తున్నట్టు తెలిపారు. అయితే, ఈ విషయంపై టీడీపీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు తరపున ఎన్నికల ఏజెంట్ సీహెచ్ పట్టాభి అభ్యంతరం లేవనెత్తారు. ఈ విద్యార్హతలు నమ్మశక్యంగా లేవని, నామినేషన్ తిరస్కరించాలని కోరారు. కానీ, ఇది పెద్ద విషయం కాదన్న రిటర్నింగ్ అధికారి.. ఎంవీవీ నామినేషన్‌ను ఆమోదించారు.

అభ్యంతరాలున్నా అనుమతి!

- తెనాలి వైసీసీ అభ్యర్థి అఫిడవిట్‌లో సంతకాల తికమక.. అయినా ఓకే

తెనాలి వైసీపీ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నామినేషన్‌పై ఉత్కంఠ నెలకొంది. నామినేషన్ ఫాం-26లోని అఫిడవిట్‌లో నోటరీ చేసిన సంతకం, శివకుమార్ సమర్పించిన నామినేషన్ పత్రాల్లో సంతకాలు వేర్వేరు తేదీలతో ఉండటంపై టీడీపీ అభ్యంతరం తెలిపింది. నిబంధనల ప్రకారం అఫిడవిట్‌ను నిర్ధారించడానికి దీనికి సంబంధించిన కమిషనర్ లేదా ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్, లేక నోటరీ ద్వారా సమర్పించాల్సి ఉంటుంది. అఫిడవిట్‌లోని అంశాలన్నీ నిజమని ప్రమాణం చేస్తూ వారి సమక్షంలో అభ్యర్థి అదే రోజు సంతకాలు చేయాలి. అంటే నోటరీ చేయిస్తే, నోటరీ సంతకం, అభ్యర్థి నిర్ధారించిన ప్రమాణ పత్ర సంతకం ఒకేరోజు జరగాల్సి ఉంది. ఈ రెండు సంతకాలు ప్రతి పేజీపైనా ఉండాలి. కానీ శివకుమార్ అఫిడవిట్‌లో నోటరీ 23న సంతకం చేయగా అభ్యర్థి 24న సంతకం చేసినట్లు చూపారు. ఇది ఎన్నికల నియమావళికి విరుద్ధమని, నామినేషన్‌ను తిరస్కరించాలని టీడీపీ వాదించింది. కానీ, శివకుమార్ నామినేషన్‌ను ఆర్వో అనుమతించారు. దీనిపై టీడీపీ ఈసీకి ఫిర్యాదు చేసింది.

సెప్టిక్ అవుతుందన్నా ప్లాస్టర్ తీయరేం?: వర్ల

అమరావతి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): గులకరాయి తగిలి 13 రోజులైనా ప్లాస్టర్ తీయకుండా, జగన్ ప్రజల్ని మభ్యపెట్టి, ఓట్లు దండుకోవటానికి డ్రామాలు ఆడుతున్నాడని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ధ్వజమెత్తారు. శుక్రవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'మహిళలకు పెద్దాపరేషన్ చేసినా.. వారానికే కుట్లు ఊడతీస్తారు. కానీ జగన్ మాత్రం మూడు రోజులకు తీయాల్సిన ప్లాస్టర్ ఇన్ని రోజులు ఉంచుకుని, సానుభూతి కోసం తాపత్రయపడుతున్నాడు. ఇన్ని రోజులు ప్లాస్టర్ ఉంచుకుంటే సెప్టిక్ అవుతుందని డాక్టర్లు హెచ్చరిస్తున్నా.. తనకు ఓట్లే ముఖ్యమన్నట్లు జగన్ వ్యవహరిస్తున్నాడు. బాబాయ్ వివేకాపై గొడ్డలి వేటులో సూత్రధారిని అమాయకుడని సీఎం అనడం విడ్డూరం. 11 చార్జిషీట్లున్న తనూ అమాయకుడిననే అంటాడా?' అని వర్ల ప్రశ్నించారు.

1న ఇళ్ల వద్దే పింఛన్లు ఇవ్వాలి: రామకృష్ణ

అనంతపురం, ఏప్రిల్ 26: 'రాష్ట్రంలో వృద్ధులకు ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీ చేయాలి. లేకుంటే ఎన్నికల కోడ్ ఉన్నా నిరసన తెలుపుతాం' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హెచ్చరించారు. అనంతపురం నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. 'రాష్ట్రంలో 66 లక్షల మంది పింఛన్‌దారులు ఉన్నారు. వారికి మే 1నే పింఛన్ చెల్లించాలి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1.26 లక్షల మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. ఒక్కొక్కరు 50 మందికి పింఛన్ అందించేలా బాధ్యతలు అప్పగించాలి. ఒకటో తేదీ మధ్యాహ్నానికి పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలి. లేదంటే ఎక్కడికక్కడ నిరసన కార్యక్రమాలు చేపడతాం' అని రామకృష్ణ హెచ్చరించారు.

చేపల వేట చూసేందుకు వెళ్లి మృత్యువాత

- ముగ్గురిని మింగిన జల్లేరు వాగు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 26: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం వేగవరం పంచాయతీ పరిధిలోని జల్లేరు వాగులో మునిగి శుక్రవారం సాయంత్రం ఇద్దరు మహిళలతో పాటు ఒక బాలుడు మృత్యువాత పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం దిబ్బగూడేనికి చెందిన షేక్ మౌలాలి చేపలు పడుతూ ఉంటాడు. అతనితోపాటు అతని భార్య షేక్ మొహిషా (23) ఆమె సోదరుడు షేక్ అషాద్ (14) సరదాగా జల్లేరు వాగుకు వెళ్లారు. వారి బంధువులు తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట మండలం ఊట్లపల్లి గ్రామానికి చెందిన షేక్ ఖాజాహుస్సేన్ కూడా చేపలు పడుతుంటాడు. అతను కూడా కుమార్తె షేక్ రేష్మా (24)ను తీసుకుని జల్లేరువాగు వద్దకు వెళ్లారు. మౌలాలి, ఖాజాహుస్సేన్ నీళ్లలో దిగి చేపలు పడుతున్నారు. అప్పటివరకు ఒడ్డున ఉన్న మొహిషా, రేష్మా, అషాద్ ఎండవేడిమి భరించలేక నీళ్లలోకి దిగారు. వీరు దిగిన ప్రాంతం గుండం కావడంతో ఒకరి తరువాత ఒకరు మునిగిపోయి మృత్యువాత పడ్డారు. ఈ సమాచారం అందుకున్న జంగారెడ్డిగూడెం ఎస్‌ఐ జ్యోతిబస్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెరుగుతున్న విద్యుత్ వినియోగం

అమరావతి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వేసవి ఉష్ణోగ్రతలు పతాక స్థాయికి చేరుకున్నాయి. విద్యుత్తు వాడకమూ అంతే స్థాయిలో ఉంటోంది. సగటున రోజుకు 250 మిలియన్ యూనిట్లదాకా విద్యుత్తు డిమాండ్ ఉంటోంది. గురువారం 249.779 మిలియన్ యూనిట్ల డిమాండ్ నమోదైంది. రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థలు, కేంద్ర విద్యుదుత్పత్తి సంస్థ నుంచి 211.218 మిలియన్ యూనిట్ల మేర సమీకరించారు. మరో 38.561 మిలియన్ యూనిట్ల లోటు ఏర్పడింది. 39.779 మిలియన్ యూనిట్లను బహిరంగ మార్కెట్‌లో రూ.26.775 కోట్లకు కొనుగోలు చేశారు. మరోవైపు థర్మల్ కేంద్రాల్లో మూడు రోజులకు సరిపడా మాత్రమే బొగ్గు నిల్వలు ఉన్నాయి.



సర్కారును సిబ్బందే పోషిస్తున్నారట!

వారి పేరిట చెక్కులు తీసిన సర్వేశాఖ.. గతంలోనూ ఇలాగే చిల్లర పనులు

- ఉద్యోగులకు పెళ్లి భోజనాలు పెట్టించి హోటల్ ఖర్చు కింద చెక్కులు జారీ
- 'మీ సేవ' నిధులను కొల్లగొట్టిన వైనం
- 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో వెలుగులోకి
- అయినా, సర్వేశాఖలో ఆగని చేతివాటం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఉద్యోగులకు జీతాలు, పింఛనులు ఇవ్వడానికే సర్కారు వద్ద నిధులు లేవు. నెలనెలా అప్పులు తెచ్చి గండాలు దాటుతోంది. ఈ సమయంలో సర్వే శాఖ 'మీ సేవ' నిధులను అడ్డగోలుగా వాడేసుకుంటోంది. నిధులు ఏ అవసరానికి వాడుకున్నారో చెప్పడానికి లక్షల రూపాయలు వెచ్చించి ఖరీదైన మొక్కలు కొనుగోలు చేసినట్లుగా బిల్లులు తీసుకొస్తోంది. ఇది సరిపోదన్నట్లుగా సర్వేశాఖలోని ఉద్యోగులు ప్రభుత్వ అవసరాలకోసం ఖర్చులు పెట్టినట్లుగా లెక్కలు చూపి వారి పేరిట లక్షలాది రూపాయలకు చెక్‌లు జారీ చేస్తున్నారు. అసలే ఎన్నికల సమయం. ఏం చేసినా ఎవ్వరికి తెలియదనుకున్నారో ఏమోగానీ, విచ్చలవిడిగా ఖర్చులు, లెక్కలు రెడీ చేశారు. గతంలోనూ 'మీ సేవ' నిధుల అడ్డగోలు వినియోగానికి సర్వే అధికారి ఇలాంటి చిల్లర పనులే చేశారు. ఉద్యోగులను పెళ్లి విందుకు తీసుకెళ్లి బయట హోటల్‌లో భోజనం చేసినట్లు బిల్లులు పెట్టి తమ కక్కుర్తి చాటుకున్నారు. విషయం బయటకు రాగానే కొంతకాలం మౌనంగా ఉండి, ఇప్పుడు ఎన్నికల సమయంలో మరోసారి తమ విశ్వరూపాన్ని చూపిస్తున్నారు. సర్వే శాఖ అందించే సేవలు అంటే భూముల సర్వే, సబ్ డివిజన్ వంటివి పొందడానికి రైతులు మీ సేవ ద్వారా ఫీజులు చెల్లిస్తున్నారు. అవి నేరుగా సర్వేశాఖ నియంత్రణలోని మీ సేవ ఖాతాలో ఉంటాయి. వాటిని నేరుగా ప్రభుత్వానికి జమ చేయాలి. అంతే తప్ప శాఖాపరమైన అవసరాలకు వినియోగించడానికి వీల్లేదని నిబంధనలున్నాయి. అయితే, సర్వేశాఖలో గత కొన్నేళ్లుగా మీ సేవ నిధులను ఇష్టానుసారంగా వినియోగిస్తున్నారు. సర్వే కమిషనర్ల విచక్షణ మేరకు నిధులను శాఖాపరమైన అవసరాలకు వాడుకుంటున్నారు. ఇలా గత నాలుగున్నరేళ్ల కాలంలో రూ.270 కోట్లపైనే వినియోగించారు. బిల్లులను చూస్తే నిధులు ఇలా కూడా వాడుకుంటున్నారా? అని తలతిరిగిపోయేలా అధికారులు వ్యవహరిస్తున్నారు. సర్వేశాఖలో నిధుల వినియోగంలోని అక్రమాలు, దొంగ పద్ధతులను 'ఆంధ్రజ్యోతి' గత ఏడాది ఆధారాలతో సహా వెలుగులోకి తీసుకొచ్చింది. ఉద్యోగులు తమ సొంత డబ్బును ప్రభుత్వ అవసరాలకోసం ఖర్చుపెట్టినట్లుగా లెక్కలు చూపి, ఆ మేరకు వారి పేరిట లక్షల రూపాయల చెక్‌లు జారీ చేశారు. మీ సేవ నిధుల నుంచే ఆ చెక్‌లను క్లియర్ చేశారు. ఇలా చెక్‌నెంబర్లు, ఉద్యోగుల పేర్లను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. చివరికి సర్వేశాఖలోని ఓ ఉద్యోగి ఇంట పెళ్లికి వెళ్లి అక్కడే భోజనాలు చేసి, బయట క్యాటరింగ్ తీసుకున్నట్లుగా బిల్లులు సృష్టించిన ఘనత ఇక్కడి అధికారులది. ఈ ఉదంతాన్ని కూడా ఆంధ్రజ్యోతి ఆధారాలతో సహా వెలుగులోకి తీసుకొచ్చింది. వీటిపై విచారణ చేపట్టాలన్న డిమాండ్లు వచ్చినా రెవెన్యూ, సర్వే అధికారులు కూడబలుక్కొని ఒక్కటయ్యారు. విచారణే లేకుండా వివరణలతో విషయాన్ని ముగించారు.

గుట్టుగా ఖాతా మార్పు

ఇటీవలి కాలంలో సర్వే కమిషనరేట్‌ను విజయవాడలోని కరెన్సీ నగర్ నుంచి మంగళగిరిలోని ఏపీఐఐసీ బిల్డింగ్‌కు మార్చారు. సర్వేశాఖ మీసేవ నిధుల ఖాతా రామవరప్పాడు రింగ్‌లో ఉన్న యూనియన్‌బ్యాంక్‌లో ఉండేది. ఆ ఖాతా లావాదేవీలు బయటకు వచ్చాకే మీ సేవ నిధుల దుర్వినియోగం బయటపడింది. దీంతో అధికారులు జాగ్రత్త పడి ఆ ఖాతాను మూసివేశారు. గురునానక్‌నగర్ కాలనీలోని ఎస్‌బీఐలో కొత్తగా ఖాతా తెరిచారు. నిజానికి కొత్త ఖాతా ఏర్పాటు చేయాలనుకుంటే, ఆఫీసు ఉన్న మంగళగిరిలోనే ఏర్పాటు చేసుకోవచ్చు. కానీ అందుకు భిన్నంగా విజయవాడలోని గురునానక్ కాలనీలోని ఎస్‌బీఐలో ఖాతా తెరిచారు. ఇది కూడా అనేక అనుమానాలకు తావిచ్చేలా ఉంది. ఈ అనుమానాలను నిజం చేసేలా ఇప్పుడు నిధుల వినియోగంలోని చిత్రాలు బయటకొస్తున్నాయి. ఎన్నికల సమయంలో సరిగ్గా నాలుగు రోజుల క్రితం సర్వే అధికారులు లక్షల రూపాయలు వ్యయం చేసి మొక్కలు కొన్నారు. ఇంత అర్జంటుగా మొక్కలు కొనాల్సిన అవసరం ఏమొచ్చింది? పైగా, కొనుగోలు చేసిన మొక్కలేవీ సర్వే ఆఫీసు పరిసరాల్లో కనిపించడం లేదు. అలాగని , ఆశాఖ సొంతంగా నర్సరీ కూడా నిర్వహించడం లేదు. ఒక పక్క ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో నిండా మునిగిపోతే, సర్వే అధికారులు లక్షలాది రూపాయలతో మొక్కలు కొన్నారు. నిజంగా వాటిని కొనుగోలు చేశారా? లేక ఆ పేరిట బిల్లులు సృష్టించారో అంతుచిక్కడం లేదు. పోరంకిలోని ఓ నర్సరీ నుంచి లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసినట్లుగా బిల్లులు తెచ్చారు.

ఉద్యోగుల పేరిట మళ్లీ చెక్కులు

సర్వేశాఖ ప్రభుత్వంలో ఓ విభాగం. ఆ శాఖ ఏ పనిచేయాలన్నా ప్రభుత్వమే ఖర్చు భరిస్తుంది. ఉద్యోగులు తమ జేబుల్లో నుంచి రూపాయి తీసి ఖర్చుపెట్టాల్సిన అవసరం లేదు. నిజంగానే ఉద్యోగులతో ఖర్చుపెట్టించేంతగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పాతాళానికి పడిపోలేదు. కానీ సర్వేశాఖ చేస్తున్న పనులు చూస్తే ప్రభుత్వాన్ని ఉద్యోగులే ఆదుకుంటున్నట్లుగా ఉంది. ఆ శాఖ పరిధిలో వివిధ అవసరాలకు ఉద్యోగులు సొంతంగా డబ్బు ఖర్చుపెట్టుకున్నట్లుగా లెక్కలు చూపిస్తోంది. ఆ డబ్బును తిరిగి రీఎంబర్స్‌మెంట్ చేస్తున్నట్లుగా రికార్డులు తయారుచేస్తోంది. ఈ మేరకు ఉద్యోగులకు సొమ్ము చెల్లిస్తున్నట్లుగా వారి పేరిట చెక్‌లు జారీ చేస్తోంది. ఎన్నికల కోడ్ రావడానికి ముందు ఫిబ్రవరిలో, కోడ్ వచ్చాక మార్చి, ఏప్రిల్‌లో పలువురు ఉద్యోగుల పేరిట చెక్‌లు జారీ చేశారు. ఇవి ఎందుకిచ్చారు? ఆ నిధులను ఎక్కడ ఖర్చుపెట్టారో సర్వేశ్వరుడికే తెలియాలి.

వైసీపీ ర్యాలీలో పాల్గొన్నవారికీ మస్టర్లు!

- 'ఉపాధి'లో అవినీతిపై సర్పంచి భర్త ఫిర్యాదు
- ఎంపీడీఓ సమక్షంలోనే ఆయనపై దాడి చేసిన వైసీపీ నేత

రాపూరు(డక్కిలి), ఏప్రిల్ 26: వైసీపీ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమానికి హాజరైనవారికి ఉపాధి పనులు చేసినట్లు మస్టర్లు ఎలా వేస్తారని ప్రశ్నించిన పంగిలి సర్పంచి భర్త కూకటి పెంచలయ్యపై ఎంపీడీవో సమక్షంలోనే ఉపాధి మేట్ మదిరా సుబ్బయ్య, వైసీపీ నాయకుడు మదురా సుబ్బయ్య దాడిచేశారు. ఈ సంఘటన నెల్లూరు జిల్లా రాపూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం చోటుచేసుకొంది. దీంతో పెంచలయ్య పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడిని ఆసుపత్రికి పంపి కేసు నమోదు చేశారు.


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న పంగిలి సర్పంచి భర్త పెంచలయ్య

టీడీపీ వచ్చాక.. లక్ష అంతర్జాతీయ ఉద్యోగాలు!

ప్రవాసాంధ్ర టీడీపీ నేతల ప్రకటన.. రాష్ట్రవ్యాప్త ప్రచారానికి శ్రీకారం

- రంగంలోకి 25 ప్రచార వాహనాలు
- జెండా ఊపి ప్రారంభించిన ఎన్నారై నేతలు
- ఐదేళ్లుగా చీకటి పాలన
- రాష్ట్రం వెనుకబడిపోయింది
- యువత బాగా నష్టపోయారు
- తిరిగి గాడిలో పెట్టడానికి బాబే రావాలి
- ప్రవాస నాయకుల స్పష్టీకరణ



మంగళగిరిలోని టీడీపీ కార్యాలయం వద్ద ఎన్ఆర్ఐల ర్యాలీ

అమరావతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధికారంలోకి వచ్చాక ఆంధ్రప్రదేశ్ యువతకు లక్ష అంతర్జాతీయ ఉద్యోగాలు వచ్చేలా చూస్తామని ప్రవాసాంధ్ర టీడీపీ విభాగం నేతలు ప్రకటించారు. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల తరపున ప్రచారానికి వెళ్తున్న 25 ప్రవాసాంధ్రుల ప్రచార వాహనాలను ఆ విభాగం నేతలు వేమూరి రవికుమార్, రావి రాధాకృష్ణ, కానూరి శేషుబాబు, మేదరమెట్ల మల్లిక్, మంగలూరి భాను, బుచ్చిరాం ప్రసాద్ జెండాలు ఊపి ప్రారంభించారు. నాలుగు ప్రాంతాల్లోని 25 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో వీరు ప్రచారం చేస్తారు. అనంతరం ఎన్నారై టీడీపీ అధ్యక్షుడు రవి కుమార్ విలేకరులతో మాట్లాడారు. 'ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను తెలుగువారు అందిపుచ్చుకోవడానికి గతంలో టీడీపీ విధానాలు, పాలన ఉపకరించాయి. విభజన తర్వాత ఆంధ్ర రాష్ట్రానికి తమ వంతు సాయం చేయాలనుకున్న ప్రవాసాంధ్రుల ఆశలను వైసీపీ పాలన తీవ్రంగా దెబ్బతీసింది. వచ్చిన వారు వెనక్కి వెళ్లిపోయారు. కంపెనీలు పక్క రాష్ట్రాలకు తరలిపోయాయి. మళ్లీ టీడీపీ వచ్చాక ప్రవాసాంధ్ర పెట్టుబడులు రావడానికి మా వంతు కృషి చేస్తాం. మా విభాగం ద్వారా విదేశాల్లో కనీసం లక్ష అంతర్జాతీయ ఉద్యోగాలను ఇక్కడి యువత పొందేలా చేస్తాం. ఒక్క ఐటీలోనే కాకుండా ఆరోగ్య రక్షణ, ఫార్మసీ, పర్యాటకం, వాణిజ్యంలో ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయి. ఐరోపా, కెనడా, జపాన్‌లో అవకాశాలు బాగా వస్తున్నాయి. అమెరికాలో కూడా తెలుగు వారి కంపెనీలు వేలల్లో ఉన్నాయి. ఒక్కో కంపెనీ ఇరవై ఉద్యోగాలు ఇచ్చినా లక్ష ఉద్యోగాలు అవుతాయి. టీడీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నది లక్ష్యంగా పెట్టుకుంది. అందులో ఒక లక్ష అంతర్జాతీయ ఉద్యోగాలు మా ద్వారా కల్పిస్తాం. అమెరికాలో ఇప్పుడు కొంత ఇబ్బంది ఉన్నా ఏడాదిలో అక్కడ గాడిలో పడుతుంది. ఇక్కడ మేం ముందుగానే తగిన నైపుణ్య శిక్షణ ఇప్పించి ఉద్యోగాలు ఇప్పిస్తాం' అని వివరించారు. మొత్తం 175 నియోజకవర్గాల్లో ప్రవాసాంధ్రులు ప్రచారం చేయబోతున్నారని, మంచి ప్రభుత్వం ఉంటే మంచి భవిష్యత్ ఉంటుందనేది తమ నినాదమని రావి రాధాకృష్ణ చెప్పారు. ఇంత మంది ఎన్నారైలు ప్రచారానికి తరలిరావడం గతంలో ఎప్పుడూ చూడలేదని, ఈ రాష్ట్రంపై ప్రేమ.. ఇక్కడి అధ్వాన పరిస్థితులపై కసితో వస్తున్నారని అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఇప్పటికే శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి నైపుణ్య శిక్షణ ఇప్పిస్తున్నామని, దీని ద్వారా అమెరికాలో టీచర్లు, పర్యాటకం, ఆరోగ్య రంగాల్లో కొన్ని వందల మందికి ఉద్యోగాలు కల్పించామని మేదరమెట్ల మల్లిక్ తెలిపారు. ఐదేళ్ల చీకటి పాలనలో రాష్ట్రం వెనుకబడిపోయిందని, యువత బాగా నష్టపోయారని, దారి తప్పిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టడానికి చంద్రబాబు రావడం ఒక్కటే మార్గమని చాటుతామని నేతలు వెల్లడించారు.

ఎన్‌రైజ్ ఏపీ పేరుతో ప్రచారం

ఎన్‌రైజ్ ఏపీ పేరుతో తమ ప్రచారం నిర్వహించాలని ప్రవాసాంధ్ర టీడీపీ విభాగం నిర్ణయించింది. అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ/కూటమి అభ్యర్థులను సమన్వయం చేసుకుని ఆయా నియోజకవర్గాల్లో యువతను, సాధారణ ప్రజలను కలిసి ఈసారి టీడీపీ/కూటమిని గెలిపించాల్సిన అవసరాన్ని వీరు వివరిస్తారు.


స్త్రీ ధనంపై భర్తకు అధికారం లేదు

- అదేమీ ఉమ్మడి ఆస్తి కాదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: భార్యకు చెందిన స్త్రీ ధనంపై భర్తకు ఎలాంటి నియంత్రణ ఉండదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ ఇబ్బందుల్లో ఉన్నప్పుడు దానిని తీసుకున్నా దానిని తిరిగి ఆమెకు చెల్లించాల్సిన నైతిక బాధ్యత ఆయనపై ఉందని తెలిపింది. భార్య తీసుకొచ్చిన నగలను అమ్మేసినందుకు ఆమెకు రూ.25 లక్షలు చెల్లించాలని కేరళకు చెందిన ఓ వ్యక్తిని ఆదేశించింది. ఆ మహిళ 2009లో ఆ వ్యక్తిని రెండో వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో 89 సవర్ల బంగారు నగలను తీసుకెళ్లింది. భర్త నగలను తీసుకున్నాడు. అమ్మేసి అప్పు కట్టాడు. అనంతరం గొడవలు రావడంతో భార్య ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించింది. భర్త, అత్త కలిసి తన నగలు అమ్మేశారని, వాటిని ఇప్పించాలని కోరింది. ఆమెకు అనుకూలంగా 2011లో ఫ్యామిలీ కోర్టు తీర్పు ఇచ్చింది. దీనిపై అతడు హైకోర్టులో అప్పీలు చేశాడు. బంగారాన్ని అమ్మేసినట్టు ఆమె నిరూపించలేకపోవడంతో దాన్ని ఇవ్వాల్సిన పనిలేదని తెలిపింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ మళ్లీ సదరు భార్య సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం.. స్త్రీ ధనం భార్యాభర్తల ఉమ్మడి ఆస్తి కాదని, దీనిపై భర్తకు హక్కు ఉండదని స్పష్టం చేసింది.

సందేశాల ఎన్‌క్రిప్షన్‌ను తొలగించం

- బలవంతం చేస్తే భారత్ నుంచి వెళ్లిపోతాం
- ఢిల్లీ హైకోర్టుకు వాట్సాప్ వెల్లడి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: తమ వినియోగదారుల సందేశాలకు సంబంధించి ఎన్‌క్రిప్షన్ విధానాన్ని తొలగించాలని బలవంతం చేస్తే నిరభ్యంతరంగా భారత్ నుంచి వైదొలుగుతామని ఢిల్లీ హైకోర్టుకు వాట్సాప్ స్పష్టం చేసింది. 'కొత్త ఐటీ నిబంధనలు-2021'లోని పలు సెక్షన్లను సవాల్ చేస్తూ వాట్సాప్, ఫేస్‌బుక్ (ఇప్పుడు మెటా) సంస్థలు గతంలో దాఖలు చేసిన పిటిషన్‌పై తాజాగా కోర్టు విచారణ జరిపింది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మన్మీత్ ప్రీతం సింగ్ అరోరాల ధర్మాసనం ముందు వాట్సాప్ తరఫున సీనియర్ న్యాయవాది తేజస్ కరియా వాదనలు వినిపించారు. 'వాట్సాప్‌లో సందేశాల భద్రత కోసం ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ విధానాన్ని అవలంబిస్తున్నాం. సందేశాన్ని పంపిన వారు.. గ్రహీత మాత్రమే దాన్ని చదవగలరు. కొత్త నిబంధనల మేరకు ఇప్పుడు ఆ ఎన్‌క్రిప్షన్ విధానాన్ని బ్రేక్ చేయాల్సి ఉంటుంది. అలా మీరు చేయాలని చెబితే భారత్ నుంచి వైదొలుగుతాం' అని తేల్చి చెప్పారు. ఐటీ నిబంధనల్లోని 4 (2) సెక్షన్ మేరకు చాట్‌లను ట్రేస్ చేయడం, మూలాలను గుర్తించడం లాంటివి చేయాల్సి ఉంటుందన్నారు. ఇది భావ ప్రకటన స్వేచ్ఛకు, వినియోగదారుల గోప్యత హక్కుకు భంగం కలిగిస్తుందని.. రాజ్యాంగ విరుద్ధమని వాదించారు. సామాజిక మాధ్యమ సంస్థలతో ఎటువంటి సంప్రదింపులు జరపకుండానే కొత్త నిబంధనలు తెచ్చారని ఆక్షేపించారు. దీంతో కోర్టు కలుగజేసుకొని ఇతర దేశాల్లో ఇటువంటి చట్టాలు లేవా అని ప్రశ్నించింది. దీనికి కరియా బదులిస్తూ.. 'ఏ దేశంలోనూ ఇటువంటి నిబంధనలు లేవు' అని తెలిపారు. వాదనల అనంతరం కోర్టు.. విచారణను ఆగస్టు 14వ తేదీకి వాయిదా వేసింది.

మీకు ప్రజల కంటే రాజకీయ ప్రయోజనాలే ఎక్కువయ్యాయి

- కేజ్రీవాల్‌పై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: దేశ రాజధాని పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటికీ.. విద్యార్థులకు ఇంకా పుస్తకాలు పంపిణీ కాలేదన్న పిటిషన్‌పై ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఢిల్లీ హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. జైలులో ఉన్నప్పటికీ సీఎం పదవికి కేజ్రీవాల్ రాజీనామా చేయకపోవటం వల్ల, మరొకరు ఆ బాధ్యతలు స్వీకరించకపోవటం వల్ల ఢిల్లీలో పాలన స్తంభించిపోతోందన్న అర్థం వచ్చేలా వ్యాఖ్యలు చేసింది. ఓ స్వచ్ఛందసంస్థ దాఖలు చేసిన పిల్‌పై కోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. పుస్తకాల పంపిణీకి సీఎం ఆమోదం అవసరమని, కానీ, ఆయన జైలులో ఉన్నారని ఢిల్లీ ప్రభుత్వ న్యాయవాది చెప్పటంతో ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. విద్యార్థుల, ప్రజల ప్రయోజనాల కన్నా తన వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలకే కేజ్రీవాల్ ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడింది. దేశ ప్రయోజనాలే అత్యంత ముఖ్యమైనవని ఇప్పటివరకూ తాము సంయమనంతో చెబుతూ వచ్చామని, కానీ ఇది తప్పని రుజువవుతోందని.. సోమవారం దీనిపై ఆదేశాలు జారీ చేస్తామని తెలిపింది.


విలేకరుల సమావేశంలో పొట్లూరి దర్శిత్ తదితరులు

విద్యార్థిలోకంపై దాడి జరిగింది!

- ఐదేళ్లలో మాతో ఆడిన ఫుట్‌బాల్ గాయాలివి
- ఒక్క డీఎస్సీ లేదు.. జాబ్ క్యాలెండర్ రాలేదు
- వేలాది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు
- మే 13న ఓటు ఆయుధంతో జగన్‌కు బుద్ధి చెప్పండి
- టీఎన్ఎస్ఎఫ్ నాయకుల పిలుపు

విజయవాడ(విద్యాధరపురం), ఏప్రిల్ 26: గత ఐదేళ్ల వైసీపీ పాలనతో విద్యార్థి లోకంపై దాడి జరిగిందని, మే 13న జరిగే ఎన్నికల్లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై ఓటు ఆయుధంతో ప్రతి దాడి చేసి అరాచక ప్రభుత్వానికి చరమగీతం పాడాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి పొట్లూరి దర్శిత్, ఇతర నాయకులు పిలుపునిచ్చారు. 'తగలని గాయాలకు కనిపించే కట్లు' అంటూ శుక్రవారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో దర్శిత్‌తో పాటు రేపాకుల శ్రీనివాస్, చరణ్ సాయి తలలకు కట్లు కట్టుకుని విలేకరులతో మాట్లాడారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక 23 వేల మంది యువత ఆత్మహత్య చేసుకున్నారని, జగన్ దుర్మార్గమైన పాలనే ఇందుకు కారణమని చెప్పారు. ఐదేళ్లుగా విద్యార్థులపై చేసిన దాడుల గాయాలను పట్టించుకోని జగన్.. కనిపించని గులకరాయి దెబ్బకు గత 13 రోజులుగా స్టిక్కరు అంటించుకుని డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏటా ఏదోక విధంగా విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నాడని, అనేక రకాల దాడులు చేశాడని ఆరోపించారు. ఒక్క డీఎస్సీ కూడా ప్రకటించకుండా, ఉద్యోగాలు భర్తీ చేయకుండా, స్కూల్ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించకుండా అన్నింటికీ గండి కొట్టాడన్నారు. ఎయిడెడ్ విద్యా సంస్థల ఆస్తులపై కన్నేసి కాజేయాలని చూశారన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలుపుదల చేసి వెన్నుపోటు పొడిచాడన్నారు. పీజీ విద్యార్థులకూ ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దు చేశారన్నారు. అంబేడ్కర్ విదేశీ విద్య పథకాన్ని ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం చంద్రబాబు తీసుకు వస్తే, పెత్తందారీ మనస్తత్వం గల జగన్ ఆ పథకాన్ని రద్దు చేసి ఆ సామాజిక వర్గం విద్యార్థులపై దాడి చేశాడన్నారు. విద్యార్థులపై ఇలా అనేక దాడులు చేసుకుంటూ వచ్చిన జగన్.. గత 13 రోజుల క్రితం గులకరాయి దాడిని సాకుగా చూపించి ఒక కట్టు కట్టుకుని రాష్ట్రంలో తిరుగుతున్నారని విమర్శించారు. విజయవాడలో ఇంకొక దుర్మార్గుడు కుడి కంటికి, ఎడమ కంటికి స్టిక్కర్లు, కాటన్‌లు మార్చుకుంటూ ప్రజలను మభ్యపెట్టేందుకు చూస్తున్నాడని విమర్శించారు.

విశాఖ నుంచి మరో విదేశీ విమానం

- కౌలాలంపూర్‌కు సర్వీసు ప్రారంభం

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి మలేషియా రాజధాని కౌలాలంపూర్‌కు కొత్త అంతర్జాతీయ విమాన సర్వీసు అందుబాటులోకి వచ్చింది. ఎయిర్ ఆసియా సంస్థ వారానికి మూడు రోజులు దీనిని నడపడానికి ముందుకువచ్చింది. ఇది బుధ, శుక్ర, ఆదివారాల్లో రాకపోకలు సాగిస్తుంది. రాత్రి 9.30 గంటలకు విశాఖపట్నం వచ్చి తిరిగి 10 గంటలకు బయలుదేరుతుంది. ఈ విమానం శుక్రవారం రాత్రి రాగా విమానాశ్రయం డైరెక్టర్, ఇతర సిబ్బంది కలిసి వాటర్ కేనన్(నీటితో స్వాగతం) పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విమానాశ్రయం డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు సింగపూర్‌కు స్కూట్ ఎయిర్‌లైన్స్ వారానికి నాలుగు రోజులు, బ్యాంకాక్‌కు థాయ్ ఎయిర్ ఆసియా వారానికి మూడు రోజులు అంతర్జాతీయ సర్వీసులు నడుపుతున్నాయన్నారు. కౌలాలంపూర్ విమానంతో మూడో అంతర్జాతీయ సర్వీసు వచ్చినట్టయిందన్నారు.

సీపీఎస్ బకాయిలు ఇప్పించండి

అమరావతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన డీఏ బకాయిలు, 11వ పీఆర్సీ బకాయిలు, సీపీఎస్ కంట్రిబ్యూషన్ బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే ఇప్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి ఏపీ సచివాలయ సీపీఎస్ అసోసియేషన్ విన్నవించింది. ఎన్నికల కోడ్ వచ్చినా బకాయిలు చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పిందని, కనుక ఇచ్చిన మాట ప్రకారం బకాయిలు చెల్లించాలని కోరారు. శుక్రవారం ఈ మేరకు అమరావతి సచివాలయంలో ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కోట్ల రాజేష్, అంబటి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు నాపా ప్రసాద్ సీఎస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఎస్ ఉద్యోగులకు మూడేళ్లుగా 60 నెలల డీఏ బకాయిలు చెల్లించాల్సి ఉందని, ఆ తర్వాత ఇచ్చిన డీఏలకు సంబంధించిన బకాయిల చెల్లింపులూ జరగలేదని తెలిపారు.

దక్షిణాదిలో నీటి ఎద్దడి..!

- ఏపీ, తెలంగాణ సహా దక్షిణాది రాష్ట్రాలలో.. సాగు, తాగునీరు, జల విద్యుత్‌పై ప్రభావం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: ఇంకా ఏప్రిల్ నెల కూడా పూర్తవకుండానే దక్షిణ భారతం నీటి ఎద్దడిని ఎదుర్కొంటోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడుతో కూడిన దక్షిణాదిలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు పడిపోతున్నాయని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) తాజా బులెటిన్‌లో పేర్కొంది. ఈ ప్రాంతంలోని రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యంలో 17 శాతం నీరు మాత్రమే ఉందని, చారిత్రక సగటుతో పోలిస్తే నీటి నిల్వ గణనీయంగా తగ్గిందని వెల్లడించింది. భారత్‌లో వివిధ ప్రాంతాల్లోని జలాశయాల నిల్వ స్థాయిలకు సంబంధించి సీడబ్ల్యూసీ గురువారం రాత్రి బులెటిన్ విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం దక్షిణాదిలో సీడబ్ల్యూసీ పర్యవేక్షణలో ఉన్న 42 రిజర్వాయర్ల స్టోరేజీ సామర్థ్యం 53.334 బీసీఎం (బిలియన్ క్యూబిక్ మీటర్లు) కాగా, ప్రస్తుత లైవ్ స్టోరేజీ 8.865 బీఎంసీగా ఉంది. ఇది వాటి మొత్తం సామర్థ్యంలో 17 శాతం మాత్రమే. గతేడాది ఇదే సమయంలో వాటి నిల్వ స్థాయిలు 29 శాతంగా ఉన్నాయి. పదేళ్ల సగటు (23శాతం)తో పోల్చినా కూడా ఇది చాలా తక్కువ. దక్షిణాదిలో నీటి నిల్వ స్థాయిలు తగ్గిపోవడం వలన నీటి కొరత మరింత తీవ్రం కానుంది. ఈ రాష్ట్రాల్లో సాగు, తాగునీటి సరఫరా, జలవిద్యుత్ ఉత్పత్తిపైనా ప్రభావం చూపనుంది. కాగా.. తూర్పు ప్రాంతంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఒడిశా, పశ్చిమ బెంగాల్, అసోం వంటి రాష్ట్రాలతో కూడిన తూర్పు ప్రాంతంలో గతేడాది, పదేళ్ల సగటుతో పోలిస్తే నీటి నిల్వల స్థాయిలో సానుకూల మెరుగుదల కనిపించింది. ఈ ప్రాంతంలో 20.430 బీసీఎంల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన 23 రిజర్వాయర్లలో ప్రస్తుతం 7.889 బీసీఎంల నీరు నిల్వ ఉందని, ఇది దాని మొత్తం నిల్వ సామర్థ్యంలో 39 శాతమని సీడబ్ల్యూసీ తన బులెటిన్‌లో పేర్కొంది. గతేడాది ఇదే సమయంలో (34 శాతం), పదేళ్ల సగటు (34శాతం)తో పోలిస్తే ఇది మెరుగుపడింది. దేశంలోని మిగతా ప్రాంతాల్లో పరిస్థితి ఆశాజనకంగా లేదు. గుజరాత్, మహారాష్ట్రతో కూడిన పశ్చిమ ప్రాంతంలో 11.771 బీసీఎంల నిల్వ స్థాయిలే ఉన్నాయి. ఇది మొత్తం 49 రిజర్వాయర్ల సామర్థ్యంలో 31.7 శాతం.

ఆంధ్రజ్యోతి
నవ్య స్మార్ట్
శనివారం • 27 ఏప్రిల్ 2024



స్మార్ట్ గ్లాసెస్‌కు ఏఐ సామర్థ్యాలు

రేబాన్ లేటెస్ట్ స్మార్ట్ గ్లాసెస్‌కు జనరేటివ్ ఏఐ ఫీచర్లను అమెరికాకు చెందిన టెక్నాలజీ జెయింట్ మెటా ప్రకటించింది. ముఖ్యంగా లార్జ్ లాంగ్వేజ్ మోడల్ మెటా ఏఐ 2(ఎల్ఎల్ఏఎంఏ 2)పై రన్ అయ్యే మెటా ఏఐ చాట్‌బోట్‌కు సంక్లిష్టంగా ఉండే యూజర్ సందేహాలను అర్థం చేసుకునే సామర్థ్యం ఉంది. అంతేకాదు, సులువుగా అర్థమయ్యే విధంగా సదరు సందేహాలను నివృత్తి కూడా చేస్తుంది. దీనికి తోడు వీడియో కాలింగ్ సదుపాయాన్ని కూడా అందిస్తోంది. మెటా కొద్దికాలంగా ఏఐ సామర్థ్యాలను వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ యాప్‌లపై ఇండియా సహా వివిధ దేశాల్లో పరీక్షిస్తోంది. ఇప్పుడు ఇది రేబాన్ స్మార్ట్ గ్లాసులకు వర్తింపజేసింది.



ఇక ఇది ఎలా పనిచేస్తుందో చూద్దాం. అలా రహదారిపై వెళుతున్న బాటసారికి దారిలో సరికొత్త ల్యాండ్‌మార్క్ కనిపించిందని అనుకుందాం. ఆ గ్లాసెస్ ధరించిన యూజర్ వెంటనే 'హే మెటా' అంటూ పలకరించి, ఇప్పుడు తానేమి చూస్తున్నాను అని అడగవచ్చు. వెంటనే ఆ గ్లాసులు అందులో ఇమిడి ఉన్న 12 ఎంపీ హెచ్‌డీ కెమెరాతో విజువల్స్‌ను విశ్లేషిస్తుంది. ఇంటర్నెట్ కనెక్టివిటీ తప్పనిసరిగా ఉండాలి. చెవికి దగ్గరగా పెట్టుకున్న ఓపెన్ ఇయర్ స్పీకర్ల ద్వారా సమాధానాన్ని తెలియజేస్తుంది. అదేవిధంగా హోటల్ మెనూలో ఉన్న ఐటమ్స్ వేరే భాషలో ఉంటే ఇంగ్లీష్‌లో అవేంటో చెబుతుంది. వాట్సాప్, ఫేస్‌బుక్ మెసెంజర్ యాప్‌తో కూడా ఇంటిగ్రేట్ అయి ఉంటుంది. ఒకసారి అప్డేట్ చేసుకుంటే వీడియో కాల్స్ చేసుకోవచ్చు. అమెరికా సహా 15 దేశాల్లో ఇది అందుబాటులో ఉంది. వందకు మించి కస్టమ్ ఫ్రేమ్, లెన్స్ కాంబినేషన్స్‌తో మార్కెట్లోకి ఈ కళ్ళద్దాలు వచ్చాయి.

నెట్ లేకుండానే ఫైల్స్ పంపుకోవచ్చు!



వాట్సాప్ మరికొన్ని ఫీచర్లను విడుదల చేసే యత్నంలో ఉంది. ఆఫ్‌లైన్‌లోనూ ఫైల్స్ షేరింగ్, కాంటాక్ట్‌లకు అదనంగా నోట్స్ జోడింపు వంటివి ఇందులో ఉన్నాయి. 'డబ్ల్యుఏబేటాఇన్ఫో' ప్రకారం సెల్యులర్ డేటా లేదా ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండానే వివిధ ఫైల్స్ అంటే ఫొటోలు, డాక్యుమెంట్లను సమీపంలో వాట్సాప్ యూజర్లకు పంపుకోవచ్చు. ఆండ్రాయిడ్ బేటా వెర్షన్‌లో వీటిని కనుగొంది. ఇందుకోసం నియర్‌బై యూజర్లను ఎంచుకోవాల్సి ఉంటుందని స్క్రీన్‌షాట్స్ ద్వారా అర్థమవుతోంది. కాంటాక్ట్‌లకు నోట్స్‌ను జత చేయడంపై కూడా వాట్సాప్ పనిచేస్తోందని సమాచారం. అంటే కాంటాక్ట్‌కు సంబంధించిన అదనపు సమాచారాన్ని కలుపుకోవచ్చు. ఆ సమాచారం యూజర్ పర్సనల్ రిఫరెన్స్‌కు ఉపయోగపడుతుంది. దీన్ని క్రియేట్ చేసిన యూజర్‌కు మాత్రమే ఆ సమాచారం కనిపించడం ఇందులోని ప్రధాన విశేషం. మొబైల్ యూజర్లకు తోడు వాట్సాప్ వెబ్‌లోనూ ఈ సదుపాయం అందుబాటులో ఉండనుంది. అయితే ఈ రెండు ఫీచర్లూ బేటా టెస్టింగ్ దశలోనే ఉన్నాయి.

బ్రౌజర్లలోకి రెడ్‌లైన్ స్టీలర్ ట్రోజాన్!



ఎప్పటికప్పుడు కట్టుదిట్టాలు చేస్తున్నప్పటికీ హ్యాకర్లు ఏదో ఒక రూపంలో తమ చేతికి పని చెబుతూనే ఉన్నారు. తాజా మాల్వేర్ ఏకంగా బ్రౌజర్లలోని పాస్ వర్డ్‌లను తస్కరించి హ్యాకర్లకు పంపుతోంది. రెడ్‌లైన్ స్టీలర్ మాల్వేర్‌ను హ్యాకర్లు ఉపయోగిస్తున్నారని 'మెక్ అఫీ' రీసెర్చ్ టీమ్ పేర్కొంది. ఇది గేమర్లను టార్గెట్ చేస్తోంది. డౌన్‌లోడింగ్ వ్యవహారంలో మోసపూరితమైన కోడ్‌తో పని సాగిస్తోంది. అదనపు పాయింట్లు, లైవ్, ఆటకు అవసరమైన ఆయుధాల కోసం ఫైల్స్‌ను స్నేహితులతో షేర్ చేసుకోవాలి. సరిగ్గా అక్కడే మోసపూరిత కోడ్స్‌ను పంపి మోసాలకు పాల్పడుతున్నారు. చీట్‌ల్యాబ్ పేరిట ఈ దందా సాగుతోంది. వాస్తవానికి చీట్‌ల్యాబ్ ఎప్పుడూ ప్రయోజనాలను ప్రామిస్ చేయదు. ఒకసారి ఇన్‌స్టాల్ అయిన తరవాత సిస్టమ్‌లోనే అది అంతర్ధానమవుతుంది. అయితే రెడ్‌లైన్ స్టీలర్ ట్రోజాన్ మాత్రం లా బైట్‌కోడ్ ఉపయోగించి మోసాలకు తెరలేపుతోంది. యూజర్‌నేమ్, పాస్‌వర్డ్‌లను సంగ్రహించి హ్యాకర్లకు పంపుతోంది. అధికారిక స్టోర్ల నుంచి యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడం నుంచి గేమింగ్ కోడ్స్‌ను అవాయిడ్ చేయడం, కొత్తవాటిపై క్లిక్ చేయకపోవడం వంటి జాగ్రత్త చర్యలతో మాత్రమే ఈ మోసాల నుంచి గట్టెక్కగలమని నిపుణులు సూచిస్తున్నారు.

విండోస్ 11 అప్డేట్



ఇలా చేస్తే యాడ్స్ నుంచి తప్పించుకోవచ్చు

విండోస్ 11లో ఈ నెల మొదటి నుంచి స్టార్ట్ మెనూ యాడ్స్‌పై టెస్టింగ్ ఆరంభమైంది. కొంతమంది యూజర్లకు ఈ యాడ్స్ దాడి అస్సలు తెలియదు. ఈ వారంలో యూజర్ల చెంతకు తాజా అప్డేట్ చేరుతోంది. రికమెండెడ్ విభాగంలో ఒక పార్ట్‌గా ఈ యాడ్స్ కనిపిస్తున్నాయి. మైక్రోసాఫ్ట్‌కు చెందిన విండోస్ తాజా అప్డేట్‌లో భాగం ఈ పర్సనలైజ్డ్ ప్రకటనలు. 'ద వెర్జ్' రిపోర్ట్ ప్రకారం ఇప్పటికిది టెస్టింగ్‌లో ఉంది. మైక్రోసాఫ్ట్ సైతం సపోర్ట్ పేజీలో ఈ విషయాన్ని వెల్లడించింది. కొందరు యూజర్లకు ఈ ప్రకటనలు కనిపిస్తున్నాయి. అయితే ఈ యాడ్స్ తాకిడిని తట్టుకోలేని యూజర్లు వీటిని ఇలా డిజేబుల్ చేసుకోవచ్చు.

- స్టార్ట్‌మెనూపై క్లిక్ చేయాలి. సెట్టింగ్స్ యాప్‌ను కనుగొని దానిపై కూడా క్లిక్ చేయాలి. తదుపరి పర్సనలైజేషన్‌పై క్లిక్ చేయాలి.
- పర్సనలైజేషన్ మెనూలో స్టార్ట్‌పై క్లిక్ చేయాలి.
- షో రికమెండేషన్స్ ఫర్ టిప్స్, యాప్ ప్రమోషన్స్, మోర్ టైటిల్ కింద ఉన్న వాటిలో నాలుగో ఆప్షన్‌ను కనుగొని దాని టోగెల్‌ను టర్నాఫ్ చేయాలి. అంతే ప్రకటనలు ఇక రావు.



థ్రెడ్స్‌లో ఆర్కైవ్ ఫీచర్

థ్రెడ్స్ కొత్త ఫీచర్ల కోసం సన్నాహాలు చేస్తోంది. అందులో భాగంగా పాత పోస్టులు ఆటోమేటిక్‌గా హైడ్ చేసేందుకు ఉద్దేశించిన ఆప్షన్‌ను ప్రస్తుతం టెస్టింగ్‌లో ఉంచింది. ప్రస్తుతానికి ఈ ఫీచర్ కొద్దిపాటి యూజర్లకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఇప్పటికిప్పుడు వ్యక్తిగత పోస్టులు మాన్యువల్‌గా లేదా ఆటోమేటిక్‌గా ఆర్కైవ్ చేసుకోవచ్చు. అది కొంతకాలానికే పరిమితం. అలాగే ఆ పోస్టులను తిరిగి ఎప్పుడైనా రన్నింగ్‌లో పెట్టుకోవచ్చు. అయితే ఈ ఫీచర్‌ను డిఫాల్ట్‌గా పెట్టవద్దని పలువురు కోరుతున్నట్టు ఇన్‌స్టాగ్రామ్ హెడ్ తెలిపారు. తమ పోస్టులను ఆర్కైవ్ చేసే వెసులుబాటు కల్పించాలని పలువురు ఎక్స్(ట్విటర్) ద్వారా అభ్యర్థించారని సమాచారం.




సున్నిత సమాచారం షేర్ కాకుండా..?

ఆండ్రాయిడ్ 14 వరకు ఇకపై స్క్రీన్ షేరింగ్‌లో హ్యాకర్ల బారిన పడకుండా ఉండొచ్చు. ముఖ్యంగా సెన్సిటివ్ సమాచారం షేర్ కాకుండా చూసుకోవచ్చు. మొత్తమ్మీద దీన్నో శక్తిమంతమైన ఫీచర్‌గా చెప్పవచ్చు. ఈ ఏడాది మధ్యలో రాబోయే వెర్షన్‌లో ఈ ఫీచర్ ఉంటుందని భావిస్తున్నారు. పాస్‌వర్డ్స్, సెన్సిటివ్ నోటిఫికేషన్స్ డిస్‌ప్లే కాకుండా గూగుల్ చర్యలు తీసుకోనుంది. 'ఆండ్రాయిడ్ పోలీస్' రిపోర్ట్ ప్రకారం లేటెస్ట్ ఆండ్రాయిడ్ బేటా 1.1లో 'డిజేబుల్ స్క్రీన్ షేర్ ప్రొటెక్షన్' పేరిట ఈ సమాచారం ఉంది. అయితే ఇంకా ఇది ఎనేబుల్ కావాల్సి ఉంది. అంటే ఇంకా టెస్టర్ల చేతికి రాలేదు.

గూగుల్ మెసేజెస్‌లో న్యూ సెల్ఫీ ఫీచర్

గూగుల్ మెసేజెస్‌లో 'సెల్ఫీ జీఐఎఫ్' ఫీచర్ అందుబాటులోకి వస్తోంది. ఇంటరాక్టివ్ మెసేజింగ్ అనుభవం మరింత మెరుగ్గా ఉండేందుకు గూగుల్ మెసేజెస్ దీన్ని విడుదల చేసింది. దీన్ని ఉపయోగించుకునేందుకుగాను యూజర్లు మొదట కాన్వర్సేషన్‌ను ఓపెన్ చేయాలి. కెమెరా ఐకాన్‌పై లాంగ్ ప్రెస్ చేయాలి. కస్టమ్ కెమెరా ఇంటర్‌ఫేస్ అప్పుడు మీనియేచర్ కెమెరా వ్యూఫైండర్‌ను చూపుతుంది. సింగిల్ టాప్‌తో స్క్రోలబుల్ గ్యాలరీ కూడా కనిపిస్తుంది. స్పెసిఫిక్ కాన్వర్సేషన్ ప్రాంప్ట్‌తో సెల్ఫీ జీఐఎఫ్ ఆప్షన్‌ని యాక్సెస్ చేసుకోవచ్చని '9టు5గూగుల్' తెలిపింది. యానిమేటెడ్ సెల్ఫీని రికార్డ్ చేసుకోవచ్చు. ఒకసారి సెలెక్ట్ చేసుకుంటే మూడు సెకెండ్ల రికార్డింగ్ ఇనీషియేట్ అవుతుంది. తద్వారా యానిమేటెడ్ సెల్ఫీని ఆటోమేటిక్‌గా రూపొందించుకోవచ్చు. యూజర్లు మాన్యువల్ ఆప్షన్‌ను కూడా ఎంచుకోవచ్చు. రెడ్ బటన్ ఉపయోగించి రికార్డింగ్‌ను రీస్టార్ట్ చేసుకోవచ్చు. ఈ చిన్నపాటి జీఐఎఫ్‌లు కెమెరా రోల్‌లోనే నేరుగా సేవ్ అవుతాయి. వాటిని స్నేహితులు, బంధువులకు పంపుకోవచ్చు. ఇదే కాకుండా మరికొన్ని ఫీచర్లను షేర్ చేసే యత్నాల్లో గూగుల్ మెసేజెస్ ఉంది.



ప్రొడక్ట్

కెమెరా హంగులతో ఒప్పో స్మార్ట్‌ఫోన్

ఒప్పో - ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లను అలరించే చర్యలు తీసుకుంటోంది. ఒప్పో తాజాగా కెమెరా సెంట్రిక్ స్మార్ట్ ఫోన్ 'ఫైండ్ ఎక్స్7 అల్ట్రా'ని చైనాలో విడుదల చేసింది. ఈ ఫోన్‌లో ప్రధాన ఆకర్షణ తొలి క్వాడ్ మెయిన్ కెమెరా. హైపర్ టోన్ ఇమేజెస్ ఇంజన్‌తో ఇది వచ్చింది. దీనికి తోడు లెటెస్ట్ హార్డ్‌వేర్‌ను దీనిలో ఉంచారు. సెకండ్ జనరేషన్ సెన్సర్ అంటే ఎల్‌వైటీ -506 సెన్సర్‌తో 50ఎంపీ అల్ట్రా-వైడ్ కెమెరా ఇందులో ఉంది. దీంతో ఫొటోగ్రఫీ సామర్థ్యం మరింత మెరుగ్గా ఉంటుంది. రిఫ్లక్షన్‌ను 50 శాతం తగ్గిస్తుంది. 23ఎంఎం ఆప్టికల్ ఫోకల్ లెంథ్ ఉంటుంది. రాత్రనక, పగలనక ఏ సమయంలో అయినా పిక్చర్ల



క్లారిటీ బాగుంటుంది. ఇది కాకుండా రెండు పెరిస్కోప్ కెమెరాలు కూడా ఉంటాయి. అందులో ఒక దానికి 3ఎక్స్ ఆప్టికల్ జూమ్ ఉంటుంది. 1/1.56 ఇంచీల సోనీ ఐఎంఎక్స్ 890 సెన్సర్‌తో ఉంటుంది. క్లోజప్, పోర్ట్రయిట్‌లకు సంబంధించి ఇది స్పెషల్ ప్రొడక్ట్ అని చెప్పవచ్చు. 50ఎంపీ 6ఎక్స్ పెరిస్కోప్ టెలిఫొటో కెమెరాలో 1/2.5-1 ఇంచీల సోనీ ఐఎంఎక్స్ 858 సెన్సర్, 135 ఎంఎం ఫోకల్ లెంథ్ కలిగి ఉంటుంది. 32 ఎంపీ ఫ్రంట్ కెమెరాలో ఎల్‌వైటీ -506 సెన్సర్ ఉంటుంది. హైపర్‌టోన్ ఇమేజ్ ఇంజిన్, జూమ్, హ్యాజల్‌బ్యాండ్ పోర్ట్రయిట్ మోడ్, హ్యాజల్‌బాండ్ మాస్టర్ మోడ్ దీని ప్రత్యేకతలుగా చెప్పవచ్చు.

కే12

ఒప్పో - క్వాల్కామ్‌కు చెందిన స్నాప్‌డ్రాగన్ 7జన్ 3ఎస్‌ఓసీ పవర్‌తో కె12ని చైనాలో విడుదల చేసింది. 12జీబీ ర్యామ్, 512జీబీ వరకు ఆన్‌బోర్డ్ స్టోరేజీ సదుపాయం ఉన్నాయి. సెంటర్డ్ హోల్-పంచ్ అమోల్డ్ డిస్‌ప్లేకు తోడు డ్యూయల్ రేర్ కెమెరాలు ఉన్నాయి. 5000ఎంఏహెచ్ బ్యాటరీ సపోర్ట్ ఉంది. ఇన్-డిస్‌ప్లే ఫింగర్‌ప్రింట్ సెన్సర్ ఉంది. ఐపీ54 రేటింగ్‌తో డస్ట్ అలాగే స్పాష్ రెసిస్టెన్స్ ఉంది. బరువు 186 గ్రాములు. క్వింగ్‌యాన్, స్టారీ నైట్ రంగుల్లో లభిస్తున్నాయి. మూడు వేరియంట్లతో ఇవి లభిస్తున్నాయి. 8జీబీ + 256 జీబీ వేరియంట్ ఒప్పో కే12 ధర రమారమి ఇండియన్ కరెన్సీలో రూ.20,700. 12జీబీ + 256 జీబీ అయితే రూ.23,000, 12జీబీ + 512 జీబీ అయితే రూ.28,700





దేశీ మార్కెట్లోకి నార్జో '70 సిరీస్'

రియల్‌మి నార్జో 70ఎక్స్, 70 సిరీస్ ఫోన్లు ఇండియన్ మార్కెట్లోకి వచ్చాయి. రెండు రంగుల్లో ఇవి అందుబాటులో ఉన్నాయి. ఆరంభ ధర రూ.12,000. 70ఎక్స్ సిరీస్ ఫోనుల్లో 6.72 ఇంచీల ఫుల్ హెచ్‌డీ, 45-120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటు, 950 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ కలిగి ఉన్నాయి. ట్రిపుల్ స్లాట్(రెండు నానో సిమ్స్, ఒక మైక్రో ఎస్‌డీ కార్డు), సైడ్‌లో ఫింగర్‌ప్రింట్ సెన్సర్, 3.5 ఎంఎం ఆడియో జాక్ ఉన్నాయి. 6ఎన్ఎం మీడియాటెక్ 6100 + ఆక్టోకోర్ ప్రాసెసర్ ఉంది. స్టోరేజీని రెండు టీబీల మేరకు విస్తరించుకోవచ్చు. 45 వాట్స్ చార్జింగ్ స్పీడ్‌తో 5000 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. 50ఎంపీ, 8 ఎంపీ రెండు కెమెరాలు ఉన్నాయి. సెల్ఫీ, వీడియో కాలింగ్ కోసం 8ఎంపీ కెమెరా ఉపయోగపడుతుంది. 4జీబీ ర్యామ్, 128 స్టోరేజీ అయితే రూ.11,999; 6జీబీ ర్యామ్, 128 జీబీ స్టోరేజీ అయితే రూ.13,4999కి లభిస్తాయి.

రియల్‌మి 70 5జీ విషయానికి వస్తే 6.7 ఇంచీల ఫుల్ హెచ్‌డీ, అమోల్డ్ స్క్రీన్, 120హెచ్‌జెడ్ రిఫ్రెష్‌రేటు 2000 నిట్స్ మేర పీక్ బ్రైట్‌నెస్ ఉన్నాయి. ఐపీ 54 డస్ట్ అలాగే వాటర్ రెసిస్టెంట్ రేటు కాగా దీనికి సైడ్‌లో ఫింగర్‌ప్రింట్ సెన్సర్, 3.5 ఎంఎం. ఆడియో జాక్ ఉన్నాయి. డ్యూయల్ స్లాట్(ఒకటి నానో సిమ్, ఇంకొకటి మైక్రో ఎస్‌డీ కార్డు) కోసం ఉన్నాయి. ఆండ్రాయిడ్ 14పై రన్ అయ్యే ఇవి 45వాట్స్ ఫాస్ట్ చార్జింగ్ కేపబిలిటీతో 5000 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. స్టోరేజీ 128జీబీ అయినప్పటికీ ర్యామ్ 6జీబీ అయితే రూ.15,999, 8జీబీ ర్యామ్ అయితే రూ.16,999కి లభిస్తాయి. మిస్టీ ఫారెస్ట్ గ్రీన్, స్నో మౌంటెయిన్ బ్లూ రంగుల్లో ఈ రెండు సిరీస్‌లకు చెందిన స్మార్ట్ ఫోన్లు లభ్యమవుతున్నాయి.

మరింత మెరుగ్గా ఐపాడ్ ఎయిర్!

అప్‌డేట్



యాపిల్ - ఎయిర్‌పాడ్ ఎయిర్‌ను మరిన్ని మెరుగైన ఫీచర్లతో తెచ్చే యత్నాల్లో ఉంది. డిస్‌ప్లేని 10.9 ఇంచీల నుంచి 12.9 అంటే రెండు ఇంచీల మేర పెంచనుంది. దీంతో ఐపాడ్ ప్రొ రేంజ్‌లో మాదిరిగా బైఫర్కేటెడ్ డిస్‌ప్లే ఆప్షన్లు ఉండబోతున్నట్టు '9టు4మేక్' పేర్కొంది. మినీ లెడ్ డిస్‌ప్లే కారణంగా సంప్రదాయ ఎల్‌సీడీ ప్యానల్స్‌తో పోల్చుకుంటే కాంట్రాస్ట్, బ్రైట్‌నెస్, పవర్ ఎఫిషియెన్సీ బాగా ఉంటాయి. ఇందులో కెమెరాను రీడిజైన్ చేస్తున్నట్టు సమాచారం. వెర్టికల్లీ - ఓరియెంటెడ్ మాడ్యూల్ ఉండనుంది. అది మరింత పెద్ద కెమెరాను ఉంచేందుకు వీలుకల్పిస్తోంది. తద్వారా యాంటిసిపేటెడ్ ఫ్లాష్ ఉంటుంది. అంటే ఫొటోగ్రఫీ సామర్థ్యాలను పెంచుతోందని అర్థం చేసుకోవాలి. అల్యూమినియం డిజైన్‌తో మేజిక్ కీబోర్డ్‌ను కూడా మారుస్తోంది. ఫ్రంట్ ఫేసింగ్ టైమ్ కెమెరా స్థానాన్ని కూడా మారుస్తోంది. ఆ మార్పుతో కెమెరా అలైన్‌మెంట్ మెరుగవుతుంది. డిస్‌ప్లే అలాగే కెమెరా ఇంప్రూవ్‌మెంట్స్‌కు తోడు ఎం2 లేదా ఎం2 చిప్‌తో అత్యద్భుత పర్ఫార్మెన్స్ ఇచ్చేందుకు సన్నద్ధమవుతోందన్న వార్తలు వినవస్తున్నాయి. అధికారిక ప్రకటన మాత్రం ఇంకా వెలువడాల్సి ఉంది.

ఇన్ఫో



ఐఫోన్‌తో షార్ట్ ఫిల్మ్స్



చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే ప్రపంచం మన గుప్పిట్లో ఉంటుందనేది ఈనాటి మాట. వాటికున్న కెమెరాతో ప్రతీది ఇమేజ్ రూపంలో భద్రపర్చుకునే పరిస్థితి కలిగిందన్నదీ వాస్తవమే. అయితే ఇప్పుడు అయిదుగురు ఫిల్మ్ మేకర్లు ఏకంగా షార్ట్ ఫిల్ములనే తీశారు. అదీ ఐఫోన్ 15 ప్రొ మాక్స్‌తో అంటే సాంకేతికత ఏ స్థాయిలో పురోగతి చెందిందో అర్థం చేసుకోవచ్చు. బిగువైన కథకు తోడు ఐఫోన్ ఉంటే ఫిల్మ్ నిర్మాణానికి ఇక కావాల్సింది నటులు మాత్రమే. ఐఫోన్ 15 ప్రొ మాక్స్‌ని గత ఏడాది విడుదల చేసిన సందర్భంలోనే యాపిల్ సీఈఓ టిమ్ కుక్ ఇది ప్రొఫెషనల్ ఫిల్మ్ మేకింగ్ కోసమని అన్నారు. అది ఇప్పుడు నిజమైంది. అయిదుగురు నిర్మాతలు తీసిన ఆ షార్ట్ ఫిల్ములు ఇప్పుడు ఉచితంగానే 'మామీ యూట్యూబ్‌'లో చూడవచ్చు. క్రాసింగ్ బోర్డర్స్, ఒబర్, ఏ న్యూలైఫ్, జై టు జలాల్ టు, మిర్రర్ - ఈ అయిదింటిని ఒక్కసారి చూస్తే వ్యవహారం ఇకపై మెగాపిక్సెల్ కాదని, కథనాన్ని నడిపించే తీరేనని భావించడం ఖాయం.

ముంబై అకాడమీ ఆఫ్ మూవింగ్ ఇమేజ్(మామి) ఈ ఫిల్మ్‌మేకర్లను ఎంపిక చేసింది. ఐఫోన్ 14 ప్రొ తోనే సుప్రసిద్ధ డైరెక్టర్ విశాల్ భరద్వాజ్ ఒక సినిమా తీసి అప్పట్లో సంచలనం సృష్టించారు.

ఇప్పుడు తాజాగా అయిదుగురు ఐఫోన్ 15 ప్రొతో ఆ బాట పట్టారు. '15 ప్రొ మాక్స్‌తో సినిమా తీశాం, కలర్ కరక్షన్ కోసం పంపాం, అంతకు మించి జిమ్మిక్కులు ఏమీ లేవు' అని క్రాసింగ్ బోర్డర్ సినిమా మేకర్ అనడం ఈ స్మార్ట్ ఫోన్ పనితనానికి ఒక మచ్చుతునక. ఇండో-నేపాల్ సరిహద్దుల్లో ఒక మహిళ సాగించే స్మగుల్డ్ గూడ్స్ వ్యవహారంపై తీసిన కథ ఇది. డిఫాల్ట్‌గా ఉన్న 24 ఎంఎం మెయిన్ కెమెరాతో మొదట్లో వైడ్ షాట్స్, చివరకు వచ్చేసరికి 120 ఎంఎం టెలిఫొటో కెమెరాతో అద్భుతమైన పనితనం చూపించడానికి వీలైందని 'మిరేజ్' మేకర్ తెలిపారు. ఐఫోన్‌తోనే కాలం గడిపే అబ్బాయి కథ ఇది. వాయిస్ మెమో యాప్‌తో ఆడియో చక్కగా సాధ్యమైందని 'ఒబర్' మేకర్ తెలిపారు. చుట్టుపక్కల శబ్దాలను సదరు యాప్‌తో చాలా బాగా పట్టుకోగలిగామని చెప్పారు. ఈ ధ్వనులకు కేవలం 15 ప్రొ మాక్స్‌కు తోడు వాయిస్ మెమో యాప్, ఎక్స్‌టర్నల్ మిక్ సరిపోయాయని అన్నారు. మైగ్రేట్ అయిన ఫ్యాక్టరీ వర్కర్ చుట్టూ తిరిగిన కథనం 'ఏ న్యూ లైఫ్'లో రియల్ టైమ్‌లో వీడియో కాల్స్ తీయగలిగారు. ఫోన్‌కుతోడు ట్రైపాడ్‌పై స్మాల్ రిగ్ కేజ్ ఉపయోగించి మొత్తం పనికానిచ్చారు. ఏతావతా స్టోరీ టెల్లింగ్‌లో 15 ప్రొమాక్స్ మ్యాజిక్ చేస్తోందని చెప్పవచ్చు.

క్రాఫ్ట్స్ అండ్ డిజైన్ సంస్థలో డిగ్రీ, పీజీ

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● శనివారం 27 ఏప్రిల్ 2024
diksuchi@andhrajyothy.com

జైపూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రాఫ్ట్స్ అండ్ డిజైన్(ఐఐసీడీ)- బీ డిజైన్, ఎం డిజైన్, ఎం ఒకేషనల్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆన్‌లైన్ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. నిబంధనల మేరకు స్కాలర్‌షిప్‌లు అందిస్తారు. డిగ్రీలో మూడేళ్లు, పీజీలో ఏడాది కోర్సు పూర్తయ్యాక ఎనిమిది వారాల ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ పూర్తిచేయాల్సి ఉంటుంది. నాన్ రెసిడెంట్ ఇండియన్స్, సార్క్ దేశాల అభ్యర్థులు, ఇతర విదేశీ విద్యార్థులు కూడా ఈ ప్రోగ్రామ్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు ఎంట్రెన్స్ రాయనవసరం లేదు. వీరికి స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, డిజిటల్ పోర్ట్‌ఫోలియో, ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

డిగ్రీ, పీజీ స్పెషలైజేషన్‌లు
- హార్డ్ మెటీరియల్ డిజైన్
- సాఫ్ట్ మెటీరియల్ డిజైన్
- ఫైర్డ్ మెటీరియల్ డిజైన్
- ఫ్యాషన్ క్లాతింగ్ డిజైన్
- జ్యువెలరీ డిజైన్
- క్రాఫ్ట్ కమ్యూనికేషన్



బీ డిజైన్: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులోనే ఏడాది వ్యవధిగల ఫౌండేషన్ కోర్సు ఉంటుంది. ఏడాదికి రెండు చొప్పున మొత్తం ఎనిమిది సెమిస్టర్‌లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 180 సీట్లు ఉన్నాయి. గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ఏడాది కోర్సు పూర్తయ్యాక డిప్లొమా, రెండేళ్ల తరవాత అడ్వాన్స్‌డ్ డిప్లొమా, మూడేళ్ల తరవాత బీ ఒకేషనల్ డిగ్రీతో ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది.

ఎం డిజైన్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్‌లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో 90 సీట్లు ఉన్నాయి. బీ డిజైన్/బీఆర్క్/బీఏ డిజైన్/బీఎస్సీ డిజైన్/బీ ఒకేషనల్ డిజైన్/తత్సమాన కోర్సులు పూర్తి చేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎం ఒకేషనల్: దీనిని నాన్ డిజైన్ డిగ్రీ కోర్సులు చేసిన అభ్యర్థులకు ప్రత్యేకించారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఏడాది వ్యవధిగల ఫౌండేషన్ కోర్సు ఉంటుంది. మొత్తం ఆరు సెమిస్టర్‌లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో 90 సీట్లు ఉన్నాయి.

బోధనాంశాలు: డిగ్రీ ప్రోగ్రామ్‌లో క్రాఫ్ట్ అండ్ డిజైన్, స్కిల్స్ అండ్ అప్లికేషన్స్, హిస్టరీ ఆఫ్ క్రాఫ్ట్, మెటీరియల్స్-సైన్స్, టూల్స్-టెక్నిక్స్-ప్రాసెస్, ఫీల్డ్ ఎక్స్‌పోజర్, కస్టమర్-మార్కెట్ నీడ్స్, డిజైన్ ప్రాసెస్ తదితర అంశాలు బోధిస్తారు.

- పీజీ ప్రోగ్రామ్‌లలో రీసెర్చ్, కాన్సెప్ట్, డిజైన్-సిస్టమ్స్ అండ్ సొల్యూషన్ థింకింగ్, అడ్వాన్స్ ఎక్స్‌ప్లొరేషన్ ఆఫ్ మెటీరియల్స్-డిజైన్ పాజిబిలిటీస్, ఇన్నోవేషన్స్, బిజినెస్ ఆఫ్ క్రాఫ్ట్ అండ్ డిజైన్, సోషల్ అంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ లీడర్‌షిప్ అంశాలు వివరిస్తారు.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: ఇందులో రెండు దశలు ఉంటాయి. మొదటిది జనరల్ అవేర్‌నెస్-క్రియేటివిటీ అండ్ పర్సెప్షన్ టెస్ట్. ఇందులో అభ్యర్థుల అబ్జర్వేషన్, విజువల్ ఇంటర్‌ప్రిటేషన్, జనరల్ అవేర్‌నెస్ స్కిల్స్ పరిశీలిస్తారు. రెండోది మెటీరియల్-కలర్స్-కాన్సెప్ట్ టెస్ట్. ఇందులో మెటీరియల్స్, మెటీరియల్ హ్యాండిలింగ్, ప్లాన్ అండ్ స్ట్రాటజీ, మల్టిపుల్ సొల్యూషన్స్, కలర్స్ తదితరాలపై అభ్యర్థుల పరిజ్ఞానాన్ని పరీక్షిస్తారు. అభ్యర్థులు కాన్సెప్ట్ టెస్ట్‌కు అవసరమైన పెన్, పెన్సిల్స్ (హెచ్‌బి, 2బి, 4బి, 6బి), సీజర్స్, స్కేల్, సెల్లో టేప్, పేపర్ కట్టర్, ఫెవీ స్టిక్, ఎరేజర్, కంపాస్, కలర్ పెన్సిల్స్, వాటర్ కలర్స్, బ్రష్‌లు వెంట తెచ్చుకోవాలి. తరవాత పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఇందులో అప్టిట్యూడ్ టు క్రాఫ్ట్, ఇంటెలిజెన్స్ కోషంట్, కమ్యూనికేషన్ ఎబిలిటీ, క్రాఫ్ట్ అండ్ డిజైన్‌కు సంబంధించిన జనరల్ అవేర్‌నెస్, పర్సనల్ అచీవ్‌మెంట్స్, కరిక్యులర్ యాక్టివిటీస్ ఆధారంగా అభ్యర్థుల ప్రావీణ్యాన్ని పరీక్షిస్తారు. పోర్ట్ ఫోలియో ప్రజంటేషన్ పూర్తిగా అభ్యర్థి క్రియేటివ్ వర్క్‌కు సంబంధించి ఉండాలి. ఇందులో స్కెచింగ్, పెయింటింగ్, ఎంబ్రాయిడరీ, ఫొటోగ్రఫీ, మోడల్స్ ఎక్స్‌ప్లొరేషన్ విత్ మెటీరియల్స్, క్రియేటివ్ రైటింగ్ తదితర అంశాలు ఉండేలా చూసుకోవాలి. జనరల్ అవేర్‌నెస్-క్రియేటివిటీ అండ్ పర్సెప్షన్ టెస్ట్‌కు 35 శాతం, మెటీరియల్-కలర్స్-కాన్సెప్ట్ టెస్ట్‌కు 45 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకు 20 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** ఇండియా సహా సార్క్ దేశాల అభ్యర్థులకు రూ.1,750; ఎన్ఆర్ఐలు సహా విదేశీ విద్యార్థులకు రూ.3,500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 28
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** మే 30 నుంచి
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** జూన్ 18 నుంచి 21 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 28
- **ప్రోగ్రామ్ ఫీజు చెల్లింపు:** జూలై 1 నుంచి 12 వరకు
- **సెషన్స్ ప్రారంభం:** జూలై 15 నుంచి
- **వెబ్‌సైట్:** www.iicd.ac.in

ఆర్ట్ అండ్ డిజైన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి (ఏపీఎస్‌సీహెచ్ఈ)- 'ఆర్ట్ అండ్ డిజైన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏడీసెట్) 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిని కడపలోని డా.వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (వైఎస్సార్ఏఎఫ్‌యూ) నిర్వహిస్తోంది. ఇందులో సాధించిన మెరిట్ ఆధారంగా బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్(బీఎఫ్ఏ), బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(బీ డిజైన్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. వీటిని ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. నిబంధనలకు లోబడి ఫీ రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుంది.

స్పెషలైజేషన్‌లు-సీట్లు
- బీఎఫ్ఏ ప్రోగ్రామ్‌లో అప్లయిడ్ ఆర్ట్, పెయింటింగ్, స్కల్ప్‌చర్, ఫొటోగ్రఫీ, యానిమేషన్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. యానిమేషన్‌లో 60 సీట్లు; మిగిలినవాటిలో స్పెషలైజేషన్‌కు 40 చొప్పున మొత్తం 160 సీట్లు ఉన్నాయి.
- బీ డిజైన్ ప్రోగ్రామ్‌లో ఇంటీరియర్ డిజైన్ స్పెషలైజేషన్ ఉంది. ఇందులో 60 సీట్లు ఉన్నాయి.
- ప్రతి ప్రోగ్రామ్‌లో 15 శాతం సీట్లను ఇతర రాష్ట్రాల అభ్యర్థులకు ప్రత్యేకించారు.

అర్హత: ఎంపీసీ, ఎంఈసీ, బైపీసీ, ఎంబైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూప్‌లలో ఒకదానితో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏడీ సెట్ 2024 వివరాలు: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. జనరల్ నాలెడ్జ్, ఆర్ట్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ డీటెయిల్స్ ఆఫ్ అప్లయిడ్ ఆర్ట్, పెయింటింగ్, స్కల్ప్‌చర్, యానిమేషన్, ఫొటోగ్రఫీ, ఆర్ట్ హిస్టరీ, డిజైన్ స్కిల్స్ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. రెండు కోర్సులకూ(బీఎఫ్ఏ, బీ డిజైన్) కామన్ పేపర్ ఇస్తారు. ప్రశ్నపత్రం తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో అర్హత సాధించాలంటే కనీసం 35 శాతం మార్కులు రావాలి.



ముఖ్య సమాచారం
- **ట్యూషన్ ఫీజు:** ఏడాదికి రూ.37,000
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; బీసీ అభ్యర్థులకు రూ.750; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 22
- **కరెక్షన్ విండో ఓపెన్:** జూన్ 1 నుంచి 3 వరకు
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** జూన్ 4 నుంచి
- **ఏడీసెట్ 2024 తేదీ:** జూన్ 13
- **వెబ్‌సైట్:** www.ysrafu.ac.in, https://cets.apsche.ap.gov.in

జాబ్ కార్నర్

టీఎంసీలో వివిధ ఖాళీలు

మొత్తం ఖాళీలు: 87

టాటా మెమోరియల్ సెంటర్‌కు చెందిన టాటా మెమోరియల్ హాస్పిటల్...ముంబయి, గువహటి, విశాఖపట్నంలోని టీఎంసీ ఆసుపత్రుల్లో మెడికల్, నాన్-మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. మెడికల్ ఆఫీసర్ 'ఇ': 8 పోస్టులు
2. మెడికల్ ఫిజిసిస్ట్: 2 పోస్టులు
3. ఆఫీసర్ ఇన్‌చార్జ్: 1 పోస్టు
4. సైంటిఫిక్ అసిస్టెంట్: 2 పోస్టులు
5. అసిస్టెంట్ నర్సింగ్ సూపరింటెండెంట్: 1 పోస్టు
6. ఫిమేల్ నర్స్: 58 పోస్టులు
7. కిచెన్ సూపర్‌వైజర్: 1 పోస్టు
8. టెక్నీషియన్ 'సి': 1 పోస్టు
9. టెక్నీషియన్ 'ఎ': 4 పోస్టులు
10. స్టెనోగ్రాఫర్: 6 పోస్టులు
11. లోయర్ డివిజన్ క్లర్క్: 3 పోస్టులు

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, 12వ తరగతి, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 7
వెబ్‌సైట్: tmc.gov.in

ఐఐఎంఆర్‌లో సీనియర్ రీసెర్చ్ ఫెలో

హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఉన్న ఐకార్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 2
అర్హత: సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ, నెట్ అర్హతతో పాటు పని అనుభవం ఉండాలి.
వేతనం: నెలకు రూ.31,000
ఇంటర్వ్యూ తేదీ: మే 6
దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 30
దరఖాస్తులు పంపాల్సిన ఈమెయిల్: balakrishna@millets.res.in
వెబ్‌సైట్: https://www.millets.res.in/ad.php





ఫార్మాస్యూటికల్ కోర్సుల్లో ప్రవేశానికి నైపర్ జేఈఈ

గువహటీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైపర్)- జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న క్యాంపస్‌లలో మాస్టర్స్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ఎగ్జామ్ రాయాలంటే జీప్యాట్/గేట్/నెట్ అర్హత తప్పనిసరి.

క్యాంపస్‌లు: అహ్మదాబాద్, గువహటీ, హాజీపూర్, హైదరాబాద్, కోల్‌కతా, రాయ్‌బరేలీ, ఎస్ఏఎస్ నగర్.

స్పెషలైజేషన్‌లు: బయోటెక్నాలజీ, మెడిసినల్ కెమిస్ట్రీ, మెడికల్ డివైసెస్, నేచురల్ ప్రొడక్ట్స్, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, ఫార్మాస్యూటికల్ మేనేజ్‌మెంట్, ఫార్మాస్యూటిక్స్, ఫార్మాస్యూటికల్ అనాలిసిస్, రెగ్యులేటరీ టాక్సికాలజీ, ఫార్మాకోఇన్ఫర్మాటిక్స్, రెగ్యులేటరీ అఫైర్స్, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ(ప్రాసెస్ కెమిస్ట్రీ), ఫార్మసీ ప్రాక్టీస్, బయోఫార్మాస్యూటికల్స్.

మాస్టర్స్ ప్రోగ్రామ్‌లు
- **కోర్సులు:** ఎంఫార్మసీ, ఎంటెక్(ఫార్మసీ), ఎంటెక్, ఎంఎస్(ఫార్మసీ), ఎంబీఏ(ఫార్మసీ)
- **సీట్లు:** అన్ని క్యాంపస్‌లలో కలిపి మొత్తం సీట్లు 990. హైదరాబాద్ క్యాంపస్‌లో 170 సీట్లు ఉన్నాయి. ఎంఎస్(ఫార్మసీ) కోర్సులో మెడిసినల్ కెమిస్ట్రీ 20, నేచురల్ ప్రొడక్ట్స్ 10, ఫార్మాస్యూటికల్ అనాలిసిస్ 20, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ 25, ఫార్మాస్యూటిక్స్ 25, ఫార్మాకోఇన్ఫర్మాటిక్స్ 10, రెగ్యులేటరీ అఫైర్స్ 10; ఎంటెక్(ఫార్మసీ) కోర్సులో ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ(ప్రాసెస్ కెమిస్ట్రీ) 20, బయోటెక్నాలజీ 20; ఎంటెక్ కోర్సులో మెడికల్ డివైజెస్ 10 సీట్లు ఉన్నాయి. అహ్మదాబాద్ క్యాంపస్‌లో 150, గువహటీలో 160, హాజీపూర్‌లో 60, కోల్‌కతాలో 100, రాయ్‌బరేలీలో 100, ఎస్ఏఎస్ నగర్‌లో 250 సీట్లు ఉన్నాయి.
- **అర్హత:** స్పెషలైజేషన్‌ను అనుసరించి బీఫార్మసీ, బీఏఎంఎస్, బీవీఎస్సీ బీడీఎస్, ఎంబీబీఎస్, ఎమ్మెస్సీ(ఆర్గానిక్ కెమిస్ట్రీ/బోటనీ/అనలిటికల్ కెమిస్ట్రీ/ఫార్మకాలజీ/టాక్సికాలజీ/లైఫ్ సైన్సెస్/బయో కెమిస్ట్రీ/మెడికల్ బయో టెక్నాలజీ/జువాలజీ/బయోలాజికల్ సైన్సెస్/ఫిజికల్/ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ/మాలిక్యులర్ బయాలజీ/బయోఇన్ఫర్మాటిక్స్/మైక్రోబయాలజీ/బయో ఫిజిక్స్/ఫుడ్ సైన్స్/లైఫ్ సైన్సెస్), బీఈ/బీటెక్(బయో ఇన్ఫర్మాటిక్స్/ఎలక్ట్రానిక్స్/బయో ఇంజనీరింగ్/బయో మెడికల్ ఇంజనీరింగ్/బయోటెక్నాలజీ/కెమికల్/మెటీరియల్ సైన్స్/బయో కెమికల్) కోర్సుల్లో ఒకటి పూర్తిచేసి ఉండాలి. కనీసం 60 శాతం మార్కులు తప్పనిసరి.
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్:** ఇందులో మొత్తం 200 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. జనరల్ ఇంగ్లీష్, ఆప్టిట్యూడ్, రీజనింగ్, జనరల్ నాలెడ్జ్ అంశాలనుంచి 25 శాతం ప్రశ్నలు; బీఫార్మసీ, ఎమ్మెస్సీ సిలబస్‌ల నుంచి 75 శాతం ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు అర మార్కు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం 2 గంటలు. ఈ పరీక్షలో సాధించిన ప్రతిభ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి ఎంఎస్(ఫార్మసీ), ఎంఫార్మసీ, ఎంటెక్(ఫార్మసీ) కోర్సుల్లో అడ్మిషన్స్ ఇస్తారు.

పీహెచ్‌డీ
- **సీట్లు:** అన్ని క్యాంపస్‌లలో కలిపి మొత్తం సీట్లు 73. అహ్మదాబాద్ క్యాంపస్‌లో 4, గువహటిలో 22, హాజీపూర్‌లో 9, కోల్‌కతాలో 10, రాయ్‌బరేలీలో 14, ఎస్ఏఎస్ నగర్‌లో 14 సీట్లు ఉన్నాయి.
- **అర్హత:** విభాగం-స్పెషలైజేషన్‌ను అనుసరించి ఎంఎస్(ఫార్మా), ఎంఫార్మసీ, ఎంటెక్ (ఫార్మసీ), ఎమ్మెస్సీ, ఎంఈ, ఎంటెక్, ఎండీ, ఎంవీఎస్సీ, ఎంసీఏ, ఫార్మాడీ కోర్సుల్లో ఒకటి పూర్తిచేసి ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. ఎండీ, ఎంవీఎస్సీ, ఎండీఎస్, ఫార్మాడీ, స్పాన్సర్డ్ అభ్యర్థులు మినహా అందరికీ జీప్యాట్/గేట్/నెట్ అర్హత తప్పనిసరి. సీఎస్ఐఆర్/ యూజీసీ/ఐసీఎంఆర్/డీబీటీ/డీఎస్‌టీ నుంచి నెట్-జేఆర్ఎఫ్ అర్హత ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్:** కెమికల్ సైన్సెస్, బయోలాజికల్ సైన్సెస్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్, ఫార్మాస్యూటికల్ మేనేజ్‌మెంట్ విభాగాలకు ఉదయం సెషన్‌లో మెడికల్ డివైజెస్ విభాగానికి మధ్యాహ్నం సెషన్‌లో ఎగ్జామ్ నిర్వహిస్తారు. ఎగ్జామ్‌లో 170 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. సంబంధిత పీజీ స్థాయి సిలబస్ నుంచి 75 శాతం ప్రశ్నలు; జనరల్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, జనరల్ ఆప్టిట్యూడ్‌కు, జనరల్ ఇంగ్లీష్, ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్‌లకు సంబంధించి 25 శాతం ప్రశ్నలు అడుగుతారు. మొత్తం మార్కులు 85. పరీక్ష సమయం 2 గంటలు. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులను ఇంటర్వ్యూకి పిలుస్తారు. దీనికి 15 మార్కులు కేటాయించారు.

ముఖ్య సమాచారం
- **మాస్టర్స్ ప్రోగ్రామ్‌లకు దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.3000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500
- **పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.4000, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 24
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ
- **వెబ్‌సైట్:** www.niperguwahati.ac.in

లిటిల్స్



మీకు తెలుసా?

- పిచ్చుక జాతికి చెందిన ఈ పక్షిని 'లాంగ్ టైల్డ్ రోజ్ ఫించ్' అంటారు.
- ఈ రోజ్ ఫించ్ రష్యా, కజకిస్తాన్, దక్షిణ కొరియా, ఉత్తర కొరియా, మంగోలియా, జపాన్ దేశాల్లో ఉంటాయి.
- ఉష్ణమండల ప్రదేశాల్లో, సమశీతోష్ణ గడ్డిభూముల్లో ఎక్కువగా ఉంటాయి.
- దీన్ని పంజరాల్లో పెంచుకుంటారు. అయితే పంజరంలో ఎక్కువ కాలం ఉండలేదు.
- చిన్న ముక్కు, పక్షి కంటే ఎక్కువగా తోక ఉండటం వల్ల లాంగ్ టైల్డ్ అని పిలుస్తారు.




- మగపక్షులు రోజ్ కలర్‌లో ఉంటాయి. వాటి గొంతు శ్రావ్యంగా ఉంటుంది.
- ఆడపక్షులు బూడిద రంగు, తెలుపు రంగుల్లో కనపడతాయి.
- ఇవి ఒక చోట నుంచి మరొక చోటకు సులువుగా మైగ్రేట్ అవుతాయి.

ఎంత మంది మనుషులు ఉన్నారు?



సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



7 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 292

4		2				1		7
	7		6					
	5	9	1			2		
	3			5		7		
	1		8		6		2	
		4		9			5	
		7			4	3	1	
					8		7	
3		6				5		2

సుడోకు - 291 సమాధానం

3	9	4	5	8	1	6	2	7
8	5	6	7	4	2	3	1	9
7	2	1	6	3	9	5	4	8
6	4	8	9	1	5	2	7	3
9	3	5	8	2	7	1	6	4
2	1	7	4	6	3	9	8	5
5	6	9	1	7	4	8	3	2
4	8	2	3	5	6	7	9	1
1	7	3	2	9	8	4	5	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.